
'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 291

గురువారం 4-7-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




తొలిసారి శిఖరాన...

వరల్డ్ 'నంబర్‌వన్' ఆల్‌రౌండర్‌గా హార్దిక్.. భారత్ నుంచి తొలి ప్లేయర్ - 12లో



సెన్సెక్స్ @ 80,000


సూచీల సరికొత్త రికార్డులు.. ఆల్‌టైం హైని తాకిన నిఫ్టీ - 13లో



ప్రశాంతంగా మణిపూర్

మణిపూర్ హింసాకాండపై ప్రధాని మోదీ స్పందించారు. అక్కడ సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయని చెప్పారు.

వివరాలు 6లో ▸



ముందస్తు ఓటమే?!

సవాలక్ష సమస్యలతో సతమతమవుతున్న బ్రిటన్‌లో సార్వత్రిక ఎన్నికలకు వేళైంది. సునాక్ పార్టీ ఈ ఎన్నికల్లో ఎదురీదుతోంది.

వివరాలు 6లో ▸



జార్ఖండ్ సీఎంగా సోరెన్

జార్ఖండ్ సీఎంగా మళ్లీ హేమంత్ సోరెన్ పగ్గాలు చేపట్టబోతున్నారు. ఆ రాష్ట్ర సీఎం చంపాయి సోరెన్ రాజీనామా చేశారు.

వివరాలు 6లో ▸



బిహార్‌లో కూలిన ఏడో వంతెన

బిహార్‌లోని సివాన్ జిల్లాలో మరో వంతెన కుప్ప కూలింది. దీంతో గత 15 రోజుల్లో బిహార్‌లో కూలిన వంతెనల సంఖ్య ఏడుకు చేరింది.

వివరాలు 6లో ▸

బాబు భూ దోపిడీ ఖజానా!

అమరావతి ముసుగులో చంద్రబాబు బృందం అరాచకాలు

యథేచ్ఛగా ప్రభుత్వ, ప్రైవేట్, అసైన్డ్ భూముల దురాక్రమణ

శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులు బుట్టదాఖలు

'రాజధాని లీక్స్' పేరిట బురిడీ

పక్కా పన్నాగంతో అమరావతి ఎంపిక

బరితెగించి ఇన్‌సైడర్ ట్రేడింగ్.. భయపెట్టి భూ మాయాజాలం

అమరావతి కేంద్రంగా ఎల్లో గ్యాంగ్ రూ.లక్షల కోట్ల కుంభకోణం

రాజధానిలో భూ బాగోతాలను కప్పిపుచ్చేందుకే శ్వేతపత్రం డ్రామా

సాక్షి, అమరావతి: ''ఏ'' అంటే.. అమరావతి అని వక్కాణిస్తున్న సీఎం చంద్రబాబు.. రాజధాని ముసుగులో తన అవినీతి, అరాచకాలకు కేంద్రంగా చేసుకున్నారు! బరితెగించి తాను పాల్పడిన అవినీతికి అక్షయపాత్రలా మార్చారు! నాటి తెల్ల దొరలే తెల్లబోయేలా వ్యవహరించారు! బ్రిటిష్ పాలకుల సామ్రాజ్యవాద దోపిడీని మరిపిస్తూ టీడీపీ పెద్దలు సాగించిన భూ దోపిడీకి నిలువెత్తు సాక్ష్యం అమరావతి... బడుగులు, పేదలకు స్థానం లేకుండా చంద్రబాబు సృష్టించుకున్న నయా జమిందారీ వ్యవస్థకు నిదర్శనం అమరావతి! పచ్చ రాబందులు గుప్పిట పట్టిన రూ.లక్షల కోట్ల విలువైన భూ ఖజానా అమరావతి! దేశ చరిత్రలోనే అతిపెద్ద భూ దోపిడీకి మౌనసాక్షి అమరావతి!! ఈ భూ బాగోతాలు, తన నిర్వాకాలను కప్పిపుచ్చి మభ్యపెట్టేందుకే తాజాగా అమరావతిపై శ్వేతపత్రం అంటూ మరో డ్రామాకు చంద్రబాబు తెర తీశారు.

మోయలేని భారం మోపుతూ...

రాజధానిగా అమరావతి ఎంపిక చేసిన ప్రాంతం ఇటు విజయవాడ కాదు..

మిగతా 2వ పేజీలో ▶



విరాళాలు, ఆస్తుల అమ్మకం

- రాజధాని నిర్మాణానికి ఇలా నిధులు సమకూర్చుకుంటాం
- శ్వేతపత్రం విడుదల సందర్భంగా సీఎం చంద్రబాబు
- పాత ప్లాన్ ప్రకారమే అమరావతి నిర్మాణం
- పూర్తి చేయడానికి టైమ్ బాండ్ లేదట..
- ఎన్నేళ్లు పడుతుందో తెలీదట.. చేసుకుంటూ వెళతారట..
- ఏ లెక్కన ఇది ప్రజా రాజధానో శ్వేత పత్రంలో చెప్పని వైనం
- హైదరాబాద్ తరహాలో అమరావతినీ సంపదకు కేంద్రంగా మారుస్తానని గొప్పలు.. ఇక్కడ పేదలుండటానికి వీల్లేదని హెచ్చరిక
- గత సర్కారు ఇక్కడ పేదలకు పట్టాలివ్వడంపై రుసరుస
- ఇక్కడ కాకుండా వారి ప్రాంతాల్లోనే ఇళ్లు కట్టిస్తామని మెలిక

2 లో

'అసైన్డ్' ఆక్రమణ

బడుగుల భూముల్లో వాలిన పచ్చ గద్దలు.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను భయపెట్టి దోపిడీ

బినామీల పేరిట అక్రమ జీపీఏ రిజిస్ట్రేషన్లు

రూ.5,500 కోట్ల విలువైన 1,100 ఎకరాలు హస్తగతం

2 లో

'రింగ్'లో మింగారు!

- ఐఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చేసి తమ భూములకు రెక్కలు
- ముందే ఖరారు చేసి కన్సల్టెన్సీ ద్వారా రాజముద్ర
- రూ.2 వేల కోట్లకుపైగా టీడీపీ పెద్దల దోపిడీ
- క్విడ్‌ప్రో కో కింద హెరిటేజ్‌కు భూములు

13 లో

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ కార్యకర్త హత్య



శ్రీసత్యసాయి జిల్లా గోళ్లపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సతీశ్‌ను టీడీపీ కార్యకర్తలు కొట్టి చంపేశారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రచారం చేశాడని కక్ష పెంచుకున్న టీడీపీ కార్యకర్తలు.. సతీశ్‌ను మాట్లాడుకుందామని పిలిచి దాడి చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సతీశ్ మరణించాడు.

వివరాలు 10లో ▸

కష్టజీవులపై కర్కశం



కనిగిరిలో బుధవారం తెల్లవారుజామున ముందస్తు సమాచారం ఇవ్వకుండా పెద్ద ఎత్తున దుకాణాలను జేసీబీలతో కూల్చివేశారు. దీంతో 500 కుటుంబాలు బతుకుదెరువు కోల్పోయాయి. ఎమ్మెల్యే మెప్పు కోసమే అధికారులు ఇలా చేశారంటూ ప్రజా సంఘాలు మండిపడ్డాయి.

వివరాలు 10లో ▸

'ఎగ్గొ'ట్టారు!



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువులు అర్ధాకలితో సాగుతున్నాయి. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని స్కూళ్లలో మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు ఇవ్వడం లేదు. మెనూ కూడా పాటించడం లేదు. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచే క్యారేజీలు తెచ్చుకుంటున్నారు.

వివరాలు 14లో ▸

బైడెన్ కంటే హారిస్ మేలు

6 లో

డ్రోన్ల ద్వారా దోమలను కనిపెడదాం

ఆ తర్వాత మందు పిచికారి చేసి చంపేద్దాం

అధునాతన సాంకేతిక పద్ధతుల ద్వారా వాటిని నియంత్రిద్దాం

సురక్షిత తాగునీరు, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

ప్రజారోగ్యంపై అధికారుల నిర్లక్ష్యం ఉపేక్షించం

సీజనల్ వ్యాధులపై సమీక్షలో సీఎం చంద్రబాబు



అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: 'దోమలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను డ్రోన్‌ల ద్వారా గుర్తించి, ఆ ప్రాంతాల్లో డ్రోన్‌ల ద్వారా మందు పిచికారి చేసి.. వాటిని చంపేసే వ్యవస్థను 2019కి ముందు ఉపయోగించాం. మళ్లీ అదే వ్యవస్థను తీసుకు వచ్చి డ్రోన్‌లతో దోమలను చంపేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో

మిగతా 3వ పేజీలో ▶

హస్తినకు చేరుకున్న సీఎం చంద్రబాబు

నేడు ప్రధాని, కేంద్ర హోం, రక్షణ శాఖ మంత్రులతో భేటీ.. రేపు ఆర్థిక మంత్రితో సమావేశమయ్యే అవకాశం

ఇటీవల గెలుపొందిన రాష్ట్ర ఎంపీలకు బాబు విందు

3 లో

పింఛన్లకు 'అధికార' గ్రహణం

శ్రీసత్యసాయి జిల్లాలో పలువురికి పింఛన్లు నిలిపివేత

కాకినాడ జిల్లా ఎల్డీపేటలో 18 మందికి ఆపేసిన వైనం

టీడీపీ నేతల ఫిర్యాదులే కారణం

బత్తలపల్లి/గాండ్లపెంట/పుట్టపర్తి అర్బన్/కోటనందూరు: రాష్ట్రంలో పెన్షన్లకు 'అధికార' గ్రహణం పట్టింది. టీడీపీ నేతలు పలువురికి పెన్షన్లు ఇవ్వకుండా అధికారుల్ని అడ్డుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులని చెప్పి అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అర్హులకు కూడా పింఛన్ నగదు అందకుండా చేస్తున్నారు. ఏళ్ల తరబడి వస్తున్న పింఛన్‌ను ఇప్పుడు ఇవ్వకపోవడంతో బాధితులు నిరసన తెలుపుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం మాల్యవంతం పంచాయతీ పరిధిలో 40 మందికి పింఛన్ ఇవ్వకుండా టీడీపీ నేతలు అడ్డుకున్నారు. దీంతో వారు బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఎంపీడీవో

మిగతా 5వ పేజీలో ▶



శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద బైఠాయించిన రామగిరి మండలం ఎంసీపల్లి పెన్షన్‌దారులు



సుగాలీలకు ఇంత అన్యాయం చేస్తారా?

నా కుమార్తె నందివర్ధినీబాయికి తలసేమియా పెన్షన్ వస్తోంది. పాపను ఎత్తుకుని నా భార్య మూడురోజుల పాటు సచివాలయం చుట్టూ తిరిగింది. టీడీపీ వాళ్లను కలిసి ఫోన్‌చేయిస్తే ఇస్తామని చెప్పారు. లోకల్ లీడర్ల ప్రెజర్ ఉందని, వాళ్లను కలవాలని సెక్రటరీ, ఎంపీడీవో చెప్పడం అన్యాయం. సుగాలీలకు ఇంత అన్యాయం చేస్తారా? గతంలో సుగాలీల గురించి మాట్లాడిన పవన్ ఇప్పుడు స్పందించి నందివర్ధినీబాయికి బాసటగా నిలవాలి.

– ముత్యాలనాయక్, ఆర్.కొత్తపల్లి, రామగిరి మండలం

విరాళాలు, ఆస్తుల అమ్మకం

రాజధాని నిర్మాణానికి ఇలా నిధులు సమకూర్చుకుంటాం

- శ్వేతపత్రం విడుదల సందర్భంగా సీఎం చంద్రబాబు
- పాత ప్లాన్ ప్రకారమే అమరావతి నిర్మాణం

సాక్షి, అమరావతి: 'అమరావతి రాజధానిని విధ్వంసం చేసి తెలుగు జాతికి జగన్ తీరని అన్యాయం చేశారు. దేశ చరిత్రలో జగన్ లాంటి వ్యక్తిత్వం ఉన్న వారు తప్ప ఇంకెవరూ రాజధాని మార్పు నిర్ణయాన్ని తీసుకోరు. విధ్వంసానికి జగన్ ఒక కేస్ స్టడీ. మాకు రాజధాని లేదు అని చెప్పుకునేంత పాపం రాష్ట్ర ప్రజలు ఏం చేశారు? రాష్ట్రంలో పుష్కలంగా వనరులు ఉన్నాయి. తెలివి గల మానవ వనరులు ఉన్నాయి. పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచ వ్యాప్తంగా ఎందరో ఇక్కడికి వచ్చే అవకాశం ఉంది. అలాంటి రాష్ట్రాన్ని ఐదేళ్ల పాటు విధ్వంసంతో నాశనం చేశారు' అని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. రాజధాని నిర్మాణానికి ఒక టైమ్ బాండ్ అంటూ పెట్టుకోలేదని, పాత ప్లాన్ ప్రకారం చేసుకుంటూ ముందుకు వెళతామని స్పష్టం చేయడం చూస్తుంటే.. గత ప్రభుత్వం చెప్పిందే నిజమని స్పష్టమవుతోంది. వెలగపూడి సచివాలయంలో బుధవారం ఆయన రాజధాని అమరావతిపై శ్వేతపత్రం విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన జరుగుతుందని, ఇక్కడ రాజధాని కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, రాజధానికి ఏ పేరు పెడితే బాగుంటుందని ఆలోచిస్తున్నప్పుడు రామోజీరావు అమరావతి పేరును సూచించారన్నారు. రాజధాని శంకుస్థాపనకు ప్రతి గ్రామం నుంచి.. దేశంలోని అన్ని పవిత్ర ప్రదేశాల నుంచి నీరు, మట్టిని కూడా తీసుకొచ్చామన్నారు. కుప్పం వారికైనా, ఇచ్ఛాపురం వారికైనా అమరావతి సమదూరంగా ఉంటుందని, అందువల్లే ఇక్కడ రాజధాని నిర్ణయించినట్టు చెప్పారు. బుద్ధి ఉన్న ఏ వ్యక్తీ అమరావతి రాజధానిని వ్యతిరేకించరని, రాజధానికి రెండు వైపులా 12 చొప్పున ఎంపీ స్థానాలు ఉన్నాయని, విభజన అనంతరం శివరామృష్ణ కమిటీ రాష్ట్రంలో పర్యటించి కృష్ణా, గుంటూరు లేదా ఆ 2 జిల్లాల మధ్య రాజధాని ఉండాలని ఎక్కువ మంది అభిప్రాయపడినట్లు చెప్పిందన్నారు. ఏటా 3 పంటలు పండే మంచి భూమిని రాజధాని కోసం తీసుకోవడం సరికాదని శివరామకృష్ణన్ కమిటీ చెప్పిన విషయాన్ని ఇక్కడ ఆయన వక్రీకరించి అనుకూలంగా మార్చుకున్నారు.

హైదరాబాద్‌కు కరెంట్, నీళ్లు.. బాబు ఘనతేనట

గతంలో టీడీపీ అధికారంలోకి వచ్చే నాటికి రూ.15 వేల కోట్లు ఆర్థిక లోటు ఉన్నా, సైబరాబాద్ నిర్మాణ అనుభవంతో అమరావతిని నిర్మించాలని ఆలోచించామని చంద్రబాబు తెలిపారు. హైదరాబాద్‌కు నాడు సరిగా కరెంట్, నీళ్లు లేవని.. రానురాను అన్నీ కలిసొచ్చాయన్నారు. ఎంత మంది ప్రయత్నించినా వీలుపడని కృష్ణా జలాలను హైదరాబాద్‌కు తీసుకొచ్చామని, 14 రోజుల పాటు అమెరికాలో తిరిగి ఐటీ పరిశ్రమలను కూడా సైబరాబాద్‌కు తీసుకొచ్చినట్టు సీఎం వివరించారు. పెద్ద పెద్ద ఇంజనీరింగ్ కాలేజీలు తీసుకొచ్చామని, తన హయాంలో సాగు నీటి ప్రాజెక్టులు, రోడ్లు, ఎయిర్ పోర్టులకు భూములు ఇచ్చిన వారు సంతృప్తిగా ఉండేలా చేశానని బాబు గొప్పలు చెప్పుకున్నారు. తొలుత అమరావతికి ల్యాండ్ పూలింగ్ సాధ్యమవుతుందా.. అని అనుమాన పడినా, ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా 34,400 ఎకరాలను 29,966 మంది రైతులు ఇచ్చారన్నారు. ఈ రైతులకు పదేళ్ల పాటు కౌలు ఇవ్వాలని నిర్ణయించామని, వ్యవసాయ కూలీలకు నెలకు రూ.2,500 పెన్షన్ అందిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 1నే దాన్ని రూ.5 వేలకు పెంచి అందించామన్నారు. వాస్తవంగా పెన్షన్‌ను పెంచింది గత ప్రభుత్వమనే విషయాన్ని మరచి తన ఖాతాలోకి వేసుకోవడం బాబుకే చెల్లింది.

గత ప్రభుత్వంపై ఏడుపు

వైఎస్ జగన్ 2019లో అధికారంలోకి రాగానే విధ్వంసం ప్రారంభించారని, కనీసం నిబంధనలు కూడా పాటించకుండా ప్రజా వేదికను కూల్చేశారని, తర్వాత మూడు రాజధానులు ప్రకటించారని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. 'జీఎస్.రావు, బోస్టన్ కమిటీ అంటూ ఎన్ని విన్యాసాలు చేయాలో అన్నీ చేశారు. ప్రజావేదిక శిథిలాలను తొలగించవద్దని ఇప్పుడు అంతా చెబుతున్నారు. అది చూస్తే ప్రతి ఒక్కరిలో గత ప్రభుత్వ విధ్వంసం గుర్తుకు రావాలి. జగన్ నిర్ణయంతో రైతులు రోడ్డున పడ్డారు. తిరుపతి యాత్రకు వెళితే ఉండటానికి మండపాలు ఇవ్వకుండా వేధించారు. అరసవెల్లి యాత్రకు వెళితే దాడులు చేసి మధ్యలోనే నిలిపేయించారు' అని సీఎం చంద్రబాబు మొసలి కన్నీళ్లు కార్చారు. గత పాలకులు అధికారంలోకి రాగానే రాజధానిలో అన్ని నిర్మాణాలను మధ్యలోనే నిలిపేశారని, వ్యవసాయ కూలీలకు అందించాల్సిన పెన్షన్లు, రైతులకు ఇవ్వాల్సిన కౌలు నిలిపేశారని, మాస్టర్ ప్లాన్ రద్దు చేశారని, రూ.1000 కోట్లు గ్రాంట్ రాకుండా కేంద్రానికి తప్పుడు ఫిర్యాదులు చేశారని.. ఉన్నవి లేనివి కల్పించి చెప్పారు. సింగపూర్ కన్సార్టియం పైనా ఆరోపణలు చేశారని, 14 ఎకరాల్లో 12 టవర్లతో నిర్మాణం తలపెట్టిన హ్యాపీ నెస్ట్‌ను నాశనం చేశారని, అది పూర్తయితే ప్రభుత్వానికి రూ.57.37 కోట్లు ఆదాయం వచ్చేదని, ముున్ముందు రూ.885 కోట్లకు పెరిగేదన్నారు. కానీ దాన్ని కూడా నాశనం చేయడంతో ఇప్పుడు రూ.164.5 కోట్ల నష్టంతో పాటు రాజధాని పరిధిలోని రోడ్లు, భవనాలు దెబ్బ తిన్నాయన్నారు.

నిర్మాణ ఖర్చు పెంచడానికే ఈ మాటలు..

గత ప్రభుత్వ ఐదేళ్ల విధ్వంసంతోనే రాజధాని నిర్మాణం ఖర్చు పెరిగిందని సీఎం చంద్రబాబు చెప్పడం చూస్తుంటే మళ్లీ ఎస్టిమేషన్లు పెంచుకోవడం కోసమేనని తెలుస్తోంది. 'రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్ బాగా దెబ్బతింది. పెట్టుబడిదారుల్లో నమ్మకం సన్నగిల్లింది. సంపద ఉత్పత్తి పెరగలేదు. అన్ని రంగాలు రివర్స్ అయ్యాయి. నిధులు ఇవ్వకపోవడంతో మధ్యలో ఉన్న పనులు పూర్తవలేదు. రెవెన్యూ ఆదాయం తగ్గిపోయింది. ఏపీలో భూముల విలువ కూడా తగ్గిపోయింది. హైకోర్టు, హెచ్‌వోడీ, సచివాలయాల భవనాల ఐకానిక్ పునాదులన్నింటినీ నీళ్లలో ముంచేశారు. గెజిటెడ్ అధికారులు, మంత్రులు, జడ్జీల కోసం నిర్మించ తలపెట్టిన వాటిని కూడా అర్ధంతరంగా నిలిపేశారు. నేను పడ్డ కష్టం వృథా అయింది. అది చూస్తే మనసు నిగ్రహం చేసుకోలేని పరిస్థితి ఉంది. ఉమ్మడి రాజధాని కాలం కూడా అయిపోంది. పెట్టుబడిదారులు నమ్మకాన్ని కోల్పోయారు. సింగపూర్ ప్రతినిధులు వస్తారో రారో తెలీదు. ఒక వ్యక్తి అధికారాన్ని తీసుకుని భావితరాల భవిష్యత్తును నాశనం చేశారు. దేశానికి అన్నం పెట్టిన రాష్ట్రం మనది. వెయ్యి కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. ఇలాంటి వ్యక్తికి రాజకీయాల్లో ఉండే అర్హత ఉందా? నన్ను ఇబ్బందులు పెట్టారని నేను మాట్లాడడం లేదు. జగన్ విధ్వంసాన్ని ప్రజలు మర్చిపోకూడదు. బూడిద చేసిన ప్రాంతం నుండే బంగారు భవిష్యత్తుకు నాంది పలుకుతా' అని అన్నారు.



శ్వేతపత్రం విడుదల సందర్భంగా మీడియాతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఉద్యోగ కల్పనకు నిలయంగా రాజధాని రూపకల్పన

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల వారికి ఉద్యోగాల కల్పన అమరావతిలో జరుగుతుందని సీఎం చంద్రబాబు మరోసారి చుక్కలు చూపారు. ప్రతి పంచాయతీ సంక్షేమానికి ఇది నిక్షేపంలా ఉంటుందన్నారు. అమరావతి నాది అని చెప్పుకునేలా ప్రణాళిక రూపొందించామని, మాస్టర్ ప్లాన్‌లో మార్పులు లేవని తెలిపారు. గతంలో రూపొందించిన అదే మాస్టర్ ప్లాన్‌ను కొనసాగిస్తామన్నారు. ఇన్ని చెప్పిన బాబు.. అమరావతి నిర్మాణానికి ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తామని, కొన్ని ఆస్తులు అమ్మి సంపద సృష్టిస్తామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పడం ఎన్నో సందేహాలకు తెర లేపింది. ఇక్కడ భూములమ్మిన వారు ఇతర ప్రాంతాల్లో భూములు కొంటే అక్కడ కూడా విలువ పెరుగుతుందని, ప్లాన్ ప్రకారం నిర్మాణాలు జరిగి ఉంటే ప్రభుత్వానికి కూడా పన్నులు, జీఎస్టీ రూపంలో రూ.20 వేల కోట్లకు పైగా ఆదాయం వచ్చేదన్నారు. విట్, ఎస్ఆర్, అమృత్ లాంటి యూనివర్సిటీల్లో పేద పిల్లలు చదువుకుంటే కోట్ల ప్యాకేజీతో ఉద్యోగాలు వస్తాయని యువతను మునగచెట్టు ఎక్కించే ప్రయత్నం చేశారు. రాజధాని పునర్నిర్మాణంపై కేంద్రంతో కూడా మాట్లాడతామని చెప్పారు. రాజధాని పనులు ఎక్కడ ఆగాయో అక్కడి నుంచే పనులు ప్రారంభిస్తామే తప్ప వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదన్నారు. ఎక్కడో ఉన్న వారిని తీసుకొచ్చి సెంటు పట్టాలని డ్రామాలాడారని, ఇల్లు లేని వారికి వారి ప్రాంతాల్లోనే ఇల్లు కట్టిస్తామని సీఎం ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ లెక్కన అమరావతిలో పేదలకు స్థానం లేదని చంద్రబాబు మరోమారు స్పష్టం చేశారు. మంగళగిరిలో ఎయిమ్స్‌కు కూడా నీళ్లివ్వకుండా గత ప్రభుత్వం వేధించిందని, తద్వారా పడకల పెరుగుదలకు అవరోధం ఏర్పడి ఆసుపత్రిలో ఓపీలు కూడా తగ్గాయని చెప్పారు. ఏ లెక్కన చంద్రబాబు ఈ మాట చెప్పారో అర్థం కావడం లేదు. వాస్తవానికి ఎయిమ్స్‌లో ఓపీలు పెరగడం గమనార్హం. గతంలో అనుమతులు పొందిన 132 సంస్థలకు గాను 122 సంస్థలు అమరావతికి రాలేదని చెప్పుకొచ్చారు.

ఆ విజన్‌కు ప్రపంచ స్థాయి అట!

అమరావతిలో 53,748 ఎకరాలు సేకరించామని సీఎం చంద్రబాబు తెలిపారు. రోడ్లు, ఇతర నిర్మాణాలకు 27,885 ఎకరాలు, రిటర్నబుల్ ప్లాట్ల కింద 11,826, ఇతర అవసరాలకు 14,037 ఎకరాలు పోను ప్రభుత్వం వద్ద 8,274 ఎకరాలు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం వద్దనున్న భూమిని విక్రయించి రాజధాని నిర్మాణం చేయొచ్చని ఆలోచించామని, కేంద్ర ప్రభుత్వం కేపిటల్ గెయిన్ మినహాయింపునిచ్చి రూ.2,500 కోట్లు ఇవ్వడానికి ఒప్పుకుని రూ.1,500 కోట్లు కూడా అందించిందన్నారు. నాడు రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకుతో పాటు ఏఐఐబీ, జేఐసీఏ వంటి సంస్థలు ఆర్థిక తోడ్పాటుకు ముందుకు వచ్చాయని, సింగపూర్‌తో ఎంఓయూ కుదుర్చుకున్నామని తెలిపారు. మొదట సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్, తర్వాత రాజధాని మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ సంస్థ అందించిందన్నారు. దేశంలోనే స్మార్ట్ సిటీగా, ప్రపంచ స్థాయి ఆర్థిక రాజధానిగా అమరావతి విజన్ రూపొందించినట్టు చెప్పారు. అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్‌తో పాటు అన్ని విభాగాలు ఒకేచోట ఉండాలని మాస్టర్ ప్లాన్‌లో నిర్ణయించామన్నారు. దేశంలో ఏ సిటీకి లేనంత మేర నదీ ప్రాంతం అమరావతికి ఉందని, రెండు నదులను అనుసంధానం చేసే కాన్సెప్ట్‌తో నగరానికి రూపకల్పన చేశామన్నారు. రూ.51,687 కోట్లతో రాజధాని పనులకు అంచనా వేసి, రూ.41,170 కోట్లకు టెండర్లు పిలిచామని, అప్పటికే జరిగిన నిర్మాణాలకు గాను రూ.4,318 కోట్లు బిల్లులు చెల్లించామని, రూ.1,268 కోట్లు ఇప్పటికీ పెండింగులో ఉందన్నారు.

బాబు భూ దోపిడీ ఖజానా!

▶ మొదటి పేజీ తరువాయి

అటు గుంటూరూ కాదు. రెండింటికి 40 కి.మీ. పైగా దూరం. మూడు పంటలు పండే సారవంతమైన పంట పొలాల్లో నిర్మాణ వ్యయం తడిసి మోపెడవుతుందని చంద్రబాబు అండ్ కో కట్టిన లెక్కలే చెబుతున్నాయి. ఒక్క ఎకరాలో కనీస మౌలిక వసతుల కల్పనకు (బేసిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) రూ.2 కోట్లు వ్యయం అవుతుందని, మొత్తం రాజధాని ప్రాంతం అభివృద్ధి చేయడానికి రూ.లక్ష కోట్లకు పైగా ఖర్చవుతుందని అప్పట్లోనే అంచనా వేశారు. ఏటా ఆ వ్యయం పెరగడమే కానీ తగ్గదు. విభజన అనంతరం రాష్ట్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో అంత భారీగా నిధులు ఖర్చు చేయడం సాధ్యమయ్యే పని కాదని నిపుణులు చేసిన హెచ్చరికలను చంద్రబాబు పట్టించుకోలేదు. తాజాగా భారీగా నిధులు అవసరమంటూనే.. విరాళాలు సేకరిస్తామని చెబుతున్నారు. అధికార పగ్గాలు చేపట్టిన మూడు వారాల్లోనే రూ.7 వేల కోట్లు అప్పు చేసిన టీడీపీ ప్రభుత్వం.. సంపదను ఎలా సృష్టించి రాజధాని నిర్మాణం చేస్తుందనే ప్రశ్నకు జవాబు లేదు.

భూములు లాక్కుని గాలి మేడలు..!

అమరావతి వేదికగా చంద్రబాబు సాగించిన భూ దందాను అప్పట్లోనే నిపుణుల నుంచి సామాన్యుల వరకూ అందరూ తీవ్రంగా వ్యతిరేకించారు. అమరావతి ప్రాంతం రాజధాని నిర్మాణానికి అనువైనది కాదని శివరామకృష్ణన్ కమిటీ స్పష్టం చేసింది. ఏడాదికి మూడు పంటలు పండే భూములను నాశనం చేయవద్దని పర్యావరణవేత్తలు అభ్యంతరం చెప్పారు. జీవనాధారమైన తమ భూములను కొల్లగొట్టవద్దని బడుగు, బలహీనవర్గాలు, పేద రైతులు వేడుకున్నారు. వారి విన్నపాలను బేఖాతర్ చేస్తూ చంద్రబాబు భారీ భూదోపిడీకి తెరతీశారు. అసైన్డ్ భూములను బినామీల ద్వారా హస్తగతం చేసుకుని పరిహారం ప్రకటించుకున్నారు. 2014–19 మధ్య రాజధాని పేరిట అమరావతి ముసుగులో చంద్రబాబు బృందం చేయని దురాగతం లేదు. అదిగో రాజధాని.. అల్లదిగో అమరావతి..! అంటూ అరచేతిలో వైకుంఠం చూపించారు. అంతకుముందు పక్కా పన్నాగంతో రాజధాని అక్కడ.. ఇక్కడ అంటూ పలు ప్రాంతాల పేర్లను తెరపైకి తెచ్చి సామాన్యులను బురిడీ కొట్టించారు. మరోవైపు ముందస్తుగా తాము భూముల కొనుగోలు చేసిన అమరావతిలో బినామీ మాఫియాను వ్యవస్థీకృతం చేశారు. అంతర్జాతీయ స్థాయి రాజధాని.. ఆకాశ హర్మ్యాల నగరం అంటూ గాలిలో మేడలు కట్టి రైతుల కాళ్ల కిందున్న భూమిని కాజేశారు.

పచ్చ దండు దురాక్రమణ..

దేశంలోనే కాదు ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద భూ దోపిడీకి చంద్రబాబు బరి తెగించారు. రాజధాని ప్రచారంతో మాయాజాలం... భూసమీకరణ ముసుగులో దోపిడీ... అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములు, లంక భూముల స్వాహా... ఇన్నర్ రింగ్ రోడ్డులో అవినీతి మలుపులు... అస్మదీయులకు యథేచ్ఛగా భూ పందేరాలు... ఇలా ఒకటేమిటి ఎన్ని రకాలుగా భూదోపిడీకి పాల్పడవచ్చో అన్ని విద్యలూ ప్రయోగించారు. అమరావతిపై చంద్రబాబు 'పచ్చ దండు' దండయాత్ర చేసి రూ.లక్షల కోట్ల విలువైన భూముల దురాక్రమణకు పాల్పడింది. చంద్రబాబుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, నాటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రులు, టీడీపీ నేతలు, వారి బినామీలు అమరావతి భూములపై వాలిపోయారు. చంద్రబాబు, లోకేశ్‌తోపాటు నారాయణ, సుజనా చౌదరి, ప్రత్తిపాటి పుల్లారావు, మాగుంట మురళీమోహన్, కొమ్మాలపాటి శ్రీధర్, కోడెల శివప్రసాద్ కుమారుడు శివరామకృష్ణ, ధూళిపాళ్ల నరేంద్ర, పయ్యావుల కేశవ్, బాలకృష్ణ వియ్యంకుడు ఎంఎస్‌పీ రామారావు.. ఇలా పచ్చ దండు అంతా అమరావతిలో భూములను కొల్లగొట్టింది. అన్యాయంగా, ఏకపక్షంగా విభజనకు గురై కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి ఆదిలోనే హంసపాదులా అభివృద్ధికి గండి కొట్టారు. తాత్కాలిక రాజధాని భవనాల పేరుతో కనికట్టు చేశారు.

మభ్యపుచ్చే యత్నాలు..

నాడు ఐదేళ్లలో భూముల దోపిడీకి పాల్పడటం మినహా టీడీపీ పెద్దలు రాజధాని కట్టిందీ లేదు.. అభివృద్ధి చేసిందీ లేదు. చంద్రబాబు బృందం సాగించిన భూ దోపిడీ ఇప్పటికే సీఐడీ దర్యాప్తులో పూర్తి ఆధారాలతోసహా బట్టబయలైంది. సీఐడీ న్యాయస్థానాల్లో చార్జిషీట్లు కూడా దాఖలు చేసింది. ఇక న్యాయ విచారణ ప్రక్రియ కొనసాగితే చంద్రబాబుకు యావజ్జీవ ఖైదు ఖాయమని న్యాయ నిపుణులు తేల్చి చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ అధికారంలోకి రాగానే చంద్రబాబు సరికొత్త కుట్రలకు పన్నాగం పన్నుతున్నారు. అమరావతిలో తన భూ బాగోతాన్ని కప్పిపుచ్చేందుకు శ్వేతపత్రం పేరుతో డ్రామాకు తెరతీశారు. రాజధాని నిర్మాణానికి తాను ఏం చేస్తానో చెప్పకుండా ఊకదంపుడు ఉపన్యాసంతో ఊదరగొట్టారు. రాజకీయ వ్యాఖ్యలు చేస్తూ తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు పడరాని పాట్లు పడ్డారు. కానీ అమరావతి పేరిట చంద్రబాబు యథేచ్ఛగా సాగించిన దోపిడీ దాచేస్తే దాగేది కాదు. ఇప్పటికే పూర్తి ఆధారాలతో సహా చార్జిషీట్ల రూపంలో నిక్షిప్తమైందన్నది నిఖార్సైన నిజం.

'సీడ్ యాక్సిస్' రైతులకు 2,800 గజాలు ఇవ్వాలి

తాడేపల్లిరూరల్: ఉండవల్లి సీడ్ యాక్సెస్ రోడ్‌లో పొలాలను కోల్పోయే రైతులు సీఆర్‌డీఏ అధికారులను బుధవారం ఉండవల్లి, తుళ్లూరులలోని కార్యాలయాల్లో కలిసి తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ సీడ్ యాక్సెస్ రోడ్‌లో పంట పొలాలను కోల్పోతున్న రైతులకు 2015లో ఎకరం రిజిస్ట్రేషన్ విలువ రూ.24 లక్షలు ఉందని, రాజధాని పరిధిలోని ఇతర గ్రామాల్లో రూ.3లక్షలు మాత్రమే రిజిస్ట్రేషన్ విలువ ఉందని చెప్పారు. అందువల్ల సీడ్ యాక్సెస్ రోడ్ కోసం విలువైన పంట పొలాలను కోల్పోతున్న రైతులు తమకు 2,800 గజాలు ఇవ్వాలని కోరుతున్నారని తెలియజేశామని చెప్పారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉండవల్లిలోని పొలాలకు గ్రీన్ జోన్ కొంత, యు–1 జోన్ కొంత, వేస్ట్ డంపింగ్ యార్డుకు కొంత భూమిని కేటాయించిందని, ఇప్పటివరకు ఎనిమిదేళ్ల నుంచి పరిస్థితి అలాగే ఉందని, కాబట్టి సీడ్ యాక్సెస్ రోడ్డుకు కేటాయించగా, మిగిలిన భూముల్లో జీ+5 నిర్మాణాలకు అనుమతివ్వాలని కోరామని తెలిపారు. సీఆర్‌డీఏ అధికారులు సానుకూలంగా స్పందించారని, ఉన్నతాధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజధాని రైతు సంఘం అధ్యక్షుడు మున్నంగి అంజిరెడ్డి, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు ఈమని వీరారెడ్డి, రైతులు గుర్రాల శ్రీనివాసరావు, మున్నంగి కమలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్వేత పత్రం కాదది.. 'పచ్చ' పత్రం

- చంద్రబాబుపై మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ధ్వజం
- వాస్తవాలు మరచి వైఎస్సార్‌సీపీపై నిరాధార ఆరోపణలు

సాక్షి, అమరావతి: అమరావతిపై సీఎం చంద్రబాబు విడుదల చేసింది శ్వేతపత్రం కాదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నీలాప నిందలు వేసే 'పచ్చ' పత్రం అని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మండిపడ్డారు. నిరాధార ఆరోపణలతో అభియోగాలు మోపుతూ గత ప్రభుత్వం ఐదేళ్లలో అమరావతి నిర్మాణాన్ని అడ్డుకుందంటూ అసత్య పత్రం విడుదల చేశారని దుయ్యబట్టారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అమరావతి తన విజన్ అని చెప్పిన చంద్రబాబు.. దాని నిర్మాణం పూర్తి చేయడానికి ఎందుకు పరిపూర్ణంగా నిధులు వెచ్చించలేదని ప్రశ్నించారు. బాబు చెబుతున్న రాజధాని కొందరికేనన్నది ఇప్పటికే స్పష్టం అయిందన్నారు. అదంతా ఇన్ సైడర్ ట్రేడింగ్ అని తాము ఆధారాలతో చూపించామన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, అధికార వికేంద్రీకరణలో భాగంగా 3 రాజధానుల విధానాన్ని ప్రకటించి, అందులో అమరావతిని భాగం చేసి అభివృద్ధి దిశగా అడుగులేశామని చెప్పారు. సురేష్ ఏమన్నారంటే..

అప్పుల భారం మోపిన చంద్రబాబు

■ అమరావతి నిర్మిస్తామని రూ.లక్ష కోట్లు ఎస్టిమేషన్ వేసి రూ.50 వేల కోట్ల డీపీఆర్‌లు తయారు చేసి చివరకు వాళ్లు ఖర్చు చేసింది రూ.4,900 కోట్లు. రూ.2 వేల కోట్లు అందులో బకాయిలు పెట్టారు. హడ్ కో నుంచి మాస్టర్ ప్లాన్, రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పి రూ.1151.59 కోట్లు తెచ్చారు. దీనికి సంబంధించి ఏడాదికి రీపేమెంట్ రూ.100 కోట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టింది.

■ అమరావతి బాండ్స్ అమ్మేసి మరో రూ.2 వేల కోట్లు తీసుకొచ్చారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి అని పేర్కొన్నారు. కానీ ఎలాంటి సదుపాయాలు కల్పించారో చూశాం. దీనికి రీపేమెంట్ రూ.286 కోట్లు. కన్సార్టియం ఆఫ్ బ్యాంక్స్.. యూబీఐ, ఐబీ, బీఓబీ బ్యాంకుల నుంచి రూ.1,955 కోట్ల లోన్లు తీసుకున్నారు. ఇవన్నీ కలిపి రూ.5 వేల కోట్లు అప్పులు తెచ్చారు. దీనికి మా ప్రభుత్వం రీపేమెంట్ చేసింది.

■ గత టీడీపీ హయాంలో మీరు, మీ వాళ్లు గుంటూరు జిల్లా తుళ్లూరు, అమరావతి, తాడికొండ, తదితర మండలాల్లో 4,069.95 ఎకరాలు కొనుగోలు చేయడం వాస్తవమా? కాదా?



ఇవన్నీ చేసింది మా ప్రభుత్వమే

■ రాజధానిలో సీడ్ యాక్సిస్ రోడ్డు పూర్తి చేయకుండా, లైట్లు వేయకుండా, కరకట్ట వద్ద రోడ్డు విస్తరించకుండా అప్పుడు చంద్రబాబు వెళ్లారు. సీడ్ యాక్సిస్ రోడ్డు పూర్తి చేసి.. రూ.10 కోట్లు వెచ్చించి ఆ లైట్లు మా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక అమరావతి రోడ్లు ధగధగ లాడుతున్నాయని 'ఈనాడు'లో నిస్సిగ్గుగా చెప్పుకున్నారు.

■ జ్యుడీషియరీ కాంప్లెక్స్ వద్ద అదనంగా హైకోర్టు భవనాన్ని నిర్మించాం. రూ.46 కోట్లతో హైకోర్టు అదనపు భవనాలను నిర్మించాం. చంద్రబాబు సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని చెప్పినా పోరాడి ఆర్ 5 జోన్‌ను క్రియేట్ చేసి, 1,400 ఎకరాల భూమిని ఒక్కొక్కరికి ఒక సెంటు చొప్పున 51,392 మంది పేదలకు పట్టాలిచ్చాం.

■ ఆలిండియా సర్వీస్ అధికారులు, ఎమ్మెల్యే క్వార్టర్స్ పనులన్నీ తుది దశలో ఉన్నాయి. ముగింపు పనులకు రూ.28 కోట్లు ఖర్చు చేశాం. అమరావతి స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా అంగన్ వాడీ హెల్త్ సెంటర్లకు రూ.134 కోట్లు ఖర్చు చేయాలని నిర్దేశించుకోగా అందులో 17 సెంటర్లు రూ.32 కోట్లు ఖర్చు చేసి పూర్తి చేశాం.

■ హెల్త్, వెల్ నెస్ సెంటర్ల కోసం రాజధాని ప్రాంతంలో రూ.40 కోట్లు ఖర్చు చేశాం. రూ.40 కోట్లతో 14 స్కూళ్లు అభివృద్ధి చేశాం. సీడ్ యాక్సిస్ రోడ్డులో ఉన్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ రూ.18 కోట్లతో పూర్తి చేశాం.

■ కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి ఏమైపోయిందంటున్నారు.. అది గ్రాఫిక్స్. కానీ రియల్ బ్రిడ్జిని మేము కట్టించి చూపించాం. వెస్ట్ బైపాస్ రోడ్డు కృష్ణా రివర్ మీద జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా అమరావతి మీదుగా పోతోంది. విశాఖ, విజయవాడ, చెన్నై, హైదరాబాద్ మధ్య కనెక్టివిటీ ఉన్న అద్భుతమైన రోడ్డు ఇది. ఇది చంద్రబాబుకు ఇష్టం లేదు. కేంద్రం అలైన్‌మెంట్ కోసం సమకూర్చుకున్న భూములను రిటర్నబుల్ ప్లాట్లుగా కేటాయించి ఆ బ్రిడ్జిని రానీయకుండా, బైపాస్ రోడ్డు రానీయకుండా నాటి సీఎం చంద్రబాబు అడ్డుకున్నారా? లేదా? ఈ విషయం శ్వేతపత్రంలో చెప్పి ఉంటే బాగుండేది.

■ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూ.24 కోట్లతో అలైన్‌మెంట్ సమస్య తీర్చాం. ఆ బ్రిడ్జి మరో 3 నెలల్లో పూర్తి కాబోతోంది. ఈ సమస్యలన్నీ తీర్చేసి అమరావతి ప్రాంతాన్ని బయటి ప్రపంచంతో అనుసంధానం చేసే హైవేను తీసుకువచ్చాం. దీన్ని విధ్వంసం అంటారా?.



బడుగుల భూముల్లో వాలిన పచ్చ గద్దలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను భయపెట్టి దోపిడీ.. బినామీల పేరిట అక్రమ జీపీఏ రిజిస్ట్రేషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి రాజధాని పేరిట చంద్రబాబు సొంత సంస్థానాన్ని సృష్టించుకున్నారు. స్వతంత్ర్య దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని భూదోపిడీకి బాటలు వేశారు. ఆధునిక జమీందారులా మారిపోయి బడుగుల భూములకు ఎసరు పెట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులను భయభ్రాంతులకు గురి చేసి అసైన్డ్ భూములను లాక్కున్నారు. రికార్డులు తారుమారు చేసి ప్రభుత్వ భూములను చెరబట్టారు. ప్రైవేట్ భూములను హస్తగతం చేసుకున్నారు. అధికారం అండతో భూ దందాలకు మార్గదర్శిగా నిలిచారు. 2014 – 19 మధ్య అధికారంలో ఉండగా భూసమీకరణ ప్యాకేజీ మార్కెట్ విలువ ప్రకారం ఏకంగా రూ.5,500 కోట్ల విలువైన భూములను కొల్లగొట్టడం దేశ చరిత్రలోనే అతిపెద్ద భూ దోపిడీగా రికార్డులకు ఎక్కింది. చంద్రబాబు బృందం అరాచకాలు సీఐడీ విచారణలో పూర్తి ఆధారాలతో నిగ్గు తేలాయి. దీనిపై సీఐడీ ఇప్పటికే న్యాయస్థానంలో చార్జ్‌షీట్ కూడా దాఖలు చేసింది.

బెదిరించి లాక్కుని తాపీగా ప్యాకేజీ..

అసైన్డ్ భూములను కొల్లగొట్టేందుకు టీడీపీ పెద్దలు పక్కా వ్యూహం రచించారు. అసైన్డ్ భూములకు పరిహారం ఇవ్వబోమంటూ బెదిరించి 814 మంది బినామీల ముసుగులో కాజేశారు. అనంతరం అసైన్డ్ భూములకు ప్యాకేజీని ప్రకటించడం వారి కుతంత్రానికి నిదర్శనంగా నిలుస్తోంది. భూసమీకరణ ప్యాకేజీని నిర్ణయిస్తూ 2015 జనవరి 1న టీడీపీ సర్కారు జీవో నంబరు 1 జారీ చేసింది. ఆ జీవోలో ప్రైవేట్ భూములకే భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించారు. అసైన్డ్ భూములకు ఎలాంటి ప్యాకేజీ ప్రకటించలేదు. అనంతరం తమ బినామీలు, ఏజెంట్లను అమరావతి గ్రామాల్లోకి పంపి ప్రభుత్వం అసైన్డ్ భూములను ఎలాంటి ప్యాకేజీ ఇవ్వకుండా ఉచితంగా తీసుకుంటుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులను హడలగొట్టారు. దీంతో గత్యంతరం లేక కారు చౌకగా ఎకరా కేవలం రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకే చంద్రబాబు, నారాయణ, ఇతర టీడీపీ పెద్దల బినామీలకు అసైన్డ్ భూములను సేల్ డీడ్ల ద్వారా విక్రయించే పరిస్థితి కల్పించారు. ఆ తరువాత అసైన్డ్ భూములకు కూడా భూసమీకరణ ప్యాకేజీని ప్రకటిస్తూ 2016 ఫిబ్రవరి 17న తాపీగా జీవో నంబరు 41 జారీ చేశారు. అప్పటికే అసైన్డ్ భూములు టీడీపీ పెద్దల బినామీల పరం కావడంతో వారికే భూసమీకరణ ప్యాకేజీ దక్కేలా స్కెచ్ వేశారు.

ఉన్నతాధికారుల అభ్యంతరాలు బేఖాతర్

చట్ట ప్రకారం దేశంలో 1954కు ముందు ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములను ఇతరులకు విక్రయించుకునే అవకాశం ఉంది. ఆ తరువాత పంపిణీ చేసిన అసైన్డ్ భూముల క్రయ విక్రయాలు చట్ట విరుద్ధం. ఈమేరకు నాటి కలెక్టర్, సీఆర్‌డీయే, రెవెన్యూ, న్యాయ శాఖ ఉన్నతాధికారులు, అడ్వకేట్ జనరల్ తమ అభ్యంతరాలను జీవో 41 నోట్ ఫైళ్లలో ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా వెల్లడించారు. వీటిని లెక్క చేయకుండా బినామీల ద్వారా హస్తగతం చేసుకున్న భూములకు చంద్రబాబు ప్యాకేజీని ప్రకటించారు.

కోర్టును మోసం చేసి మరీ...

అసైన్డ్ భూములను కొల్లగొట్టేందుకు చంద్రబాబు ఏకంగా న్యాయస్థానాన్నే మోసం చేయడం విస్మయపరుస్తోంది. ఈ కుట్రను అమలు చేసేందుకు రెవెన్యూ కార్యాలయాల్లో అసైన్డ్ భూముల రికార్డులను మాయం చేశారు. 1954 తరువాత భూ పంపిణీ రికార్డులేవీ లేవంటూ మంగళగిరి, తుళ్లూరు, తాడికొండ మండల రెవెన్యూ అధికారులతో ఓ నివేదిక ఇప్పించి న్యాయస్థానానికి సమర్పించారు. వాస్తవానికి 1954 తరువాత పలుదఫాలు పేదలకు అసైన్డ్ భూముల పంపిణీ జరిగింది. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2004–05లో అసైన్డ్ భూములను పంపిణీ చేశారు. అమరావతి అసైన్డ్ భూములలో 1954 తరువాత పంపిణీ చేసిన భూములు ఉన్నట్లు రుజువు చేసే రికార్డులు వెలుగులోకి వచ్చాయి. వాటిలో 1987, 2004–05లో పంపిణీ చేసిన అసైన్డ్ భూములు ఉన్నట్లు వెల్లడైంది. సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సమగ్ర విచారణలో మొత్తం భూబాగోతం బట్టబయలైంది.

ఉన్నతాధికారుల వాంగ్మూలం

టీడీపీ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూముల బదలాయింపు చేసినట్లు రెవెన్యూ ఉన్నతాధికారులు 164 సీఆర్‌పీసీ కింద న్యాయస్థానంలో వాంగ్మూలం ఇచ్చారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి తనను అప్రూవర్‌గా పరిగణించాలని కోరుతూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు.

ఏ 1 బాబు, ఏ 2 నారాయణ

అమరావతి భూ దోపిడీ కేసులో ఏ–1గా చంద్రబాబు, ఏ–2గా నారాయణలతో పాటు పలువురిపై విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో సీఐడీ చార్జ్‌షీట్ కూడా దాఖలు చేసింది. ఐపీసీ సెక్షన్లు 420, 409, 506, 166, 167, 217, 120 (బి), 109 రెడ్‌విత్ 34, 35, 36, 37.. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంలోని సెక్షన్లు 3(1),(జి), 3(2), అసైన్డ్ భూముల అన్యాక్రాంత నిరోధక చట్టంలోని సెక్షన్లు 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద వారిపై అభియోగాలు నమోదు చేసింది.

క్లుప్తంగా...

ముగిసిన ఎన్నికల డిప్యుటేషన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో కొంతకాలంగా ఎన్నికల సంఘం వద్ద పనిచేస్తున్న ఉద్యోగులను మాతృ సంస్థలకు బదిలీ చేశారు. రాష్ట్రంలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ కోసం 27 మంది అధికారులు డిప్యుటేషన్‌పై ఎన్నికల విధులు నిర్వహించారు. బుధవారం నుంచి వీరిని రిలీవ్ చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ ఉత్తర్వులిచ్చారు.

గవర్నర్‌తో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ భేటీ



గవర్నర్‌కు జ్ఞాపికను అందిస్తున్న వెంకటలక్ష్మి

సాక్షి, అమరావతి: గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకట లక్ష్మి బుధవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. మహిళా సాధికారికత సాధనతోపాటు పలు అంశాలపై మహిళా కమిషన్ చేపడుతున్న చర్యలను గవర్నర్‌కు ఆమె వివరించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను ఆమె కోరారు.

గంజాయి నియంత్రణకు మంత్రుల కమిటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. హోం మంత్రి వంగలపూడి అనిత నేతృత్వంలోని ఈ కమిటీలో మంత్రులు నారా లోకేశ్, కొల్లు రవీంద్ర, సత్య కుమార్ యాదవ్, గుమ్మడి సంధ్యా రాణి సభ్యులుగా ఉంటారు. వెలగపూడి సచివాలయంలో గురువారం నిర్వహించే ఈ కమిటీ తొలి సమావేశంలో డీజీపీతోపాటు ఇంటిలిజెన్స్, సీఐడీ అదనపు డీజీపీలు, సెబ్ డైరెక్టర్ తదితరులు పాల్గొంటారు.

త్వరలో ఉచితంగా ఇసుక

- గనులు, భూగర్భ వనరులశాఖ మంత్రి కొల్లు రవీంద్ర



సాక్షి, అమరావతి: త్వరలో ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకొస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖల మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. మూడునెలల్లో కొత్త ఇసుక విధానాన్ని రూపొందిస్తామన్నారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచితంగా ఇసుకను అందరికీ అందుబాటులో ఉంచుతామని తెలిపారు. గత ప్రభుత్వంలో ప్రైవేటు ఏజెన్సీలకు ఇసుక బాధ్యతను అప్పగించారని, తద్వారా దానిపై ఆదాయాన్ని సమకూర్చుకున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వంలో అలాకాకుండా అందరికీ ఉచితంగా ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చి నిర్మాణరంగం నిరంతరాయంగా కొనసాగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వం అనుసరించిన ఇసుక విధానాన్ని నిలుపుదల చేయడంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడం వల్ల రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలకు అవకాశం ఉండదని చెప్పారు. సెప్టెంబర్ తర్వాతే రీచ్‌ల్లో తవ్వకాలకు అవకాశం ఉంటుందని, అప్పటివరకు రీచ్‌లు తెరుచుకోవని తెలిపారు. 10, 15 రోజుల్లో రాష్ట్రంలో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్లను గుర్తించి వాటిల్లో అందుబాటులో ఉన్న ఇసుకను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. దీనిద్వారా వచ్చే మూడునెలల్లో కోటి టన్నుల ఇసుకను ప్రజలకు అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లోడింగ్, అక్కడి నుంచి ఇసుక రవాణా చేసే వాహనాల చార్జీలు ఎంత ఉండాలనే విషయాన్ని ఆయా జిల్లాల కలెక్టర్లు నిర్ణయిస్తారని తెలిపారు.

ఈవీఎంలపై ప్రత్యేక చర్చ జరగాలి

సీపీఐ కార్యదర్శి రామకృష్ణ



మురళీనగర్ (విశాఖ ఉత్తర): ఈవీఎంలపై ప్రత్యేక చర్చ జరగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు బుధవారం కొనసాగాయి. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లో ఈవీఎంలను వాడటం లేదన్నారు. ఎన్నికల వ్యవస్థపై దేశవ్యాప్త చర్చ అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు రూ.10 వేల కోట్లు ఖర్చు చేశాయని.. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజాస్వామ్యంపై ప్రజల్లో విశ్వాసం పోయే ప్రమాదం ఉందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఒంటెత్తు పోకడలతో పాలన సాగిస్తోందని విమర్శించారు. కొత్త నేర చట్టాలపై ప్రతిపక్షాలు అభ్యంతరం చెబుతున్నా జూలై 1 నుంచి అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంలో బీజేపీ వైఖరి మారలేదని, స్టీల్ ప్లాంట్‌ను నష్టాల పాల్జేసి అమ్మేయాలన్నది కేంద్ర ప్రభుత్వ విధానంగా ఉందన్నారు.

మరో డయాఫ్రమ్ వాల్ కట్టాల్సిందే

అంతర్జాతీయ నిపుణుల సూచన

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యామ్ గ్యాప్–2లో గోదవరి వరదల ఉధృతికి దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మించాలని అంతర్జాతీయ నిపుణుల బృందం కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)కి సూచించింది. ప్రస్తుతం ఉన్న డయాఫ్రమ్ వాల్‌కు మరమ్మతులు చేసినా, దెబ్బతిన్న ప్రాంతాల్లో 'యూ' ఆకారంలో నిర్మించి అనుసంధానం చేసినా పూర్తి సామర్థ్యం మేరకు పనిచేస్తుందని చెప్పలేమని తేల్చిచెప్పింది. ఇప్పటికే గోదావరి వరదలను మళ్లించేలా స్పిల్ వే, స్పిల్ ఛానల్‌తోపాటు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను ప్రభుత్వం పూర్తి చేసినందున కొత్త డయాఫ్రమ్ వాల్‌ను సులభంగా నిర్మించవచ్చని నిపుణుల బృందం అభిప్రాయపడింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) నియమించిన యూఎస్‌ఏకు చెందిన డేవిడ్ బి.పాల్, గియాస్ ఫ్రాంకో డి సిస్కో, కెనడాకు చెందిన రిచర్డ్ డొన్నెల్లీ, సీన్ హించ్‌బెర్గర్, కాంట్రాక్టు సంస్థ మేఘా నియమించిన అంతర్జాతీయ కన్సల్టెంట్ యాఫ్రి సంస్థ (స్వీడన్) ప్రతినిధులు నాలుగు రోజులపాటు ప్రాజెక్టును పరిశీలించి, అధికారులతో సమీక్షించారు. బుధవారం మరోసారి సమీక్షించిన అనంతరం నిపుణుల బృందంతో సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. గతంలో వరదను మళ్లించేలా స్పిల్ వే పూర్తి చేయకుండా, ఎగువ కాఫర్ డ్యామ్‌ను చేపట్టి ఇరు వైపులా ఖాళీ వదిలేయడం వల్లే వరద ఉధృతి మరింత పెరిగి డయాఫ్రమ్ వాల్ దెబ్బతిందని అంతర్జాతీయ నిపుణులు సీడబ్ల్యూసీ చైర్మన్‌కు తేల్చి చెప్పారు. గ్యాప్–2లో 1396 మీటర్ల పొడవున డయాఫ్రమ్



వాల్ నాలుగు చోట్ల కోతకు గురై 485 మీటర్ల మేర దెబ్బతిందని నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) ఇచ్చిన నివేదికతో ఈ బృందం ఏకీభవించింది. ప్రాజెక్టు భద్రత దృష్ట్యా డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్తది నిర్మించడం శ్రేయస్కరమని సూచించింది.

జెట్ గ్రౌటింగ్‌లో లోపం వల్లే లీకేజీలు

ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మాణానికి ముందు జెట్ గ్రౌటింగ్ చేసేటప్పుడు ఆ ప్రదేశంలో ఇసుక సాంద్రతను తప్పుగా అంచనా వేశారని ఈ బృందం తెలిపింది. అందువల్లే తక్కువ లోతు నుంచి స్టోన్ కాలమ్స్ వేసి, జెట్ గ్రౌటింగ్ చేశారని, దీనివల్లే లీకేజీలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంది. లీకేజీలకు కారణాలు కనుక్కోవడానికి కాఫర్ డ్యామ్ పైనుంచి 100 నుంచి 150 మీటర్లకు ఒక చోట మొత్తం 17 చోట్ల బోర్ హోల్స్ వేసి పరీక్షలు చేయాలని సూచించామని తెలిపింది. యాఫ్రి సంస్థ ఇప్పటికే నాలుగు చోట్ల పరీక్షలు చేసిందని వివరించింది. ఆ పరీక్షల ఫలితాలను విశ్లేషిస్తే.. లీకేజీలను పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయలేమని, కొంతవరకు అడ్డుకోవచ్చని అభిప్రాయపడింది. కొంతవరకు లీకేజీలు ఉన్నప్పటికీ కొత్త డయాఫ్రమ్‌వాల్ నిర్మాణానికి, ఈసీఆర్‌ఎఫ్ డ్యామ్ పనులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని వివరించింది.

ముగిసిన అంతర్జాతీయ నిపుణుల పర్యటన

అంతర్జాతీయ నిపుణుల నాలుగు రోజుల పోలవరం పర్యటన బుధవారం ముగిసింది. వారు బుధవారం విజయవాడ చేరుకున్నారు. గురువారం ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీకి చేరుకుని, అక్కడి నుంచి వారి దేశాలకు వెళ్తారు.

రెండు వారాల్లో మధ్యంతర నివేదిక

పోలవరం ప్రాజెక్టు పరిశీలన, అధికారులతో సమీక్షలో వెల్లడైన అంశాల ఆధారంగా సవాళ్లను అధిగమించడం, నిర్మాణాల డిజైన్లపై రెండు వారాల్లోగా మధ్యంతర నివేదిక ఇస్తామని నిపుణుల బృందం తెలిపింది. ఆ నివేదిక ఆధారంగా కాంట్రాక్టు సంస్థ అంతర్జాతీయ కన్సల్టెంట్ యాఫ్రి సంస్థ సవాళ్లను అధిగమించడానికి చేపట్టాల్సిన నిర్మాణాల డిజైన్లను రూపొందించి తమకు పంపితే.. తాము పరిశీలించి మార్పులుంటే సూచిస్తామని చెప్పింది. యాఫ్రి, తాము ఏకాభిప్రాయంతో నిర్ణయించిన డిజైన్‌ను సీడబ్ల్యూసీకి పంపుతామని తెలిపింది. ఆ డిజైన్‌ను సీడబ్ల్యూసీ క్షుణ్ణంగా పరిశీలించి, ఆమోదించాకే దాని ప్రకారం పనులు చేపట్టాలని సూచించింది. ఇందుకు సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా అంగీకరించారు. నిపుణుల బృందం మధ్యంతర నివేదిక ఇచ్చాక ఢిల్లీలో మరోసారి రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు, అంతర్జాతీయ నిపుణులతో సమావేశం నిర్వహిస్తామని వోరా చెప్పారు.



వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఆ పార్టీ ముఖ్య నాయకులు, ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు భేటీ అయ్యారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో వైఎస్ జగన్‌ను ఎమ్మెల్సీ ఇస్సాక్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, పార్టీ నాయకులు కోలా గురువులు, చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి, చంద్రమౌళి, బుడ్డా శేషారెడ్డి తదితరులు కలిశారు.

ప్రత్యేక హోదా తీర్మానాలు చేస్తే ఇచ్చేది కాదు

కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

సాక్షి, న్యూఢిల్లీ: ప్రత్యేక హోదా తీర్మానాలు చేస్తే ఇచ్చేది కాదని.. దీనిపై నిర్ణయం తీసుకోవాల్సింది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. బుధవారం ఢిల్లీలోని ఉద్యోగ్ భవన్‌లో 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమంలో భాగంగా ఆయన ఒక మొక్కను నాటారు. ఈ సందర్భంగా శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం చెప్పిందని గుర్తుచేశారు. ప్రత్యేక హోదా ఎందుకు ఇవ్వలేకపోతున్నామో కేంద్ర ప్రభుత్వం కారణాలను చెప్పిందన్నారు. ఆ కారణాలైతే మారవుకదా? అని వ్యాఖ్యానించారు. ఎందువల్ల ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేకపోయారో అదే బిహార్‌కు కూడా వర్తిస్తుందన్నారు. ఏదేమైనా ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.



పోలవరంలో నాణ్యత లేని పనులు

పోలవరం ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని శ్రీనివాసవర్మ వెల్లడించారు. అక్కడ నాణ్యతలేని పనులు జరిగాయన్నారు. కాఫర్ డ్యామ్, డయాఫ్రం వాల్‌లో పగుళ్లు వచ్చాయని తెలిపారు. వాటిని పునర్నిర్మించాల్సిన అవసరం కనిపిస్తోందన్నారు. 'పోలవరం విషయంలో కేంద్రం చిత్తశుద్ధితో పనిచేస్తుంది. ఇది పూర్తిగా కేంద్రం నిర్మించాల్సిన ప్రాజెక్టు. 2014–19 వరకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో బీజేపీ, రాష్ట్రంలోని టీడీపీ భాగస్వాములుగా ఉన్నాయి. ప్రాజెక్టును మా నిర్వహణలోకి తీసుకుని నిర్మించుకుంటామని అప్పటి టీడీపీ ప్రభుత్వం కేంద్రాన్ని అభ్యర్థించింది. 2014–19 వరకు కొన్ని పనులు జరిగాయి. తిరిగి ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ముందుకు వెళ్లాలా? జాతీయ ప్రాజెక్టు కాబట్టి కేంద్రమే చేపట్టాలా? అనేది కేంద్ర జలశక్తి శాఖ నిర్ణయం తీసుకుంటుంది' అని శ్రీనివాసవర్మ తెలిపారు.

ఇంధన శాఖపై 'కూటమి' కన్ను!

విద్యుత్ సంస్థల కీలక పోస్టుల్లో తమ వారిని నియమించే ప్రయత్నాలు

- రూ.కోట్లలో దండుకునేందుకు బేరాలు
- ఇప్పటికే పలువురు అధికారుల రాజీనామా
- విద్యుత్ సంస్థల్లో 10 మంది డైరెక్టర్ల చేత బలవంతంగా రాజీనామా
- త్వరలోనే ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల అధిపతులకూ స్థాన చలనం!
- వారి స్థానంలో అనుకూలురైన ఐఏఎస్‌ల నియామకం!

సాక్షి, అమరావతి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకోవడంతో అప్పులు తీర్చుకుని ఆదాయం బాట పట్టిన ఇంధన శాఖపై టీడీపీ కూటమి ప్రజాప్రతినిధుల కన్ను పడింది. డిస్కంలతో పాటు ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కోలో కీలక స్థానాల్లో తమ వారిని నియమించుకొని, కోట్లాది రూపాయలు దండుకొనేందుకు కూటమికి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు పెద్ద కుతంత్రానికే తెరలేపారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నియమితులైనవారిని రాజీనామాలు చేసి వెళ్లిపోవాలని హెచ్చరిస్తున్నారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు ఏ విధంగా ప్రభుత్వ శాఖలను జేబులు నింపుకొనేందుకు వాడుకున్నారో ఇప్పుడూ అదే తీరులో చెలరేగుతున్నారు. వారి ధన దాహానికి డైరెక్టర్ నుంచి అన్ని స్థాయిల ఉద్యోగులు అల్లాడిపోతున్నారు. కూటమి పెద్దల బలవంతంతో వరుసగా రాజీనామాలు చేస్తున్నారు. కొందరిని బలవంతంగా బయటకు పంపిస్తున్నారు. ఇప్పటికే ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ జేఎండీ, విశ్రాంత ఐపీఎస్ అధికారి మల్లారెడ్డి చేత రాజీనామా చేయించారు. ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్‌లో ముఖ్య ఆర్థిక సలహాదారులు హనుమంతరావు, సింహాచలం, జెన్‌కో ఓఎస్డీ ఆంటోని రాజు, మరికొందరిని విధుల నుంచి తప్పించారు. డైరెక్టర్లనూ రాజీనామా చేయాలని ఇటీవల హుకుం జారీ చేశారు. మంగళవారం రాత్రి మరోసారి గట్టిగా చెప్పడంతో ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కో, మూడు డిస్కంలలోని 10 మంది డైరెక్టర్లు బుధవారం రాజీనామా చేశారు. వారి బాధ్యతలను తాత్కాలికంగా సీజీఎంలకు అప్పగిస్తూ డిస్కంల సీఎండీలు ఉత్తర్వులు జారీ చేశారు. ఖాళీ అయిన పోస్టుల్లో కొన్నింటికి రూ.కోట్లలో బేరాలు మొదలు పెట్టినట్లు సమాచారం. కొన్ని పోస్టుల్లో అనుయాయులను నియమించుకొని వారి ద్వారా కోట్లు దండుకొనే ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. త్వరలోనే ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల అధిపతులను కూడా మార్చాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి తమకు అనుకూలంగా ఉండే పలువురు ఐఏఎస్ అధికారుల పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం.



ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం

10 మంది డైరెక్టర్ల రాజీనామా


ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ, జెన్‌కో ఎండీ, డిస్కంల సీఎండీలకు 10 మంది డైరెక్టర్లు బుధవారం రాజీనామా లేఖలను అందజేశారు. వాటిని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు పంపగా, ఆయన వెంటనే ఆమోదించారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

రాజీనామా చేసిన డైరెక్టర్లు

- టి.వీరభద్రరెడ్డి (ఫైనాన్స్– ఏపీ ట్రాన్స్‌కో)
- డి.ఎస్.జి.ఎస్.ఎస్. బాబ్జి (థర్మల్ – ఏపీ జెన్‌కో)
- సయ్యద్ రఫి (హెచ్‌ఆర్, ఐఆర్ – ఏపీ జెన్‌కో)
- ఎంవీవీ సత్యనారాయణ (హైడల్ – ఏపీ జెన్‌కో)
- సి.శ్రీనివాసమూర్తి (ఆపరేషన్స్ – ఏపీఈపీడీసీఎల్)
- ఎ.వి.వి.సూర్యప్రతాప్ (ప్రాజెక్ట్స్ – ఏపీఈపీడీసీఎల్)
- వి. బ్రహ్మానందరెడ్డి (ఫైనాన్స్ – ఏపీసీపీడీసీఎల్)
- జి. జయభారతరావు (టెక్నికల్ – ఏపీసీపీడీసీఎల్)
- టి. వనజ (ప్రాజెక్ట్స్ – ఏపీసీపీడీసీఎల్)
- కె.శివప్రసాదరెడ్డి (ప్రాజెక్ట్స్ – ఏపీఎస్పీడీసీఎల్)

మళ్లీ పాత పద్ధతిలోనే పంటల బీమా

- రైతుల భాగస్వామ్యంలో నూతన పంటల బీమా విధానం
- ఐఏఎస్ అధికారులు పొలంబాట పట్టి, రైతులతో మాట్లాడాలి
- ఖరీఫ్ సాగు ప్రణాళిక, సాగునీటి విడుదలపై సమీక్షలో సీఎం



సాక్షి, అమరావతి: ప్రస్తుతం ఉన్న ఉచిత పంటల బీమా పథకం స్థానంలో మళ్లీ పాత విధానంలో క్రాప్ ఇన్సూరెన్స్ తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రైతు భాగస్వామ్యం లేకుండా పంటల బీమా స్వరూపాన్నే మార్చేశారని, ఇక నుంచి సాగు చేసే ప్రతీ రైతుకు భాగస్వామ్యం ఉండేలా పంటల బీమా విధానాన్ని పునరుద్ధరించాలని చెప్పారు. ఖరీఫ్ పంటల సాగులో వ్యవసాయ శాఖ సన్నద్ధతపై బుధవారం సచివాలయంలో వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులతో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు సాగునీటి విడుదల ప్రణాళికను సీఎం చంద్రబాబుకు వివరించారు. గోదావరి డెల్టాకు జూన్ 1న నీరు విడుదల చేశామని, ఈ రోజు (బుధవారం) పట్టిసీమ, పుష్కర, తాటిపూడి, పురుషోత్తంపట్నం ద్వారా నీటి విడుదల ప్రారంభించామని చెప్పారు. పులిచింతలలో నీటి లభ్యత లేదని, పట్టిసీమ ద్వారా వచ్చే నీటి ద్వారానే కృష్ణా డెల్టాకు సాగు నీరు ఇస్తామన్నారు. జూన్‌లో హీట్ వేవ్ ఉన్నప్పటికీ, ప్రస్తుతం వర్షాలు ఆశించిన స్థాయిలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో సగటున 50 శాతం అదనపు వర్షపాతం నమోదైందని, కేవలం 45 మండలాల్లోనే లోటు వర్షపాతం ఉందన్నారు. సీజన్‌లో ఇప్పటి వరకు 4,14,490 ఎకరాలు సాగు జరగాల్సి ఉండగా 3,04,604 ఎకరాల్లో పంటలు సాగయ్యాయన్నారు.

ఏపీలోనే రైతుల అప్పులెక్కువ

దేశంలో ఎక్కువ అప్పులు ఉండే రైతులు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నారని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ పరిస్థితి మారాలన్నారు. ప్రభుత్వ సబ్సిడీలు, పాలసీల ద్వారా సాగు ఖర్చులు తగ్గాలన్నారు. గతంలో క్రమం తప్పకుండా సాయిల్ టెస్ట్‌లు నిర్వహించి, రైతులకు పోషకాలు అందించే వాళ్లమన్నారు. రాయలసీమ జిల్లాల్లో సబ్సిడీపై పెద్ద ఎత్తున డ్రిప్, స్ప్రింక్లర్లు ఇచ్చామని చెప్పారు. ప్రాజెక్టుల నిర్వహణలో మళ్లీ ఉత్తమ విధానాలు అమలు చేయాలని సూచించారు. జీరో బడ్జెట్ నాచురల్ ఫార్మింగ్‌ను మళ్లీ ప్రోత్సహించాలన్నారు. డ్రోన్లతో పురుగు మందుల పిచికారీపై అధ్యయనం చేయాలని, వాటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. పంటలకు అధికంగా పురుగు మందులు కొట్టే విధానాలకు స్వస్తి పలకాలన్నారు. ఏ తెగులుకు ఏ మందు కొట్టాలి అనే విషయంలో అధికారులు రైతులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అన్ని పంట కాలువల్లో యుద్ధ ప్రాతిపదికన గుర్రపు డెక్క తొలగించాలని ఆదేశించారు. కృష్ణా నది నీటిని రాయలసీమకు ఎక్కువగా ఉపయోగించి, వృధాగా పోయే గోదావరి వరద నీటిని సద్వినియోగం చేసుకుని కృష్ణా డెల్టాకు నీరు ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఆక్వా, హార్టికల్చర్‌కు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. తీవ్ర నష్టాల్లో ఉన్న రైతులకు మళ్లీ భరోసా కల్పించేలా అధికారులు పని చేయాలని ఆదేశించారు. ఐఏఎస్ అధికారులు సైతం సచివాలయం నుంచి పొలాలకు వెళ్లి, రైతులతో నేరుగా మాట్లాడాలన్నారు. ఈ సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హస్తినకు చేరుకున్న సీఎం చంద్రబాబు

- నేడు ప్రధాని, కేంద్ర హోం, రక్షణ శాఖ మంత్రులతో భేటీ
- రేపు ఆర్థిక మంత్రితో సమావేశమయ్యే అవకాశం
- నిధులు, పోలవరం, రాజధాని అంశాలపై చర్చ!
- ఇటీవల గెలుపొందిన రాష్ట్ర ఎంపీలకు బాబు విందు

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి/గన్నవరం: ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీకి చేరుకున్నారు. బుధవారం రాత్రి 8 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆయనకు పలువురు ఎంపీలు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి నేరుగా అశోకా రోడ్డులోని ఆయన నివాసానికి వెళ్లారు. రెండు రోజుల పాటు ఢిల్లీలోనే బస చేయనున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులను చంద్రబాబు కలవనున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయం, పెండింగ్ ప్రాజెక్టుల విషయం, పోలవరం, రాజధాని అమరావతి అంశాలపై ప్రధాని, కేంద్ర మంత్రులతో చర్చించనున్నారు. గురువారం ఉదయం ప్రధానితో భేటీ అవ్వనున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. అనంతరం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి మనోహర్ లాల్‌ఖట్టర్‌లను కలవనున్నారు. శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. కాగా, రాష్ట్రంలో ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ, జనసేన, బీజేపీ ఎంపీలకు చంద్రబాబు విందు ఇచ్చారు. అనంతరం శుక్రవారం రాత్రి లేదా శనివారం ఉదయం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు తిరిగి వెళ్లనున్నట్లు తెలిసింది.

34 కిలోమీటర్ల దూరానికి హెలికాప్టర్!

నిత్యం నీతులు, సుద్దులు చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. కొంచెం దూరం ప్రయాణించడానికి కూడా హెలికాప్టర్ వినియోగించడం చర్చనీయాంశమైంది. బుధవారం ఆయన కేవలం 34 కిలోమీటర్ల దూరం రోడ్డు మార్గంలో ప్రయాణించకుండా, హెలికాప్టర్‌ను వాడారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లేందుకు బుధవారం సాయంత్రం వెలగపూడి సచివాలయం నుండి గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకునేందుకు ఆయన ఆకాశమార్గాన్ని ఎంచుకున్నారు. హడావుడి, ఆడంబరాలకు దూరంగా ఉన్నట్లు రోజూ మీడియా సమావేశాలు, సమీక్షల్లో చెబుతున్న ఆయన కొద్దిపాటి దూరానికి హెలికాప్టర్ వినియోగించడం గమనార్హం. సాధారణంగా కొద్దిపాటి దూరం ప్రయాణాలకు ముఖ్యమంత్రి అయినా, గవర్నర్ అయినా రోడ్డు మార్గాన్నే ఉపయోగిస్తారు. అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప హెలికాప్టర్ వాడరు. కానీ ఇప్పుడు 34 కిలోమీటర్లు వెళ్లేందుకు హెలికాప్టర్ వాడడం ద్వారా తాను చెప్పే సూక్తులన్నీ మాటలకే పరిమితమని చంద్రబాబు రుజువు చేసుకున్నారు.

పట్టిసీమ నుంచి నీరు విడుదల



పట్టిసీమ నుంచి విడుదలవుతున్న నీరు

పోలవరం రూరల్: ఏలూరు జిల్లాలోని పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి కుడి కాలువకు బుధవారం నీటిని విడుదల చేశారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు 2, 4, 6 పంపుల ద్వారా గోదావరి జలాలను విడుదల చేశారు. డెలివరీ సిస్టమ్ వద్ద గోదారమ్మకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. ఏటా వేలాది టీఎంసీల గోదావరి నీరు వృథాగా సముద్రంలోకి పోతోందన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోగా దానిలో కొంత మేరైనా కృష్ణాకు తాగు, సాగునీటిని అందించి వినియోగిస్తామన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు అందించడం ద్వారా ముందస్తు ఖరీఫ్ పంట వేసుకునేందుకు రైతులకు అవకాశం ఉంటుందన్నారు. కృష్ణా జలాలను అటు రాయలసీమకు కూడా వినియోగిస్తామన్నారు. ఎత్తిపోతల పథకం ద్వారా ఆరు మోటార్ల నుంచి 2,100 క్యూసెక్కుల నీరు కుడి కాలువ ద్వారా వెళుతోందన్నారు. ఒకేరోజు పట్టిసీమ, తాడిపూడి, పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని విడుదల చేయడం రికార్డు అన్నారు. ఐటీడీఏ పీఓ సూర్యతేజ, ఆర్డీఓ కె.అద్దయ్య, ఎస్ఈ కె.నరసింహమూర్తి, ఈఈ పి.ఏసుబాబు, డీఈ పెద్దిరాజు, తహసీల్దార్ జీవీ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు క్యాంపు కార్యాలయంలో నిపుణుల బృందంతో మంత్రి సమావేశమయ్యారు.

డ్రోన్ల ద్వారా దోమలను కనిపెడదాం

▶ మొదటి పేజీ తరువాయి

బుధవారం వైద్య, ఆరోగ్య శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకున్న చర్యలను అధికారులు సీఎంకు వివరించారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు రాష్ట్రంలో 60 డయేరియా కేసులు నమోదయ్యాయని, ప్రస్తుతం 6 గ్రామాల్లో 35 డయేరియా యాక్టివ్ కేసులు ఉన్నట్లు తెలిపారు. తొమ్మిది మంది డయేరియాతో చనిపోయారన్నారు. ఈ నేపథ్యంలో సీఎం మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల నియంత్రణకు 2014 నుంచి 2019 మధ్య అనుసరించిన విధానాలను మళ్లీ అనుసరించాలని వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల అధికారులను ఆదేశించారు. దోమల నియంత్రణకు అధునాతన సాంకేతిక పద్ధతులను వినియోగించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో కలుషిత తాగునీరు, పారిశుధ్య లోపం, దోమల నివారణకు చర్యలు తీసుకోక పోవడం వల్లే ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. రక్షిత తాగునీరు, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల బారినపడే వారి సంఖ్య అధికంగా ఉంటుందని, వారిపై వైద్య, ఆరోగ్య శాఖ మరింత దృష్టి పెట్టాలని సూచించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడితే మాత్రం ఉపేక్షించబోనన్నారు. సీజనల్ వ్యాధుల నివారణలో మూడు శాఖలు సమన్వయంతో పని చేయాలని, అప్పుడే ఫలితాలు వస్తాయన్నారు. శాఖల మంత్రులు, అధికారులు దీనిపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి, స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లాలని చెప్పారు. ఈ సమీక్షలో మంత్రులు నారాయణ, సత్యకుమార్ యాదవ్, మూడు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇప్పుడు సమయం లేదు మళ్లీ వింటా..

రాష్ట్రంలో త్వరలో వైద్య విద్యా కోర్సుల ప్రవేశాల ప్రక్రియ మొదలుకానుంది. ఈ నేపథ్యంలో ఫీజులు ఖరారు చేయడంతో పాటు, కొత్త వైద్య కళాశాలల్లో తరగతుల ప్రారంభం, ఇతర అంశాల్లో ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఈ అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు అధికారులు ప్రయత్నించగా ప్రస్తుతం సమయం లేదని, మళ్లీ వింటానని చంద్రబాబు చెప్పినట్టు తెలిసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి పులివెందుల, ఆదోని, మార్కాపురం, ఆదోని, పాడేరు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రారంభించాల్సి ఉంది. ఈ తరుణంలో ఆయా వైద్య కళాశాలలకు ఎన్‌ఎంసీ నుంచి అనుమతులు రాబట్టడంతో పాటు, తరగతులు ప్రారంభించడానికి వీలుగా ఎన్‌ఎంసీ నిబంధనలకు అనుగుణంగా వసతులు కల్పించాల్సి ఉంది. ఇదిలా ఉండగా అమరావతిపై శ్వేత పత్రం విడుదల చేసిన సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా దోమలు అధికంగా ఉన్న 20 వేల ప్రాంతాలను గుర్తించామన్నారు. ఆ ప్రాంతాల్లో డ్రోన్‌లతో మందును పిచికారి చేస్తూ దోమలు లేని ప్రాంతాలను సున్నాకు తీసుకుని రావాలని ప్రణాళిక రచించామని చెప్పారు.

'ఆప్షన్–3'పై సీఎంతో చర్చిస్తాం

గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



సాక్షి, అమరావతి: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద ప్రభుత్వమే పేదలకు ఇళ్లు నిర్మించి ఇచ్చే విధంగా గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆప్షన్–3 విధానాన్ని కొనసాగించాలా? లేదా? అనే దానిపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బుధవారం సచివాలయంలో గృహ నిర్మాణ శాఖపై అన్ని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్‌లు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వంద రోజుల్లో 1.28 లక్షల ఇళ్లు పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకున్నామన్నారు. అంతేగాక రాష్ట్రంలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 8.02 లక్షల గృహాలను వచ్చే మార్చి నెలాఖరుకు నాటికి పూర్తి చేయాలనుకున్నామని వివరించారు. గృహ నిర్మాణాలు జరిగే లేఅవుట్ల అభివృద్ధికి సంబంధించి విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, రాయలసీమల్లోని థర్మల్ పవర్ స్టేషన్ల నుంచి వచ్చే ఫ్లై యాష్ వినియోగించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. గృహ నిర్మాణ శాఖలో ఉన్న ఖాళీలను ప్రస్తావిస్తూ.. పదోన్నతుల ద్వారా ఖాళీలను భర్తీ చేయాలని, కిందిస్థాయి ఖాళీలను జిల్లాల నుంచి లేదా డిప్యూటేషన్ ద్వారా భర్తీ చేయాలని సమీక్షలో అధికారులు మంత్రికి సూచించారు. శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ప్రత్యేక కార్యదర్శి మైదీన్ దివాన్, ఎండీ గిరీషా పాల్గొన్నారు.

> కర్మ సూత్రం అనేది ఎప్పుడూ ఒక ప్రతిధ్వనిలా పనిచేస్తుందని గుర్తుంచుకోండి. ఒకరి గురించి చెడుగా మాట్లాడినప్పుడు అలాంటి అర్థంలేని మాటలే మీకూ ప్రతిధ్వనిస్తాయి.
> – బ్రహ్మకుమారీలు

సాక్షి
గురువారం, 4 జూలై 2024

ఘోరం... నేరం...

మానవ బలహీనతను సొమ్ము చేసుకోవడానికి నమ్మకాన్ని వాటంగా మార్చుకోవడం చరిత్రలో తరచూ కనిపించేదే. ఎవరికీ ఏ ఇబ్బందీ కలగనంత వరకేమో కానీ... ప్రజల అమాయకత్వాన్ని స్వార్థానికి వాడుకుంటున్నప్పుడు, ఆ ప్రక్రియ ఆఖరికి ప్రాణాంతకంగానూ మారినప్పుడు చూస్తూ సహించలేం. సమకాలీన సమాజంలో అలాంటి అనుభవాల్ని భరించలేం. ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్ జిల్లా ఫుల్‌రాయ్ వద్ద మంగళవారం జరిగిన ధార్మిక సభ, అక్కడ తొక్కిసలాటను చూసినప్పుడు అదే అనిపిస్తుంది. 121 మంది అమాయక భక్తులు మరణించిన హాథ్రస్ ఘటన ఘోర విషాదం. పాదధూళితో, పంపులో నీళ్ళతో సమస్త సమస్యలూ పరిష్కారమవుతాయని అమాయక ప్రజల్ని నమ్మిస్తున్న ఓ పెద్ద మనిషి తప్పిదానికి అమాయక ప్రజల ప్రాణాలు గాలిలో కలిశాయి. పాలకులు ఎప్పటి లానే సంతాపాలు తెలిపారు. నష్టపరిహారాలు ప్రకటించారు. సిట్ దర్యాప్తుకూ ఆదేశించారు. కానీ, తరచూ జరుగుతున్న ఇలాంటి దుర్ఘటనల్ని నివారించాల్సిన బాధ్యత లేదా? ప్రమాదవేళ తూతూ మంత్రంగా స్పందించి, ఆనక నివారణ చర్యలపై నిమ్మకు నీరెత్తినట్టుంటే సరిపోతుందా?

తాజా హాథ్రస్ ఘటనకు కేంద్రబిందువైన స్వయం ప్రకటిత దైవదూత నారాయణ్ సాకార్ హరి అలియాస్ భోలే బాబా కథ సుదీర్ఘమైనదే. ఆయన అసలు పేరు సూరజ్ పాల్. ఆధ్యాత్మిక గురువుగా మారక ముందు యూపీ పోలీసుల స్థానిక ఇంటెలిజెన్స్ విభాగంలో సాధారణ హెడ్ కానిస్టేబుల్. ఉద్యోగంలో ఉండగానే తాను ఆధ్యాత్మికత వైపు మొగ్గాననీ, అందుకే 1990లలో చేస్తున్న ఉద్యోగం మానేసి దైవమార్గం పట్టాననీ ఆయన కథనం. ఉత్తరప్రదేశ్‌లో ఓ చిన్న గ్రామంలో రైతు కుటుంబంలో పుట్టిన ఆయన చలువ కళ్ళద్దాలు, శ్వేత వస్త్రధారణతో పేరు, పలుకుబడి గల బాబాగా అవతరించడం ఆశ్చర్యమే. ఇవాళ యూపీ, రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా తదితర ప్రధాన హిందీ రాష్ట్రాల్లో ఆయనకు లక్షలాది భక్తులు పోగుబడడం మరింత ఆశ్చర్యం కలిగిస్తుంది. చనిపోయిన బిడ్డను బ్రతికిస్తానంటూ 23 ఏళ్ళ క్రితం శ్మశానంలో గందరగోళం చేయడం మొదలు లైంగిక అత్యాచార ఆరోపణల దాకా ఈ బాబాపై అనేక కేసులున్నాయి. నాలుగేళ్ళ క్రితం 2020 జనవరిలో షాజహాన్‌పూర్‌లో ఈయన సత్సంగంలోనే ప్రసాద వితరణ వేళ మంటలు చెలరేగి, తొక్కిసలాట జరిగింది. సమయానికి అగ్నిమాపక దళం రావడంతో పెను ప్రమాదం తప్పింది. కానీ, దోవ కూడా సరిగ్గా లేని తాజా హాథ్రస్ ఘటనాస్థలిలో కనీసం అంబులెన్స్ లాంటివైనా లేకపోవడం ఘోరం, నేరం.

హాథ్రస్ ఘటనపై కఠిన చర్యలు చేపడతామని యూపీ సీఎం గర్జించారు కానీ, ఈ దుర్ఘటనపై దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో అసలు భోలే బాబా పేరే పెట్టలేదు. ఇక, ఇంత భారీ దుర్ఘటన జరిగాక సదరు బాబా ఎవరికీ కనిపించకుండా పరారీలో ఉన్నారు. హాథ్రస్ ఘటన అత్యాశకూ, అపరిమిత నిర్లక్ష్యానికీ ప్రతీక. ఈ ఘటనలో తిలా పాపం తలా పిడికెడు. సత్సంగమంటూ 80 వేల మందికే అనుమతి తీసుకొన్నా, రెండున్నర లక్షల మందికి పైగా జనాన్ని అనుమతించడం ఎవరి తప్పు? తగినన్ని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలైనా లేకుండా అంత భారీ ఆధ్యాత్మిక సభ జరిపిన నిర్వాహకులను ఏమనాలి? 'నా పాదధూళి ఇంటికి తీసుకెళ్ళి సమస్యల్లో ఉన్నవారికి రాస్తే అన్నీ చక్కబడతాయి' అని అమాయకుల బలహీనతతో ఆడుకొని, ఇంత ఘోరానికి కారకుడైన మహానుభావుణ్ణి ఏం చేయాలి? ఇంత జరిగాక కూడా ఆయన తన వకీలు ద్వారా ఈ దుర్ఘటన వెనుక అసాంఘిక శక్తుల కుట్ర ఉందంటూ నెపం నెట్టేసే పని చేస్తుంటే పాలకులు ఏం చేస్తున్నట్టు?

హాథ్రస్ ఘటన లాంటివి మనకు కొత్త కాదు. గతంలోనూ ఇలాంటివి అనేకం జరిగాయి. 2005లో మహారాష్ట్రలోని వాయిలో మంధరాదేవి గుడి వద్ద తొక్కిసలాటలో 340 మందికి పైగా చనిపోయారు. 2008లో రాజస్థాన్‌లో చాముండా దేవి ఆలయం వద్ద కనీసం 250 మంది, హిమాచల్ ప్రదేశ్‌లోని నైనాదేవి గుడి వద్ద 162 మంది తొక్కిసలాటల్లోనే దుర్మణం పాలయ్యారు. చరిత్ర పుటల్లో వెనక్కి వెళితే, 70 ఏళ్ళ క్రితం 1954లో స్వాతంత్ర్యానంతరం జరిగిన తొలి కుంభమేళాలో అలహాబాద్‌లో జరిగిన తొక్కిసలాటలో 800 మంది ప్రాణాలు కోల్పోవడం గుండెల్ని మెలిపెట్టే విషాదం. రద్దీని నియంత్రించే వ్యవస్థలు లేకపోవడం, భారీగా జనం తరలివచ్చే సందర్భాలకు తగ్గట్టు ముందస్తు ప్రణాళికా రచన చేయకపోవడం, సామాన్యుల నియంత్రణే కష్టంగా ఉండే సమయంలో వీఐపీల తాకిడి ఎక్కువై యంత్రాంగమంతా వారి సేవల్లో తరించడం లాంటి లోపాలు ఆనాటి నుంచి ఈనాటి వరకు కొనసాగుతూనే ఉన్నాయి. అది మరింత విషాదం.

భారతదేశంలో నూటికి 79 తొక్కిసలాటలు ధార్మిక సమ్మేళనాలు, తీర్థయాత్రల్లో జరుగుతున్నవేనని 2013లో ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం తేల్చింది. పైపెచ్చు, మన దేశంలో అనేక ఆలయాలు కొండల పైన, నదీ తీరాల్లో, ప్రయాణానికి సంక్లిష్టమైన ఇతర ప్రాంతాల్లో నెలకొన్నందున తొక్కిసలాటల ముప్పు ఎక్కువ. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ధార్మిక సమ్మేళనాలు నిర్వహిస్తుంటే వేలు, లక్షల్లో జనం రాకతో ఆ ప్రాంతాలు క్రిక్కిరిసి పోతున్నాయి. అలాంటి చోట్ల ప్రాథమిక వసతులే కాదు... కనీసం సరైన ప్రవేశ మార్గాలు, అత్యవసర పరిస్థితుల్లో నిష్క్రమణ మార్గాలు సైతం ఉండట్లేదు. ఇవన్నీ ప్రమాదాలకు కారణాలే. వీటిని నివారించాలంటే జనసమ్మర్దాన్ని నియంత్రించే యంత్రాంగం కీలక పాత్ర పోషించాలి. 2014లోనే జాతీయ విపత్తుల ప్రాధికార సంస్థ జనసమ్మర్ద నియంత్రణపై మార్గదర్శకాలు ఇచ్చింది. కానీ, అవి ఎక్కడా అమలైనట్టు లేవు. తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. తాజా ఘటనతోనైనా పాలకులు నిద్ర లేస్తారా? ఓట్ల రాజకీయాల్ని వదిలేసి, మూఢనమ్మకాలు ప్రోత్సహించేవారికి ముకుతాడు వేస్తారా?

వినాశనపు ఒడ్డున ప్రపంచం

విశ్లేషణ



సి. ఉదయ్ భాస్కర్

2024 జనవరి నాటికి తొమ్మిది అణ్వాయుధ దేశాల(ఎన్9) దగ్గర 12,121 అణ్వస్త్రాలు ఉన్నాయని 'స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' నివేదిక చెబుతోంది. ఆయుధ సంపత్తిని పెంచుకునేందుకు, ఆధునికీకరించుకునేందుకు ఈ దేశాలు (భారత్ సహా) గత ఏడాది ఏకంగా 9,100 కోట్ల డాలర్లు ఖర్చు పెట్టాయి. రష్యా, అమెరికా వద్ద ఉన్నన్ని ఖండాంతర క్షిపణులను సిద్ధం చేసేందుకు చైనా ప్రయత్నిస్తోందని కూడా ఈ నివేదిక తెలియజేస్తోంది. ఇది దక్షిణాసియాకు క్షేమకరం కాకపోగా, పరోక్షంగా భారత్‌కు కూడా ముప్పే. శక్తిమంతమైన దేశాల మధ్య వ్యూహాత్మక అంశాల విషయంలో సమాచార వినిమయం జరగకపోవడం ఈ పరిస్థితికి కారణం. కనుచూపు మేరలో ఇది మెరుగుపడే సూచనలూ లేకపోవడం ఆందోళనకరం.

ప్రపంచ వినాశనానికి హేతువు కాగల అణ్వస్త్రాలు మరోసారి పడగ విప్పుతున్నాయి. గత నెల పదిహేడున విడుదలైన రెండు అంతర్జాతీయ స్థాయి నివేదికలు ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ భద్రతను సవాలు చేస్తున్నాయి. మొదటి రిపోర్టును ఇంటర్నేషనల్ క్యాంపెయిన్ టు అబాలిష్ న్యూక్లియర్ వెపన్స్(ఐసీఏఎన్) విడుదల చేయగా... రెండోదాన్ని స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎస్ఐపీఆర్ఐ-సిప్రి) విడుదల చేసింది. రెండింటిలోని సమాచారం మానవాళిని హెచ్చరించేది మాత్రమే కాదు... భయపెట్టేది కూడా.



ఆకలి కంటే అణ్వాయుధాలే మిన్నా?

ఐసీఏఎన్ రిపోర్టు ప్రకారం, ప్రపంచం మొత్తమ్మీద అణ్వాయుధ సామర్థ్యమున్న తొమ్మిది దేశాలు (అమెరికా, యూకే, రష్యా, చైనా, ఫ్రాన్స్, ఇండియా, ఇజ్రాయెల్, పాకిస్తాన్, ఉత్తర కొరియా) తమ ఆయుధ సంపత్తిని పెంచుకునేందుకు, ఆధునికీకరించుకునేందుకు గత ఏడాది ఏకాఏకి 9,100 కోట్ల డాలర్లు ఖర్చు పెట్టాయి. అన్ని దేశాల సమర్థింపు ఒక్కటే... 'ఇతరుల' నుంచి ముప్పు ఉందని! 2023లో అందరూ ఊహించినట్టుగానే అమెరికా అత్యధికంగా 5,150 కోట్ల డాలర్లు అణ్వాయుధాలపై ఖర్చు చేయగా... చైనా (1,180 కోట్ల డాలర్లు), రష్యా (830 కోట్ల డాలర్లు) ఖర్చు చేసినట్టు ఐసీఏఎన్‌నివేదిక తెలిపింది. ''గత ఏడాది ఈ తొమ్మిది దేశాలు కలిసికట్టుగా ప్రతి సెకనుకు సుమారు రెండున్నర లక్షల రూపాయలు ఖర్చు పెట్టాయి'' అని ఐసీఏఎన్ డైరెక్టర్ మెలిస్సా పార్క్ తెలిపారు. ఈ మొత్తం ప్రపంచం మొత్తమ్మీద ఆకలిని అంతం చేసేందుకు అవసరమయ్యే నిధులకంటే చాలా ఎక్కువని ఆమె వివరించారు. ఇంత మొత్తాన్ని మొక్కలు నాటేందుకు ఉపయోగించి ఉంటే ఒక్కో నిమిషానికి కనీసం పది లక్షల మొక్కలు నాటి ఉండవచ్చు అని మెలిస్సా అన్నారు.

వాతావరణ మార్పుల ప్రభావం కారణంగా భూమ్మీద మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతున్న ఈ తరుణంలో ఇంత పెద్ద ఎత్తున మొక్కలు నాటే అంశాన్ని ఎత్తడం ఎంతైనా మంచి విషయమే కదా? ఈ ఏడాది వేసవి ఎంత మంట పుట్టించిందో, వడగాడ్పులకు ఎంత మంది మరణించారో మనకు తెలియంది కాదు. మనుషుల నిష్పత్తితో పోల్చినప్పుడు ఉండాల్సినన్ని వృక్షాలు లేకపోవడం వల్ల చాలా దేశాలు అనేక వాతావరణ సంబంధ సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఈ అంశంలో పెద్ద దేశాల్లోకీ ఇండియా అత్యంత ఎక్కువగా ప్రభావితం అవుతోంది.

సిప్రి ఇయర్‌బుక్–2024 అంతర్జాతీయంగా భద్రత విషయంలో వస్తున్న మార్పులేమిటి? ఆయుధాలు, టెక్నాలజీ రంగాల్లోని ముఖ్య పరిణామాలు ఏమిటి? అనేది సమగ్రంగా వివరిస్తుంది. దేశాల మిలిటరీ పెడుతున్న ఖర్చులు, ఆయుధాల ఉత్పత్తి, వ్యాపారాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న ఘర్షణలను కూడా ఈ ఇయర్ బుక్ వివరిస్తుంది. సంప్రదాయ ఆయుధాలతోపాటు అణ్వస్త్రాలు, జీవ, రసాయన ఆయుధాలపై కూడా ఇది దృష్టి పెడుతుంది. అణ్వాయుధాలకు సంబంధించి ఇందులో దాదాపు వంద పేజీల విలువైన సమాచారాన్ని పొందుపరిచారు.

పెరిగిన చైనా అణ్వాయుధాలు...

సిప్రి నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా అణ్వాయుధాల సంఖ్య మాత్రమే కాదు... అందులో రకాలు కూడా పెరిగాయి. మొత్తం తొమ్మిది దేశాలు అణ్వాయుధాల ద్వారా మాత్రమే తమ జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవచ్చునని అనుకుంటున్నాయి. రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్నే తీసుకోండి. హద్దులు దాటొద్దని నాటోను హెచ్చరించేందుకు రష్యా అణ్వాయుధాలను వాడేందుకు వెనుకాడమని చెబితే... బదులుగా నాటో, అమెరికా కూడా అణ్వస్త్రాలతో యుద్ధానికి సిద్ధమన్నట్టు కాలు దువ్వుతున్నాయి.

2024 జనవరి నాటికి తొమ్మిది అణ్వాయుధ దేశాల(ఎన్9) దగ్గర దాదాపు 12,121 అణ్వస్త్రాలు ఉన్నాయని సిప్రి నివేదిక చెబుతోంది. ఇందులో 9,585... వాడుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అంతేకాదు... వీటిల్లో 3,904 అణ్వస్త్రాలు ఇప్పటికే నిర్దిష్ట ప్రదేశాల్లో ఏర్పాటు చేశారనీ, 2,100 అణ్వస్త్రాలను ఆపరేషనల్ అలర్ట్‌తో ఉంచారనీ కూడా సిప్రి ఇయర్ బుక్ చెబుతోంది. గత ఏడాదితో పోలిస్తే ఆపరేషనల్ అలర్ట్‌తో ఉన్న అణ్వాయుధాలు ఈ ఏడాది దాదాపు వంద ఎక్కువ కావడం గమనార్హం. ప్రపంచం మొత్తమ్మీద ఉన్న అణ్వాయుధాల్లో 88 శాతం అమెరికా, రష్యాల వద్దే ఉండటం గమనార్హం. అయితే చైనా అణ్వాయుధ సంపత్తి 2023 నాటి 410 నుంచి ఈ ఏడాది జనవరి నాటికి 500కు చేరడం ఆందోళన కలిగించే అంశమని సిప్రి నివేదిక తెలిపింది. చైనా తన అణ్వాయుధాలను ఆధునికీకరించుకుంటోందనీ, రానున్న దశాబ్ద కాలంలో ఉత్పత్తిని కూడా గణనీయంగా పెంచుకునే ప్రయత్నాల్లో ఉందనీ సిప్రి నివేదిక తెలియజేస్తోంది. ''రష్యా, అమెరికాల వద్ద ఉన్నన్ని ఐసీబీఎం(ఖండాంతర క్షిపణు)లను సిద్ధం చేసేందుకు చైనా ప్రయత్నిస్తోంది'' అని ఈ నివేదిక రచయితలు తెలిపారు. చైనా తననితాను అమెరికాకు ప్రత్యర్థిగా భావించవచ్చు కానీ... చైనా ఈ మధ్యకాలంలో అణ్వాయుధాలను సిద్ధం చేయడం ఎక్కువ కావడం దక్షిణాసియా ప్రాంత భద్రతకు ఏమంత మంచిది కాదు. ఇంకోలా చెప్పాలంటే భారతదేశానికి కూడా పరోక్ష ముప్పు పొంచి ఉందన్నమాట!

కనబడని కాంతి

ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో, 1945 –1991 మధ్యన అమెరికా, ఆ దేశాన్ని బలపరిచే యూకే, ఫ్రాన్స్‌లు ఒక పక్క... ఒకప్పటి సోవియట్ రష్యా మరో పక్క అన్నట్టుగా అణ్వాయుధ పోటీ నడిచింది. 1962 నాటి క్యూబన్ మిస్సైల్ ఉదంతం తరువాత ఇరు పక్షాలు కూడా అణ్వస్త్ర నిరోధకతకు అనుకూలంగా కొంత తగ్గాయి. ఆయుధాల నియంత్రణ, మ్యూచువల్లీ అష్యూర్డ్ డిస్ట్రక్షన్ వంటి అంశాల ఆధారంగా ఈ సంయమనం సాధ్యమైంది.

2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి చేసింది మొదలు ప్రపంచం అణ్వస్త్రాల విషయంలో రెండుగా విడిపోయింది. ఒకటేమో అమెరికా నేతృత్వంలోని మిలిటరీ భాగస్వాములుగా మారితే... రెండోదేమో రష్యా– చైనా, జూనియర్ పార్ట్‌నర్‌గా ఉత్తర కొరియా కూటమిగా నిలిచాయి. భారత్, పాకిస్తాన్, ఇజ్రాయెల్ ఏ కూటమిలోనూ చేరలేదు. కాకపోతే వాటి భౌగోళిక స్థితిని బట్టి ఎవరు ఎటువైపు అన్నది స్పష్టమే.

ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందని ఒకసారి ఆలోచిస్తే 2022 నాటి నుంచి ప్రపంచం మొత్తమ్మీద శక్తిమంతమైన దేశాల మధ్య వ్యూహాత్మక అంశాల విషయంలో సమాచార వినిమయం పెద్దగా జరగడం లేదని చెప్పాలి. అమెరికా దేశీయంగా ఎన్నో ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటోంది. డోనాల్డ్ ట్రంప్ మరోసారి పగ్గాలు చేపట్టే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇంకోపక్క ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని కొనసాగించాలనే నిశ్చయాభిప్రాయంతో రష్యా ఉంది. చైనా కూడా తన సరిహద్దుల విషయంలో దుందుడుకుగా వ్యవహరిస్తోంది. నిజంగానే ఇది ప్రపంచం ఎదుర్కొంటున్న ముప్పు అని చెప్పాలి. ఐసీఏఎన్, సిప్రి నివేదికలు ఈ ముప్పునే సవివరంగా వివరిస్తున్నాయి. కనుచూపు మేరలో పరిస్థితి మెరుగుపడే సూచనలూ లేవని చెబుతూండటం కఠోర సత్యం.

వ్యాసకర్త ఢిల్లీలోని సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మట్టి కోసం ప్రాణాలా?



హాథ్రస్ (ఉత్తరప్రదేశ్) తొక్కిసలాటలో మరణించినవారిలో అత్యధికంగా 108 మంది మహిళలు అని తెలియడం ఒకటైతే, 'వెళ్లిపోవడానికి ముందు బోధకుడు నడిచిన స్థలంలోని పాదధూళిని సేకరించే యత్నంలో' ఒకరిపై ఒకరు పడ్డారని తెలియడం ఈ దుర్ఘటనను ఎన్నో విధాల మరింత విషాదకరం చేస్తోంది.

– మిథాలీ శరణ్, కాలమిస్ట్

ఎంపిక కాదు!



పాశ్చాత్య దేశాల్లోని కుహనా స్త్రీవాదులు ఎప్పుడూ హిజాబ్–నఖాబ్ ఒక ఎంపిక అని చెబుతుంటారు! అవును, అది కేవలం ప్రజాస్వామిక పాశ్చాత్య దేశాల్లోని కొంతమంది మహిళలకే ఎంపిక. ఇస్లామిక్ నరక దేశాల్లోని లక్షలాది మంది మహిళలకు అది ఎంపిక కాదు.

– తిరాద్ రయీఫ్ బదావీ; బ్లాగర్, సౌదీ జైల్లో ఉన్న యాక్టివిస్ట్ రయీఫ్ బదావీ కొడుకు

సంఘ్ ఆపింది!



ఎమర్జెన్సీ తర్వాత బాబూ జగ్జీవన్ రామ్ ప్రధాని కాకుండా ఇందిరా గాంధీ అడ్డగించారని జూలై 2న లోక్‌సభలో ప్రధాని అనడం ఆశ్చర్యం కలిగించింది. 1977లో ఇందిరా గాంధీ ఓడిపోయారు. జనతా పార్టీ ప్రభుత్వంలో జన సంఘ్ భాగస్వామి. అది ఇతరులతో, ప్రత్యేకించి 'జేపీ'తో కలిసి, జగ్జీవన్‌ను ప్రధాని కాకుండా ముఖ్యపాత్ర పోషించింది.

– నీనా వ్యాస్, జర్నలిస్ట్

ఎత్తేస్తే ఏమి?



ఎంబీబీఎస్‌లో ప్రవేశాన్ని కోరుతున్నవారికి బోర్డు పరీక్షలను ఐచ్ఛికం చేస్తే ఎలా ఉంటుంది? మెడిసిన్‌లో చేరడానికి ఎటూ నీట్ ఒక్కటే మార్గం అయినప్పుడు, విలువలేని బోర్డు ఎగ్జామ్ ఉండాలి అనడానికి సానుకూల వాదన ఏముంటుంది?

– కార్తీక్ బాలచంద్రన్, ఎండోక్రైనాలజిస్ట్

భలే వినోదం



ప్రస్తుతం నడుస్తున్న అన్ని సినిమాలు, ఓటీటీల్లోని షోల కంటే పార్లమెంట్ మరింత రంజుగా ఉంది.


– చేతన్ భగత్, రచయిత

ఇన్ బాక్స్

మన్యం విప్లవ జ్యోతి

భారత స్వాతంత్ర్య పోరాటంలో విప్లవ పథాన్ని అనుసరించి పోరాడిన వీరుల్లో అల్లూరి సీతారామరాజు అగ్రగణ్యుడు. విశాఖ జిల్లా పాండ్రంకిలో జన్మించిన ఆయన తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సాధారణ విద్యతో పాటు యుద్ధ విద్య, జ్యోతిష్యం వంటివాటిని అభ్యసించాడు. తరువాత దేశ సంచారం చేసి దేశంలో ఉన్న పరిస్థితులను ఆకళింపు చేసుకుని విశాఖ జిల్లా కృష్ణదేవిపేట వచ్చి మన్యంలో తిరుగుబాటు మొదలుపెట్టాడు.

కవర్డు, హైటర్ వంటి అధికారులను సీతారామరాజును మట్టు పెట్టటానికి మన్యం పంపింది బ్రిటిష్ ప్రభుత్వం. లోతుగడ్డ వాగు దగ్గర సీతారామరాజు ఉన్నాడని తెలుసుకొని, 300 మంది పటాలంతో వాళ్లు బయలుదేరారు. ముందుగానే వారి రాకను పసిగట్టిన సీతారామరాజు విలువిద్యలో ఆరితేరిన గోకిరి ఎర్రేసు, గాము గంటం దొర, మల్లు దొర, పడాలు అగ్గిరాజువంటి వారితో కలిసి గొరిల్లా యుద్ధానికి సిద్ధమయ్యాడు. ఇరుకైన మార్గంలో వస్తున్న కవర్డ్, హైటర్లు సీతారామరాజు దళం దెబ్బకు పిట్టల్లా రాలిపోయారు. ఇది రామరాజు మొదటి విజయం. దీంతో రామరాజు తలమీద బ్రిటిష్ గవర్నమెంట్ 10 వేల రివార్డు ప్రకటించింది.



అయితే ఈ దాడిలో మల్లు దొరకు తుపాకీ గుండు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పుడు రామరాజు బ్రిటిష్ వారితో పోరాడాలంటే విల్లంబులు చాలవనీ, తుపాకులు కావాలనీ భావించాడు. తుపాకుల కోసం ఎవరి మీద దాడి చేయకుండా, పోలీస్ స్టేషన్‌లో తుపాకులను, మందుగుండు సామగ్రిని కొల్లగొట్టాలి అని నిర్ణయించుకున్నాడు. అన్నవరం, రాజవొమ్మంగి, అడ్డతీగల, నర్సీపట్నం పోలీస్ స్టేషన్లకు ఒకదాని తరువాత మరొకదానికి మిరపకాయ టపా పంపి తాను స్టేషన్‌పై దాడికి వస్తున్నట్లు తెలిపి మరీ తుపాకులను దోచుకున్నాడు. పోలీస్ రికార్డుల్లో తాను ఎన్ని తుపాకులు తీసుకువెళ్తున్నాడో ఆ వివరాలన్నీ రాసి కింద 'శ్రీరామరాజు' అని సంతకం చేశాడాయన.

గుంటూరు కలెక్టర్‌గా పనిచేస్తున్న రూథర్‌ఫర్డ్‌ను సీతారామరాజును అణచడానికి విశాఖ జిల్లాకు పంపించింది బ్రిటిష్ ప్రభుత్వం. ఇదే సమయంలో పరమ నీచుడైన బ్రిటిష్ మేజర్ గుడాల్, గిరిజన గూడేలపై పడి ఆడవాళ్ళపై అత్యాచారాలు చేస్తూ పసిపిల్లలను వధించటం, భార్యల ఎదుటే భర్తను చంపటం, గిరిజన గూడేలను తగలబెట్టడం లాంటి చర్యలకు ఒడిగట్టాడు. ఇది సీతారామరాజుకి తెలిసి, తన వల్ల అమాయకులైన గిరిజన జనం చనిపోవడం, ఇబ్బందులపాలు కావడం ఇష్టంలేక లొంగిపోవాలని నిర్ణయించుకున్నాడు. మార్గమధ్యలో గుడాల్ మాటు వేసి, తన సైన్యంతో సీతారామరాజును బంధించాడు. ఆయన్ని నులక మంచానికి కట్టి, నానా హింసలు పెట్టి, వీధుల్లో ఊరేగించి తుపాకీతో కాల్చి చంపాడు. ఆ విధంగా ఒక విప్లవ జ్యోతి అమరదీపమై దేశ స్వాతంత్రోద్యమానికి దారి చూపింది.

– పొత్తూరి సీతారామరాజు, కాకినాడ (నేడు అల్లూరి సీతారామరాజు జయంతి)

'చేజారడానికి' సిద్ధమైనప్పుడే... మనుగడ

అభిప్రాయం



జాన్‌సన్ చోరగుడి

వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న 2000లో ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల ఏర్పాటు జరిగింది. అప్పటికి ఆర్థిక సంస్కరణల అమలు మొదలై పదేళ్ళు అయింది. ఇది జరిగిన పదేళ్లకు ఈ కొత్త రాష్ట్రాలకు ఆనుకుని ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయింది. ఈ కాలంలోనే– 'రీ మ్యాపింగ్ ఇండియా' అంశంపై 'అకడమిక్' చర్చ మొదలైంది. దేన్నయినా మొత్తంగా 'చూస్తూ' చేసే నిర్ధారణల వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.

అటువంటిదే– ప్రొఫెసర్ లూయిస్ టిల్లిన్ రాసిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ప్రచురణ 'రీ మ్యాపింగ్ ఇండియా: న్యూ స్టేట్స్ అండ్ దెయిర్ పొలిటికల్ ఆరిజన్స్' గ్రంథం. ఈ రచయిత్రి ప్రస్తుతం లండన్ కింగ్స్ కాలేజీలో 'ఇండియా ఇన్‌స్టిట్యూట్'తో పాటుగా కేంబ్రిడ్జి – 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్' వంటి ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీల్లో పొలిటికల్ సైన్స్ బోధిస్తున్నారు. ఈమె గతంలో బీబీసీ సౌత్ ఆసియా అనలిస్ట్‌గా పనిచేశారు. మన రాష్ట్ర విభజన జరిగిన 2014 నాటికి ఈ రచన వెలువడింది. అందులో ముందుమాట లోనే ఆమె– 'రాష్ట్రాల సరిహద్దులు మన జీవితాల్లోని రాజకీయ, ఆర్థిక అంశాల విషయంలో ఏ వర్గాల మధ్య పరస్పరం పోటీ ఉంది? ఏవి ఎవరి చేజారిపోతున్నాయి? అనేది నిర్ధారిస్తాయి' అంటారు.



ఉత్తర, మధ్య ఇండియాలో ఇప్పటికి పాతికేళ్ళ క్రితం ఏర్పడిన మూడు కొత్త రాష్ట్రాల్లో జరిగిన సామాజిక రాజకీయ పునరేకీకరణ విషయంలో– ఆ తర్వాత పదేళ్లకు ఏర్పడిన కొత్త రాష్ట్రంగా మనకొక నిరంతరాయ స్పృహ తప్పదు. ప్రొ॥ లూయిస్ అంటున్నట్టుగా ఇందులో– 'ఏవి, ఎవరి చేజారి ఎవరి చేతిలోకి పోతున్నాయి...' అనేది అతి కీలకమైన అంశం. గడచిన వందేళ్ళలో కొన్ని సంప్రదాయ వర్గాల ఆధిపత్యం చేజారిపోయిందనే వాదన ఉంది. కానీ అది నిజమా? అంటే కాదు. వాళ్ళు స్థిరాస్తులుగా ఉన్న తమ భూముల్నీ, పారంపర్య ఆచార బాధ్యతల్నీ విడిచి జ్ఞాన రంగాలకు వెళ్ళి అక్కడ ఆధిపత్య స్థాయిలో స్థిరపడ్డారు. టెక్నాలజీ పరంగా 'అప్ డేట్' అవుతూ ఉన్నారు.

అలా పైకి వెళ్ళిన వర్గాల చేతుల్లోనే గడచిన డెబ్బై ఐదు ఏళ్ల రాజకీయ ఆధిపత్యం ఉంది. వీరే ఏదో ఒక పార్టీ పేరుతో అధికార ప్రతిపక్షాల్లో ఉంటూ, తమ స్థిరాస్తుల భద్రత చూసుకుంటూ అభివృద్ధి అంటూ వారు తమ ఆస్తుల విలువ పెంచే ఆలోచనలను అమలు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగానే 1989–90 మధ్య ప్రధాని వీపీ సింగ్ 'మండల్ కమిషన్' నివేదిక అమలు మొదలైతే, వాటి వెనుక మరో ఏడాదికి తెలుగు ప్రధాని పీవీ ఆర్థిక సంస్కరణలు అమలులోకి తెచ్చారు. గమనిస్తే– 'మండల్' నుంచి 'ఆర్థిక సంస్కరణలు' దాటి వచ్చిన 'విభజన' వరకు ఈ పాతికేళ్ళ కాలంలో ఇందులో ఒక 'ప్రాసెస్'ను చూస్తాం. వాటిలో– ఒకదానిలో 'ప్రజలు' ఉంటే మరొకదానిలో 'ప్రాంతం' కనిపిస్తుంది.

అయితే, వీటిలో మొదటిదైన వీపీ సింగ్ 'మండల్' అమలు నిర్ణయం జరగకుండా, రెండవదైన పీవీ ఆర్థిక సంస్కరణల అమలును గానీ, పోరాడి మరీ మన నుంచి తెలంగాణ విడిపోవడాన్నిగానీ ఊహించగలమా? అదే కనుక జరక్క పోయి ఉంటే, సంస్కరణల మౌలిక సూత్రమైన– 'ప్రపంచీకరణ'– 'ప్రైవేటీకరణ'–'సరళీకరణ'ల అమలు ఇక్కడ సాధ్యమయ్యేవా? వాటి వలన పెరిగిన అసమానతలు మాట ఏమిటి అనేది మళ్ళీ వేరే చర్చ.

అయితే ఇక్కడే– 'రాష్ట్రాల సరిహద్దులు మన జీవితాల్లోని రాజకీయ, ఆర్థిక అంశాల విషయంలో ఏ వర్గాల మధ్య పరస్పరం పోటీ ఉంది? సంపదపై ఆధిపత్యం ఎవరిది? ఏవి ఎవరి చేజారి ఎవరి చేతుల్లోకి వెళుతున్నాయి' అనే ప్రశ్నే మళ్ళీ మళ్ళీ తలెత్తుతున్నది. భూముల పైన, సాంఘిక జీవనం పైన ఆధిపత్యం వదులుకుని, జ్ఞానరంగం వైపు వెళ్ళినవారు గతంలో కంటే మెరుగైన స్థాయిలో ఉండడం మనకు తెలియదా?

తెలిసీ విభజన తర్వాత కూడా మళ్ళీ 'భూమి' కేంద్రంగా దాని చుట్టూనే అధికార రాజకీయాలు సాగాలి అన్నప్పుడు, జరగాల్సింది ఏమిటి? మళ్ళీ–'రీ మ్యాపింగ్ ఆంధ్రప్రదేశ్' జరగాలి. ఆ క్రమంలో ఎదురయ్యే సవాళ్ళనూ, వచ్చే పర్యవసానాలనూ పాలకులు ఎదుర్కోవాలి. అలాగని అదేమీ ఐదేళ్ళ వ్యవధిలో మొదలై పూర్తి అయ్యేది కాదు. ఆ విషయం దిగువకు చివరివరకు చేరేది అంతకంటే కాదు. గత ప్రభుత్వం 13 జిల్లాలను 25 చేసి మన్య ప్రాంతాన్ని 26వ జిల్లాగా చేసింది. అంత మాత్రాన పని పూర్తి అయిందని కాదు. గత ప్రభుత్వం 'మ్యాప్' పైన చేసింది కేవలం ఆరంభపు 'మార్కింగ్' మాత్రమే. తర్వాత జరగాల్సింది సూక్ష్మ స్థాయికి పరిపాలన చేరడం. మన సమాజంలో 'బోర్డర్స్'లో ఉండేది ఎవరు? ఒక ఊళ్ళో ఊరి చివర ఉండేది ఎవరు? అటువంటి చివరి సమాజాలకు పరిపాలన చేరడం అనేది ఇక్కడ లక్ష్యం. ఆ క్రమంలో మనది అనుకున్నది మన తర్వాతి వారికి–'చేజారి పోవడం' అనేది తప్పదు.


వ్యాసకర్త అభివృద్ధి – సామాజిక అంశాల వ్యాఖ్యాత

మరణభయం పోవాలంటే...

చాలామంది 'మరణం' గూర్చి భయపడుతూ ఉంటారు. మరణ తత్త్వాన్ని అర్థం చేసుకోకపోవటమే ఈ భయానికి కారణం. మరణం అంటే శరీర సాధారణ స్థితిలో కలుగు మార్పు. శైశవం వదలి బాల్యంలోకి, బాల్యం వదలి యవ్వనంలోకి, అత్యంత ప్రియమైన యవ్వనం నుంచి ముసలి తనానికి ఈ మార్పు కారణం అవుతుంది. చివరగా ముసలితనం మరణానికి దారితీస్తుంది.

రాత్రి... గడచిపోయి సూర్యోదయానికి స్వాగతం పలుకుతుంది. ఉదయం గడచి మధ్యాహ్నానికి అవకాశమిస్తుంది. అదే విధముగా రాత్రి ప్రారంభం కాగానే మధ్యాహ్నం పోతుంది. ప్రకృతి తిరుగులేని నియమాన్ని ఎవ్వరూ నిరోధించలేరు. ఆ నియమం అనుసరించి జన్మించిన ప్రతి జీవీ మరణించవలసిందే. అలాగే మరణించిన ప్రతి జీవీ తిరిగి జన్మించవలసిందే. ఈ విషయాన్ని సరిగా అవగాహన చేసుకుంటే మరణం వల్ల భయం కలుగదు. ఈ భయ నివారణకు తిరిగి జన్మించకుండా ఉండటమే సరైన మార్గం. జననమే లేనప్పుడు మరణించే ప్రసక్తే ఉండదు కదా!

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఎంతకాలం 'ఈ దేహమే నేను' అనే దేహాత్మ భావన ఉంటుందో అంతవరకు మరణ తప్పదు. ఏ క్షణం శారీరక స్పృహను దాటుతామో, అప్పుడే మనం నాశ రహితులం అవుతాం. పుట్టిన ప్రతి జీవీ గిట్టకతప్పదని తెలిసినా ఎవరికి వారు తమకు మరణం లేదని అనుకొంటూ ఉండటమే ఆశ్చర్యకరమైన విషయం అని ధర్మరాజు మహాభారతంలో ఒకచోట అంటాడు. ఇది ఆలోచించదగిన విషయం. ఒకానొక సందర్భంలో ఓ యక్షుడు ధర్మరాజును అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏది? (కిం ఆశ్చర్యం?) అని అడుగుతాడు. ఈ ప్రశ్నకు ధర్మరాజు 'ప్రతి క్షణం లెక్కలేనన్ని జీవులు యముని (మృత్యుదేవత) రాజ్యాన్ని చేరుకొంటున్నాయి. అయినప్పటికీ జీవించి ఉన్న వారు మాత్రం తమకు మరణం ఉన్నదని తెలిసీ లేనివారివలె జీవిస్తారు' అని సమాధానం ఇస్తాడు. మానవుని జీవితం క్షణభంగురం. మరణం అనివార్యం. కాబట్టి మానవులందరూ ప్రతిక్షణాన్నీ సద్వినియోగపరచుకోవాలి. కాలం గడచిన పిమ్మట గతంలోకి తొంగిచూచుకొని 'అయ్యో! నేను కాలాన్ని సద్వినియోగపరచుకొనలేకపోయాన'ని బాధపడటానికి ఎలాంటి అవకాశం లేకుండా జీవితాన్ని గడపాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.త్రయోదశి ఉ.5.38 వరకు, తదుపరి చతుర్దశి, తె.4.25 వరకు(తెల్లవారితే శుక్రవారం), **నక్షత్రం:** మృగశిర తె.4.20 వరకు(తెల్లవారితే శుక్రవారం), తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** ఉ.10.00 నుండి 11.33 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.54 నుండి 10.46 వరకు, తదుపరి ప.3.07 నుండి 4.00 వరకు, **అమృతఘడియలు:** రా.7.38 నుండి 9.12 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.33, **సూర్యాస్తమయం:** 6.35, మాసశివరాత్రి.

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో భారత మహిళా క్రికెటర్లు



తిరుమల: తిరుమల శ్రీవారిని మహిళా క్రికెటర్లు హర్మన్‌ప్రీత్ కౌర్, షఫాలీ వర్మ, రేణుకా సింగ్, పూజా వస్త్రాకర్, దీప్తి శర్మ బుధవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా..టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. కాగా, తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 67,398 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.09 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని వారికి ఆరు గంటల సమయం పడుతోంది.

సెలవులో ఎచ్చెర్ల ఎంపీడీవో!

ఇటీవలే టీడీపీ నేతలు ఆమెను హెచ్చరించిన వైనం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల ఎంపీడీవో టి.రమాదేవి వారం రోజుల పాటు సెలవు పెట్టారు. ఈ మేరకు 4వ నుంచి 10వ తేదీ వరకు సెలవు పెడుతూ జెడ్పీ సీఈవోకు బుధవారం లీవ్‌లెటర్ అందజేశారు. ఇన్‌చార్జి బాధ్యతలు గురువారం పరిపాలనాధికారికి అప్పగించే అవకాశాలున్నాయి. ఎంపీడీవో రమాదేవి వరుస పరిణామాలతో మానసిక ఒత్తిడికి గురైనట్లు సమాచారం. గత నెల 27న, ఈ నెల 1న టీడీపీ నేతలు హెచ్చరించడం, బెదిరించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో 1వ తేదీ రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు నాయకులపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే జోక్యంతో పంచాయితీ నిర్వహించి నాయకులతో క్షమాపణలు చెప్పించటంతో 2న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఉప సంహరించుకున్నారు. ఇదే క్రమంలో కూటమి ఎమ్మెల్యే, పక్క నియోజకవర్గం ఎమ్మెల్యే ఆమెను గట్టిగా హెచ్చరించినట్లు సమాచారం. దీంతో ఆమె కొన్నాళ్లు సెలవుపెట్టి, భవిష్యత్తు కార్యాచరణపై ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ విధానం అమలు చేయండి

లారీ యజమానుల సంఘం విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలలో సరుకు రవాణా లారీలకు కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర లారీ యజమానుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈమేరకు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు వినతిపత్రాలు సమర్పించింది. జాతీయ స్థాయిలో సరిహద్దు రాష్ట్రాల మధ్య ప్రయాణించే లారీలకు కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ విధానం అమలులో ఉందని చెప్పింది. ఎన్నో దశాబ్దాలపాటు కలసి ఉన్న ఏపీ, తెలంగాణ మధ్య కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ విధానం అమలులో లేకపోవడంతో తెలుగు రాష్ట్రాల లారీ యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. జాతీయ పర్మిట్ లారీకి ఏడాదికి రూ.18వేలు చెల్లించాలని... అందులో కేంద్ర ప్రభుత్వం రూ.16,500 తీసుకోగా దామాషా ప్రకారం ఒక్కో రాష్ట్రానికి రూ.800 వరకు చెల్లిస్తుందని తెలిపింది. అదే కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ విధానం ఉంటే లారీకి రూ.5వేల చొప్పున సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తారని, దాంతో లారీ యజమానులకు ఆర్థిక భారం తగ్గుతుందని వివరించింది. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఆదాయం పెరుగుతుంది కాబట్టి రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కౌంటర్ సిగ్నేచర్ పర్మిట్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరినట్లు రాష్ట్ర లారీ యజమానుల సంఘం బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది.

నివేదిక ఎందుకివ్వలేదు?

జీవీఎంసీ అధికారులపై హైకోర్టు అసహనం

సాక్షి, అమరావతి: విశాఖపట్నం, భీమునిపట్నం బీచ్ సముద్ర తీరం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాల విషయంలో ఏం చర్యలు తీసుకున్నారో తెలియచేస్తూ నివేదిక ఇవ్వాలని తామిచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడంపై గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) అధికారులపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. భీమునిపట్నం బీచ్ సముద్ర తీరంలో కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సీఆర్‌జెడ్) నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని, ఈ విషయంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదంటూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలోని ధర్మాసనం గత ఫిబ్రవరిలో విచారణ జరిపింది. నిర్మాణాల నిలుపుదలకు తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. అంతేగాక తీసుకున్న చర్యలపై నివేదికివ్వాలని ఆదేశించింది. బుధవారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా.. ధర్మాసనం స్పందిస్తూ తాము ఆదేశించిన విధంగా ఎందుకు నివేదిక సమర్పించలేదని నిలదీసింది. కనీసం తీసుకున్న చర్యల తాలూకు వివరాలను మౌఖికంగా కూడా తమకు చెప్పకపోవడాన్ని తప్పుపట్టింది. చివరి అవకాశం ఇస్తున్నామని, తదుపరి విచారణ కల్లా తాము ఆదేశించిన విధంగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్యలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది.

పింఛన్లకు 'అధికార' గ్రహణం

▶ మొదటి పేజీ తరువాయి

శివనాగప్రసాద్ వారితో చర్చించారు. పంచాయతీ కార్యదర్శి గంగరత్న, వెల్ఫేర్ అసిస్టెంట్ ఫ్రాన్సిస్‌ను ఆరాతీశారు. అందరికీ పింఛన్లు ఇవ్వాలని తాము భావించామని, అయితే టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని వారు వాపోయారు. ప్రస్తుతానికి సైట్ క్లోజ్ అయిందని, వచ్చేనెల రెండునెలల పింఛన్ మొత్తాన్ని ఇస్తామని చెప్పారు. అప్పుడు కూడా ఇస్తారన్న గ్యారెంటీ ఏమిటని వైఎస్సార్‌సీపీ నాయకులు నిలదీశారు. తామేమీ చేయలేమని అధికారులు చేతులెత్తేశారు. దీంతో కలెక్టర్‌ను కలవాలని బాధితులు నిర్ణయించుకున్నారు.

- గాండ్లపెంట మండలం ఎలుగూటివారిపల్లిలో దివ్యాంగులైన నలుగురు లబ్ధిదారులకు పింఛన్ మంజూరైనా అధికారులు పంపిణీ చేయలేదు. దీంతో బాధితులు కె.రమాదేవి, ఎం.నారాయణరెడ్డి, ఎం.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి బుధవారం ఎంపీడీవో రామానాయక్‌కు ఫిర్యాదు చేయాలని కార్యాలయానికి వెళితే ఎంపీడీవో లేకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాలుగా తీసుకుంటున్న పింఛన్‌ను ఇప్పుడు నిలిపేశారని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు చెప్పారు.
- స్థానిక టీడీపీ నాయకులను కలిసి వస్తేనే పింఛన్ ఇస్తామంటూ మూడురోజుల నుంచి తిప్పుకొన్న సచివాలయ సిబ్బంది చివరకు సైట్ క్లోజ్ అయిందంటూ పింఛన్ సొమ్ము ఎగ్గొట్టారని రామగిరి మండలం ఎంసీపల్లి 1, 2 సచివాలయాలకు చెందిన పెన్షన్‌దారులు బుధవారం పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గతంలో ఏ రోజూ ఇలా జరగలేదని, వలంటీర్లు ఇంటికే వచ్చి పింఛన్ మొత్తాన్ని ఇచ్చేవారని చెప్పారు. ప్రభుత్వం మారగానే పింఛన్ ఎగ్గొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్ సిబ్బంది సూచన మేరకు వారు డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ పీడీ నరసయ్య లేకపోవడంతో అధికారి శివమ్మ వద్ద గోడు వెళ్లబోసుకుని వినతిపత్రం ఇచ్చారు. దీనిపై డీఆర్‌డీఏ పీడీ నరసయ్యను వివరణ కోరగా .. ఈ విషయాన్ని పరిశీలించాలని రామగిరి ఎంపీడీవోని ఆదేశించామని, వివరాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామని చెప్పారు.
- టీడీపీ నేతల ఫిర్యాదుల నేపథ్యంలో కాకినాడ జిల్లా కోటనందూరు మండలం ఎల్లీపేటలో 18 మంది పింఛనుదారులకు అధికారులు పింఛన్ నిలిపేశారు. సోమ, మంగళవారాల్లో లబ్ధిదారుల ఇంటికి తెచ్చి ఇవ్వాల్సిన పింఛన్ ఇవ్వకపోగా సచివాలయానికి వెళ్లినా పట్టించుకోలేదు. మంగళవారం రాత్రి ఏడుగంటల వరకు సచివాలయంలోనే ఉన్నామని, ఎందుకు ఆపేశారని అడిగినా అధికారులు సమాధానం చెప్పలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు సమస్యను బుధవారం ఎంపీపీ లగుడు శ్రీనివాసుకి వివరించారు. పింఛన్లు ఇప్పించాలని కోరుతూ ఎంపీపీ ఆధ్వర్యంలో ఎంపీడీవో జయమాధవికి వినతి పత్రమిచ్చారు. దీనిపై ఎంపీడీవో జయమాధవిని వివరణ అడగగా.. నిబంధనలకు విరుద్ధంగా పింఛన్లు తీసుకుంటున్నారని 18 మందిపై ఫిర్యాదు అందడంతో వారికి పింఛన్లు ఆపేశామన్నారు. విచారించి వారు అర్హులైతే వచ్చేనెల నుంచి ఇస్తామని చెప్పారు.



బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న పింఛన్‌దారులు, వైఎస్సార్‌సీపీ నేతలు

ఇంత దారుణం ఎన్నడూ చూడలేదు



ఇంత దారుణం నా జీవితంలో ఎన్నడూ చూడలేదు. గత ప్రభుత్వంలో ఒక్కనెల కూడా ఇలా ఇబ్బంది పెట్టలేదు. కలెక్టర్ స్పందించి మా సమస్యను పరిష్కరించాలి.

– సిద్దయ్య, ఎంసీపల్లి, రామగిరి మండలం

అప్పుడు ఎవరికీ తొలగించలేదు



జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఏ ఒక్కరికీ పెన్షన్ తొలగించలేదు. ఒకవేళ మా నాయకులు తప్పుచేస్తే నాకు చెప్పండి లేదా కోర్టుకు వెళ్లండని చెప్పిన గొప్ప నాయకుడు. అర్హులు ఎంతమంది ఉంటే అంతమందికి పింఛన్ ఇచ్చారు. ఇప్పుడు మాత్రం టీడీపీ వాళ్లు అందుకు భిన్నంగా చేస్తున్నారు.

– నరసింహారెడ్డి, ఎంసీపల్లి, రామగిరి మండలం

కూటమి ఒత్తిడితో రాజీనామా!

రాజీనామా చేసిన పూడివలస గ్రామ సచివాలయ కార్యదర్శి



సీతారామ రాజు

ఎచ్చెర్ల క్యాంపస్: కూటమి ఎమ్మెల్యే, నేతల ఒత్తిడి తట్టుకోలేక శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం పూడివలస గ్రామ సచివాలయ కార్యదర్శి సనపల సీతారామరాజు బుధవారం తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవోలకు అందజేశారు. లేఖలో వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు పేర్కొన్నా.. వాస్తవం మాత్రం వేరేలా ఉంది. కూటమి నేతల ఒత్తిడి భరించలేక మెడికల్ లీవ్, ఇతర మార్గాల్లో సెలవులకు ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. గ్రామంలో ప్రభుత్వ బోరు బావులకు ప్రైవేట్ వ్యక్తులు మోటార్లు పెట్టి వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుంటున్నారని వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్ జరుగుళ్ల కృష్ణారావు, టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ గొలివి గోవిందరావు 'మీ కోసం' (పబ్లిక్ గ్రీవెన్స్ సెల్)లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ బోర్లకు, బావులకు ఉన్న మోటార్లు తొలగించాలని ఉన్నతాధికారులు గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. ఆరు బోర్లు ఉండగా.. ముందు సర్పంచ్ వర్గానికి చెందిన బోర్లు ముందుగా తొలగించారు. తర్వాత కూటమి వర్గానికి చెందినవారి బోర్ల వద్దకు వెళ్లగా కూటమి ఎమ్మెల్యే నుంచి ఫోన్ వచ్చింది. కూటమి వర్గానికి చెందిన మోటర్లు తొలగించవద్దని హెచ్చరించారు. దీంతో కార్యదర్శి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారెవరూ స్పందించకపోవడంతో మనస్తాపానికి గురైన కార్యదర్శి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఈ అంశం మండలంలో చర్చనీయాంశంగా మారింది. మిగతా గ్రామ కార్యదర్శులు సైతం ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజుల్లోపే ఇటువంటి సమస్యలు వస్తుంటే భవిష్యత్తులో పరిస్థితి ఏమిటని వీరు ఆందోళన చెందుతున్నారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి నాయకుల ఒత్తిళ్లు, హెచ్చరికలు ఉద్యోగ వర్గాల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

అవ్వకు అందని 'భరోసా'

- పింఛన్ ఇవ్వని అధికారులు
- వినూత్నంగా నిరసన వ్యక్తం చేసిన ఆమె కుమారుడు
- ఎంపీడీవో కార్యాలయంలో వదిలివెళ్లిన వైనం
- శ్రీ సత్యసాయి జిల్లాలో ఘటన



బత్తలపల్లి ఎంపీడీవో కార్యాలయంలో దీనంగా పడుకున్న వృద్ధురాలు నాగలక్ష్మమ్మ

బత్తలపల్లి: మంచానికే పరిమితమైన ఆ అవ్వకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతినెలా 1నే ఠంచనుగా పింఛన్ అందింది. అయితే కూటమి ప్రభుత్వంలో ఆమెకు అధికారులు పింఛన్ నిరాకరించారు. 85 ఏళ్ల వయసు ఉన్నా.. పింఛన్ పొందడానికి కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నా ఇవ్వలేదు. దీంతో ఆమె కుమారుడు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశాడు. తన తల్లిని ఎంపీడీవో కార్యాలయంలో వదిలివెళ్లిపోయాడు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం చీమలనాగేపల్లికి చెందిన మునిరెడ్డి, నాగలక్ష్మమ్మ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు వెంకటరెడ్డి, నరసారెడ్డి ఉన్నారు. మునిరెడ్డి ఆరేళ్ల క్రితం మృతి చెందాడు. కుమారులు ఇద్దరూ వేరు కాపురం పెట్టారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. 85 ఏళ్ల వృద్ధురాలైన నాగలక్ష్మమ్మ మంచానికే పరిమితమైంది. చిన్నకుమారుడు నరసారెడ్డి తన తల్లికి ప్రభుత్వం ఇచ్చే పింఛన్ డబ్బు తీసుకుంటూ ఆమె బాగోగులు చూసుకుంటున్నాడు. గత ఐదేళ్లు ఎలాంటి ఇబ్బందీ లేకుండా గ్రామ వలంటీర్ ఇంటికే వచ్చి పింఛన్ నగదు అందజేశాడు. అయితే ఈ నెలలో ఆమెకు పింఛన్ ఇవ్వలేదు. అదిగో ఇస్తాం, ఇదిగో ఇస్తాం అంటూ సోమవారం, మంగళవారం అధికారులు కాలయాపన చేశారు. బుధవారం అయినా ఇస్తారనుకుంటే వెబ్‌సైట్ క్లోజ్ అయ్యిందని పంచాయతీ కార్యదర్శి గంగరత్న, వెల్ఫేర్ అసిస్టెంట్ ఫ్రాన్సిస్ సమాధానం ఇచ్చారు. తన తల్లికి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పింఛన్ ఎందుకు ఇవ్వరంటూ కుమారుడు నరసారెడ్డి అధికారులను ప్రశ్నించాడు. అంతే కాకుండా ఆటోలో తన తల్లిని తీసుకువచ్చి ఎంపీడీవో కార్యాలయంలో వదిలి నిరసన తెలిపాడు. కాగా ఎంపీడీవో శివనాగప్రసాద్ మీటింగ్ ఉందంటూ పుట్టపర్తికి వెళ్లారు. కిందిస్థాయి సిబ్బంది నాగలక్ష్మమ్మకు ఏమీ సమాధానం చెప్పలేక మిన్నకుండిపోయారు. అవ్వ పరిస్థితిని చూసిన పలువురు 'అయ్యో పాపం..ఇలాంటి వారికా పింఛన్‌లు ఆపేది?.. రాజకీయాల కోసం అభాగ్యులకు అన్యాయం చేస్తారా' అంటూ నిట్టూర్చారు. చివరకు సాయంత్రం ఆరు గంటలకు పుట్టపర్తిలో ఉన్న ఎంపీడీవోకు ఫోన్‌లో సిబ్బంది సమాచారం చేరవేశారు. ఆయన పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు వచ్చి నరసారెడ్డికి సర్దిచెప్పి.. పింఛన్ వచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో తన తల్లితో నిరసన విరమింపజేశారు.

ప్రసవం కోసం వస్తే ప్రాణాలుపోయాయి!

- విజయవాడలోని ఓ ఆస్పత్రిలో గర్భిణి, ఇద్దరు శిశువుల మృతి
- వైద్యురాలి నిర్లక్ష్యం వల్లే ముగ్గురు బలయ్యారని బంధువుల ఆందోళన
- విచారణకు ఆదేశించిన డీఎంహెచ్‌వో
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



కవలల మృతదేహాలు, మాధవి (ఫైల్)

లబ్బీపేట(విజయవాడతూర్పు): పురిటినొప్పులతో ఆస్పత్రికి వచ్చిన గర్భిణీతోపాటు ఆమె కవల శిశువులు మరణించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పటమటలోని పద్మావతి హాస్పిటల్‌లో ఈ ఘటన జరిగింది. డాక్టర్ సకాలంలో స్పందించకపోవడంతోనే ఈ దారుణం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణాజిల్లా పోరంకికి చెందిన బండ్రపల్లి ప్రశాంత్, మాధవి(25) దంపతులకు ఒక బాబు(2) ఉన్నాడు. మాధవి రెండోసారి గర్భం దాల్చడంతో పటమటలోని పద్మావతి హాస్పిటల్‌లో రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. సోమవారం రాత్రి మాధవికి పురిటినొప్పులు రావడంతో ప్రసవం కోసం కుటుంబ సభ్యులు అదే ఆస్పత్రికి తీసుకొచ్చారు. మాధవిని పరీక్షించిన డాక్టర్ వెంకటరమణ సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించారు. తొలుత నార్మల్ డెలివరీలో ఒక శిశువు జన్మించినా, అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. రెండో శిశువు అడ్డం తిరగడంతో సిజేరియన్ చేశారు. అప్పటికే రెండో శిశువు కూడా మృతిచెందింది. సిజేరియన్ చేసిన అనంతరం మాధవి ఆరోగ్య పరిస్థితి కూడా విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మాధవి బుధవారం ఉదయం మృతిచెందారు.

ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

తన భార్య, ఇద్దరు శిశువులు మృతిచెందడంతో పద్మావతి ఆస్పత్రి వద్ద మాధవి భర్త ప్రశాంత్‌తో పాటు బంధువులు ఆందోళనకు దిగారు. తాము ఆస్పత్రికి వచ్చిన వెంటనే డాక్టర్ వెంకటరమణ స్పందించి సిజేరియన్ చేసి ఉంటే తల్లీబిడ్డలు బతికేవాళ్లని, డాక్టర్ నిర్లక్ష్యంవల్లే మరణించారని ప్రశాంత్ ఆవేదన వ్యక్తంచేశారు. డాక్టర్ వెంకటరమణపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పటమట పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని బాధితుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం పోస్టుమార్టం కోసం మృతదేహాలను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైద్యశాఖ విచారణ

తల్లీ, ఇద్దరు బిడ్డలు మృతిచెందడంతో ఎన్టీఆర్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని బుధవారం పద్మావతి ఆస్పత్రికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. వాస్తవాలను తెలుసుకునేందుకు నిపుణులైన వైద్యులను నియమించాలని విజయవాడ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌కు లేఖ రాశారు. ఈ మేరకు జీజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ హిమబిందు, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ పరుచూరి అనిల్‌కుమార్, ఎనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ ఏవీ రావు, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఇందిర ఆస్పత్రికి చేరుకుని విచారణ చేశారు. డాక్టర్ వెంకటరమణ నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. వైద్య రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే సమయానికే మాధవి పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్ వెంకటరమణ పేర్కొన్నట్లు సమాచారం. పోస్టుమార్టం రిపోర్టు, విచారణ కమిటీ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు.

అత్యాశకు పోయి.. పోలీసులకు చిక్కి..

- రూ. 80 లక్షల దొంగతనం కేసులో నిందితుల అరెస్ట్
- రూ.77,50,000 నగదు స్వాధీనం



కావలి: చెన్నైకు చెందిన ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన రూ.80 లక్షల మొత్తాన్ని కొట్టేసి.. తన అప్పులు తీర్చుకోవాలని ఓ అత్యాశపరుడి భారీ చోరీ నాటకాన్ని రట్టుచేసిన నెల్లూరు జిల్లా కావలి రూరల్ పోలీసులు.. బుధవారం ముగ్గురిని అరెస్ట్ చేసి వారినుంచి రూ.77,50,000, 5 మొబైల్స్, కారు స్వాధీనం చేసుకున్నారు. కావలి సమీపంలో రుద్రకోట వద్ద ఈ నెల 1వ తేదీ అర్ధరాత్రి జరిగిన ఘటన వివరాల్లోకి వెళ్తే.. చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన హరనాథరెడ్డి చెన్నైలోని ఒక నిర్మాణ సంస్థలో అకౌంట్స్ విభాగంలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అక్కడే చెన్నకేశవరెడ్డి అనే వ్యక్తి కూడా ఉద్యోగం చేస్తున్నాడు. విజయవాడలో ఒకరి నుంచి రూ.80 లక్షలు తీసుకురావాలని చెన్నకేశవరెడ్డికి సంస్థ చెప్పింది. తోడుగా హరనాథరెడ్డిని తీసుకెళ్లమని చెప్పింది. కాగా అప్పుల పాలై ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న హరనాథరెడ్డి ఈ నగదు కొట్టేయాలని పథకం పన్నాడు. మదనపల్లి, హోస్పేట్ (కర్ణాటక)కు చెందిన జులాయిలుగా తిరిగే తన స్నేహితులైన వినోద్, రమేష్‌ను కర్ణాటక రిజిస్ట్రేషన్ కారుతో విజయవాడకు రమ్మని చెప్పాడు. విజయవాడలో రూ.80 లక్షలతో చెన్నకేశవరెడ్డి, హరనాథరెడ్డి చెన్నైకు బస్సు ఎక్కగానే, అదే బస్సులోనే సాధారణ ప్రయాణికులుగా వినోద్, రమేష్ ఎక్కారు. తాము ఎక్కిన బస్సును ఫాలో కావాలని కారు డ్రైవర్‌కు సూచించడంతో, కారు బస్సును వెంబడిస్తూ వచ్చింది. బస్సు కావలి సమీపంలోని రుద్రకోటకు చేరుకోగానే ఆగింది. మూత్ర విసర్జనకు చెన్నకేశవరెడ్డి బస్సు దిగగానే, హరనాథరెడ్డి తన దగ్గరున్న డబ్బును తన స్నేహితులైన వినోద్, రమేష్‌కు ఇచ్చేశాడు. వారు బస్సు దిగి కారు ఎక్కి వెళ్లిపోయారు. మూత్రవిసర్జన ముగించుకుని బస్సులోకి వచ్చిన చెన్నకేశవరెడ్డికి దొంగలు తనకు మత్తు ఇచ్చి నగదును ఎత్తికెళ్లిపోయారని కథ చెప్పి రక్తి కట్టించాడు. గతంలో కూడా ఒకసారి హరనాథరెడ్డి ఇలాంటి కథ చెప్పి సంస్థ నగదు కాజేశాడనే ఆరోపణలున్నాయి. గత అనుభవంతో పాటు తాజాగా జరిగిన దొంగతనం నేపథ్యంలో చెన్నైలోని నిర్మాణ సంస్థ యాజమాన్యం కావలి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కావలిరూరల్ సీఐ కె.శ్రీనివాసరావు ఎస్పీ, డీఎస్పీ పర్యవేక్షణలో కొనసాగిన కేసు దర్యాప్తులో హరనాథ్‌రెడ్డి చోరీ చేసినట్లు గుర్తించారు. నగదుతో పారిపోయిన హరనాథరెడ్డి ఇద్దరు స్నేహితులు, కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.77.5 లక్షలు, కారు స్వాధీనం చేసుకున్నారు.

క్రాప్ హాలిడేకు సిద్ధమవ్వాలి

ఆక్వా రైతు సంఘం నాయకుల పిలుపు

- సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయం
- తమకిచ్చిన హామీలు అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్



మాట్లాడుతున్న గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు



సమావేశానికి హాజరైన ఆక్వా రైతులు

సాక్షి, భీమవరం/పాలకొల్లు సెంట్రల్: ఆక్వా రంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు అవసరమైతే క్రాప్ హాలీడేకు రైతులు సిద్ధం కావాలని ఆక్వా రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. అప్పుడే హేచరీలు, ప్రాసెసింగ్, ఫీడ్ కంపెనీలు దిగివస్తాయన్నారు. జైభారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పశ్చిమగోదావరి జిల్లా పూలపల్లిలో ఆక్వా రైతు మహాసభ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. 'హేచరీలు, ప్రాసెసింగ్, ఫీడ్ కంపెనీలు లాభాపేక్షతో వ్యవహరిస్తూ ఆక్వా రంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి. చాలా కంపెనీలు ఫీడ్, మందులు రెండింటినీ తయారు చేస్తున్నాయి. నాసిరకం ఫీడ్ వల్ల తెగుళ్లు వస్తున్నాయి. వాటిని తగ్గించే మందులను కూడా ఆ కంపెనీలే విక్రయిస్తున్నాయి. అందువల్ల ఎప్పటికప్పుడు సీడ్, ఫీడ్ నాణ్యతలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఎంపెడా పటిష్ట చర్యలు తీసుకోవాలి. ఏ ఒక్క రైతుకు సమస్య వచ్చినా రాజకీయాలతో సంబంధం లేకుండా అందరూ పోరాడాలి. అడ్డగోలుగా వ్యవహరిస్తున్న హేచరీలు, ప్రాసెసింగ్, ఫీడ్ కంపెనీల వద్ద ఆందోళనలు చేపట్టాలి. పరిస్థితి మరింతగా దిగజారితే ఆక్వా రంగాన్ని కాపాడుకునేందుకు క్రాప్ హాలీడేకు సిద్ధమవ్వాలి. రాష్ట్రవ్యాప్తంగా క్రాప్ హాలీడేను విజయవంతం చేసేందుకు అన్ని సంఘాలను ఏకతాటిపైకి తీసుకువద్దాం' అని అన్నారు.

గత ప్రభుత్వంలో సమస్యల పరిష్కారం

ఆక్వా రైతు సంఘం నాయకుడు యాళ్ల వెంకటానందం మాట్లాడుతూ.. 'గత ప్రభుత్వంలో రొయ్య ధరలు ఒడిదుడుకులకు గురికాకుండా ప్రాసెసింగ్ కంపెనీల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి ధరల స్థిరీకరణకు అప్పడా కృషి చేసింది. అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ రైతు సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారు. వీరవాసరంలో ఆక్వా చెరువులకు విద్యుత్ సమస్య ఉందని రైతులు చెప్పగా.. వెంటనే నిరంతర విద్యుత్‌ను అందించారు' అని చెప్పారు. జోన్‌తో సంబంధం లేకుండా విద్యుత్ సబ్సిడీ అమలు చేస్తామని, గిట్టుబాటు ధరలు కల్పిస్తామని, విద్యుత్ సమస్య పరిష్కరిస్తామని, నాణ్యమైన సీడ్, ఫీడ్ అందిస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఇచ్చిన హామీలపైనా సమావేశంలో చర్చించారు. వాటి అమలుకు మంత్రులను కలవాలని నిర్ణయించారు. ఆక్వా రైతు సంఘాల నాయకులు బోణం వెంకట నరసయ్య, యాళ్ల వెంకటానందం, గాదిరాజు సుబ్బరాజు, పి.నాగభూషణం, వీరవల్లి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి వ్యాపారి కిడ్నాప్

- ఆందోళనలో కుటుంబ సభ్యులు
- పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు



వెంకటరెడ్డి (ఫైల్)

మార్కాపురం రూరల్: తమకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించకుండా మిర్చి వ్యాపారి తప్పించుకుని తిరుగుతున్నాడని బాధిత రైతులు ఆ వ్యాపారిని కిడ్నాప్ చేసిన ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం, బిరుదులనరవ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మార్కాపురానికి చెందిన రావి వెంకటరెడ్డి కొంతకాలంగా మార్కాపురం డివిజన్‌లోని రైతుల నుంచి మిర్చి కొనుగోలుచేసి గుంటూరు యార్డులో విక్రయించేవాడు. ఈక్రమంలో సంవత్సరం క్రితం గొట్టిపడియకు చెందిన పలువురు రైతుల వద్ద మిర్చిని కొనుగోలు చేశాడు. వారికి డబ్బులు ఇవ్వలేదు. ఈ విషయమై పలు దఫాలుగా రైతులు అడుగుతున్నా రేపు... మాపు అంటూ కాలం గడుపుతున్నాడు. దీనికి విసిగిన బాధిత రైతులు ఇటీవల ఒంగోలు వెళ్లి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి వెంకటరెడ్డి కనిపించకుండా పోవడంతో రైతులు నిఘా పెట్టారు. ఈ క్రమంలోనే బుధవారం వెంకటరెడ్డి తన గ్రామంలోని పొలంలో పనులు చేయిస్తున్నాడని తెలుసుకున్న గొట్టిపడియకు చెందిన కొందరు రైతులు తమకు బకాయిలు చెల్లించాలని నిలదీశారు. దీంతో వెంకటరెడ్డికి, బాధిత రైతులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం రైతులు వెంకటరెడ్డికి చెందిన కారు అద్దాలు ధ్వంసం చేసి, అతడిని తీసుకెళ్లారని అత్త, మామలు కుందురు వెంకటేశ్వరరెడ్డి, కుందురు శరభమ్మ రూరల్ ఏఎస్సై శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. తమపై కూడా దాడి చేశారని, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నామని తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్, టౌన్ ఎస్సై అబ్దుల్ రెహమాన్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. వివిధ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వలంటీర్ల 'చలో విజయవాడ' పోలీసులతో కట్టడి

- ముందస్తు నోటీసులు జారీ
- ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరిక

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు వలంటీర్లు బుధవారం నిర్వహించతలపెట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని పోలీసుల ద్వారా ప్రభుత్వం ఎక్కడికక్కడే కట్టడి చేసింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిన చంద్రబాబు ప్రభుత్వం వలంటీర్లను త్రిశంకుస్వర్గంలో ఉంచేలా వ్యవహరిస్తోంది. దీంతో తమ ఆవేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు 'చలో విజయవాడ'కు పిలుపునిచ్చారు. ఈ మేరకు వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు బయలుదేరుతున్న వలంటీర్లకు పోలీసులు ముందస్తు నోటీసులు జారీచేశారు. ప్రభుత్వం నుంచి అనుమతిలేని ఈ కార్యక్రమానికి వెళ్లవద్దని హెచ్చరించారు. 'చలో విజయవాడ' వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, తమ నోటీసులు ఉల్లంఘించి కార్యక్రమంలో పాల్గొంటే చట్టప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని పోలీసులు ఎక్కడికక్కడ వలంటీర్లకు వ్యక్తిగతంగా నోటీసులు జారీచేసినట్టు వలంటీర్ల సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. మరోవైపు వలంటీర్లు 'చలో విజయవాడ'కు పిలుపునిచ్చిన నేపథ్యంలో బుధవారం విజయవాడ కలెక్టరేట్ వద్ద పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఎఫ్‌ఆర్‌ఎస్‌పై మంత్రికి వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో క్షేత్ర స్థాయిలో పనిచేసే వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందికి ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆస్కార్‌రావు వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కోరారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలో సంఘం ప్రతినిధులు మంత్రిని కలిసి ఉద్యోగులకు సంబంధించిన 14 సమస్యలపై వినతి పత్రం అందజేశారు. అనంతరం వీరు వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబును కూడా కలిసి తమ సమస్యలను వివరించారు.

అన్న ప్రసాదాల తయారీలో మార్పులు అవాస్తవం

తిరుమల: తిరుమలలో అన్న ప్రసాదాల తయారీలో మార్పులు చేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని టీటీడీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ''తిరుమల శ్రీవారికి నివేదించే అన్నప్రసాదాల తయారీకి సేంద్రియ బియ్యం వాడకాన్ని నిలిపివేసి, గతంలో వినియోగించే బియ్యాన్ని వాడాలని టీటీడీ నిర్ణయించిందని, అదేవిధంగా అన్నప్రసాదాల దిట్టం కూడా పెంచాలని టీటీడీ నిర్ణయించింది'' అని సామాజిక మాధ్యమాల్లో ఒక వార్త ప్రచారం అవుతోందని, ఇది పూర్తిగా అసత్యమని పేర్కొంది. టీటీడీ ఈవో శ్యామలరావు మొన్న అర్చక స్వాములు, ఆలయ అధికారులతో సమావేశమై స్వామివారికి నివేదించే అన్న ప్రసాదాల గురించి, వాటి దిట్టం గురించి సుదీర్ఘంగా చర్చించారనీ, అంతే తప్ప వీటిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది.

ముందస్తు ఓటమే?!

సునాక్ పార్టీ ఎదురీత ● బ్రిటన్‌లో నేడే ఎన్నికలు

650 స్థానాలకు పోలింగ్	రేపటికల్లా ఫలితాల వెల్లడి	లేబర్ పార్టీదే గెలుపు: సర్వేలు	బరిలో 107 మంది బ్రిటిష్ ఇండియన్లు

సవాలక్ష సమస్యలతో సతమతమవుతున్న బ్రిటన్‌లో సార్వత్రిక ఎన్నికలకు వేళైంది. హోరాహోరీ ప్రచారానికి బుధవారం సాయంత్రంతో తెర పడింది. పార్లమెంటు దిగువ సభ అయిన హౌజ్ ఆఫ్ కామన్స్‌లోని 650 స్థానాలకు గురువారం దేశవ్యాప్తంగా పోలింగ్ జరగనుంది. సాయంత్రం నుంచే ఫలితాల వెల్లడి మొదలవుతుంది. శుక్రవారం ఉదయానికల్లా పూర్తి ఫలితాలు వెలువడతాయి. కొత్త సభ జూలై 9న కొలువుదీరుతుంది. స్పీకర్ ఎన్నిక, సభ్యుల ప్రమాణ స్వీకారాల తర్వాత నూతన ప్రభుత్వం బాధ్యతలు స్వీకరిస్తుంది. విపక్ష నేత స్టార్మర్ నేతృత్వంలోని లేబర్ పార్టీ భారీ మెజారిటీతో 14 ఏళ్ల అనంతరం గద్దెనెక్కడం ఖాయమని ఒపీనియన్ పోల్స్ చెబుతున్నాయి. భారత మూలాలున్న ప్రధాని రిషి సునాక్ సారథ్యంలోని అధికార కన్జర్వేటివ్ పార్టీ ఎదురీదుతోందని అప్పటికే స్పష్టం చేశాయి. సునాక్ కూడా బుధవారం ప్రచారాన్ని ముగిస్తూ, 'లేబర్ పార్టీకి ఘనవిజయం దక్కకుండా అడ్డుకుందాం' అని ప్రజలతో పాటు సొంత పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నిజానికి ఎన్నికలు డిసెంబర్‌లో జరగాల్సి ఉన్నా ప్రజల్లో తీవ్రంగా ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను ముందే పసిగట్టి సునాక్ ముందస్తుకు వెళ్లారు. కానీ అది కూడా కలిసొచ్చేలా కన్పించడం లేదు...

- సాక్షి, నేషనల్ డెస్క్



బరిలో భారతీయం

బ్రిటన్ ఎన్నికల బరిలో భారతీయుల జోరు పెరుగుతోంది. 2019లో 63 మంది బ్రిటిష్‌ఇండియన్లు పోటీ చేయగా 15 మంది విజయం సాధించారు. ఈసారి ఏకంగా 107 మంది బరిలో దిగుతుండటం విశేషం. ప్రధాన పార్టీలైన కన్జర్వేటివ్, లేబర్‌తో పాటు రిఫామ్ యూకే వంటి కొత్త పార్టీల నుంచి కూడా ఇండియన్లు పోటీలో ఉన్నారు. పలు స్థానాల్లో బ్రిటిష్ ఇండియన్లే ప్రత్యర్థులుగా తలపడుతుండటం మరో విశేషం. హారో ఈస్ట్ స్థానం నుంచి ప్రిమేశ్ పటేల్ (లేబర్), రీతేంద్రనాథ్ బెనర్జీ (లిబరల్ డెమొక్రాట్స్), సారాజుల్హగ్ పర్వానీ (వర్కర్స్ పార్టీ ఆఫ్ బ్రిటన్) బరిలో ఉన్నారు. లీసెస్టర్ ఈస్ట్‌లో లండన్ మాజీ డిప్యూటీ మేయర్ రాజేశ్ అగర్వాల్ (లేబర్), శివానీ రాజా (కన్జర్వేటివ్) పోటీ చేస్తున్నారు.

37.3 లక్షల బ్రిటిష్ ఇండియన్లు

బ్రిటన్‌లో భారత మూలాలున్న వారి సంఖ్య ఏకంగా 37.3 లక్షలు దాటేసింది! ఓటర్లలోనూ వారు 10 లక్షల మందికి పైగా ఉన్నట్టు సమాచారం. పాకిస్తాన్, బంగ్లాదేశ్ మూలాలున్న వారు కూడా భారీగానే ఉన్నారు. దాంతో వారిని ఆకట్టుకోవడానికి పార్టీలన్నీ శాయశక్తులా ప్రయత్నిస్తున్నాయి. లేబర్ పార్టీ నేత స్టార్మర్ ఇటీవల బ్రిటిష్ బంగ్లాదేశీలపై చేసిన అనుచిత వ్యాఖ్యలు, గాజా దుస్థితిపై ఆ పార్టీ వైఖరి కారణంగా ముస్లిం ఓటర్లు గుర్రుగా ఉన్నారు. దీన్ని వీలైనంతగా సొమ్ము చేసుకునేందుకు కన్జర్వేటివ్ నేతలు ప్రయత్నిస్తున్నారు.

కన్జర్వేటివ్: ఏడుగురు సిట్టింగ్ ఎంపీలతో పాటు 23 మంది బ్రిటిష్ ఇండియన్లకు కొత్తగా టికెట్లిచ్చింది. వీరిలో ప్రధాని రిషి సునాక్, మాజీ మంత్రులు ప్రీతీ పటేల్, సుయెల్లా బ్రేవర్మన్‌తో పాటు చంద్ర కన్నెగంటి, నీల్ శాస్త్రి హర్స్ట్, నీల్ మహాపాత్ర, రేవ గుడి, నుపుర్ మజుందార్, ఎరిక్ సుకుమారన్ తదితరులున్నారు.

లేబర్: ఏడుగురు సిట్టింగ్ ఎంపీలు కాగా 26 మంది కొత్తవారు. వీరిలో ఉదయ్ నాగరాజు, హజీరా ఫరానీ, రాజేశ్ అగర్వాల్, జీవన్ సంధెర్ తదితరులున్నారు.

పార్టీ	బ్రిటిష్ ఇండియన్ల అభ్యర్థులు
కన్జర్వేటివ్	30
లేబర్	33
గ్రీన్ పార్టీ	13
రిఫామ్ యూకే	13
లిబరల్ డెమొక్రాట్స్	11

ఒపీనియన్ పోల్స్ ఏం చెబుతున్నాయ్..

లేబర్ పార్టీకి కనీసం 41 శాతం ఓట్లు ఖాయమని అత్యధిక ఒపీనియన్ పోల్స్ అంచనా వేస్తున్నాయి. అధికార కన్జర్వేటివ్ పార్టీకి 21 శాతానికి మించబోవని అవి జోస్యం చెప్పాయి. రిఫామ్ పార్టీకి 16 శాతం, లిబరల్ డెమొక్రాట్లకు 12 శాతం రావచ్చని పేర్కొన్నాయి. అవే నిజమైతే లేబర్ పార్టీ ఘనవిజయం సాధించడం ఖాయమే.



44 ఏళ్ల రిషి 2022 అక్టోబర్ 25న బ్రిటన్ ప్రధాని అయ్యారు. ఆ పదవి చేపట్టిన తొలి భారత మూలాలున్న వ్యక్తిగానే గాక తొలి హిందువుగా కూడా రికార్డు సృష్టించారు. కానీ వాగ్దానాలను నిలుపుకోవడంలో ఆయన విఫలమయ్యారన్న అసంతృప్తి ప్రజల్లో తీవ్రంగా ఉంది. ఆర్థిక సంక్షోభం కొన్నేళ్లుగా బ్రిటన్‌కు చుక్కలు చూపుతోంది. ముఖ్యంగా నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయి. ఆర్థిక నిపుణుడై ఉండి కూడా పరిస్థితిని రిషి చక్కదిద్దలేదన్నది బ్రిటన్‌వాసుల ఫిర్యాదు. ప్రధానమైన హౌజింగ్ సంక్షోభాన్ని చక్కదిద్దడంలోనూ ఆయన విఫలమయ్యారని వారు భావిస్తున్నారు. దాంతో ఆర్థిక వ్యవస్థను పటిష్టపరుస్తామన్న తాజా హామీలను ఎవరూ నమ్మడం లేదు. యూగవ్ తాజా సర్వేలో 52 శాతం మంది ఆర్థిక సమస్యలనే ప్రముఖంగా ప్రస్తావించారు. ఆరోగ్య సమస్యలు తమను బాగా కుంగదీస్తున్నట్టు 50 శాతం చెప్పారు. కీలకమైన వలసదారులు, వారికి ఆశ్రయం విషయంలో కన్జర్వేటివ్ పార్టీ వైఖరిని 40 శాతం మంది తప్పుబడుతున్నారు. ఎలా చూసినా సునాక్ పాలనకు 20 నెలలకే తెర పడటం ఖాయమన్న అభిప్రాయం సర్వత్రా విన్పిస్తోంది.

సునాక్ ఎదురీత వెనక...



స్టార్మర్‌కు కలిసొచ్చిన అంశాలు...

ప్రధానంగా 14 ఏళ్ల కన్జర్వేటివ్ పార్టీ పాలనపై ప్రజల్లో నెలకొన్న తీవ్ర వ్యతిరేకతే విపక్ష లేబర్ పార్టీకి ఈసారి అతి పెద్ద సానుకూలాంశంగా మారింది. ఆ పార్టీ నాయకుడు స్టార్మర్ (61) 'పార్టీ కంటే దేశం ముందు' నినాదంతో దూసుకెళ్లారు. ఆ నినాదం బ్రిటన్‌వాసులను విపరీతంగా ఆకట్టుకుంది. లేబర్ పార్టీకి ఓటేస్తే ఆర్థిక స్థిరత్వానికి వేసినట్టేనన్న ఆయన ప్రచారానికి విశేష స్పందన లభించింది. నిరుపేద కార్మిక కుటుంబం నుంచి వచ్చిన తనకు సామాన్యుల కష్టనష్టాలు బాగా తెలుసునని, ధరాభారాన్ని తగ్గించి తీరతానని, సుపరిపాలన అంటే ఎలా ఉంటుందో చూపిస్తానని హామీలిచ్చిన స్టార్మర్ వైపు ప్రజలు స్పష్టమైన మొగ్గు చూపుతున్నారు.

ప్రస్తుత బలాబలాలు

బ్రిటన్ ఓటర్లు దాదాపు	5 కోట్లు
హౌస్ ఆఫ్ కామన్స్‌లో స్థానాలు	650
మెజారిటీకి కావాల్సింది	326

పార్టీ	స్థానాలు
కన్జర్వేటివ్	344
లేబర్	205
ఎస్ఎన్‌పీ	43
లిబరల్ డెమొక్రాట్స్	15
ఇతరులు	43



రాజ్యసభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ



వాకౌట్ చేశాక మాట్లాడుతున్న సోనియా, ఖర్గే

ప్రశాంతంగా మణిపూర్

రాజ్యసభలో ప్రధాని వ్యాఖ్యలు ● విపక్షాల మండిపాటు, వాకౌట్

న్యూఢిల్లీ: విపక్షాల విమర్శల నేపథ్యంలో మణిపూర్ హింసాకాండపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో జరిగిన చర్చకు బుధవారం ప్రధాని బదులిచ్చారు. రెండు గంటలపాటు సాగిన ప్రసంగంలో మణిపూర్ అంశంపై వివరంగా మాట్లాడారు. అక్కడ హింస క్రమంగా తగ్గుముఖం పడుతోందన్నారు. ''మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. విద్యా సంస్థలతో పాటు వ్యాపార సంస్థలు కూడా దాదాపుగా తెరుచుకుంటున్నాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలను సంపూర్ణంగా పునరుద్ధరించేందుకు కేంద్రం అన్ని చర్యలూ చేపడుతోంది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వంతో అన్నివిధాలా కలిసి పని చేస్తోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మణిపూర్‌లో పలు రోజుల పాటు ఉండి మరీ పరిస్థితిని చక్కదిద్దేందుకు కృషి చేశారు. హింసాకాండకు సంబంధించి ఇప్పటిదాకా 500 మందికి పైగా అరెస్టయ్యారు. 11 వేల పై చిలుకు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి'' అని వివరించారు. మణిపూర్ హింసపై గత సమావేశాల సందర్భంగా రాజ్యసభలో తాను సుదీర్ఘంగా మాట్లాడానని ప్రధాని గుర్తు చేశారు. ''మణిపూర్ ఇప్పుడు వరదలతో సతమతమవుతోంది. కనుక ఈ అంశంపై విపక్షాలు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి. పరిస్థితిని చక్కదిద్దేందుకు మాతో కలిసి రావాలి'' అని కోరారు. కానీ మోదీ వ్యాఖ్యలతో విపక్షాలు సంతృప్తి చెందలేదు. మణిపూర్లో పరిస్థితి ఇంకా ఉద్రిక్తంగానే ఉందన్నాయి. అక్కడ గత మేలో హింస చెలరేగితే ఏడాదైనా ఆ రాష్ట్రాన్ని సందర్శించేందుకు మోదీకి తీరిక చిక్కలేదా అంటూ మండిపడ్డాయి. ఈ అంశంపై మాట్లాడేందుకు విపక్ష నేత మల్లికార్జున ఖర్గేకు అవకాశమివ్వాలని డిమాండ్ చేశాయి. అందుకు చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ నిరాకరించడంతో తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. ప్రధాని మాట్లాడుతుండగానే సభ నుంచి వాకౌట్ చేశాయి. దీనిపై చైర్మన్ తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. విపక్షాలు సభనే గాక రాజ్యాంగాన్ని కూడా అవమానించాయంటూ ఆగ్రహించారు. ''మీరు వీడింది సభను కాదు, మర్యాదను'' అంటూ దుయ్యబట్టారు. అనంతరం మోదీ మాట్లాడుతూ మణిపూర్ జాతుల సంఘర్షణలకు మూలం దాని చరిత్రలోనే ఉందన్నారు. స్వాతంత్ర్యానంతరం అక్కడ 10 సార్లు రాష్ట్రపతి పాలన విధించాల్సి వచ్చిందని గుర్తు చేశారు. 1993 నుంచి ఐదేళ్ల పాటు రాష్ట్రంలో భారీ స్థాయిలో సామాజిక సంఘర్షణ చోటుచేసుకుందన్నారు. ''కనుక మణిపూర్ సమస్యను పరిష్కరించే క్రమంలో ఓపికగా, ఆచితూచి వ్యవహరించాలి'' అన్నారు. నీట్ లీకేజీపై కఠిన చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు.

రాజ్యాంగాన్ని కాలరాసిందే కాంగ్రెస్!

అంతకు ముందు సభలో మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను మరోసారి తూర్పారబట్టారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడామన్న కాంగ్రెస్ వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. ''ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగాన్నే అపహాస్యం చేసిన వారినుంచి ఇలాంటి మాటలు విడ్డూరం! ఎమర్జెన్సీ అనంతరం జరిగిన 1977 ఎన్నికల సందర్భంగా ఇందిరాగాంధీ ప్రభుత్వం మీడియాపై ఉక్కుపాదం మోపింది. ఆ ఎన్నికల్లో మాత్రమే ప్రజలు రాజ్యాంగ పరిరక్షణ కోసం ఓటేశారు. కాంగ్రెస్ సర్కారును సాగనంపారు'' అంటూ దుయ్యబట్టారు. దాంతో మోదీ అబద్ధాలకోరంటూ విపక్ష సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. దీనిపై ఖర్గేకు మాట్లాడేందుకు అవకాశమివ్వాలని పట్టుబట్టారు. వారి నినాదాల మధ్యే మోదీ ప్రసంగం కొనసాగించారు.

దర్యాప్తు సంస్థలకు మరింత స్వేచ్ఛ

అవినీతి, నల్లధనంపై పూర్తిస్థాయిలో ఉక్కుపాదం మోపుతామని మోదీ స్పష్టం చేశారు. ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు సంస్థలకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్టు చెప్పారు. ''అవినీతిపరులెవరినీ వదలబోం. ఇది మోదీ గ్యారంటీ'' అన్నారు.

రాజ్యసభ నిరవధిక వాయిదా

రాజ్యసభ నిరవధికంగా వాయిదా పడింది. బుధవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని సభ ఆమోదించగానే చైర్మన్ ఈ మేరకు ప్రకటించారు. లోక్‌సభ మంగళవారమే నిరవధికంగా వాయిదా పడటం తెలిసిందే. దీంతో పార్లమెంటు సమావేశాలకు తెర పడింది.

రాహుల్ ఇంటి వద్ద భద్రత పెంపు

న్యూఢిల్లీ: అతివాద సంస్థల సభ్యులు రాహుల్‌గాంధీ ఇంటి వద్ద తరచూ నిరసనలకు దిగొచ్చనే నిఘా వర్గాల సమాచారంతో ఢిల్లీ పోలీసులు ఆయన ఇంటి వద్ద భద్రతను పెంచారు. రాహుల్ ఇంటి చుట్టూ ఒక ప్లాటూన్ పారామిలటరీ సిబ్బందితోపాటు ఢిల్లీ పోలీసు బలగాలు మోహరించారు. ఆయనకిప్పటికే జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పిస్తున్నారు.

రేపు ప్రమాణం చేయనున్న అమృత్‌పాల్

చండీగఢ్/అమృత్‌సర్: విచారణ ఖైదీగా అస్సాం జైలులో గడుపుతున్న ఖలిస్తానీ ప్రచారకుడు, సిక్కు వేర్పాటువాది అమృత్‌పాల్ సింగ్ జూలై ఐదో తేదీన పార్లమెంట్ సభ్యునిగా ప్రమాణంచేయనున్నారు. 'వారిస్ పంజాబ్ దే' అధినేత అయిన అమృత్‌పాల్ ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో పంజాబ్ నుంచి గెలిచారు. ఖదూర్ సాహిబ్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి దాదాపు 2లక్షల భారీ మెజారిటీతో గెల్చిన విషయం తెల్సిందే. జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టయి అస్సాంలోని దిబ్రూగఢ్ జైలులో అమృత్‌పాల్ విచారణ ఖైదీగా ఉన్నారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలంతా ప్రమాణంచేసేనాటికి ఈయనకు పెరోల్ లభించలేదు. తాజాగా జూలై 5వ తేదీ నుంచి నాలుగురోజులపాటు పెరోల్ దొరికింది. దీంతో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రైవేట్ ఛాంబర్‌లో ఈయనతో ఎంపీగా ప్రమాణం చేయిస్తారని ఫరీద్‌కోట్ స్వతంత్ర ఎంపీ సరబ్‌జీత్ సింగ్ ఖల్సా బుధవారం వెల్లడించారు.

కూలడంలో.. వరస కట్టిన వంతెనలు

బిహార్‌లో ఒకేరోజు కూలిన మూడు వంతెనలు

సివాన్(బిహార్): బిహార్‌లో వంతెనలు పేకమేడల్లా కూలుతున్నాయి. సివాన్ జిల్లాలో 11 రోజుల క్రితం ఒక వంతెన కూలగా బుధవారం అదే జిల్లాలో మరో రెండు వంతెనలు కూలాయి. సరన్ జిల్లాలో ఇంకోటి కూలింది. బుధవారం ఘటనలు కలుపుకుని గత 15 రోజుల్లో ఇలా రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది వంతెనలు కుప్పకూలాయి. జిల్లాలోని దేవరియా బ్లాక్ పరిధిలో గండకీ నదిపై దాదాపు 42 సంవత్సరాల క్రితం నిర్మించిన ఒక చిన్నపాటి వంతెన బుధవారం ఉదయం ఐదుగంటలకు కూలింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం చోటుచేసుకోలేదు. '' వంతెనలో కొంత భాగమే కూలింది. గత కొద్దిరోజులుగా వంతెనకు మరమ్మత్తులు చేస్తున్నారు. కుప్పకూలడానికి కారణాలపై దర్యాప్తు మొదలుపెట్టాం'' అని డెప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ ముకేశ్ చెప్పారు. గత కొద్దిరోజులుగా గండకీ నది వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తోందని, ప్రవాహం ధాటికి తట్టుకోలేక బ్రిడ్జి కూలిందని అక్కడి గ్రామస్తులు చెబుతున్నారు. సివాన్ జిల్లాలో తెఘ్రా బ్లాక్‌లోనూ మరో వంతెన కూలింది. ఇటీవల మధుబని, అరారియా, తూర్పు చంపారన్, కిషన్‌గంజ్ జిల్లాల్లోనూ వంతెనలు కూలాపోయాయి. భారీ వర్షాలు, నదీ ప్రవాహం పెరిగిన ఈ తరుణంలో వంతెనలు కూలుతుండటంతో వాటి నాణ్యతపై అనుమానాలు పెరిగాయి. దీంతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసి వంతెనల సామర్థ్యం, స్థితిగతులపై సమీక్ష నిర్వహించనున్నారు.

ఎన్నికల వ్యయంలో తేడాలున్నాయి

ఇంజనీర్ రషీద్‌కు ఈసీ నోటీసు

శ్రీనగర్: ఎన్నికల వ్యయ నివేదికలో చూపిన ఖర్చులో తేడాలున్నాయని బారాముల్లా ఎంపీగా ఎన్నికైన షేక్ అబ్దుల్ రషీద్ (ఇంజనీర్ రషీద్)కు ఎన్నికల సంఘం మంగళవారం నోటీసులు జారీచేసింది. తీవ్రవాదులకు నిధులు అందజేశారనే అభియోగాలను ఎదుర్కొంటున్న ఇంజనీర్ రషీద్‌ను 2019లో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అరెస్టు చేసింది. అప్పటి నుంచి తీహార్ జైలులో ఉన్న రషీద్ బారాముల్లా నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. కోర్టు రెండు గంటలు పెరోల్ ఇవ్వడంతో ఈనెల 5న ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రషీద్ తనకు రూ.2.10 లక్షలు ఖర్చయిందని ఎన్నికల రిజిస్టర్‌లో చూపారని, అయితే ఎన్నికల పరిశీలకులు నిర్వహించిన సమాంతర రిజిస్టర్‌లో ఖర్చును రూ.13.78 లక్షలుగా చూపారని ఈసీ తెలిపింది. ఈ వ్యత్యాసంపై రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొంది. జిల్లా వ్యయ పర్యవేక్షక కమిటీ ముందు రషీద్ లేదా ఆయన ప్రతినిధి హాజరై వివరణ ఇవ్వాలని, ఈసీకి సకాలంలో ఎన్నికల వ్యయ నివేదికను సమర్పించాలని కోరింది.

అనుమతి 80 వేల మందికి..

వచ్చింది 2.5 లక్షలు

- సత్సంగ్ నిర్వహణలో బాబా అనుచరుల నిర్లక్ష్యం
- 121కి చేరిన మృతుల సంఖ్య
- పరారీలోనే భోలే బాబా

హత్రాస్/న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లా ఫుల్‌రాయ్ గ్రామంలో తొక్కిసలాట ఘటనలో మృతుల సంఖ్య బుధవారం 121కి చేరుకుంది. సత్సంగ్ నిర్వాహకులపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ముఖ్య సేవాదార్ దేవప్రకాశ్ మధుకర్‌తోపాటు ఇతరుల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. భోలే బాబా పేరును ఇంకా చేర్చలేదు. 80 వేల మందికే అనుమతి ఉంటే 2.5 లక్షల మంది వచ్చారని ఎఫ్ఐఆర్‌లో పోలీసులు స్పష్టం చేశారు. సాక్ష్యాధారాలు దాచిపెట్టేందుకు నిర్వాహకులు ప్రయత్నించారని ఆరోపించారు. అనుమతి తీసుకొనే సమయంలో తమకు సరైన సమాచారం ఇవ్వలేదని చెప్పారు. తొక్కిసలాటలో పోలీసుల తప్పిదమేమీ లేదని స్పష్టం చేశారు. ఫుల్‌రాయ్‌లో తొక్కిసలాటకు కారణమైన బాబా నారాయణ్ హరి అలియాస్ సకర్ విశ్వ హరి భోలే బాబా ఇంకా పరారీలోనే ఉన్నారు. ఆయన ఆచూకీ కోసం పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. 121 మంది మృతుల్లో 117 మందిని గుర్తించారు. గాయపడ్డ 28 మందికి చికిత్స కొనసాగుతోంది. సత్సంగ్ టెంట్ వద్ద గుట్టలుగా పేరుకుపోయిన చెప్పులు దుర్ఘటనకు మౌనసాక్షిగా నిలిచాయి.

బాబా అనుచరుల వల్లే తొక్కిసలాట!

తొక్కిసలాటపై హత్రాస్ సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్(ఎస్‌డీఎం) బుధవారం జిల్లా మేజిస్ట్రేట్‌కు ప్రాథమిక నివేదిక సమర్పించారు. సత్సంగ్ ముగిసిన తర్వాత తన వాహనం వద్దకు తిరిగి వెళ్తున్న భోలే బాబాను దగ్గరగా చూసేందుకు, చేత్తో తాకేందుకు భక్తులు ఆరాటపడ్డారని, వారిని బాబా అనుచరులు దూరంగా తోసివేయడానికి ప్రయత్నించడంతో తొక్కిసలాట జరిగిందని నివేదికలో వెల్లడించారు. అంతేకాకుండా ఆ ప్రాంతంలో నేలంతా బురదగా ఉండడంతో జనం జారిపడ్డారని, ఒకరిపై ఒకరు పడిపోయారని పేర్కొన్నారు. కింద చిక్కుకున్నవారు ఊపిరాడక మృతిచెందారని నివేదికలో ప్రస్తావించారు. సత్సంగ్‌కు 2 లక్షల మందికిపైగా జనం హాజరయ్యారని వివరించారు.

జ్యుడీషియల్ విచారణ: యోగి

తొక్కిసలాటపై హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో జ్యుడీషియల్ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. దుర్ఘటన వెనుక కుట్రకోణాన్ని కొట్టిపారేయలేమని చెప్పారు. చికిత్స పొందుతున్న వారిని ఆయన బుధవారం పరామర్శించారు. ఘటనా స్థలాన్నీ పరిశీలించారు.



బురదమయమైన సత్సంగ్ ప్రాంగణం

విద్రోహ శక్తులే కారణం
భోలే బాబా

లక్నో: సత్సంగ్ వేదిక నుంచి తాను వెళ్లిపోయిన చాలాసేపటికి తొక్కిసలాట జరిగిందంటూ భోలే బాబా బుధవారం ప్రకటన విడుదల చేశారు. తొక్కిసలాటకు సంఘ విద్రోహ శక్తులే కారణమని ఆరోపించారు. ఆ సమయంలో తానక్కడ లేనన్నారు. భక్తుల మృతిపట్ల సంతాపం ప్రకటించారు.

బాబా మంచోడు: గ్రామస్తులు

భోలే బాబా మంచోడని యూపీలో కాస్‌గంజ్ జిల్లాలోని ఆయన స్వగ్రామం బహదూర్‌నగర్ వాసులు చెబుతున్నారు. బాబా తమను ఏనాడూ చందాలు గానీ, కానుకలు గానీ అడగలేదని గ్రామస్థులు చెప్పారు. బహదూర్‌నగర్ సమీపంలో భోలేబాబాకు ఒక ఆశ్రమం ఉంది. బాబా దంపతులకు సంతానం కలగలేదు. ఒక బాలికను దత్తత తీసుకున్నారు. 16 ఏళ్ల క్రితం ఆ బాలిక చనిపోయింది. ఆమె ప్రాణాలతో లేచివస్తుందన్న నమ్మకంతో మృతదేహాన్ని రెండు రోజులపాటు తన ఇంట్లోనే ఉంచారు. పోలీసులు, అధికారులు జోక్యం చేసుకోవడంతో ఎట్టకేలకు అంత్య క్రియలు నిర్వహించారు.

బైడెన్ కంటే హారిస్ మేలు

- సీఎన్ఎన్ తాజా పోల్ వెల్లడి
- తప్పుకోవాలంటూ బైడెన్‌పై ఒత్తిళ్లు
- మరోసారి తెరపైకి మిషెల్ పేరు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. బరి నుంచి తప్పుకోవాలంటూ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుడు జో బైడెన్‌పై ఒత్తిళ్లు నానాటికీ పెరుగుతున్నాయి. గత వారం రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన బిగ్ డిబేట్‌లో 81 ఏళ్ల జో బైడెన్ ఆద్యంతం తడబడటం తెలిసిందే. దాంతో ఆయన ఆరోగ్యంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. బైడెన్ తప్పుకోవాలని డెమొక్రట్ పార్టీకి చెందిన చట్టసభ సభ్యుడు లాయిడ్ డాగెట్, జరెడ్ గోల్డెన్ తదితరులు తాజాగా డిమాండ్ చేశారు. మొండిగా కొనసాగితే ట్రంప్ చేతిలో ఆయనకు ఓటమి ఖాయమని సొంత పార్టీకే చెందిన చట్టసభ సభ్యురాలు గ్లూసెన్‌కాంప్ పెరెజ్ తదితరులు జోస్యం చెప్పడం విశేషం! డెమొక్రాట్లు అధికారాన్ని నిలబెట్టుకోవాలంటే ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ బరిలో దిగడమే మేలని పోల్ సర్వేలూ చెబుతున్నాయి. బైడెన్ కంటే ఆమెకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని తేల్చాయి. సీఎన్ఎన్ తాజా సర్వేలో బైడెన్ కంటే ట్రంప్ ఆరు పాయింట్ల ఆధిక్యంలో నిలిచారు. అయితే, ట్రంప్‌కు 47 శాతం ఓట్లు రాగా 59 ఏళ్ల కమలకు 45 శాతం మంది ఓటేయడం విశేషం! మహిళల్లో 50 శాతం కమలకు సానుకూలంగా ఉండగా ట్రంప్‌కు 44 శాతం ఓట్లే పడ్డాయి. డెమొక్రటిక్ అభ్యర్థిగా కమలకు 43 శాతం ఓట్లొస్తే బైడెన్‌కు 34 శాతమే వచ్చాయి. ఆమె 2020 ఎన్నికల్లో కూడా డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వం కోసం పోటీ పడి చివరి నిమిషంలో తప్పుకున్నారు. డెమొక్రాట్ల అభ్యర్థిగా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా భార్య మిషెల్ పేరు కూడా గట్టిగా వినిపిస్తోంది. ఐపాసిస్ పోల్‌లో ట్రంప్‌పై 60 ఏళ్ల మిషెల్ స్పష్టమైన ఆధిక్యం ప్రదర్శించడం విశేషం. ఆమెకు 50 శాతం ఓట్లొస్తే ట్రంప్‌కు 39 శాతమే లభించాయి!



చర్చ మధ్యలో కునుకు తీశా: బైడెన్

డిబేట్‌లో ట్రంప్‌కు దీటుగా బదులివ్వలేకపోయానని బైడెన్ తాజాగా మరోసారి అంగీకరించారు. ''అందుకు క్షమాపణలు చెబుతున్నా. డిబేట్‌కు ముందు ఊపిరి సలపని విదేశీ టూర్లు చేయడంతో అలసిపోయా. ఒక దశలో వేదిక మీదే దాదాపుగా కునుకు తీశా కూడా'' అని చెప్పుకొచ్చారు! ఆగస్టు 19 నుంచి 22 దాకా షికాగోలో జరిగే డెమొక్రటిక్ ప్రతినిధుల భేటీలో బైడెన్ అభ్యర్థిత్వంపై కీలక నిర్ణయం తీసుకునివచ్చని చెబుతున్నారు.

కేబినెట్ కమిటీలు

- నియామక కమిటీలో మోదీ, షా ఇద్దరే
- రాజకీయ వ్యవహారాల కమిటీలో కిషన్‌రెడ్డి, రామ్మోహన్ నాయుడు

న్యూఢిల్లీ: ముఖ్యమైన భద్రత, ఆర్థిక, రాజకీయ వ్యవహారాలతో పాటు పలు కేబినెట్ కమిటీలను కేంద్ర ప్రభుత్వం బుధవారం నియమించింది. ఆయా అంశాల్లో కీలక నిర్ణయాలను ఈ అత్యున్నత స్థాయి కేబినెట్ కమిటీలు తీసుకుంటాయి. ఈ కమిటీల్లో ఎన్డీఏ మిత్రపక్షాలైన జేడీయూ, టీడీపీ, జేడీఎస్, శివసేన, ఎల్జేపీ (రామ్‌విలాస్)లకు చెందిన మంత్రులకు కూడా చోటు కల్పించారు. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో నియామకాలు జరిపే కీలకమైన అపాయింట్‌మెంట్స్ కమిటీలో ఎప్పటిలాగే ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాలు ఇద్దరు మాత్రమే ఉన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన జి.కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడులకు రాజకీయ వ్యవహారాల కమిటీలో చోటు దక్కింది.

మళ్లీ ఆస్పత్రిలో అద్వానీ

న్యూఢిల్లీ: బీజేపీ కురువృద్ధుడు, మాజీ ఉప ప్రధాని ఎల్.కే.అద్వానీ అనారోగ్య కారణాలతో బుధవారం రాత్రి ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చేరారు. ''ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. అబ్జర్వేషన్‌లో ఉన్నారు'' అని అపోలో వర్గాలు తెలిపాయి. 96 ఏళ్ల అద్వానీ ఏ సమస్యతో బాధపడుతున్నారో తెలియరాలేదు. ఆయన ఇటీవలే ఎయిమ్స్‌లో ఒక రోజుండి డిశ్చార్జవడం తెలిసిందే.

మళ్లీ జార్ఖండ్ సీఎంగా హేమంత్

- సీఎం చంపాయీ రాజీనామా
- సభాపక్షనేతగా హేమంత్
- నేడు సీఎంగా ప్రమాణం!

రాంచీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి పీఠంపై మళ్లీ జేఎంఎం అగ్రనేత హేమంత్ సోరెన్ ఆసీనులయ్యేందుకు రంగం సిద్ధమైంది. బుధవారం రాత్రి రాజ్‌భవన్‌లో జార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంపాయీ సోరెన్ తన రాజీనామా లేఖను అందజేశారు. బుధవారం ఇలా పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. భూకుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలపై హేమంత్ సోరెన్‌ను ఈడీ అరెస్ట్‌చేసిన నేపథ్యంలో హఠాత్తుగా సీఎం పదవికి హేమంత్ రాజీనామా చేయడం, ఆయన స్థానంలో చంపాయీ సోరెన్‌ను జార్ఖండ్ ముక్తిమోర్చా(జేఎంఎం) ఎమ్మెల్యేలు ఎన్నుకోవడం తెల్సిందే. తాజాగా హేమంత్ బెయిల్‌పై విడుదలైన నేపథ్యంలో మళ్లీ ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టబోతున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు హేమంత్ ముఖ్యమంత్రిగా ప్రమాణంచేసే అవకాశం ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే బన్నా గుప్తా బుధవారం చెప్పారు. తనను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను హేమంత్ కోరారు. కూటమి పార్టీల మద్దతు లేఖను అందజేశారు. చంపాయీ రాజీనామాకు ముందే జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి నేతలు, ఎమ్మెల్యేలు ఆయన నివాసంలో సమావేశమై హేమంత్‌ను తమ శాసనసభాపక్షనేతగా ఎన్నుకున్నారు. దాంతో హేమంత్ సీఎం కావడం ఇక లాంఛనమే.



5 నెలలు జైల్లో ఉండి...

మనీలాండరింగ్ కేసులో హేమంత్‌ను ఈడీ జనవరి 31న అరెస్ట్ చేసింది. దాంతో సీఎంగా రాజీనామా చేశారు. హైకోర్టు బెయిల్‌తో జూన్ 28న బయటికొచ్చారు. ఆయన బెయిల్‌ను వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లాలని ఈడీ భావిస్తోంది.

కాస్త తగ్గిన కూటమి బలం

81 సభ్యులుండాల్సిన రాష్ట్ర అసెంబ్లీలో ప్రస్తుతం 76 మంది సభ్యులున్నారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత జేఎంఎం సంకీర్ణ ప్రభుత్వ బలం కాస్తంత తగ్గింది. ఇద్దరు జేఎంఎం ఎమ్మెల్యేలు ఎంపీలుగా గెల్చారు. హేమంత్ వదిన సీత రాజీనామాచేశారు. మరో ఇద్దరు ఎమ్మెల్యేలను పార్టీ బహిష్కరించింది. ఇక, ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు ఎంపీలుగా గెల్చారు. ఒకరిని పార్టీ బహిష్కరించింది. దీంతో ప్రస్తుతం ఆర్జేడీకి ఒకరు, జేఎంఎంకు 27, కాంగ్రెస్‌కు 17 మంది సభ్యుల బలముంది. బీజేపీకి 24 సభ్యుల బలముంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం । 4 । జూలై । 2024



కొన్నిరోజులుగా వర్షాలు కురవడంతో మంగళూరులో పాత ఇళ్లు, కట్టడాలకు ప్రమాదం జరుగుతోంది. బుధవారం నిర్మాణంలో ఉన్న ఓ కట్టడం కూలిపోయిన దృశ్యం. ఇద్దరు కార్మికులు గాయపడ్డారు

న్యూస్‌రీల్

పీడీఓ నిధుల స్వాహాపై నిరసన



ధర్నా చేస్తున్న ప్రజలు

తుమకూరు: తుమకూరు గ్రామీణం హెగ్గేరు గ్రామ పంచాయతీలో లక్షలాది రూపాయలు స్వాహా చేసిన పంచాయతీ అభివృద్ధి అధికారి (పీడీఓ) రాఘవేంద్రను అరెస్టు చేయాలని ఆ గ్రామ పంచాయతీ సభ్యులు, బీజేపీ , జేడీఎస్ పార్టీల కార్యకర్తలు ఆందోళన చేశారు. హెగ్గేరు గ్రామ సర్కిల్ నుంచి గ్రామ పంచాయతీ వరకు ఊరేగింపుగా సాగి అక్కడ పీడీవో రాఘవేంద్ర, బిల్ కలెక్టర్ రంగనాథ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ప్రజలు కట్టిన పన్నును దుర్వినియోగం చేస్తూ వారిద్దరూ సుమారు రూ. కోటిన్నర దోచేశారని ఆరోపించారు. తక్షణం అరెస్టు చేసి ప్రజాధనాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

25 మంది ఐపీఎస్‌ల బదిలీ

దొడ్డబళ్లాపురం: రాష్ట్రంలో 25 మంది ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. పలు ముఖ్యమైన స్థానాల్లో ఉన్నవారిని అటు ఇటు మార్చింది. వారంలోపు కొత్త స్థానాల్లో బాధ్యతలను స్వీకరించాలి. రాష్ట్రంలో హత్యలు, అత్యాచారాలు తదితర నేరాలు పెరిగిపోయినట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో సర్కారు ఐపీఎస్‌లను బదిలీ చేసింది.

చిన్నారి ఖైదీ తల్లిదండ్రులపై కేసు

దొడ్డబళ్లాపురం: చిన్నారికి ఖైదీ దుస్తులు వేసి ఫోటో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేసిన తల్లిదండ్రులపై కేసు నమోదయింది. తన అభిమాన నటుడు దర్శన్ జైలుపాలు కావడంతో ఓ వీరాభిమాని తన ఏడాది కొడుక్కి కూడా ఖైదీ మాదిరి దుస్తులు వేసి సోషల్ మీడియాలో ఫోటోలు పెట్టడం తెలిసిందే. దీనిపై మీడియాలో వార్తలు రావడంతో స్పందించిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసుకుంది. ఫోటో పెట్టిన తల్లిదండ్రుల కోసం పోలీసులు శోధిస్తున్నారు.

షేర్ల పేరుతో రూ.2.60 లక్షల మోసం

మైసూరు: రాచనగరి మైసూరులో ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. తాజాగా ఒక వ్యక్తి ఇలాంటి సైబర్ మోసానికి గురై రూ. 2.60 లక్షలను కోల్పోయాడు. జయనగర నివాసి సురేశ్ ఇంటర్నెట్లో షేర్ మార్కెట్ గురించి అన్వేషించగా అతని మొబైల్‌కు ఓ కాల్ వచ్చింది. అతన్ని వాట్సాప్ గ్రూప్‌లో చేర్చారు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపించారు. మోసగాళ్ల మాటలను నమ్మిన సురేశ్ దశలవారీగా రూ. 2.60 లక్షలను పెట్టుబడి పెట్టాడు. ఆ తర్వాత ఎలాంటి డబ్బులు తిరిగి రాకపోవడంతో మోసపోయానని గ్రహించి సైబర్ పోలీసులను ఆశ్రయించాడు.

మైసూరు సీపీగా సీమా



మైసూరు: మైసూరు నగర పోలీసు కమిషనర్ (సీపీ)గా సీమా లాట్కర్‌ను ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు ఉన్న కమిషనర్ రమేశ్ బానోత్‌ను బదిలీ చేశారు. మైసూరు జిల్లా ఎస్పీగా పని చేస్తున్న సీమా లాట్కర్ కొత్త కమిషనర్ అయ్యారు. జిల్లా ఎస్పీగా ఎన్.విష్ణువర్ధన్‌ను నియమించారు. కాగా మైసూరుకు మహిళా పోలీస్ బాస్ రావడం ఇదే తొలిసారి.

జూదగాళ్లు నదిపాలు

- పోలీసుల నుంచి తప్పించుకునే యత్నంలో విషాదం
- తెప్పలో వెళ్తూ కృష్ణాలో మునక.. ఐదుగురు జలసమాధి
- ముగ్గురి మృతదేహాల వెలికితీత
- విజయపుర జిల్లా కొల్హార తాలూకాలో ఘోరం




ఘటనాస్థలి వద్ద గుమికూడిన స్థానికులు

సాక్షి, బళ్లారి: విజయపుర జిల్లాలో ఘోరం జరిగింది. జిల్లాలోని కొల్హార తాలూకా బళూతి జాక్‌వెల్ సమీపంలో కృష్ణానది తీరంలో ఇస్పేట్ జూదం ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందడంతో పేకాటరాయుళ్లను పట్టుకునేందుకు పోలీసులు వచ్చారు. వారి బారి నుంచి తప్పించుకునేందుకు కృష్ణానదిలో తెప్ప మార్గంలో పరారయ్యేందుకు ప్రయత్నిస్తున్న వారిలో ఐదుగురు నీటి పాలు కావడం తీవ్ర విషాదం నింపింది. మొత్తం 7 మందికిపైగా తెప్పలో నది దాటుతూ పడిపోయారు. ఐదుగురు నీటిపాలు కాగా, ఇద్దరు ఈతకొడుతూ బయటకు వచ్చారు. మంగళవారం సాయంత్రం ఈ దుర్ఘటన జరిగింది. వెంటనే అగ్నిమాపక సిబ్బందితో పాటు గజ ఈతగాళ్లు కూడా వచ్చి నీటిలో మునిగిపోయిన వారి కోసం గాలింపు చేపట్టారు. మృతదేహాల కోసం పోలీసులు, స్థానికులు గాలిస్తున్నారు. ఘటన స్థలానికి ఎస్పీ రుషికేష్, ఏఎస్పీ శంకర్ మారిహాళ తదితరులు చేరుకుని పర్యవేక్షిస్తున్నారు.

మృతులు వీరే...

తెప్పలో వెళ్తుండగా తెప్ప తిరగబడటంతో ఏడుమంది నీటిలోకి పడిపోయారు. సచిన్ కటబర, ఫారూక్ అహమ్మద్ అనే ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. బుధవారం గాలింపులో పుండలీక యంకంబి (35), తయ్యబ్ చౌధరి (43), దశరథ గౌడర్ (65) అనే ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. రఫీక్ జాలగార (55), మహిబూబ్ వలికార్ (30) అనే వారి జాడ లేదు. ఈ దుర్ఘటనతో బాధిత కుటుంబాలు తీవ్ర శోకానికి గురయ్యారు. పరుగున నది వద్దకు చేరుకున్నారు.





తెప్ప మునిగిపోయి మృతి చెందిన దశరథ, రఫీక్ జాలగార, మహబూబ్ (ఫైల్)



ఘటనాస్థలిలో పోలీసులు, ఫైర్ సిబ్బంది



మృతదేహాన్ని వెలికితీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అల్లుని దాష్టీకం.. కుటుంబం ఛిన్నాభిన్నం

- బావమరిది హత్య...
- తట్టుకోలేక అత్త ఆత్మహత్య



అల్లుడు రవిచంద్రన్



తల్లి భాగ్యమ్మ, కుమారుడు అభిషేక్ (వృత్తంలో)

మైసూరు: ఓ అల్లుని ధన దాహానికి కుటుంబం ఛిన్నాభిన్నమైంది. అల్లుని చేతిలో కుమారుడిని కోల్పోయిన ఒక మాతృమూర్తి ఆ ఆవేదనతో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మైసూరులోని కోర్గళ్లిలో జరిగింది. మృతురాలు భాగ్యమ్మ (46). గత నెల 9న ఆమె కుమారుడు అభిషేక్‌ను ఆమె అల్లుడు రవిచంద్రన్ కత్తితో పొడిచి హత్య చేశాడు. రామకృష్ణనగరలో ఉండే రవిచంద్రన్ అదనపు కట్నం తేవాలని భార్యను వేధిస్తూ తరచూ కొట్టేవాడు.

చెల్లిని వేధించవద్దన్నందుకు

తన చెల్లిని వేధించవద్దని బావకు నచ్చజెప్పేందుకు వెళ్లిన అభిషేక్‌ను బావ గొడవపడి కత్తితో పొడిచి హత్య చేశాడు. ఆనాటి నుంచి కొడుకు చనిపోయాడు, కూతురి జీవితం భగ్నమైందని బాధపడుతూ ఉన్న భాగ్యమ్మ జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై విజయనగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఒకే కుటుంబంలో తల్లీ కొడుకు మరణించడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

సూరజ్‌కు జ్యుడీషియల్ కస్టడీ

బనశంకరి: యువకునిపై అసహజ లైంగిక దాడి కేసులో జేడీఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ సూరజ్ రేవణ్ణకు 18వ తేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించారు. బెయిల్ అర్జీ విచారణ గురువారానికి వాయిదా పడింది. సూరజ్‌కు సీఐడీ పోలీసు కస్టడీ ముగియడంతో బుధవారం బెంగళూరు 42వ ఏసీఎంఎం కోర్టులో హాజరు పరిచారు. 18 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో పరప్పన జైలుకు తరలించారు.

హైకోర్టులో ప్రజ్వల్ బెయిలు అర్జీ

అత్యాచారం, లైంగిక వీడియోల కేసులో అరెస్టైన మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. అత్యాచారంతో పాటు మూడు కేసుల్లో బెయిల్ కోరుతూ బుధవారం ప్రజ్వల్ న్యాయవాది పిటిషన్ వేశారు. ఇంతకు ముందు సెషన్స్‌కోర్టు బెయిల్ నిరాకరించింది.

కొడుకును కలిసిన రేవణ్ణ

తనయుడు ప్రజ్వల్‌ను కలిసేందుకు మాజీమంత్రి హెచ్‌.డీ.రేవణ్ణ మొదటిసారిగా బుధవారం పరప్పన అగ్రహార జైలుకు వెళ్లారు. సోమవారం తల్లి భవానీ కుమారున్ని చూసి వెళ్లారు. మంగళవారం మైసూరులో మీడియాతో మాట్లాడిన రేవణ్ణ నేను ఇప్పట్లో ప్రజ్వల్‌ను కలవను. కలిశాక ఏం మాట్లాడారని అందరూ అడుగుతారు అని అన్నారు. దేవేగౌడ నెలరోజుల నుంచి ఇదే బాధలో ఉన్నారని, అన్నింటికీ కాలం సమాధానం చెబుతుందని, నేను దేనికి భయపడనని, 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానని ఇలాంటివి చాలా చూశానని చెప్పారు.

బ్యాంకుకు వ్యతిరేకంగా రైతుల ధర్నా



మైసూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని బ్యాంకులు రైతుల వ్యవసాయ రుణాలను ఓటీఎస్ ద్వారా చెల్లింపులు చేస్తుంటే కర్ణాటక గ్రామీణ బ్యాంకు మాత్రం ఇది పాటించడం లేదని రాష్ట్ర చెరువు ఉత్పత్తిదారుల సంగం మైసూరు జిల్లా విభాగం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బుధవారం కర్ణాటక గ్రామీణ బ్యాంకు ముట్టడికి యత్నించారు. కరువులో ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న రైతులకు వ్యవసాయ రుణాల చెల్లింపు సాధ్యం కావడం లేదన్నారు. వారికి వెసులుబాటుగా రాష్ట్ర ప్రభుత్వం రుణ రెన్యువల్‌కు మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మార్గదర్శకాల ప్రకారం ఓటీఎస్ (వన్‌టైమ్ సెటిల్‌మెంట్) ద్వారా రుణాల చెల్లింపు మేళాను అధికంగా నిర్వహించి ప్రచారం చేయాలని సూచించింది. కర్ణాటక బ్యాంకు అధికారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోకుండా అడ్డంకులు కల్పిస్తున్నారని రైతులు ఆరోపించారు.

ముడా స్థలాలపై ఉన్నత విచారణ



- సీఎం సిద్దు వెల్లడి

శివాజీనగర: మైసూరులో ముడా ఇంటి స్థలాల పంపిణీలో దుర్వినియోగం జరిగిందో లేదో కనిపెట్టేందుకు తనిఖీ చేయిస్తాం. పంపిణీ చేసిన అన్ని స్థలాలను సస్పెన్షన్‌లో పెట్టాం. ప్రభుత్వానికి ఎలాంటి నష్టం కగలేదు. స్థలాలను పంపిణీ చేసిన అధికారులను బదిలీ చేసి సీనియర్ ఐఏఎస్ అధికారులచే విచారణ చేయిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ముడా ఇంటి స్థలాల పంపిణీలో అక్రమాలు జరిగాయని, సీబీఐ దర్యాప్తు చేయించాలన్న బీజేపీ డిమాండ్‌పై స్పందిస్తూ అన్నింటినీ సీబీఐకి అప్పగించాలని ఎందుకు కోరుతున్నారో అర్థం కావటం లేదు. బీజేపీ అధికారంలో ఉన్నపుడు ఏ కేసునైనా సీబీఐకి అప్పగించారా అని ప్రశ్నించారు. భూమి ఇచ్చినవారికి బదులుగా స్థలం ఇవ్వాలని బీజేపీనే చట్టం చేసిందన్నారు.

వాల్మీకి మండలి అక్రమాలపై తనిఖీ

వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన అక్రమాలపై సిట్ దర్యాప్తు చేస్తోంది. సంబంధిత మంత్రి నాగేంద్ర నిధుల బదిలీకి మేనేజింగ్ డైరెక్టర్‌కు మౌఖిక ఆదేశాలిచ్చారనే కారణంతో రాజీనామా చేయించాం. బ్యాంక్ లావాదేవీలపై సీబీఐ కూడా తనిఖీ చేపట్టిందని సీఎం చెప్పారు.

చిన్నారిని వదిలించుకున్నారు



బాలుడు



బాలున్ని తీసుకొచ్చిన మహిళ

చింతామణి: గుర్తుతెలియని మహిళ ఒక ఏడాది బాలున్ని చింతామణి ప్రభుత్వ ఆస్పత్రిలోని ఉయ్యాలలో పెట్టి వెళ్లిపోయింది. బాలుడు ఏడవడంతో నర్సులు వచ్చి చూసి తల్లి కోసం ఆరా తీయగా కనిపించలేదు. దీంతో వైద్యాధికారి డా. సంతోష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఆస్పత్రిలోని సీసీ కెమెరా చిత్రాలను పరిశీలించగా పింక్ చుడీదార్ వేసుకున్న మహిళ ఈ చిన్నారిని తీసుకొచ్చి పెట్టి పారిపోతున్న దృశ్యం కనబడింది. ఆ మహిళ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆమె బాలుని తల్లినా, లేక వేరే మహిళనా అనేది తేలాల్సి ఉంది.



ప్రకృతిని కాపాడుకుంటేనే మనుగడ. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం విధానసౌధ ముందు జరిగిన జాగృతి జాతాలో బాలలు

నెలలో రూ.9 కోట్ల చలానాలు

మైసూరు: మైసూరు– బెంగళూరు జాతీయ రహదారిలో ఒకే నెలలో భారీగా ట్రాఫిక్ చలానాలు విధించారు. నెలరోజుల్లో మొత్తం రూ. 9 కోట్ల జరిమానా విధించారు. ఐటీఎంఎస్ కెమెరాల్లో నమోదైన ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ఆయా వాహనదారులకు సుమారు రూ. 8.99 కోట్ల జరిమానా విధించారు. జూన్ 1 నుంచి అదే నెల 30 వరకు 1,61,491 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు వచ్చాయి. ఇందులో కారులో సీటు బెల్ట్ పెట్టుకోని కేసులే అధికంగా ఉన్నాయి.

పసికందు మృతిపై నిరసన

యశవంతపుర: వైద్యుల నిర్లక్ష్యం వల్ల 7 నెలల శిశువు మృతి చెందిన ఘటన బెళగావి జిల్లా గోకాక్‌లో జరిగింది. గోకాక్ పట్టణానికి చెందిన డాక్టర్ మహంతేశ్ కడాడి ఆస్పత్రిని నడుపుతున్నారు. శివానంద నింగప్ప తమ చిన్నారికి అనారోగ్యంగా ఉండడంతో నాలుగు రోజుల నుంచి ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. మంగళవారం మధ్యరాత్రి పసికందు ఆరోగ్యం విషమించింది. దీనితో వైద్యులు మరో పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. తల్లిదండ్రులు అంత రాత్రి సమయంలో నానాపాట్లు పడి ఒక అంబులెన్స్ తీసుకొచ్చేలోపు శిశువు ప్రాణాలు వదిలింది. దీనితో ఆక్రోశానికి గురైన బంధువులు దాడికి దిగి ఆస్పత్రి కుర్చీలను ధ్వంసం చేశారు. డాక్టర్ మహంతేశ్‌ను నిలదీశారు. ఇంతలో పోలీసులు చేరుకుని బంధువులను అడ్డుకుని కేసు నమోదు చేశారు.

బెళగావిలో నకిలీ నోట్ల ముఠా

యశవంతపుర: నకిలీ నోట్లను తయారు చేస్తున్న ఐదుమంది ముఠాను బెళగావి జిల్లా గోకాక్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు మూడలగి తాలూకా అరభావికి చెందిన అన్వర్ మహ్మద్ సలీం యాదవాడ, మహలింగపురకు చెందిన సద్దాం మూసా యడహళ్లి, రవి చన్నప్ప హ్యాగడి, దుండప్ప మహదేవ బనశెణవి, విఠల హనుమంత హొసకోటి అనే వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. జూన్ 29న గోకాక్–బెళగావి రోడ్డులోని కడబగట్టి గ్రామం వద్ద పోలీసులు గస్తీ తిరుగుతుండగా కారును అడ్డగించి పరిశీలించగా కొంత మొత్తంలో రూ.100, 500 నకిలీ నోట్లు బయట పడ్డాయి. అరభావి గ్రామంలో ఒక ఇంటిలో నకిలీ నోట్లను ముద్రిస్తున్నట్లు గుర్తించారు. ఆ నోట్లను జిల్లాతో పాటు ధారవాడలో చలామణి చేస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

ముడా స్కాంపై విచారణ జరపాలి

బనశంకరి: మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో రూ.5 వేల కోట్లకు పైగా కుంభకోణం జరిగిందనే దానిపై హైకోర్టు పర్యవేక్షణలో సీబీఐ విచారణ చేపట్టాలని సిటిజన్ రైట్స్ ఫౌండేషన్ డిమాండ్ చేసింది. ఇందులో సీఎం సిద్దరామయ్య కుటుంబం హస్తం ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయని ఫౌండేషన్ కార్యదర్శి బీటీ రాధాకృష్ణ బుధవారం ఆరోపించారు. మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలి కుంభకోణంపైనా దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

వాల్మీకి మండలి, ముడా స్కాంలో సీఎం



సీఎం ఇంటికి వెళ్లే మార్గంలో పోలీసుల భద్రత



బీజేపీ నాయకులను తరలిస్తున్న దృశ్యం



వాల్మీకి మండలి స్కాంకు వ్యతిరేకంగా చిక్కమగళూరులో ర్యాలీ

= బీజేపీ ఆరోపణలు, నిరసన

శివాజీనగర: మహర్షి వాల్మీకి ఎస్టీల అభివృద్ధి మండలిలో జరిగిన కోట్లాది రూపాయల అక్రమాల్లో ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు ప్రమేయముంది, ఆయన వెంటనే రాజీనామా చేయాలని బెంగళూరులో బీజేపీ నాయకులు ధర్నా చేశారు. బుధవారం కుమారకృపా అతిథి గృహం నుంచి ర్యాలీగా సీఎం సిద్దరామయ్య ఇంటి ముట్టడికి బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై.విజయేంద్ర, బీజేపీపక్ష నేత ఆర్.అశోక్, కొందరు ఎమ్మెల్యేలు బయల్దేరారు. మాజీ మంత్రి బీ.నాగేంద్రను బలిపశువుని చేసి పెద్ద తలకాయలు బయటపడ్డాయి. ఈ కేసు పరిష్కారమయ్యే వరకు సీఎం సిద్దరామయ్య రాజీనామా చేయాలి, అంతవరకు మా పోరాటం నిలువదని నేతలు తెలిపారు. స్కాం వెనుక ముఖ్యమంత్రి పాత్ర ఉంది. ఆర్థిక మంత్రి కూడా ఆయనే అయినందున ఆయనకు తెలియకుండా రూ.187 కోట్ల మొత్తం అవినీతి జరిగేందుకు సాధ్యమే లేదు. సిద్దరామయ్య కుర్చీని కాపాడుకోవడానికి లోక్‌సభ ఎన్నికల కోసం రాహుల్‌గాంధీకి ఈ సొమ్ము చేర్చేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఈ కేసును మూసివేయడానికి అన్ని విధాలా ప్రయత్నాలు చేశారని దుయ్యబట్టారు.

ఇంకా పెద్దది ముడా స్కాం

వాల్మీకి మండలి అక్రమాల కంటే మైసూరులో ముడా ఇళ్లస్థలాల స్కాం మరింత పెద్దది, రూ. 3- 4 వేల కోట్ల అక్రమాలు జరిగాయని తెలిసింది. సీఎం సొంత జిల్లాలో ఆయనకు తెలియకుండా అక్రమాలు జరిగేందుకు సాధ్యమేనా? ఈ కేసుపై సరైన తనిఖీ జరగాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకుని బలవంతంగా వ్యాన్లలో ఎక్కించి తరలించారు. కాగా వాల్మీకి మండలి స్కాంను నిరసిస్తూ చిక్కమగళూరు సహా పలుచోట్ల బీజేపీ కార్యకర్తలు ర్యాలీలు చేశారు.

క్లుప్తంగా

దర్శన్ కోసం కన్నీరు

దొడ్డబళ్లాపురం: హీరో దర్శన్ రేణుకాస్వామి హత్య కేసులో జైలుపాలైన సంగతి తెలిసిందే. అయితే దర్శన్ వీలైనంత త్వరగా జైలు నుంచి బయటకు రావాలని దర్శన్ నటించిన కాటేర, రాబర్ట్ సినిమాల డైరెక్టర్ అయిన తరుణ్ తల్లి మాలతి కోరుకుంటోంది. ఆమె మాట్లాడుతూ దర్శన్‌ను చిన్నప్పటి నుంచి చూస్తున్నానని, చాలామంచి వ్యక్తి అన్నారు. తన కొడుకుతో సమానంగా చూసుకున్నానని, దర్శన్ వీలయినంత త్వరగా దోషముక్తుడై బయటకు రావాలని, ఎప్పటిలా సినిమాల్లో నటించాలని రోదించారు.

హ్యాకర్ శ్రీకృష్ణకు ఊరట

బనశంకరి: సంచలనాల బిట్‌కాయిన్ కేసులో హ్యాకర్ శ్రీకృష్ణ అలియాస్ శ్రీకి కి హైకోర్టు ఊరటనిచ్చింది. అతనిపై పోలీసులు నమోదు చేసిన సంఘటిత నేరాల చట్టం కేసును రద్దు చేసింది. బుధవారం హైకోర్టులో న్యాయమూర్తి ఎం.నాగప్రసన్న విచారణ చేపట్టారు. శ్రీకి వకీలు వాదిస్తూ సంఘటిత నేరాల చట్టం వర్తించనప్పటికీ బెయిల్ ఇవ్వరాదని కేసు నమోదు చేశారని తెలిపారు. వాదనల ఆలకించిన జడ్జి జస్టిస్ నాగప్రసన్న... శ్రీకి పై నమోదైన కేసీటీసీ యాక్టును రద్దు చేస్తూ తీర్పునిచ్చారు. కోర్టులో బెయిల్ అర్జీ దాఖలు చేసుకోవచ్చని తెలిపారు.

కోలారు జిల్లా ఎస్పీ బదిలీ



కోలారు నూతన ఎస్పీ నిఖిల్

కోలారు: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఎస్పీ ఎం.నారాయణను బదిలీ చేసి నూతన ఎస్పీగా బి.నిఖిల్‌ను నియమించింది. రాయచూరు జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న నిఖిల్ బదిలీపై కోలారుకు వచ్చారు. కాగా నారాయణను ఉత్తర కన్నడ జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు.

భర్త హత్యకేసులో భార్య సహా ఐదుగురికి జైలు

యశవంతపుర: భర్తను హత్య చేయించిన భార్యతో సహా ఐదుగురికి యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ మంగళూరు 6వ అడిషినల్ జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. పావూరు ఇనోళి దండింజిలో ఇస్మాయిల్(59), పావూరు నబీసా దంపతులు నివాసం ఉండేవారు. నబీసా మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. పద్ధతి మార్చుకోవాలని భర్త సూచించడంతో అతన్ని అడ్డు తొలగించాలని నబీసా భావించి నలుగురికి సుఫారీ ఇచ్చి అంతమొందించింది. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి ఉళ్లాల దుర్గ సమీపంలోని బీసీ రోడ్డు నివాసి అబ్దుల్ మునాఫ్ అలియాస్ మున్న(41), ఉళ్లాల నివాసి అబ్దుల్ రహ్మాన్(36), చోళియారు నివాసి శబీర్ అలియాస్ శబ్బి(31), కుత్తార్ పరవు నివాసి జమాల్ అహమద్(38), పావూరు నబీసాను అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈకేసు మంగళవారం విచారణకు వచ్చింది. నిందితుల నేరం రుజువు కావడంతో యావజ్జీవ శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

కానిస్టేబుల్ ఇంటికి కన్నం

మైసూరు: దొంగలు మహిళా కానిస్టేబుల్ ఇంటికి కన్నం వేసి బంగారు నగలు దోచుకున్నారు. ఈ ఘటన బిళికెరెలో జరిగింది. సుధారాణి అనే మహిళ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోని పోలీసు క్వార్టర్స్‌లో నివాసం ఉంటోంది. బుధవారం ఆమె విధులకు వెళ్లిన సమయంలో దొంగలు ఇంటికి కన్నం వేసి లోపలకు చొరబడి సుమారు 30 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 10 వేల నగదు చోరీ చేసి ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కట్టడ నిర్మాణంలో ప్రమాదం.. ఇద్దరికి గాయాలు



కూలీలను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

యశవంతపుర: నిర్మాణంలో ఉన్న భవనం పైకప్పులో ఉన్న మట్టి కూలి ఇద్దరు కూలీలు గాయపడ్డారు. ఈఘటన మంగళూరులో జరిగింది. బల్మఠ వద్ద కట్టడాన్ని నిర్మిస్తున్నారు. అవసరమైన మట్టిని కట్టడ పైభాగంలో ఉంచారు. బుధవారం బీహార్‌కు చెందిన రాజ్‌కుమార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన చంచనకుమార్‌గా ఇక్కడ పనిచేస్తుండగా మట్టి కూలి మీద పడింది. అగ్నిమాపక, పోలీసులు వచ్చి బాధితులను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. దక్షిణకన్నడ జిల్లా కలెక్టర్ ముల్‌లైముగిలన్, ఎడీసీ సంతోష్‌కుమార్, మంగళూరు పోలీసు కమిషనర్ అనుపమ్ అగర్వాల్, డీసీపీ సిద్ధార్థ గోయల్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.

పోక్సో కేసు నుంచి విముక్తి

యశవంతపుర: బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలతో జైలు పాలైన వ్యక్తి నిర్దోషిగా జిల్లా పోక్సో కోర్టు తీర్పు ఇచ్చింది. ఉడుపి జిల్లాలోని ఒక గ్రామంలో సయ్యద్ ముస్తకిమ్ అహ్మద్ అనే వ్యక్తి 7, 14 ఏళ్ల వయస్సున్న కుమార్తెలపై 2019 నవంబర్ 30 నుంచి డిసెంబర్ 15 వరకు లైంగిక దాడికి పాల్పడినట్లు పోక్సో కేసు నమోదైంది. ఈ కేసును ఉడిపి జిల్లా పోక్సో కోర్టు విచారణ చేపట్టింది. సయ్యద్ ముస్తకిమ్ అహ్మద్‌పై ఆరోపణలు రుజువు కాకపోవడంతో కేసు నుంచి విముక్తి కలిగిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

దశాబ్దాలు గడిచినా ఆపన్నహస్తం సున్నా



ఇనుప రేకుల కింద గుడారంలోనే నివాసం



పునాదులకే పరిమితమైన పునరావాస కాలనీ

- ప్రభుత్వం నుంచి నేటికీ అందని పరిహారం
- ఇంకా గుడారాల్లోనే జీవిస్తున్న నిరుపేదలు

రాయచూరు రూరల్: కరువు, వరద విలయంతో అతలాకుతలమైన జిల్లా ప్రజలకు దశాబ్దంన్నర గడిచినా ఏమాత్రం సహాయం అందకపోవడంతో నేటికీ తమకు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. 2009లో కురిసిన భారీ కుండపోత వర్షాలతో వరదలు వచ్చి సర్వస్వం కోల్పోయిన ప్రజలు ఇంకా గుడారాల్లోనే బ్రతుకులు వెళ్లదీస్తున్నారు. ఏళ్లు గడిచినా తమకు పూర్తి స్థాయిలో వరద సహాయం అందలేదనే విమర్శలు వెలువడుతున్నాయి. గుడారాల్లోనే కాలం గడుపుతున్న వరద బాధితులు వణికిపోతున్నా భయం వెంటాడుతూనే ఉంది. ప్రస్తుతం తమ బ్రతుకులు ఎన్నడు బాగు పడతాయోనని ఎదురు చూస్తున్నారు. ఇళ్లు కోల్పోయిన వారికందరికీ సురక్షిత ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చినా నేటివరకూ వారి ఇళ్ల గురించి ఆలోచన చేసేవారు కరువయ్యారు. జిల్లాలో వేలాది మంది రైతులు పంట బీమా పథకం ప్రీమియం చెల్లించినా నేటికీ రైతాంగానికి ఎలాంటి బీమా డబ్బులు అందక పోవడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకూ అందని సాయం

15 ఏళ్ల క్రితం వరదల కారణంగా దాదాపు లక్ష ఎకరాల్లో వరద ప్రాంతాల్లోనే పంట తీవ్రంగా నష్టపోయింది. ప్రస్తుతం రైతులను ఆదుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో జిల్లా రైతాంగం సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. పంటలపై కట్టిన బీమా సౌకర్యం అందడం లేదని రైతులంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లా ప్రజలకు ఎలాంటి సహాయం అందిస్తుందనే చర్చ సాగుతోంది.

మొదట్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు హడావుడి చేసినా తీరా వారి హంగామా అంతా రాజకీయం కోసమేనంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. కరువు, వరద అధ్యయన బృందం జిల్లాలో పర్యటించినా ఫలితం కేవలం పర్యటనలకు మాత్రమే పరిమితమైందనే ఆరోపణలున్నాయి. బృందాలు కూడా జిల్లాలో పర్యటించి, పరిశీలించి ఏళ్లు గడుస్తున్నా నేటి వరకూ జిల్లా రైతాంగానికి, బాధితులకు ఎలాంటి సహాయం అందలేదు. అసలు ప్రభుత్వ సహాయం అందుతుందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

చెరువులో ప్రేమజంట మృతదేహాలు



అంజన, శ్రీకాంత్(ఫైల్)

బనశంకరి: వివాహితుడితో ప్రేమపెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. దీంతో ఆ జంట చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. అంజనాపుర సమీపంలోని తులసీపుర చెరువులో వీరి మృతదేహాలు లభ్యమయ్యాయి. దక్షిణ విభాగ డీసీపీ లోకేశ్‌జగలాసర్ మీడియాకు తెలిపినమేరకు తలఘట్టపుర సమీపంలోని అంజనాపుర నివాసి అంజనా(20) బీకాం చదువుతోంది. కోణణకుంటెకు చెందిన వివాహితుడు శ్రీకాంత్(24)తో ఏర్పడిన స్నేహం ప్రేమకు దారితీసింది. పెళ్లి చేసుకుంటామని ఇంటిలో చెప్పడంతో పెద్దలు అంగీకరించలేదు. దీంతో ఈనెల 1న ఇంటినుంచి అదృశ్యమయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు తలఘట్టపుర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలోనే తులసీపుర చెరువులో ఇద్దరూ శవాలై తేలారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వెళ్లి చూడగా చేతుల్లకు తాళ్లకట్టుకున్నట్లు కనిపించింది. ఇద్దరూ కలిసి జీవించడం సాధ్యం కాకపోవడంతో కలిసి చనిపోవాలని తీర్మానించుకున్నట్లు యువతి అంజనా మొబైల్‌లోని సెల్ఫీ వీడియోలో బయట పడింది. మొబైల్‌ను ఆటోలో పెట్టి చెరువులోకి దూకారని తెలుస్తోంది. మృతదేహాలను ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

జిల్లా ఎస్పీగా శోభారాణి



సాక్షి,బళ్లారి: మూడేళ్లుగా జిల్లా ఎస్పీగా పని చేస్తున్న రంజిత్ కుమార్ బండారి బదిలీ అయ్యారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో బెంగళూరు పోలీసు విభాగంలో ఉన్నతాధికారిణిగా పని చేస్తున్న శోభారాణిని బళ్లారి ఎస్పీగా బదిలీ చేశారు. ఈమె గతంలో మండ్య, హాసన్ ఏఎస్పీగా, తుమకూరు ఎస్పీగా విధులు నిర్వహించారు. ఏసీబీ, సీఐడీ విభాగంలో కూడా పోలీసు ఉన్నతాధికారిణిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం బెంగళూరు బృహత్ మహానగర పాలికె పరిధిలో జీఎంటీఎఫ్ ఎస్పీగా ఉన్నారు.

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: హుణసూరు తాలూకా హబ్బనకుప్పేలో ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్న చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కింది. కొన్ని రోజులుగా పెంపుడు జంతువులపై ఈ చిరుత దాడి చేసి బలి తీసుకుంటోంది. రైతు లోకేశ్ పొలంలో అటవీ సిబ్బంది బోను ఏర్పాటు చేయగా బుధవారం వేకువజామున ఆహారం కోసం వచ్చిన చిరుత బోనులో చిక్కింది. అటవీశాఖ అధికారులు వచ్చి చిరుతను బంధించి తీసుకెళ్లారు.

మాతృభాషలోనే చదివించాలి



అక్షరాభ్యాసం చేయిస్తున్న స్వామీజి

చిక్కబళ్లాపురం: ప్రతి ఒక్కరూ తమ పిల్లలను మాతృభాష కన్నడలోనే చదివించాలని ఆదిచుంచనగిరి ట్రస్టు పీఠాధ్యక్షులు శ్రీశ్రీ నిర్మలానందనాథ స్వామీజీ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌జేసీఐటీ కళాశాల ఆవరణలో శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో బీజీఎస్ వరల్డ్ పాఠశాల విద్యార్థులకు బుధవారం ఏర్పాటు చేసిన అక్షరాభ్యాస కార్యక్రమంలో స్వామీజీ పాల్గొన్నారు. చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ప్రపంచ జ్ఞానం కోసం ఆంగ్ల భాష అవసరమైనా మాతృభాషలోనే చదివించాలన్నారు. పాలకమండలి సభ్యుడు శివరామిరెడ్డి గుడిబండ తహసీల్దార్ మనిషా, మంగళానందనాథస్వామీజీ, ప్రిన్సిపాల్ మోహన్ కుమార్ పాల్గొన్నారు.

నయనమనోహరం సలాన్ ఛాయాచిత్ర ప్రపంచం



అత్యుతమ ఛాయాచిత్రాలు ఇవే





బనశంకరి: కెమెరాల్లో బంధించిన అద్భుత ఛాయా చిత్రాలు ఉద్యాననగరివాసులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. చిత్రకళాపరిషత్‌లో ఏర్పాటు చేసిన యూత్ ఫొటోగ్రాఫిక్ బెంగళూరు, అంతర్జాతీయ సలాన్ -2024 ఛాయాచిత్ర ప్రదర్శన నగరవాసులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లింది. కలర్, మోనోక్రోమ్, నేచర్, ట్రావెల్ విభాగంలో విజేతలకు అవార్డులు వితరణచేసి సన్మానించారు. కార్యక్రమంలో వైపీఎస్ అధ్యక్షుడు మంజువికాస్‌శాస్త్రి, ఉపాధ్యక్షుడు గిరీశ్‌అనంతమూర్తి, రాజారామ్, కార్యదర్శి ప్రేమకాకడే పాల్గొన్నారు.

మొక్కలు నాటితే అధిక ఉష్ణోగ్రతలకు చెక్

బనశంకరి: ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుదల మానవాళి మనుగడకు సవాల్‌గా మారాయని, ఈ క్రమంలో పరిసరాల సంరక్షణతో మాత్రమే సమస్తజీవుల జీవితం సాఫీగా కొనసాగుతుందని రాష్ట్ర అటవీ పరిసరాల శాఖ మంత్రి ఈశ్వర్‌ఖండ్రే తెలిపారు. బంట్వాళ తాలూకా ఆలంపుని సాలుమరదతిమ్మక్క సస్యోద్యానంలో శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామాభివృద్ధి పథకం అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. కొన్నినెలలుగా ప్రపంచవ్యాప్తంగా మండుటెండలతో ప్రజలు అల్లాడిపోయారని తెలిపారు. వేసవితాపానికి దేశంలో పదివేలమందికిపైగా మృత్యువాత పడ్డారన్నారు. ఉష్ణోగ్రతల నియంత్రణకు వృక్షసంరక్షణ పరిష్కారమన్నారు. అభివృద్ధితోపాటు నీరు, ప్రాణులు, వనసంరక్షణ సుస్థిర అభివృద్ధి మన సంకల్పం కావాలన్నారు.

వైభవంగా మహిమోత్సవాలు



ప్రత్యేక పూజ చేస్తున్న సుబుదేంద్ర తీర్థులు



క్షీరాభిషేకం చేస్తున్న సుబుదేంద్ర తీర్థులు

రాయచూరు రూరల్: మంత్రాలయంలో బుధవారం విజయేంద్ర మహిమోత్సవాలు వైభవంగా ముగిశాయి.

మంత్రాలయ రాఘవేంద్ర స్వాముల మఠంలో మూల విరాట్ కు పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగల్ గంధం పూసి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ వేడుకల్లో వందలాది భక్తుల సమక్షంలో రథోత్సవం జరిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: సీఎం

శివాజీనగర: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని ప్రేమించి కాపాడాలి. ఇదేమి కష్టంతో కూడిన పనేమి కాదు. అయితే అందరూ మనసు పెట్టి చేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. బుధవారం నగరంలో కంఠీరవ క్రీడామైదానంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినాచరణలో ఆయన పాల్గొన్నారు. వన మహోత్సవం, పర్యావరణ పురస్కారాలను ప్రదానం చేశారు. పరిశుభ్రత, వర్షం నీరు నిల్వ తదితర పద్ధతులను అలవరచుకోవాలి. దీనిద్వారా పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి అనుకూలమవుందని అన్నారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణ వల్ల లాభాలేమిటి? పరిసరాలు, అడవి, ప్రజా జీవితం, ప్రాణుల గురించి తెలుసుకోవాలి. మనుషులు బతికినట్లే వివిధ ప్రాణులకు కూడా బతికే హక్కు ఉంది. దానిని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. శుద్ధమైన తాగునీరు సరఫరా ప్రభుత్వ బాధ్యత. ఇటీవల కలుషితమైన నీటితో అయ్యే ప్రమాదాలను తాము చూశాం. అనేకమంది మృతి చెందగా, కొందరు రోగానబారిన పడ్డారని సీఎం తెలిపారు. ఇటీవల డెంగ్యూ కేసులు అధికమవుతున్నాయి. దీని నియంత్రణకు నగర పాలికె, ఆరోగ్య శాఖ, పురపాలక శాఖలు కలసికట్టుగా పని చేస్తున్నాయి. ప్రజలు కూడా చేతులు జోడిస్తే డెంగీ వంటి జబ్బుల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు.

జంట హత్యల కేసులో నిందితుల అరెస్టు






పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

మాలూరు: తాలూకాలోని సంపంగెరె వద్ద ఉన్న యధుగిరి వైన్స్ స్టోర్ వద్ద గత నెల 28వ తేదీన జరిగిన జంట హత్యల కేసులో పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఘటనకు సంబంధించి పోలీసులు తమిళనాడులోని ధర్మపురి జిల్లా పాలకోడ్ తాలూకా మూరాండహళ్లి గ్రామానికి చెందిన తమిళ అరసు సీను(27), మణి మాతెయాన్‌లను(26) అరెస్టు చేశారు. వారు తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా హోసూరు తాలూకా చూడాపుర గ్రామానికి చెందిన మణి (30), అదే గ్రామానికి చెందిన ముత్తురాజ్ (27)లను హత్య చేసి పరారయ్యారు. బార్ వద్ద మద్యం తాగడానికి వచ్చినప్పుడు పాత కక్షల నేపథ్యంలో ఈ హత్యలు జరిగాయి. కేసు నమోదు చేసుకున్న మాలూరు పోలీసులు బార్ వద్ద సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా నిందితులను పసిగట్టి అరెస్టు చేసి జుడీషియల్ కస్టడీకి తరలించారు.

భారీగా చోరీ సొత్తు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగలు

శివమొగ్గ: శివమొగ్గ బాపూజీనగరలోని మహిళ ఇంటిలో బంగారు ఆభరణాలను దొంగతనం చేసిన ముగ్గురు నిందితులు పట్టుబడ్డారు. చిక్కల్ మహ్మద్ రఫీక్ అలియాస్ కాణ (24), బాపూజీనగర ఆతావుల్లా (29), రూమన్ ఖురేషీ (20)అనే నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 15,40,500 విలువ కలిగిన 237 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 50వేల విలువ చేసే బైక్‌తో కలుపుకుని మొత్తం రూ. 15,90,500 సొత్తును స్వాధీనం చేసుకున్నారు. జూన్ 29న రాత్రి ఈ దొంగతనం జరిగింది. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోటె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

రాయచూరు రూరల్ : బడుగు, దళిత వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మైసూరు ఉరిలింగ పెద్ది మఠాధిపతి జ్ఞానప్రకాష్ స్వామీజీ అభిప్రాయపడ్డారు. మంగళవారం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ జయంతిని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ప్రపంచ మేధావుల్లో ఒకరైన అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరం కృషి చేయాలన్నారు.

కోలారు వార్తలు...

సమస్యలపై సత్వరం స్పందించండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపా

కేజీఎఫ్: రైతులు, పేదలు, అమాయకులను కార్యాలయాల చుట్టూ అనవసరంగా తిప్పుకోవడం మాని వారి పనులను వెంటనే చేసివ్వాలని ఎమ్మెల్యే రూపా శశిధర్ అధికారులకు సూచించారు. బుధవారం నగరంలోని తాలూకా కార్యాలయ భవనం ముందు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన తాలూకా స్థాయి జనస్పందన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అధికారుల కార్యవైఖరి వేగవంతమైనప్పుడే ప్రజల పనులు చక్కబడతాయన్నారు. కొంతమంది చేసే చిన్న చిన్న తప్పుల వల్ల శాఖ మొత్తం తలదించుకునే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అందువల్ల అధికారులు ప్రజా సమస్యల పరిష్కార విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. రాబోయే రోజుల్లో ఫిర్కా స్థాయిలో, క్యాసంబళ్లి, బేతమంగలలో కూడా జనస్పందన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ సౌకర్యాలను ప్రజల ముంగిటకు చేర్చడంలో అధికారులు, సిబ్బంది ప్రముఖ పాత్ర వహించాలన్నారు. ఉప విభాగాధికారి డాక్టర్ మైత్రి, ఎస్పీ శాంతరాజు, తహసీల్దార్ నాగవేణి, ఈఓ మంజునాథ్ హర్తి, డీఎస్పీ పాండురంగ, నగరాభివృద్ధి ప్రాధికార కమిషనర్ ధర్మేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాల్ట్ పాలు తాగి విద్యార్థులకు అస్వస్థత

- పాఠశాలలో అధికారుల తనిఖీ



విద్యార్థులకు అందించిన మాల్ట్ పాడిని పరిశీలిస్తున్న అధికారులు

కోలారు: మాల్ట్ కలిపిన పాలను తాగి విద్యార్థులు అస్వస్థులై ఆస్పత్రిలో చికిత్స పొందిన ఘటన ముళబాగిలు తాలూకా అంగొండహళ్లి ప్రభుత్వ హైస్కూల్‌లో చోటు చేసుకుంది. ఉదయం మాల్ట్ మిశ్రిత పాలు తాగిన విద్యార్థుల్లో 19 మంది విద్యార్థులకు అలర్జీ, దురద, ఒంటిపై చిన్న చిన్న దద్దుర్లు లేవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందారు. వెంటనే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో హుటాహుటిన పాఠశాల వద్ద వైద్య బృందంతో చేరుకున్న అధికారులు విద్యార్థులకు చికిత్స అందించారు. ఓ విద్యార్థిని ముళబాగిలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. విద్యార్థులు అందరూ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు, అధికారులు తెలిపారు. పాఠశాల వద్దకు బీఈఓ గంగరామయ్య, టీహెచ్‌ఓ డాక్టర్ సుగుణ వెళ్లి పరిశీలించారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం : తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తామని ఎమ్మెల్యే జీకే వెంకట శివారెడ్డి తెలిపారు. బుధవారం తాలూకాలోని లక్ష్మీసాగర జీపీలోని బీరగానహళ్లిలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.63 లక్షల వ్యయంతో నిర్మించే ఓవర్ హెడ్‌ట్యాంకు నిర్మాణ పనులను ప్రారంభించి ఆయన మాట్లాడారు. తాగునీటి సమస్య నుంచి ప్రజలను దూరం చేయడానికి ప్రభుత్వం తెచ్చిన పథకం జల జీవన్ మిషన్ అన్నారు. కాంట్రాక్టర్లు పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా కొనసాగించాలన్నారు. నిర్ణీత సమయంలోగా పనులు పూర్తి చేయాలన్నారు. నియోజవర్గంలో ఎక్కడ తాగునీటి సమస్య ఉన్నా వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. కాంట్రాక్టర్ నంజుండేగౌడ, పీడీఓ మంజునాథ్, బీకే సురేష్, అంజప్ప, రామప్ప, వెంకటేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10న రెడ్డి విద్యార్థులకు పురస్కారాలు

బళ్లారి రూరల్: బళ్లారి, విజయనగర జిల్లాల్లో రెడ్డి వర్గానికి చెందిన ఎస్‌ఎస్‌ఎల్‌సీ, పీయూసీలో 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈనెల 10న పురస్కారాలు అందజేయనున్నట్లు కర్ణాటక రెడ్డి జన సంఘం సంచాలకుడు గణపాల ఐనాథరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన రెడ్డి విద్యార్థులు తమ మార్కుల జాబితా, కులధృవీకరణ పత్రాలను ఈ నెల 7వ తేదీలోపు వాట్సాప్ నంబర్-9448147611కు పంపాలని తెలిపారు. బళ్లారి బలిజ కళ్యాణ మండపంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు, రెడ్డి వర్గ విశ్రాంత ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు తమ వివరాలను వాట్సాప్ నంబర్-9448080399కు పంపాలని తెలిపారు. సన్మాన కార్యక్రమంలో బళ్లారి రెడ్డి జన సంఘం అధ్యక్షుడు నాగరాజరెడ్డి, కార్యదర్శి శివలింగారెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

కోచిముల్ అధ్యక్ష పీఠం తృప్తికరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: ఎమ్మెల్యేగా కాకుండా కోచిముల్ అధ్యక్షుడిగా విధి నిర్వహణ తనకెంతో తృప్తినిచ్చిందని ఎమ్మెల్యే, కోచిముల్ అధ్యక్షుడు కెవై నంజేగౌడ తెలిపారు. బుధవారం పట్టణంలోని కోచిముల్ కార్యాలయంలో నిర్వహించిన క్షీర సమృద్ధి ఉత్సవ- 2024ను ప్రారంభించి ఆయన మాట్లాడారు. జిల్లాలోని పాడి రైతుల విశ్వాసాన్ని చూరగొన్నామన్నారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ఉనికి కోసం ఎంతో శ్రమించినట్లు తెలిపారు. జిల్లాలో ప్రతినిత్యం 12.80 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి అవుతోందన్నారు. తన ఆరేళ్ల అధ్యక్ష అవధిలో కోచిముల్ అభివృద్ధి కోసం ఎంతో శ్రమించానన్నారు. అధ్యక్షుడిగా పాడి రైతుల సమస్యల పరిష్కారానికి ప్రామాణికంగా కృషి చేశానన్నారు. చిక్కబళ్లాపురలో రూ.200 కోట్ల వ్యయంతో మెగా డెయిరీని నిర్మించామన్నారు. కోలారులో ఎంవీ కృష్ణప్ప పేరు మీద నూతనంగా మెగా డెయిరీని రూ.225 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామన్నారు. జిల్లాలో దాదాపు అన్ని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల్లోను బీఎంసీ కేంద్రాలను నెలకొల్పామన్నారు. కోలారులో రూ.75 కోట్ల వ్యయంతో ఐస్‌క్రీం ప్లాంట్ నిర్మాణ దశలో ఉందన్నారు. డైరెక్టర్ కాంతమ్మ, అంజని సోమణ్ణ, ఎన్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 18న కవయిత్రుల సమ్మేళనం

బనశంకరి: స్వాతంత్ర్య దినాన్ని పురస్కరించుకుని కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య, మన తెలుగు తేజం చానల్, ఇండో ఏషియన్ అకాడమీ విద్యా సంస్థల నేతృత్వంలో ఆగస్టు 18న కవిసమ్మేళనం-2024 నిర్వహించనున్నట్లు సమాఖ్య చైర్మన్ డాక్టర్ మల్యాద్రి బొగ్గవరపు తెలిపారు. 76 మంది కవయిత్రులతో నిర్వహించే సమ్మేళనంలో పాల్గొనే వారు ఈనెల 20 తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9538400022, 9844207230 నంబర్లలో సంప్రదించాలని ప్రధాన కార్యదర్శి డాక్టర్ నరేంద్రబాబు సింగూరు తెలియజేశారు. దేశంలో ఏ భాషకు సంబంధించిన కవయిత్రులైనా సమ్మేళనంలో పాల్గొనవచ్చునని అధ్యక్షుడు మరంగంటిశ్రీనివాస్ తెలిపారు.

ఆక్రమణలు తొలగించరూ



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు బుధవారం ఆక్రమిత స్థలం వద్ద ధర్నా చేసి తాలూకా యంత్రాగానికి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనకారులు మాట్లాడుతూ ఈనెల 15 లోగా కాలు దారి సమస్యను పరిష్కరించకుంటే వందలాది ట్రాక్టర్లతో బేతమంగల బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ముందు బృహత్ ధర్నా చేపడతామని హెచ్చరించారు. కాలు దారిని పలువురు ఆక్రమించుకోవడం వల్ల రైతులు తమ పంట పొలాల వద్దకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పొలాల్లో పనులు చేసుకోలేక పంటలు నష్టపోతున్నారన్నారు. స్థలాన్ని సర్వే చేసి వెంటనే ఆక్రమణలను తొలగించాలని, లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ, మరగల్ శ్రీనివాస్, రామసాగర వేణు, సురేష్‌బాబు, ఈకంబళ్లి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శనేశ్వరస్వామి కుంభాభిషేకం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కోలారు: అరాభికొత్తనూరు గ్రామంలో గేట్ వద్ద ఉన్న శ్రీశనేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధార మహోత్సవంలో భాగంగా బుధవారం స్వామివారికి కుంభాభిషేకాన్ని అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, నవగ్రహ హోమం, ప్రధాన హోమం, కళా హోమం తదితర పూజలను చేశారు. మహోత్సవంలో భాగంగా అన్నదాసోహం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ డాక్యుమెంట్లు ఇళ్లలో ఉంటే క్రిమినల్ కేసులు




అధికారులతో సమావేశమై మాట్లాడుతున్న టీబీ జయచంద్ర

తుమకూరు: అధికారులు ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ప్రభుత్వ డాక్యుమెంట్లను ఇళ్లలో పెట్టుకుంటే క్రిమినల్ కేసులు దాఖలు చేస్తామని జిల్లా అధికారులకు ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి టీబీ జయచంద్ర హెచ్చరించారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆయన సిరా తాలూకా అధికారులతో సమీక్ష నిర్వహించారు. శిరా తాలూకాలో ఇటీవల జరిగిన జనస్పందన కార్యక్రమంలో వచ్చిన కొన్ని దరఖాస్తులను, అవసరమైన డాక్యుమెంట్లను తహసీల్దార్లు తమ వద్ద పెట్టుకున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయని చెప్పారు. ప్రభుత్వ పత్రాలను ఇళ్లల్లో పెట్టుకుని ప్రజల సమస్యలను పరిష్కరించని అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. జనస్పందన కార్యక్రమంలో అధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫిర్యాదులే అందాయన్నారు.

సెక్యూరిటీ గార్డు హత్య

దొడ్డబళ్లాపురం: సెక్యూరిటీ గార్డు హత్యకు గురైన ఘటన బెంగళూరు అమృతహళ్లిలో చోటుచేసుకుంది. అమృతహళ్లిలోని సింధి కాలేజీలో జైకిసాన్ రాయ్ అనే వ్యక్తి సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇదే కళాశాలకు చెందిన భార్గవ అనే విద్యార్థి జై కిసాన్ రాయ్‌ని కత్తితో పొడిచి హత్య చేశాడు. అమృతహళ్లి పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. హత్యకు దారితీసిన కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



మోపెడ్‌ను కారు ఢీకొన్న దృశ్యం

దొడ్డబళ్లాపురం: మోపెడ్‌ని కారు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన దొడ్డబెళవంగల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నార్లళికి చెందిన మాళప్ప(80) మోపెడ్‌పై వెళ్తూ దొడ్డబళ్లాపురం–దాబస్‌పేట జాతీయ రహదారిలోని రామేశ్వర గేట్ వద్ద హఠాత్తుగా యూటర్న్ తీసుకుని హైవేపైకి అడ్డంగా వచ్చాడు. ఆ సమయంలో వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో మాళప్ప అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద దృశ్యం సీసీ కెమెరాలో రికార్డయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రైల్వే స్టేషన్ వద్ద బాలిక హత్య

శివాజీనగర: దుండగులు ఓ బాలికను హత్యచేసి మెజిస్టిక్ క్రాంతివీర సంగొళ్లి రాయణ్ణ రైల్వే స్టేషన్ పార్కింగ్ ఏరియాలో పడేశారు. ఈ ఘటన బుధవారం ఉదయం వెలుగు చూసింది. బాలిక మృతదేహాన్ని గమనించిన క్యాషియర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు వేలిముద్ర నిపుణులతో వచ్చి పరిశీలించారు. బాలిక వయస్సు 5–6 సంవత్సరాలు ఉంటుందని నిర్ధారించారు. మృతురాలు ఎవరనేది తెలియరాలేదు. బాలిక భిక్షాటనలో నిమగ్నమైన విషయాన్ని స్థానికుడు పోలీసులకు తెలియజేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. బెంగళూరు సెంట్రల్ రైల్వే పోలీస్‌లు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్పీ డాక్టర్ సౌమ్యలత ఎస్.కే. తెలిపారు.

బీజేపీ సంచాలకుడిగా నియామకం



నియామకపత్రం అందజేస్తున్న విజయేంద్ర

మండ్య: బీజేపీ వివిధ భాషల రాష్ట్ర సంచాలకుడిగా ఎస్‌కే ఆర్ముగం కిశోర్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర ఆదేశాలు జారీ చేశారు. ఎస్‌కే ఆర్ముగం కిశోర్ శ్రీరంగపట్టణ పురసభకు రెండు సార్లు సభ్యుడిగా ఎన్నికయ్యారు. గంజాంన శ్రీ నిమిషాంబ ఆలయ వ్యవస్థానక సమితి సభ్యుడిగా పని చేశారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.

ఐటీసీ ఫ్యాక్టరీ ఉద్యోగి హత్య

శివాజీనగర: ఐటీసీ ఫ్యాక్టరీ ఉద్యోగి తన ఇంటి సమీపంలోనే దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన పులికేశీనగర కాక్స్‌టౌన్ సమీపంలో బుధవారం జరిగింది. కాక్స్‌టౌన్ దొడ్డగుంట సమీపంలోని బాణసవాడికి చెందిన అజిత్ (35) ఐటీసీ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటి సమీపంలోకి రాగానే దుండగులు మారణాయుధాలతో దాడి చేసి కిరాతకంగా హత్య చేశారు. పులికేశీనగర పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. వడ్డీ డబ్బుల విషయంపై గతంలో అజిత్ కొందరితో గొడవ పడ్డాడు. వారు పగ పెంచుకొని అజిత్‌ను హత్య చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కృష్ణరాజ సాగర.. ట్రయల్ బ్లాస్ట్ జరిపేరా?

- చకచకా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- పేలుళ్లు వద్దంటున్న రైతు సంఘాలు



కావేరి నదిపై ప్రధానమైన జలాశయంగా ఉన్న కేఆర్ఎస్



గనుల వల్ల డ్యాం బీటలు వారుతోందని ఆరోపణలున్నాయి

మండ్య: మండ్య జిల్లాలో కృష్ణరాజ సాగర జలాశయం పరిసరాల్లో ట్రయల్ బ్లాస్ట్ జరపాలని జలవనరులు, గనుల శాఖ అధికారులు పట్టుదలగా ఉన్నారు. ప్రజా, రైతు సంఘాలు వ్యతిరేకిస్తున్నా కూడా పేలుళ్లను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ బ్లాస్ట్‌పై ఈ నెల 5న హైకోర్టు ఇచ్చే తీర్పు ప్రకారం నడుచుకుంటామని చెప్పిన జలవనరుల శాఖ అధికారులు, పేలుళ్లకు ఏర్పాట్లు చేసుకుంటూ పోవడం గమనార్హం. రాత్రికి రాత్రి పోలీసు బందోబస్తు మధ్య మందుగుండు పెట్టేందుకు రంధ్రాలు వేసే పనులు సాగించారు.

బేబీ బెట్టలో పేలుడు పనులు

పాండవపుర తాలూకా బేబీ బెట్ట పరిధిలోని గనుల ప్రాంతంలో పరీక్షల కోసం పేలుడు పదార్థాలు ఉంచేందుకు రంధ్రాలను తవ్వుతున్నారు. అయితే ఈ ట్రయల్ బ్లాస్ట్ వ్యవహారాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మంగళవారం కేఆర్ఎస్ ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట రైతు సంఘం, వివిధ సంఘాలు ఆందోళన కూడా నిర్వహించాయి. ఈ క్రమంలో హైకోర్టు ఆదేశాలు వచ్చే వరకు ఎలాంటి బ్లాస్ట్ నిర్వహించబోమని జలవనరుల శాఖ ఇంజినీర్ రఘురామ్ ఇచ్చిన హామీ మేరకు ఆందోళనను విరమించారు. అయితే ఆ హామీని తుంగలో తొక్కుతూ రాజకీయ నేతలు, గనుల యజమానుల ఒత్తిడి మేరకు రాత్రికి రాత్రి బ్లాస్ట్ కోసం ఏర్పాట్లను చకాచకా చేస్తున్నారని రైతు నేతలు ఆరోపిస్తున్నారు. ఈ పనులకు పోలీసులు బందోబస్తుగా ఉన్నారు. ఈ విషయం తెలిసిన రైతు సంఘం నాయకులు బుధవారం ఉదయం కేఆర్ఎస్ వద్ద గుమిగూడి గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. గనుల అధికారులు రంధ్రాలు చేస్తున్న విషయం తమకు తెలియదని, కోర్టు ఉత్తర్వుల కోసం వేచి చూస్తున్నామని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

ట్రయల్ బ్లాస్ట్ ఎందుకు?

కృష్ణరాజ సాగర డ్యాంను మైసూరు మహారాజు 4వ క్రిష్ణరాజ ఒడెయర్ ఆదేశాల మేరకు ప్రఖ్యాత ఇంజినీరు మోక్షగుండం విశ్వేశ్వరాయ, ఇతర నిపుణుల బృందం పదేళ్లకు పైగా శ్రమించి 1934లో నిర్మాణం పూర్తి చేశారు. ఈ ప్రాంతాన్ని పీడిస్తున్న కరువును ఎదుర్కోవడానికి డ్యాంను నిర్మించారు. అప్పటి నుంచి కావేరి నది నీటిని సద్వినియోగం చేసుకోవడం సాధ్యమైంది. అయితే డ్యాం చుట్టుపక్కల సుదీర్ఘకాలం నుంచి రాతి, ఇతరత్రా గనుల తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ గనుల్లో పేలుళ్లు జరుపుతూ ఉంటారు. ఆ పేలుళ్ల ప్రకంపనలు రావడం, అలాగే రాతి శిథిలాలు కావేరి నదిలో కలుస్తూ ఉంటాయి. దీని వల్ల ఈ ప్రాంతంలో జీవనాడిగా పేరున్న కేఆర్ఎస్ డ్యాంకు పగుళ్లు వస్తున్నాయని, డ్యాం ఎక్కువకాలం మనుగడ సాగించలేదని గతంలో పలువురు పర్యావరణవాదులు, రాజకీయ నేతలు ఆందోళన వ్యక్తంచేశారు. గనులను మూసివేయించాలని కొందరు హైకోర్టులో పిటిషన్లు వేశారు. విచారించిన న్యాయస్థానం.. గనుల పేలుళ్ల ప్రభావం డ్యాం మీద ఎలా ఉంటుందో అధ్యయనం చేయాలి. ఇందుకోసం డ్యాంకు 20 కిలోమీటర్ల దూరంగా విస్ఫోటాలు జరిపి నిపుణులు దానిని పరిశీలించి నివేదిక ఇవ్వాలి అని ఆదేశించింది. ఈ నేపథ్యంలో గత ఆరు నెలల నుంచి ట్రయల్ బ్లాస్ట్‌కు అధికారులు ఏర్పాట్లు చేస్తుండగా, రైతు సంఘాలు మాత్రం వద్దని చెబుతున్నాయి. ట్రయల్ బ్లాస్ట్ వల్ల డ్యాంకు ముప్పు ఏర్పడవచ్చని చెబుతున్నారు. పేలుళ్లు దూరంగా జరుపుతామని, డ్యాంకు ఇబ్బంది లేదని అధికారులు తెలిపారు.



కేఆర్ఎస్ చుట్టుపక్కల సాగుతున్న గనులు



ప్రయోగాత్మక పేలుళ్లపై ఇప్పుడు అందరి దృష్టి

డెంగీ నిర్ధారణ పరీక్షకు ఒకే ధర

- మంత్రి దినేశ్ గుండూరావు

శివాజీనగర: డెంగీ నిర్ధారణకు అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఒకే ధర వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు ఆరోగ్య అధికారులకు సూచించారు. బుధవారం ఆయన అధికారులతో సమావేశమై మాట్లాడారు. రాష్ట్రంలో గత ఏడాదితో పోలిస్తే ఈసారి డెంగీ కేసుల పరీక్షలు 42 శాతం పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెంగీ పరీక్షకు రోగులనుంచి ఒకే ధర వసూలు చేయాలని గురువారం అధికారిక ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు డెంగీ పాజిటివ్ కేసుల గురించి ప్రభుత్వానికి సమాచారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిమ్ రిసెప్షనిస్ట్ ఆత్మహత్య

- పెద్దలు నిర్ణయించిన వివాహం ఇష్టం లేకనే?



శ్రావణి(ఫైల్)

దొడ్డబళ్లాపురం: జిమ్‌లో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తున్న యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బాగలకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దావణగెరెకి చెందిన మల్లనగౌడ, జ్యోతి దంపతుల కుమార్తె శ్రావణి(22) దాసరహళ్లిలో ఉంటూ బాగలకుంట పరిధిలోని గోల్డెన్ జిమ్‌లో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తోంది. సోమవారం ఉదయం రోజులాగే పనికి వెళ్లిన శ్రావణి హఠాత్తుగా కూర్చున్న చోటే వాంతులు చేసుకుని అస్వస్థతకు గురై కుప్పకూలింది. జిమ్ సిబ్బంది ఆమెను ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. శ్రావణికి తల్లిదండ్రులు వివాహం నిశ్చయించారు. అయితే ఆమె శంకర్ అనే యువకుడిని ప్రేమిస్తోందని సమాచారం. శ్రావణిని పెళ్లికి ఒప్పించాలని తల్లితండ్రులు ఇటీవల బెంగళూరు వచ్చారు. అయితే వివాహం చేసుకోవడానికి ఇష్టం లేని శ్రావణి చివరిసారిగా ప్రియుడికి ఫోన్ చేసి విషయం చెప్పింది. అప్పటికే ఆమె విషం తాగింది. కేసు దర్యాప్తులో ఉంది.

రాజకీయ దురుద్దేశంతోనే ఆరోపణలు

మైసూరు: మైసూరు నగరాభివృద్ధి ప్రాధికారలో జరిగిన 50:50 కుంభకోణానికి తనకు ఎలాంటి సంబంధం లేదని ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్ర సిద్దరామయ్య తెలిపారు. మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ముడాలో జరిగిన స్థలాల పంపిణీ కుంభకోణంలో రాజకీయ దురుద్దేశం ఉందని, అందుకే తన పేరును లేవనెత్తుతున్నారని తెలిపారు. కేసు గురించి ఇటీవల మంత్రులు స్పష్టత ఇచ్చారని తెలిపారు. ముడా కమిషనర్‌ను బదిలీ చేశానని చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదన్నారు. తన పరువుకు భంగం కలిగించేందుకు ఇలా ప్రవర్తించడం సరికాదన్నారు.

మైమూల్ అధ్యక్షుడు ప్రసన్న రాజీనామా

- మంత్రి వెంకటేశ్ వేధింపులే కారణమని ఆరోపణ

మైసూరు: మైసూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ఒక్కూట (మైమూల్) అధ్యక్షుడు పీఎం ప్రసన్న తన పదవికి రాజీనామా చేశారు. పశు సంవర్ధకశాఖ మంత్రి కె.వెంకటేశ్ వేధింపులతోనే ప్రసన్న రాజీనామా చేసినట్లు చెబుతున్నారు. పిరియాపట్టణ జేడీఎస్ మాజీ ఎమ్మెల్యే కె.మహదేవ్ కుమారుడైన పీఎం ప్రసన్న 2021లో మైమూల్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జేడీఎస్ కోర్‌కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జీటీ దేవెగౌడ మద్దతుతో రెండో సారి కూడా మైమూల్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జేడీఎస్ ముఖ్య నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని వేధిస్తోందని, సీఎంకు ఆయన సొంత జిల్లా మైసూరులో ప్రతి ఎన్నికల్లోనూ ఎదురుదెబ్బ తగులుతోందని, దీంతో జీటీ దేవెగౌడ వర్గాన్ని రాజకీయంగా దెబ్బతీయాలనే ప్రయత్నాలు సాగుతున్నాయని ప్రసన్న ఆరోపించారు. ఇందులో భాగంగా ఎండీసీసీ బ్యాంకు ఎన్నికలను కూడా ప్రభుత్వం వాయిదా వేసిందన్నారు. జీటీ దేవెగౌడ కుమారుడు, ఎమ్మెల్యే హరీశ్ గౌడను అపెక్స్ బ్యాంకు ఉపాధ్యక్ష స్థానం నుంచి తప్పించారని ఆరోపించారు. అనంతరం మైమూల్‌ను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నాలు ప్రారంభమయ్యాయయన్నారు. ఇందుకోసం మంత్రి వెంకటేశ్‌ను సిద్ధరామయ్య రంగంలోకి దించారని ఆరోపించారు. మైమూల్ ఇతర సభ్యులను బెదిరిస్తున్నారని, దీనికి తోడు ఆరు నెలల్లో 24 పర్యాయాలు తనకు నోటీసులు ఇస్తూ వేధిస్తున్నారని అందుకే రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

ముడా అతి పెద్ద స్కాం: విజయేంద్ర

శివాజీనగర: మైసూరు ముడా అక్రమాల కేసులో సమగ్ర తనిఖీ జరగాలి. ఇది బీజేపీకి తిరుగుబాణం అయినా కూడా ఎదుర్కోవటానికి తాము సిద్ధంగా ఉన్నామని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు బీ.వై. విజయేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం బెంగళూరు శివానంద సర్కిల్ సమీపంలో ఉన్న తన ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడిన ఆయన, ముడా అక్రమాలు అతిపెద్ద స్కాం. మంత్రి భైరతి సురేశ్ సీఎంకు అత్యంత సన్నిహితునిగా ఉన్నారు. మొండి కాంగ్రెస్ ప్రభుత్వం రంగు బయటపడింది. రోజుకో అక్రమాలు బయటికి వస్తున్నాయి. ముఖ్యమంత్రి సొంత జిల్లా మైసూరు ముడాలో ఆయన దృష్టికి రాకుండా అంత పెద్ద అక్రమాలు జరిగేందుకు ఎలా సాధ్యం. ముఖ్యమంత్రి సతీమణికి 15 ఇంటి స్థలాలను ఇచ్చారు. మంత్రి భైరతి సురేశ్ మైసూరుకు వెళ్లి అధికారులను బదిలీ చేసి, అక్రమాలకు సంబంధించిన ఫైళ్లను బెంగళూరుకు తీసుకొచ్చారు. ఈ అక్రమాలను మూసివేసేందుకు పూర్తిగా ప్రయత్నం జరిగిందని ఆయన ఆరోపించారు.


సౌలభ్యాలను రైతులు వినియోగించుకోవాలి



పంపు మోటర్లను వితరణ చేస్తున్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: ప్రభుత్వం అందించే సౌలభ్యాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ పిలుపునిచ్చారు. అంబేడ్కర్ కార్పొరేషన్ నుంచి 2021–22 సంవత్సరపు నిధులతో ఎస్టీ వర్గాల రైతులకు బుధవారం పట్టణ సమీపంలోని సమానతా సౌధ సమీపంలో పంపు, మోటార్లను వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, మంచి దిగుబడులు సాధించడంలో కృషి చేయాలన్నారు. అనంతరం వీరమ్మనహళ్లిలో పాల ఉత్పాదక మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. నామగొండ్లు గ్రామంలో పశు వైద్య ఆస్పత్రి నూతన భవనాన్ని ప్రారంభించారు. నేతాజీ క్రీడా మైదానంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణ పనులను నాణ్యతను పరిశీలించారు.

రూ. కోట్ల విలువైన స్థలం కబ్జా?



విడుదల చేసిన రికార్డుల కాపీలు

మైసూరు: మైసూరు పాలికె అధికారులు భూదోపిడీదారులతో చేతులు కలిపి అక్రమాలకు పాల్పడిన ఘటన బయటపడింది. మైసూరు మహానగర పాలికెకు చెందిన కోట్లాది రూపాయల విలువ చేసే ఆస్తికి నకిలీ ధ్రువీకరణ పత్రాలను సృష్టించి ప్రైవేటు వ్యక్తులు అక్రమంగా ఆ స్థలాన్ని సొంతం చేసుకున్న ఘటన వెలుగు చూసింది. ఆర్‌టీఐ కార్యకర్త బీఎన్ నాగేంద్ర సాక్ష్యాలతో సహా ఈ అక్రమాన్ని బహిర్గతం చేశారు. వివరాలు.. మురుగునీటి శుద్ధీకరణ కేంద్రం స్థాపించే ఉద్దేశంతో పాలికె సర్వే నంబర్ 501/1 నుంచి 501/8 వరకు స్థలాన్ని 1997–98లో స్థలాన్ని స్వాధీనం చేసుకుని సంబంధిత యజమానికి పరిహారాన్ని కూడా పాలికె చెల్లించింది. స్వాధీనం చేసుకున్న స్థలంలో సర్వే నంబర్ 501/7లో సుమారు ఎకరన్నకు పైగా స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు నకిలీ ధ్రువీకరణ పత్రాలను సృష్టించి మళ్లీ సొంతం చేసుకున్నారు. పాలికెలోని ఏడుమంది అధికారులు ఈ కుట్రలో భాగం అయ్యారు. తమ అక్రమాలను వెలుగులోకి రాకుండా చేయడానికి సర్వే నంబర్ 504/3 స్థలంలో ప్రైవేటు వ్యక్తులు కొబ్బరి చెట్లను కొట్టివేశారని ఆరోపిస్తూ అధికారులు ఎన్ఆర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తక్షణమే అక్రమ ఖాతా కలిగిన సర్వే నంబర్ 501/7ను రద్దు చేసి, ఏడుగురు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డెంగీపై విద్యార్థులకు అవగాహన

కృష్ణరాజపురం: విద్యార్థులకు డెంగీ జ్వరంపై అవగాహన కల్పించాలని బీబీఎంపీ ఆరోగ్య పరిశీలకుడు రాఘవేంద్ర సూచించారు. బీబీఎంపీ మహదేవపుర జోన్ కృష్ణరాజపుర నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బసవనపుర వార్డులో ఉన్న ఎయిడెడ్ పాఠశాలలో విద్యార్థులకు డెంగీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల శుభ్రత పాటించాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వినియోగించాలని, చేతుల శుభ్రత పాటించాలని సూచించారు. హెచ్ఎం నారాయణస్వామి, పీఈటీ రంగయ్య, కేఆర్ పుర పీహెచ్‌సీ అధికారి శ్రీశైల కన్నాళ్ పాల్గొన్నారు.

దివంగత రెవరెండ్ దివాకర్ సేవలు మరువలేనివి



దివంగత రెవరెండ్ డాక్టర్ ఎం.బి.దివాకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

శివాజీనగర: కర్ణాటకలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో కూడా క్రైస్తవ సంఘాల అభివృద్ధికి దైవజనుడు దివంగత రెవరెండ్ డాక్టర్ ఎం.బి.దివాకర్ కృషి చేశారని పలు చర్చిల పాస్టర్లు కొనియాడారు. దివాకర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని మిల్లర్స్ రోడ్డు యునైటెడ్ థియోలాజికల్ కాలేజీ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చర్చిల పాస్టర్లు పాల్గొని మాట్లాడారు. సమాజానికి తమవంతుగా ఏం చేశామన్నది మనిషి గతించినా జ్ఞాపకం చేసుకునేలా ఉండాలన్నారు. కాకినాడకు చెందిన రెవరెండ్ టి.పొన్నయ్య మాట్లాడుతూ క్రైస్తవ సంఘాల అభివృద్ధికి దివాకర్ తన జీవితాన్ని ధారపోశారన్నారు. కార్యక్రమంలో ఐబీఎస్ చైర్మన్ రెవరెండ్ ఏ.జాకబ్, డైరెక్టర్ రెవరెండ్ సుబ్బారావు, కేబీఎస్ఎస్ అధ్యక్షుడు రెవరెండ్ మణివణ్ణన్, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ ఎం.డానియెల్, కోశాధికారి రెవరెండ్ రాజరత్నం, రెవరెండ్ కందల జోసెఫ్, రెవరెండ్ వినయ్‌కుమార్, రెవరెండ్ కాళ్వదాస్ పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

మాజీ మంత్రి జైలు శిక్ష రద్దు



మాజీ మంత్రి పి. బాలక్రిష్ణారెడ్డి

హోసూరు: ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం కేసులో అన్నా డీఎంకే మాజీ మంత్రి పి. బాలక్రిష్ణారెడ్డికి విధించి జైలు శిక్షను చెన్నై హైకోర్టు రద్దు చేస్తూ బుధవారం తీర్పు ఇచ్చింది. గత 1998లో హోసూరు తాలూకా బాగలూరులో ఒక ధర్నాలో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినట్లు ఆయన స్థానిక కోర్టులో కేసు దాఖలైంది. విచారణ జరిపి ఆయనకు మూడేళ్ల పాటు జైలు శిక్ష విధించింది. దీంతో సుమారు మూడేళ్ల కిందట పశు సంవర్ధక, క్రీడా శాఖ మంత్రిగా వహిస్తున్న బాలక్రిష్ణారెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేశారు. తరువాత ఎన్నికలలో కూడా పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టులో అప్పీల్ చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి ఆస్తుల ధ్వంసం చేశారనడానికి సరైన ఆధారాలు లేకపోవడంతో బాలక్రిష్ణారెడ్డిని నిర్దోషిగా ప్రకటిస్తూ బుధవారం జైలు శిక్షను రద్దు చేశారు. ఈ తీర్పుతో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు.

కార్మికుడు ఆత్మహత్య

క్రిష్ణగిరి: అనారోగ్యంతో బాధపడుతూ కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన సామలపట్టిలో జరిగింది. స్థానికుడు సేతు (50) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ వచ్చాడు. ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన సేతు మంగళవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. సామలపట్టి పోలీసులు కేసు నమోదు చేశారు.

అన్నదాతలకు అవగాహన



రైతులకు చైతన్యం కల్పిస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు తాలూకా కొత్తగొండపల్లి గ్రామంలో సంయుక్త వ్యవసాయంపై రైతులకు ఒక్క రోజు శిక్షణ అందజేశారు. వ్యవసాయ శాఖ ఉపడైరెక్టర్ భువనేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో ఖరీఫ్ సాగులో కంది, వేరుశనగ పంటల సాగుపై చైతన్యం కల్పించారు. ప్రతి రైతు భూసార పరీక్షలు నిర్వహించి తగిన మోతాదులోనే రసాయన ఎరువులు వినియోగించుకోవాలని, తద్వారా అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఎక్కువ మోతాదులో రసాయన ఎరువులను వాడితే నష్టం తప్పదన్నారు. రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టిన సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని, పంటలకు బీమా చేయడం వల్ల ఉపయోగం ఉంటుందని తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులతో భేటీ



హోసూరు బస్టాండులో మాట్లాడుతున్న దృశ్యం

హోసూరు: హోసూరు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలతో బుధవారం జాతీయ పారిశుద్ధ్య కమిషన్ అధ్యక్షుడు వెంకటేష్ భేటీ అయ్యారు. ఉదయం హోసూరులో కమీషనర్ స్నేహ నేతృత్వంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. సకాలంలో జీతాలు, ఈఎస్ఐ, పీఎఫ్, వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకొన్నారు. తరువాత కార్పొరేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కార్మికులకు సకాలంలో జీతాలు అందకపోతే ఫిర్యాదు చేయవచ్చునని, ఇతర వసతులు తప్పనిసరిగా అమలుచేయాలని తెలిపారు. డీఎస్పీ బాబుప్రశాంత్, సబ్‌కలెక్టర్ ప్రియాంక, ఎస్.ఎస్.మాదేశ్వరన్, ప్రభాకరన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ట్యాంకుకు భూమిపూజ



పూజ చేస్తున్న చైర్మన్ శ్రీనివాసరెడ్డి తదితరులు

కెలమంగలం: తళి యూనియన్‌లోని కొమారనపల్లిలో ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారం కోసం నీటి ట్యాంక్ నిర్మాణానికి బుధవారం యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి భూమిపూజ చేశారు. ట్యాంకు కోసం రూ. 20 లక్షల నిధులను మంజూరు చేయించారు. అలాగే అరసకుప్పం పంచాయతీ డి.కొత్తనూరు గ్రామంలో రూ. 8.80 లక్షల ఖర్చుతో నీటి కొలను ఏర్పాటుకు భూమిపూజ చేశారు.

నత్తనడకన రైల్వే వంతెన పనులు



రైల్వే వంతెన నిర్మాణ పనులు

హోసూరు: హోసూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు ప్రధాన కారణం రైల్వే వంతెన నిర్మాణ పనులు నత్తనడకన సాగడమే కారణమని స్థానికులు వాపోతున్నారు. రైల్వే రోడ్డు విస్తరణ కోసమని గత ఏడాది క్రితం రైల్వేరోడ్డు విస్తరణ పనులను ప్రారంభించింది. ఏడు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పిన కాంట్రాక్టర్లు అదే వేగంతో పనులు మాత్రం చేయించలేదు. దీంతో ప్రధాన మార్గం మూతపడగా హోసూరు పట్టణంలో ఎక్కడ చూసినా వాహనాలు స్థంభించి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని, ఈ విషయంపై కార్పొరేషన్ యంత్రాంగం చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేశారు. చుట్టుపక్కల ఊర్ల నుంచి ఎక్కువ మంది ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు, విద్యార్థులు హోసూరుకు వచ్చి వెళ్లుతున్నారు. వారు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారని తెలిపారు.

మానసిక చికిత్సా కేంద్రం ప్రారంభం

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి సమీపంలోని ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో మతిస్థిమితం కోల్పోయిన వారికి అత్యవసర చికిత్సలందజేసేందుకు ప్రత్యేక కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శరయు బుధవారం ప్రారంభించారు. కేంద్ర ఆరోగ్య శాఖ, స్వచ్ఛంద సంస్థల సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో 20 మంది రోగులకు సరిపడా వసతులు ఉన్నాయి. ఓ డాక్టర్‌తో పాటు ఏడు మంది ఉద్యోగులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికార్లు పూవతి, చంద్రశేఖర్, సెల్వరాజ్, జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చేతులు కలిపితే ప్లాస్టిక్ భూతం అంతం



పూలవ్యాపారుల వద్ద ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న కమిషనర్ తుషార్‌గిరినాథ్

బనశంకరి: పర్యావరణానికి తూట్లు పొడిచే ప్లాస్టిక్ భూతం అంతానికి బెంగళూరువాసులు బీబీఎంపీతో చేతులు కలపాలని కమిషనర్ తుషార్‌గిరినాథ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పు వలయం హెబ్బాళ విభాగ మునిరెడ్డిపాళ్యలో బుధవారం ఏర్పాటుచేసిన జాగృతి జాతాను కమిషనర్ ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్లు, బ్యాగులను పక్కన పెట్టి బట్ట సంచులు వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా స్వయంగా వీధి వ్యాపారుల వద్దకు వెళ్లి కరపత్రాలు అందించడంతో పాటు బట్టబ్యాగులు వితరణ చేశారు. కొబ్బరి బొండాలు విక్రయించేవ్యాపారులు పేపర్‌స్ట్రా అందించి ప్లాస్టిక్ తో తయారుచేసిన ఉత్పత్తులను వినియోగించరాదని సూచించారు. ప్రజలు సరుకుల కోసం వచ్చే సమయంలో బట్ట సంచులు తెచ్చుకునేలా అవగాహన కల్పించాలని దుకాణదారులకు సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ బ్యాగులు వినియోగిస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వలయ కమిషనర్ స్నేహల్, వలయ జాయింట్ కమిషనర్ సరోజ, పొడిచెత్త విభాగం ఇంజినీర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడి చీనీచెట్ల నరికివేత


నరికేసిన చీనీచెట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ

బత్తలపల్లి: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండలం యర్రాయపల్లిలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు అన్నగిరి శివారెడ్డికి చెందిన 66 చీనీచెట్లను మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నరికేశారు. శివారెడ్డి మూడెకరాల్లో 430 చీనీచెట్లు సాగుచేస్తున్నారు. ఏడాది వయసున్న వీటిలో 66 చెట్లను దుండగులు నరికివేశారు. బుధవారం ఉదయం పొలం వెళ్లిన శివారెడ్డి తల్లి రామలింగమ్మ దీన్ని గమనించారు. ఆమె చెప్పడంతో శివారెడ్డి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ శ్రీనివాసులు పొలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. యర్రాయపల్లిలో వారం వ్యవధిలో బొప్పాయి, చీనీచెట్లు నరికేశారని వైఎస్సార్‌సీపీ రైతువిభాగం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కమతం ఈశ్వరయ్య, మండల మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి చెప్పారు.

టీడీపీ నేతలతో ప్రాణహాని

కన్నీరు మున్నీరైన బాధితుడు సురేష్



చిత్తూరు కలెక్టరేట్ : తన కుటుంబానికి టీడీపీ నాయకులతో ప్రాణహాని ఉందని పుంగనూరు నియోజకవర్గం సోమల మండలం కందూరు గ్రామానికి చెందిన సురేష్ కన్నీరుమున్నీరయ్యారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలో 'సాక్షి'తో తన ఆవేదనను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ బీసీ కులానికి చెందిన తన తండ్రి రామచంద్రయ్యకు చాలా సంవత్సరాలుగా పింఛను వస్తున్నదన్నారు. గత ఐదేళ్లలో క్రమం తప్పకుండా ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి తన తండ్రికి పింఛను ఇచ్చేవారని చెప్పారు. ప్రభుత్వం మారాక ఇప్పుడు ఒకటో తేదీన తన తండ్రికి పింఛను ఇవ్వలేదని.. ఎందుకు ఇవ్వలేదని సచివాలయ ఉద్యోగులను, ఎంపీడీఓను అడిగినప్పటికీ స్పందన లేదని వాపోయారు. స్థానిక టీడీపీ నాయకులు తనకు కాల్‌చేసి 'పింఛను ఇచ్చేది లేదు ఎవరికి చెబుతావో చెప్పుకో, అసలు ఊరిలోనే ఉండనివ్వమంటూ బెదిరింపులకు దిగారన్నారు. బెదిరించిన టీడీపీ నాయకులు తనపై దాడిచేస్తారని ముందస్తుగా తెలియడంతో భార్య, ఇద్దరు ఆడపిల్లలతో ఊరు వదిలి వచ్చేశాను' అని చెప్పారు. ఈనెల 2వ తేదీ సాయంత్రం 100 మంది టీడీపీ నాయకులు తమ ఇంటిపైకి రాళ్లు వేసి ధ్వంసం చేశారన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడుతో ప్రాణహాని ఉందని వెల్లడించారు.

వాచ్‌మెన్ రంగయ్యకు తీవ్ర అస్వస్థత

పులివెందుల: మాజీ మంత్రి, దివంగత వైఎస్ వివేకానందరెడ్డి ఇంటి వద్ద వాచ్‌మెన్‌గా పనిచేసిన రంగన్న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వైఎస్ వివేకా హత్య కేసులో అప్పట్లో సీబీఐ వాచ్‌మెన్ రంగన్నను సాక్షిగా పరిగణించారు. కొద్దికాలంగా రంగన్న శ్వాసకోశ వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. బుధవారం రంగన్న తీవ్ర అస్వస్థతకు గురి కాగా పోలీసు భద్రత నడుమ ఆయనను మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు సమాచారం.

ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డికి పోలీసుల నోటీసు

అంతలోనే వెనక్కి..

తాడిపత్రి అర్బన్: ఇటీవల జరిగిన అల్లర్ల నేపథ్యంలో ఊరు వదిలి వెళ్లాలని అనంతపురం జిల్లా తాడిపత్రి టీడీపీ ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి నివాసానికి మంగళవారం రాత్రి పోలీసులు నోటీసు అతికించారు. అయితే తాము ఇక్కడే ఉండేలా కోర్టులో పిటిషన్ వేశామని చెప్పడంతో పోలీసులు నోటీసును వెనక్కు తీసుకెళ్లారు. పోలింగ్ అనంతరం జరిగిన అల్లర్లను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డితో పాటు ఆయన తండ్రి, మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రిలో ఉండరాదని కోర్టు ఆదేశించిన విషయం విదితమే. జూన్ 30న జేసీ ప్రభాకర్‌రెడ్డి సోదరి సుజాత అనారోగ్యంతో మృతి చెందడంతో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డితో పాటు ఆయన తండ్రి ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రిలోని తమ నివాసానికి సోమవారం చేరుకున్నారు. సోమవారం అంత్యక్రియలు ముగిసిన వెంటనే పట్టణం విడిచి వెళ్లాలని పోలీసులు సూచించినప్పటికీ మంగళవారం కూడా ఇంట్లోనే ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు మంగళవారం రాత్రి 10.45 గంటలకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి ఇంటికి నోటీసులు అతికించారు. వెంటనే ఇంట్లోనే ఉన్న మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి స్పందిస్తూ..తన సోదరి పెద్దకర్మ పూర్తయ్యే వరకు ఊరి పొలిమేర దాటి వెళ్లకూడదనే ఆచారం ఉందని, దీంతో తాము అనుమతి కోరుతూ 2వతేదీ (మంగళవారం) ఉదయమే కోర్టులో పిటిషన్ దాఖలు చేశామని చెప్పారు. దీంతో పోలీసులు జేసీ ఇంటికి అతికించిన నోటీసును వెనక్కు తీసుకెళ్లారు. జేసీ పిటిషన్‌పై బుధవారం కోర్టులో కౌంటర్ దాఖలు చేసేందుకు పోలీసులు విజయవాడకు వెళ్లినట్లు తెలిసింది. డీఎస్పీ కె.జనార్దన్ నాయుడును వివరణ కోరగా.. ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి పట్టణంలోకి వచ్చేందుకు అనుమతులున్నాయని, అయితే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఊరిలో ఉండేందుకు అనుమతుల్లేవని స్పష్టం చేశారు.

పాత కేసులో కొత్త అరెస్టులు

టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో మరో ఐదుగురి అరెస్టు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పాత కేసులో కొత్తగా అరెస్టులు చేస్తూ టీడీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు శ్రీకారం చుట్టింది. 2021 అక్టోబర్ 19న మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంపై దాడి జరిగిన విషయం విదితమే. దీనిపై అప్పట్లో పార్టీ కార్యాలయంలో పనిచేసే పెండెం సాయిబద్రీనాథ్ ఫిర్యాదు మేరకు 70 మందిపై కేసు నమోదు చేశారు. సెక్షన్లు 147, 148, 452, 427, 323, 328, 506 రెడ్‌విత్ 149 ఐపీసీ కింద కేసులు నమోదు చేసి పలువుర్ని అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ సరిగా జరగలేదంటూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ విచారణ ప్రారంభించారు. కొత్తగా 324, 326,307, 506 రెడ్ విత్ 109, 120–బి సెక్షన్లు చేర్చి అరెస్టులకు శ్రీకారం చుట్టారు. కేసులో అనుమానితుల సంఖ్యను 70 నుంచి 100కు పెంచారు. గతంలో పోలీసులు సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సీసీ కెమెరాల ద్వారా 29 మందిని గుర్తించి వారికి 41(ఎ) నోటీసులు జారీ చేశారు. ఎప్పుడు పిలిస్తే అప్పుడు కోర్టుకు హాజరు కావాలని కోరారు. అప్పట్లో 8 మంది ప్రత్యక్ష సాక్షులుగా గుర్తిస్తే.. ఇప్పుడు మరో 9 మందిని ప్రత్యక్ష సాక్షులుగా చేర్చి కక్షసాధింపుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

నాలుగు బృందాలతో ప్రత్యేక చర్యలు

పోలీసులు మంగళవారం అర్ధరాత్రి తర్వాత కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు. నాలుగు బృందాలుగా ఏర్పడిన పోలీసులు నిందితుల వివరాలను రెండు, మూడు రోజులపాటు సేకరించారు. దాడికి పాల్పడిన వారిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు. వీరిలో గుంటూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే ఎక్కువ మంది ఉన్నట్టు నిర్ధారించి బుధవారం తెల్లవారుజామునుంచి పలువుర్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థి విభాగం నాయకులను లక్ష్యంగా చేసుకుని గాలింపు జరుపుతున్నారు. బుధవారం రాత్రికి ఐదుగురి అరెస్టు చూపించారు. వీరిలో గుంటూరుకు చెందిన కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, పార్టీ నాయకులు షేక్ మస్తాన్‌వలీ, గిరి రాంబాబు, షేక్ ఖాజామొహిద్దీన్ ఉన్నారు. వీరిని బుధవారం రాత్రి మంగళగిరి కోర్టులో హాజరుపరిచారు. వీరికి 14 రోజులు రిమాండ్ విధించారు.

కుట్రదారుగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి పేరు

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి చెందిన వాహనాలతోపాటు మరికొన్ని వాహనాల్లో టీడీపీ కార్యాలయంపైకి దాడికి వచ్చినట్టు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. విజయవాడకు చెందిన జోగరాజు, బచ్చు మురళి, జోగ రమణ, పోపల రాజా, కాకి రమేష్, చల్లా శ్రీను, చల్లా వీరాస్వామి, కసగాని దుర్గారావు, కొండ్ర కొండ, మద్దెల సాయి, జోగరాజు, కార్పొరేటర్ అరవ సత్యం, షేక్ సైదా, మద్దెల పవన్, కార్పొరేటర్ అంబేద్కర్, గోకమళ్ల ప్రసాద్, సంతోష్ , గుంటూరుకు చెందిన కార్పొరేటర్ షేక్ రోషన్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పల్లపు మహేష్‌బాబు, మిర్చి యార్డ్ మాజీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, 22వ డివిజన్ కార్పొరేటర్ భర్త గేదెల రమేష్, 23వ డివిజన్ కార్పొరేటర్ భర్త సాధు రాజేష్, 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, ఫాతిమాపురానికి చెందిన గిరి రాము, మార్కెట్ బాబు, పావన స్వర్ణలత, రబ్బాని, నూనె ఉమామహేశ్వరరెడ్డి, పానుగంటి చైతన్య, 21వ డివిజన్ కార్పొరేటర్ కొండ్రకుంట గురవయ్య, ఖాజా మొహిద్దీన్, స్టార్ మస్తాన్ ఈ దాడిలో పాల్గొన్నట్టు అందులో వివరించారు. బత్తుల దేవానంద్‌ను విచారించగా.. అతడు తాడేపల్లి వైఎస్సార్‌సీపీ ఆఫీస్ నుంచి ఫోన్ రాగా, తాము పార్టీ కార్యాలయానికి వెళ్లామని, అక్కడ దేవినేని అవినాష్, నందిగం సురేష్ ఉన్నారని చెప్పినట్టు పేర్కొన్నారు. వారు పానుగంటి చైతన్యను, కార్యకర్తలను తీసుకుకెళ్లి టీడీపీ కార్యాలయంపై దాడి చేయాలని చెప్పినట్టు రాశారు. ఈ దాడికి కుట్రదారునిగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పేరును రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై నడిరోడ్లపై దాడులు చేస్తున్నా పట్టించుకునే వారు లేరు
- ఎస్పీకి విన్నవించిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ నేత పైలా నరసింహయ్య
- వారం రోజుల్లో దాడులు అరికట్టకపోతే ఆందోళనకు దిగుతామని స్పష్టీకరణ


ఎస్పీకి వినతిపత్రం ఇచ్చి వస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అనంతపురం: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, అందులో భాగంగానే ఉరవకొండలోనూ రాజకీయ దాడులు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఇకనైనా దాడులు ఆపకపోతే తామూ తిరగబడతామని హెచ్చరించారు. అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గ పరిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు చేస్తున్న దాడులను అరికట్టాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులతో కలసి ఎస్పీ గౌతమిశాలికి విశ్వేశ్వరరెడ్డి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఉరవకొండ నియోజకవర్గంలో పోలింగ్ రోజు నుంచే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడులు చేస్తున్నారన్నారు. తిరిగి బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారని చెప్పారు. పామిడి సలీం ఇంటిపై దాడిచేసి రూ.లక్షల ఆస్తి నష్టం కలగజేస్తే ఆయన కుటుంబంతో కలిసి ఊరు వదలి వెళ్లిపోయారని తెలిపారు. యువజన నాయకుడు వడ్ల సలీం ఇంటిపైనా దాడి చేసి ఊరు వదిలి వెళ్లిపోయేలా చేశారన్నారు. ఉరవకొండ ఉప సర్పంచ్ వన్నప్ప ఇంటిపై పరోక్షంగా దాడికి దిగారు. యువ నాయకుడు మొండి శ్రీకాంత్, ఎంపీటీసీ సభ్యుడు ఈడిగ ప్రసాద్, గందోడి మారేశ్, లత్తవరం వలంటీర్ వన్నూరు స్వామి, బెళుగుప్ప సింగిల్ విండో డైరెక్టర్ శివలింగప్ప తదితరులపై దాడులకు పాల్పడ్డారని వివరించారు. పార్టీ ముఖ్య నాయకుడు లత్తవరం కురుబ గోవిందుపై అన్యాయంగా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేశారని, మైలవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుల పైపులైన్లు ధ్వంసం చేశారని, వై.రాంపురంలో వీర శైవ లింగాయతులపై దాడి చేసి అప్పు ఉన్నట్లు బాండ్లు రాయించుకున్నారని వివరించారు. ఉదిరిపికొండ తండాలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్ నాయక్ 30 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని లాక్కుని దాడి చేశారని, పలుచోట్ల ప్రభుత్వ ఆస్తులను సైతం ధ్వంసం చేశారని చెప్పారు. టీడీపీ దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గురువారం ఉరవకొండలో పెద్దఎత్తున ధర్నా చేయాలని నిర్ణయించామని, వారం రోజుల్లో పరిస్థితిని చక్కదిద్దుతామని ఎస్పీ హామీ ఇవ్వడంతో ధర్నా వాయిదా వేస్తున్నామని చెప్పారు. దాడులను అరికట్టడంలో పోలీసులు విఫలమైతే ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమాలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త దారుణ హత్య

- కొట్టి చంపేసిన టీడీపీ కార్యకర్తలు
- ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రచారం చేశాడని కక్షగట్టి దాడి
- శ్రీసత్యసాయి జిల్లా గోళ్లాపురంలో దారుణం



హిందూపురం: శ్రీసత్యసాయి జిల్లాలో దారుణం జరిగింది. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రచారం చేశాడని ఆ పార్టీ కార్యకర్తను తెలుగుదేశం కార్యకర్తలు కొట్టి చంపేశారు. ఎన్నికలప్పటి నుంచి కక్షగట్టిన వారు మంగళవారం రాత్రి మాట్లాడుకుందామంటూ పిలిచి దాడిచేసి తీవ్రంగా కొట్టారు. గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సతీష్ (45) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబీకులు తెలిపిన మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం గోళ్లాపురం గ్రామానికి చెందిన సతీష్ (45) వైఎస్సార్‌సీపీ కార్యకర్త. ఎన్నికల సమయంలో పార్టీ తరఫున విస్తృతంగా ప్రచారం చేశాడు. ఆ సమయంలోనే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు అతడిని గట్టిగా హెచ్చరించారు. అయినా సతీష్ ఎన్నికలు పూర్తయ్యేవరకు వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో వారు కక్షగట్టారు. మంగళవారం రాత్రి మాట్లాడుకుందామని సతీష్‌ను ఊరు బయట ఉన్న చెరువు వద్దకు పిలిపించుకున్నారు. అప్పటికే మద్యం తాగి ఉన్న టీడీపీ కార్యకర్తలు ఆది, రవి, సురేష్ తదితరులు సతీష్‌పై దాడిచేసి కొట్టారు. తీవ్రంగా గాయపడిన సతీష్ అపస్మారకస్థితిలో పడిపోవడంతో వారు పరారయ్యారు. విషయం తెలుసుకున్న సతీష్ కుటుంబసభ్యులు అతడిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రే బెంగళూరులోనిస్పాక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ సతీష్ బుధవారం రాత్రి మృతిచెందాడు. పోలీసులు బుధవారం రాత్రి గ్రామానికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు.

టీడీపీ కక్ష సాధింపు చర్యలతో వ్యక్తి మృతి

పాఠశాల స్వీపర్‌ను తొలగించడంతో మనోవేదనతో ప్రాణాలు కోల్పోయిన భర్త



గుంటూరు రూరల్: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులో టీడీపీ కక్షసాధింపు చర్యలతో ఇస్రాయేలు (45) మానసిక ఒత్తిడికి గురై గుండెపోటుతో మృతిచెందాడు. ఇస్తల ఇస్రాయేలు, ఝాన్సీరాణి దంపతులకు ముగ్గురు పిల్లలు. ఇస్రాయేలు (45) వ్యవసాయ కూలీ. ఝాన్సీరాణి ఆరేళ్లుగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తోంది. ఆమె వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తి అని, ఆమెను ఉద్యోగంలోంచి తీసేయాలని టీడీపీకి చెందిన సర్పంచి పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రధానోపాధ్యాయుడు మంగళవారం ఝాన్సీరాణిని విధుల నుంచి తీసేశారు. ఈ విషయం తెలిసిన ఇస్రాయేలు.. భార్యను స్వీపర్ ఉద్యోగం నుంచి తీసేయటంతో తమ కుటుంబం పరిస్థితి ఏమిటని ఆలోచించి తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. ఈ వేదనతో మంగళవారం సాయంత్రం గుండెపోటుకు గురై ప్రాణాలు వదిలాడు. ముగ్గురు పిల్లలతో ఆ తల్లి రోదన గ్రామస్తులను కంటతడి పెట్టించింది. టీడీపీ నేతలు ఇకనైనా ఇటువంటి కక్షసాధింపు చర్యలు మానుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

టీడీపీ, జనసేన గూండాలపై చర్యలు తీసుకోండి

- ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల వినతి
- దాడులకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేయాలని డిమాండ్
- తిరువూరు, విజయవాడ ఘటనలపై ఫిర్యాదు


టీడీపీ, జనసేన అకృత్యాలపై చర్యలు తీసుకోవాలని కోరేందుకు పోలీస్ కమిషనర్ కార్యాలయానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయవాడ స్పోర్ట్స్: టీడీపీ, జనసేన గూండాలు చేస్తున్న విధ్వంసకర దాడులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ రామకృష్ణను కోరారు. ఈ నెల 2న తిరువూరు నియోజకవర్గం ఎ.కొండూరు ఎంపీపీ కలసాని నాగలక్ష్మి ఇంటిపైన, విజయవాడ పశ్చిమ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ నాయకుడు మైలవరపు దుర్గారావుపైన దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేలు నల్లగట్ల స్వామిదాసు, మల్లాది విష్ణు, కైలే అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు బుధవారం పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు.

కూటమికి ప్రజలే బుద్ధి చెబుతారు: వెల్లంపల్లి శ్రీనివాస్

కూటమి నాయకులు ప్రజా సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని వదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు దిగుతున్నారని వెల్లంపల్లి శ్రీనివాస్ అన్నారు. బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన ఎంపీపీ నాగలక్ష్మిని జుట్టు పట్టుకుని ఈడ్చి, ఆమె ఇంటిని కూల్చేయడం, విజయవాడలో దుర్గారావుపై దాడి చేయడం హేయమని అన్నారు. ఎంపీపీ నాగలక్ష్మి ఇంటిపై తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే శ్రీనివాస్ వెయ్యి మందితో వెళ్లి దాడి చేయడం, ఆమె ఇంటిని కూల్చి వేయడం దారుణమన్నారు. మంత్రి నారా లోకేశ్ టీడీపీ, జనసే ాన కార్యకర్తలను ఉసిగొల్పి విధ్వంసకర రాజకీయాలకు తెరతీశారని ధ్వజమెత్తారు. దాడులు మానకపోతే వైఎస్సార్‌సీపీ ప్రత్యేక కార్యాచరణకు దిగుతుందని, ఆ తర్వాతి పరిణామాలకు టీడీపీ, జనసేన బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. ప్రత్యర్థి పార్టీ వారిపై దాడులు చేస్తేనే గుర్తిస్తామని మంత్రి లోకేశ్ చెప్పడంతో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే స్వామిదాసు అన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కూటమి మంటగలుపుతోంది: షేక్ ఆసిఫ్

భవానీపురం (విజయవాడ పశ్చిమ): విజయవాడ 44వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి భర్త, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దుర్గారావుపై జనసేన కార్యకర్తల దాడిని నిరసిస్తూ బుధవారం వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు తీవ్ర నిరసన తెలిపారు. దుర్గారావుపై దాడి జరిగిన చెరువు సెంటర్‌లోనే వైఎస్సార్‌సీపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపి అక్కడ ఉన్న గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందచేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన దగ్గర నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతూ, అరాచకం సృష్టిస్తూ ప్రజాస్వామ్యాన్ని మంట గలుపుతున్నారని షేక్ ఆసిఫ్ అన్నారు. తమ పార్టీ శ్రేణుల జోలికి వస్తే సహించేది లేదని హెచ్చరించారు.

పార్టీ అండగా ఉంటుంది..

జనసేన మూకల దాడిలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన మైలవరపు దుర్గారావును ఆసిఫ్ పరామర్శించారు. ఆయన భార్య, కార్పొరేటర్ రత్నకుమారికి ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి పార్టీ నేతలంతా అండగా ఉంటారని తెలిపారు.

తిరువూరు ఎమ్మెల్యేపై కేసు నమోదు

తిరువూరు: ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు మండలం కంభంపాడులో మంగళవారం మండల పరిషత్ అధ్యక్షురాలు కాలసాని నాగలక్ష్మి భవనాన్ని పొక్లెయిన్లతో ధ్వంసం చేసిన ఘటనలో తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఆ పార్టీ నాయకులు మరికొందరిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మండల పరిషత్ అధ్యక్షురాలు నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేసినట్లు ఏ కొండూరు సీఐ అబ్దుల్ నబీ తెలిపారు. తన భర్త కాలసాని చెన్నారావుపై తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు అక్రమ కేసు బనాయించడమే కాక, తమ భవనాన్ని పొక్లెయిన్లతో ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు.

కష్టజీవులపై కర్కశం

- కనిగిరిలో జేసీబీలతో దుకాణాలు, బడ్డీల కూల్చివేత
- బతుకుదెరువు కోల్పోయిన 500 కుటుంబాలు
- కంటతడి పెట్టిన వీధి వ్యాపారులు
- ఎమ్మెల్యే మెప్పు కోసమేనంటూ నిప్పులు చెరిగిన ప్రజా సంఘాలు


దుకాణాలను జేసీబీతో ధ్వంసం చేస్తున్న అధికారులు



కనిగిరి రూరల్: వేకువజామున 4 గంటల సమయం.. కనిగిరిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ప్రధాన రహదారులపైకి జేసీబీలు, ట్రాక్టర్లు దూసుకొచ్చాయి. వాటి వెనుకే మునిసిపల్, రెవెన్యూ అధికారులు, సచివాయల సిబ్బంది మందీమార్బలంతో చేరుకున్నారు. ఏకంగా 80 మంది పోలీసులను వెంటబెట్టుకొచ్చారు. రహదారుల వెంబడి ఉన్న చిరు వ్యాపారుల దుకాణాలు, బడ్డీలను నిర్దాక్షిణ్యంగా ధ్వంసం చేశారు. ట్రాఫిక్ నియంత్రణ పేరుతో కనిగిరి మునిసిపల్ కమిషనర్ టీవీ రంగారావు కనీస నిబంధనలు పాటించకుండా.. కష్టజీవులపై కర్కశంగా వ్యవహరించారు. తొలుత చెప్పుల బజార్, పామూరు బస్టాండ్ వైపు బడ్డీలను పెకిలించడం మొదలుపెట్టారు. విషయం తెలుసుకుని అక్కడికి వచ్చిన చిరు వ్యాపారులను పోలీస్‌లు, మునిసిపల్ సిబ్బందితో అడ్డుకున్నారు. కనీసం తమ బడ్డీల్లో ఉన్న సామగ్రి తీసుకునే అవకాశం ఇవ్వాలని కోరినా అంగీకరించకుండా జేసీబీలతో నుజ్జునుజ్జు చేశారు. పిండి వంటలు, చెప్పుల దుకాణాలు, సెల్ పాయింట్లు, వాచీ షాపులు, గాజుల షాపులు ఇలా అనేక దుకాణాల్లో వస్తువులన్నీ ధ్వంసమయ్యాయి. దీంతో ఏం చేయాలో దిక్కుతోచక వీధి వ్యాపారులు లబోదిబోమన్నారు. మొత్తం మీద చిరు వ్యాపారులకు రూ.30 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా 500 కుటుంబాలు ఉపాధి కోల్పోయాయి.

పోలీస్ పహారాతో దమనకాండ

వాస్తవానికి చెప్పుల బజార్‌లోని కొన్ని దుకాణాలు, చర్చి సెంటర్‌లోని బడ్డీలు తొలగించనున్నట్లు కొంతకాలంగా చర్చ నడుస్తోంది. కానీ.. బుధవారం ఒక్కసారిగా పట్టణంలోని పామూరు రోడ్డు, కందుకూరు రోడ్డు, ఒంగోలు బస్టాండ్ రోడ్డులోని దుకాణాలను ముందస్తు సమాచారం లేకుండా నేలమట్టం చేశారు. 50 మంది స్పెషల్ పోలీసులు, 20 మంది పోలీస్ సిబ్బంది, నలుగురు ఎస్సైలు, సీఐలు ఈ దమనకాండలో పాల్గొన్నారు. కమిషనర్ టీవీ రంగారావు, ఆర్డీఓ పి.జాన్ ఇర్విన్, సీఐలు, ఎస్సైలు బడ్డీల తొలగింపును దగ్గరుండి పర్యవేక్షించారు.

వ్యాపారుల శాపనార్థాలు

బడ్డీల తొలగింపు సందర్భంగా కమిషనర్ రంగారావు వ్యవహరించిన తీరుపై చిరు వ్యాపారులు తీవ్రంగా మండిపడుతున్నారు. నోటికాడి కూడును నేలపాలు చేసి, తమ జీవితాలను రోడ్డున పడేసిన వారంతా దుమ్ము కొట్టుకుపోతారని శాపనార్థాలు పెట్టారు. అధికార పార్టీ నేతల మెప్పు కోసమే అధికారులు దమనకాండకు పాల్పడ్డారని ప్రజా సంఘాల నాయకులు నిప్పులు చెరిగారు. చిరు వ్యాపారుల పక్షాన న్యాయపోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ భరోసా ఇచ్చారు.

భవనం కూల్చివేతకు టీడీపీ నేత కుట్ర

- తన స్థలాన్ని కాపాడుకునేందుకు టీడీపీ నేత పన్నాగం
- ఆధారాలు బయటపెట్టినందుకు యజమానిపై దాడి


భవనంపై పబ్లిక్ రోడ్డు అని రాసి ఉన్న దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: తిరుపతి నగరంలో నాలుగంతస్తుల భవనాన్ని కూల్చివేయడమే లక్ష్యంగా ఒక టీడీపీ నేత దౌర్జన్యానికి దిగారు. తన స్థలాన్ని కాపాడుకునేందుకు వేరొకరి భవనాన్ని కూల్చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ విషయాన్ని ప్రశ్నించినందుకు భవన యజమానిపై దాడికి దిగారు. ఈ వ్యవహారం నగరంలో హాట్‌టాపిక్‌గా మారింది. తిరుపతిలో తిరుమల బైపాస్ మున్సిపల్ పార్క్ ఎదురుగా ఉన్న విరజా మార్గంలోని టీడీపీ నేత అన్నా రామచంద్రయ్య స్థలంలో మాస్టర్ ప్లాన్ రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. అతడి ఇద్దరు కుమార్తెలు కార్పొరేటర్లుగా ఉన్నారు. దీంతో ఆయన అధికారబలంతో తన స్థలాన్ని కాపాడుకునేందుకు వేరొకరి ఇంటి (నాలుగు అంతస్తుల భవనం) పైకి ఆ రోడ్డుని మళ్లించారు. నూతనంగా నిర్మించిన నాలుగంతస్తుల భవనంపై తన మనుషులతో మంగళవారం 15 అడుగుల పబ్లిక్ రోడ్డు అని రాయించారు. ఈ విషయమై భవన యజమాని మాస్టర్ ప్లాన్ మ్యాప్‌ని, అందుకు సంబంధించిన ఆధారాలను చూపించారు. ఈ విషయాన్ని స్పష్టం చేయాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు.. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు, ప్రలోభాలకు లొంగి నోరెత్తడం లేదు. బాధితుడు అధికారులను ప్రాధేయపడుతున్నా పట్టించుకోలేదు. ఇదే సమయంలో టీడీపీ నేత అన్నా రామచంద్రయ్య తన మనుషులతో భవనం వద్ద పనులు చేసుకుంటున్న యజమానిపై దాడి చేశారు. ఈ దాడి సీసీ కెమెరాలో రికార్డయింది. ఆ వీడియోలు బయటకు వచ్చాయి. టీడీపీ నేత దౌర్జన్యంపై భవన యజమాని సీఎం చంద్రబాబుకు లేఖరాయడంతో పాటు నేరుగా వెళ్లి కలిసి తమను రక్షించమని వేడుకోనున్నారు.

వైఎస్సార్ విగ్రహాలు, శిలాఫలకాల ధ్వంసం

పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దుశ్చర్యలు


జువ్వలపాలెంలో టీడీపీ నేతలు ధ్వంసం చేసిన శిలాఫలకం


ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల టీడీపీ దుశ్చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. టీడీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహాలను, శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారు. మంగళవారం రాత్రి, బుధవారం ఈ విధ్వంసకాండ కొనసాగింది. పల్నాడు జిల్లా దుర్గిలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దుర్గి బస్టాండ్ సెంటర్‌లోని ఈ విగ్రహాన్ని టీడీపీ కార్యకర్త ఇనుప రాడ్డుతో కొట్టి ధ్వంసం చేశాడు. స్థానికులు అతడిని అడ్డుకున్నారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వెలిదండి గోపాల్ నేతృత్వంలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెలిదండి గోపాల్ మాట్లాడుతూ ఇటువంటి ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. ఆవేశాలకు లోనుకాకుండా శాంతియుతంగా నిరసన తెలుపుదామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సర్పంచ్ రాయపాటి మాణిక్యం, వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ యకటీల బుచ్చిబాబు, నాయకులు తోటకూర వెంకటేశ్వర్లు, చెన్నుపాటి సీతారామయ్య, జంగా కొండలు, వెలిదండి జ్యోతి, శెట్టిపల్లి కోటేశ్వరరావు, చింతా రామకృష్ణ, చింతా నరసింహారావు, తోట మూర్తి, బత్తుల శ్రీనివాసరావు, యకటీల శ్రీను, తురక శ్రీను తదితరులున్నారు.

- బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని ద్రోణాదుల గ్రామంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం చేతిని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఇంతకుముందు గ్రామంలోని రెండు సచివాలయాల్లో శిలాఫలకాలను పగులగొట్టారు. గ్రామంలో విధ్వంసాలను అధికారులు అడ్డుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, వైఎస్సార్ అభిమానులు కోరుతున్నారు.
- బాపట్ల జిల్లా జువ్వలపాలెం పాత ఎస్సీ కాలనీలోని డాక్టరు బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గతంలో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా అప్పటి మంత్రి మేరుగ నాగార్జున ఆవిష్కరించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. జువ్వలపాలెం సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా గతంలో ఏర్పాటు చేసిన శిలాఫలకానికి పసుపు రంగులు పూశారు. సచివాలయ భవనంపై టీడీపీ నాయకుల చిత్రాలతో ఫ్లెక్సీలు ఉంచారు. ఈ ఘటనల్ని స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

* ఉపాధి


చిలువేరు సాహితి

ఒక అందమైన ఆలోచనను సక్రమంగా అమలులో పెడితే పల్లెటూరు నుంచి కూడా విదేశాలకు విస్తరించవచ్చు అని నిరూపిస్తుంది చిలువేరు సాహితి. చేస్తున్న కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలేసి పాకశాస్త్ర ప్రావీణ్యంతో ఉపాధిని సృష్టిస్తోంది. 26 ఏళ్ల వయసులో తనతోపాటు మరో ఇరవై మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. తెలంగాణలోని మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలో వ్యవసాయాధారిత జీవనాల మధ్య వెలుగుతున్న సాహితిని పలకరిస్తే విజయావకాశాన్ని వంటలతో అందిపుచ్చుకుంటున్నానని వివరిస్తుంది.

టెకీ ఉద్యోగం నుంచి టేస్టీ ఫుడ్ బిజినెస్ వరకు

‘‘నాకు రుచికరమైన ఆహారం అంటే చాలా ఇష్టం. అయితే ఆ ఇష్టం నాకో ఉపాధిని కల్పిస్తుంది అని మాత్రం ఊహించలేదు. బీటెక్ కంప్లీట్ అయ్యాక హైదరాబాద్ టీసీఎస్ కంపెనీలో నాలుగేళ్లు ఉద్యోగం చేశాను. కోవిడ్ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ రావడంతో ఊరు వచ్చేశాను. ఆ టైమ్‌లో మా అమ్మ కన్యాకుమారి చేసే వంటలను ఆస్వాదిస్తూ ఉండే దాన్ని. ఖాళీ సమయంలో సరదాగా తీసుకున్న వంటల ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో ‘ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు’ పేజీ క్రియేట్ చేసి పోస్ట్ చేసేదాన్ని. ఆ పోస్టులకు లైకులు వెల్లువెత్తుతుండేవి.

ఒకటి నుంచి మొదలు..

ఓరోజున ఉన్నట్టుండి ఒక ఫాలోవర్ నుంచి ‘మాకు స్వీట్స్ చేసి పంపుతారా’ అంటూ ఒక పోస్ట్ వచ్చింది. కాదనటమెందుకులే, ఒకసారి ప్రయత్నం చేసి చూద్దాం అని... ఆ ఆర్డర్ పూర్తిచేసి, కొరియర్ ద్వారా పంపించాం. ఆ తర్వాత మరో రెండు ఆర్డర్లు వచ్చాయి. అలా నెలకు ఒకటి రెండు ఆర్డర్లు రావడం మొదలయింది. క్రమంగా ఆర్డర్లు పెరిగాయి. నా వంటలకు మంచి డిమాండ్ ఉందని అర్థమైంది. దానినే ఉపాధిగా ఎందుకు చేసుకోకూడదూ అని... చేస్తున్న ఉద్యోగాన్ని వదిలేసి, ఫుడ్ తయారీనే వ్యాపారంగా ఎంచుకున్నాను. ముందు మా ఇంటివరకే పనులు ఉండేవి. తర్వాత పనులు పెరగడంతో ఊళ్లోనే ఉన్న మా చుట్టుపక్కల మహిళలను ఫుడ్ తయారీకి నియమించుకున్నాం. స్నాక్స్, ఊరగాయలు, స్వీట్లు, మసాలా పొడులతో పాటు మిల్లెట్ ఉత్పత్తులు, ఇన్‌స్టంట్ మిక్స్‌లు తయారు చేయడం మొదలుపెట్టాం. ఇప్పుడు నెలకు 30 నుంచి 40 ఆర్డర్లు వస్తున్నాయి.



మరో 20 మందికి...

పదిహేనేళ్లుగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న ఒక ఉద్యోగికి వచ్చే ప్యాకేజీని ఇప్పుడు నా వ్యాపారం ద్వారా పొందుతున్నాను. నాతోపాటు మరో 20 మంది మహిళలకు ఉపాధి కల్పించే స్థితికి చేరుకున్నాను. వీరిలో పదిమంది తమ ఇళ్ల నుంచే పచ్చళ్లు, పొడులు, ఇతర పిండి వంటలు తయారు చేసి వాటిని అందంగా ప్యాక్ చేసి ఇస్తారు. మా ఇంటి మొదటి అంతస్తులోని రెండు గదులను నా కంపెనీ ‘ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు’కి కేటాయించుకున్నాను. పదిహేను రకాల పచ్చళ్లు, 40 రకాల పిండి వంటలు, ఇన్‌స్టంట్ ఫుడ్ మిక్సర్లు, మసాల పొడులు.. దాదాపు 70 రకాల వంటకాలు తయారు చేస్తుంటాం. మన దేశంలోనే కాకుండా అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీ.. దేశాలలో ఉండే మన తెలుగువారికి కొరియర్ ద్వారా పచ్చళ్లు, పొడులు పంపిస్తున్నాను.

ఎక్కడా ప్లాన్ లేదు..

ఏ మాత్రం ప్లాన్ లేకుండా నా వ్యాపారం వృద్ధి చెందుతూ వస్తోంది. ఇంట్లో పెట్టిన ఆవకాయతో ఆరంభమైన ఈ బిజినెస్‌లో వచ్చిన ఆర్డర్ల ప్రకారం పెట్టుబడి పెడుతూ, ఆదాయాన్ని పొందుతున్నాను. ఫుడ్ బిజినెస్ కాబట్టి ఏడాది క్రితం లైసెన్స్ కూడా తీసుకున్నాను. మా ఊరికి మరింత పేరుతెచ్చేలా ‘ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు’ బ్రాండ్ ఉత్పత్తులను విస్తరించాలనుకుంటున్నాను. కానీ, తయారీ మాత్రం మా ఊరి నుంచి, మా ఇంటి నుంచే చేస్తుంటాను.

సవాళ్లను అధిగమిస్తూ..

రుచికరమైన వంటకాల తయారీలో పదార్థాలు కూడా అంతే నాణ్యమైనవి ఉండాలి. సరైన శుభ్రత పాటించాలి. ముఖ్యంగా ఆర్గానిక్ ఉత్పత్తులను సేకరించడం, వాటిని సమయానుకూలంగా తయారీలో వాడటం పెద్ద సవాల్‌గానే ఉంటోంది. అలాగే, సీజనల్‌గా ఉండే సమస్యల్లో ముఖ్యంగా వర్షాకాలం ప్యాకింగ్‌లు తడవడం వంటివి అప్పుడప్పుడు జరుగుతుంటాయి. ఎప్పుడైనా సమస్య వచ్చినప్పుడు తిరిగి రీప్లేస్ చేయడం వంటి జాగ్రత్తలు తీసుకుంటాను. చాలా మందితో డీల్ చేయాలి, కస్టమర్స్ అందరూ ఒకేలా ఉండరు కాబట్టి సహనంతో ఉండాలి. ఈ ప్రయాణం నన్ను నేను కొత్తగా ఆవిష్కరించుకోవడానికి ఉపయోగపడుతుంది.



‘చిన్న అమ్మాయివే కానీ, మా ఇంట్లో బామ్మలు చేసిన వంటకాల రుచి చవి చూస్తున్నాం’ అంటూ మా వంటకాలను రుచి చూసినవారు నాకు ఫోన్ల ద్వారా, మెసేజ్‌ల ద్వారా ప్రశంసలు తెలియచేస్తుంటారు. నాణ్యత ద్వారా వారి ఆశీస్సులను, అభిమానాన్ని, మద్దతును ఎప్పటికీ అలాగే నిలబెట్టుకుంటాను అంటూ ఆనందంగా వివరిస్తుంది సాహితి.

– నిర్మలారెడ్డి

* ఆర్ట్

సహాయ కళలు

బామ్మ జీవితం నుండి ప్రేరణం పొంది అబ్‌స్ట్రాక్ట్ ఆర్టిస్ట్‌గానూ తల్లి సంగీత పరిజ్ఞానాన్ని ఒంటపట్టించుకొని సంగీత కళాకారిణిగానూ ఒకేసారి రెండు కళల్లోనూ రాణిస్తూ తనదైన ప్రత్యేకతను చాటుకుంటోంది ఢిల్లీవాసి సహాయ శర్మ. తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటూ యువతరపు ఆలోచనలకు అద్దం పడుతుంది.


సహాయ శర్మ

‘‘నా ఎదుగుదలలో సంగీతం పాత్ర చాలా పెద్దది. మా అమ్మ సంగీత కళాకారిణి. తను పాడుతుండటాన్ని నా చిన్ననాటి నుంచి వింటూ, నేనూ పాడుతూ పెరిగాను. సంగీత ప్రపంచం నుంచి నాదైన సొంత శైలిని కనుక్కోవడానికి నిత్యం ప్రయత్నిస్తూనే ఉండేదాన్ని. స్కూల్, కాలేజీ రోజుల్లో ఎప్పుడు సెలవులు వచ్చినా రకరకాల పాటల్ని డౌన్‌లోడ్ చేసుకొని, ఒక ప్రత్యేకమైన జాబితా తయారు చేసేదాన్ని.

సొంతంగా ఆల్బమ్స్ విడుదల

కిందటేడాది ముంబయిలో కిందటేడాది మా ఫ్రెండ్ మ్యూజిక్ స్టూడియోని సందర్శించాను. అక్కడ నేను రాసిన ఒక పాటను ప్లే చేశాను. ఆ పాట విన్నాక, వారు తమతో కలిసి పని చేయవచ్చని చెప్పారు. దీంతో కిందటేడాది జూలై నాటికి అనుకున్న పాటను పూర్తి చేశాను. ఈ యేడాది మార్చిలో ‘ఫెడెక్స్ ఫెడప్’ ని విడుదల చేశాను. నా వ్యక్తీకరణను ప్రపంచంతో పంచుకోవడానికి ఇది సరైన సమయం అని భావించాను.


సహాయ శర్మ

గొడవల నుంచి పాటలు

రెండేళ్ల క్రితం మా కుటుంబసభ్యులతో చాలా గొడవ పడ్డాను. భగవద్గీత ఒక శ్లోకంలో కోపానికి, భయానికి మూలకారణం అనుబంధమే అని చెబుతోంది. దీనినుంచే నా ఆల్బమ్ పుట్టిందని చెప్పవచ్చు. ఒక సమయంలో జీవితం స్తంభించుకుపోయినట్టుగా అనిపిస్తుంది. అలాంటి సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని మొదటి మ్యూజిక్ ఆల్బమ్ చేశాను. 96 బిపిఎమ్ అనేది నాన్నతో గొడవ తర్వాత రాశాను. ఈ గొడవ తర్వాత స్త్రీ ప్రవర్తన నాకు కొత్తగా అర్థమయ్యేలా చేసింది. జీవితంలోని ఆచరణాత్మక దృక్పథాన్ని, భగవంతుని పట్ల ఉండే భక్తి అన్నీ బలమైన మనిషిగా తీర్చిదిద్దాయి. నా పాటలోని సాహిత్యం అంతా ఇలాగే ఉంటుంది. ‘నేను మళ్లీ కలుస్తూనే ఉంటాను. రౌండ్ అండ్ రౌండ్‌గా తిరుగుతూనే ఉంటాను...’ అని సాగుతుంది. ఇప్పటికి మూడు ఆల్బమ్స్ విడుదలయ్యాయి.


చిత్రకళలో ఓదార్పు

రంగులలో లోతైన ఓదార్పును, శాంతిని కనుక్కోవడానికి ఉపయోగపడేదే పెయింటింగ్. సంగీతం ద్వారా నన్ను నేను బయటకు వ్యక్తపరుచుకుంటే పెయింటింగ్‌లో నన్ను నేను వెతుక్కోగలిగాను. ఇలా ఈ రెండు కళలు నన్ను కొత్తగా ఆవిష్కరింపజేశాయి. మా బామ్మ తన చీరలపై రకరకాల పెయింటింగ్స్‌ను చిత్రిస్తుండేది. వాటిని చూస్తూ నేనూ సాధన చేసేదాన్ని. అలా రంగుల ప్రపంచం నాకు పరిచయం అయ్యింది. అంతేకాదు, మా ఇల్లు రకరకాల పెయింట్స్, శిల్పాలతో ఒక ఆర్ట్ మ్యూజియంలా ఉంటుంది. మా నాన్న అంత అందంగా తీర్చిదిద్దారు ఇంటిని. ఇది కళాకారిణిగా నా విజువల్ కార్టెక్స్‌లోని ప్రతి భాగాన్ని ప్రభావితం చేసింది. అక్కడి కళాకృతుల సేకరణలో అమ్మ అభిరుచి, మన దేశీయ సంస్కృతి... నాలో లోతైన గాఢత నింపాయి. ఆ ఇష్టంతోనే సింగపూర్ ఫైన్ ఆర్ట్స్ డిగ్రీ పూర్తి చేశాను. రంగులతో ఆధ్యాత్మిక ప్రపంచాలను సృష్టిస్తుంటాను. సోలో ఎగ్జిబిషన్లు నిర్వహిస్తుంటాను. భారతదేశం, న్యూయార్క్, లండన్, బోస్టన్, దుబాయ్, హాంకాంగ్‌లోని కేఫ్‌లు, కోర్టులు, హోటళ్లు, గెస్ట్ హౌజ్ గోడలను నా పెయింటింగ్స్ అలంకరించాయి.

మార్చిన ప్రయాణాలు

అమ్మానాన్నలతో కలిసి దేశమంతా తిరిగిన రోడ్డు ప్రయాణాలు, జంగిల్ సఫారీలు, ట్రెక్కింగ్ ఏరియాలు నన్ను ప్రకృతికి దగ్గర చేశాయి. నా తల్లితండ్రులు ప్రయాణంలో సంగీతం, కళ, కథలు, సంస్కృతిని పరిచయం చేశారు. అప్పటినుంచి అందమైన ప్రకృతి దృశ్యాలను నా పెయింటింగ్స్ లో చూపించడం అలవాటు చేసుకున్నాను. కరోనా సమయంలో జీవితం ఎంత చిన్నదో కదా అనిపించింది. అప్పుడు భౌతికంగా, ఆధ్యాత్మికంగా అర్థం చేసుకోవడం మొదలుపెట్టాను. విలాసవంతమైన జీవనం అవసరమా అనేది తెలుసుకున్నాను. నా వాస్తవికత ఏమిటో అర్థమయ్యాక నేనేం సృష్టించాలో తెలుసుకున్నాను. అందువల్ల మ్యూజిక్ ఆల్బమ్స్, పెయింటింగ్స్ నన్ను కొత్తగా మార్చాయి’’ అని వివరిస్తుంది సహాయ.

ఆవిష్కరణ


అక్షితా సచ్‌దేవా

చూపున్న బాట

మనం ఏ బాట ఎంచుకోవాలో అనేది విధి నిర్ణయిస్తుందో లేదోగానీ పరిస్థితులు మాత్రం నిర్ణయిస్తాయి. డాక్టర్ కావాలనుకున్న అక్షితా సచ్‌దేవా పరిస్థితుల ప్రభావం వల్ల పరిశోధన రంగంలోకి వచ్చింది. ఎన్నో రంగాలకు చెందిన ఎంతోమంది అంధులతో మాట్లాడింది. వారి సమస్యల గురించి లోతుగా తెలుసుకుంది. వారు ఎదుర్కొంటున్న సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు కనుక్కోవాలనుకుంది. బెంగళూరు కేంద్రంగా ఆమె ప్రారంభించిన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీ ‘ట్రిస్టిల్ ల్యాబ్స్’ అంధులకు బాట చూపించే ప్రయత్నాలు చేస్తోంది. ఈ ల్యాబ్స్ నుంచి వచ్చిన ‘కిబో’ పరికరం ఆ దిశగా వేసిన తొలి అడుగు....

అక్షితా సచ్‌దేవా అమ్మమ్మ క్యాన్సర్‌తో చనిపోయింది. ఇక అప్పటి నుంచి డాక్టర్ కావాలనేది తన లక్ష్యంగా మారింది. అయితే కాలేజీ రోజుల్లో ఒక లెక్చరర్‌తో మాట్లాడిన తరువాత తన ఆలోచనల్లో మార్పు వచ్చింది.

‘డాక్టర్ కావాలి’ అనే తన లక్ష్యం గురించి చెప్పినప్పుడు క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించే సాంకేతికత, దాని ప్రాధాన్యతతో పాటు హెల్త్‌కేర్ రంగంలోని ఎన్నో ఆవిష్కరణల గురించి చెప్పారు ఆ లెక్చరర్.

‘నా కళ్లు తెరిపించిన సందర్భం అది’ అని ఆ రోజును గుర్తు చేసుకుంటుంది అక్షిత.

ఆ రోజు నుంచి హెల్త్‌కేర్ రంగానికి సంబంధించిన సాంకేతికత, సరికొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టింది.



ఫరీదాబాద్‌లోని మానవ్ రచన కాలేజ్‌లో ఇంజినీరింగ్ చేస్తున్న రోజుల్లో దృష్టి లోపం ఉన్నవారి కోసం ఒక గ్లోవ్‌ను రూపొందించింది అక్షితా సచ్‌దేవా. చూపుడు వేలిపై కెమెరా ఉండే ఈ హ్యాండ్‌గ్లోవ్ సహాయంతో దృష్టి లోపం ఉన్నవారు చదవవచ్చు.

ఈ గ్లోవ్ గురించి న్యూ ఢిల్లీలోని నేషనల్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్(ఎన్ఏబీ)కి వివరించింది అక్షిత.

దృష్టి లోపం ఉన్న ఒక యువకుడు ఈ గ్లోవ్‌ను ఉపయోగించి న్యూస్‌పేపర్ చదవగలిగాడు. ఈ విజయం ఆమెలో ఎంతో ఉత్సాహాన్ని నింపింది. ఇంకా ఏదో సాధించాలనే పట్టుదలను పెంచింది.

అంధులకు జీవనోపాధి, విద్య, దైనందిన జీవన విషయాల్లో సహాయపడడానికి తన ఆవిష్కరణను ముందుకు తీసుకువెళ్లాలనుకుంది.

అంధులు ఎదుర్కొనే సమస్యలను లోతుగా అర్థం చేసుకోవాలనుకుంది. బ్యాంకర్లు, పీహెచ్‌డీ స్కాలర్లు, గృహిణులు... వివిధ విభాగాలకు చెందిన అంధులతో మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకుంది. ఆ సమయంలోనే దీపాలి పవార్ అనే స్టూడెంట్‌తో మాట్లాడింది.

కాలేజీలో ఒక సెమిస్టర్ పూర్తి చేసిన దీపాలి హఠాత్తుగా చూపు కోల్పోయింది. ఆమెను తిరిగి తీసుకోవడానికి కాలేజి వారు నిరాకరించారు.

బ్రెయిలీ నేర్చుకోమని సలహా ఇచ్చారు. బ్రెయిలీ నేర్చుకోవడానికి దీపాలి రెండేళ్లు గడిపింది. అయితే అది ఆమెకు కష్టంగా ఉండేది.

బ్రెయిలీ నేర్చుకున్న తరువాత కూడా ఆమెకు కాలేజీలో చదివే అవకాశం రాలేదు. యశ్వంత్‌రావ్ చవాన్ మహారాష్ట్ర ఓపెన్ యూనివర్శిటీలో చేరడమే దీపాలి ముందు ఉన్న ఏకైక మార్గం అయింది.

ఆడియో–రికార్డెడ్ పుస్తకాలను అందించే ఒక స్వచ్ఛంద సంస్థను సంప్రదించింది దీపాలి.

అయితే ఒక్కొక్క పుస్తకం కోసం నాలుగు నుంచి ఆరువారాల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ఆమె దగ్గర మూడు పుస్తకాలు మాత్రమే ఉన్నాయి. ఆ పుస్తకాలను తీసుకువెళ్లిన అక్షిత వాటిని మొబైల్ అప్లికేషన్ ఫామ్‌లోకి మార్చి దీపాలికి ఇచ్చింది.

మూడు నెలల తరువాత....

దీపాలి నుంచి ఫోన్ వచ్చింది. ‘సెకండ్ ఇయర్ ఎగ్జామ్స్‌ను సింగిల్ అటెంప్ట్‌లో పూర్తి చేశాను’ అని సంతోషంగా చెప్పింది. ఇది అక్షితకు మరో విజయం. మరింత ఉత్సాహాన్ని ఇచ్చిన విజయం. ఈ ఉత్సాహ బలమే బోనీదేవ్‌తో కలిసి బెంగళూరు కేంద్రంగా ‘ట్రిస్టిల్ ల్యాబ్స్’ అనే రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీ ప్రారంభించేలా చేసింది.

నాసిక్‌లోని ‘నేషనల్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్’లో పెద్ద యంత్రాన్ని చూసింది అక్షిత. అయితే అది పెద్దగా ఉపయోగంలో లేదు. ఈ మెషిన్ ప్రింటెడ్ డాక్యుమెంట్స్‌ను చదవగలుగుతుంది. అయితే కేవలం ఇంగ్లీష్‌లో మాత్రమే. అప్పుడే అక్షితకు ఎన్నో భారతీయ భాషలకు సంబంధించిన పుస్తకాలను చదవగలిగే యంత్రాన్ని రూపొందించాలనే ఐడియా తట్టింది.

అది ‘కిబో’ రూపంలో సాకారం అయింది.

ఈ పరికరం విజయం సాధించడంతో నాసిక్ మున్సిపల్ కార్పొరేషన్, ఐఐఎం–అహ్మదాబాద్... మొదలైన సంస్థల నుంచి ఆర్డర్లు రావడం మొదలయ్యాయి.

‘భారతీయ భాషలపై దృష్టి కేంద్రీకరించిన తొలి అసిస్టివ్ టెక్ టూల్ కిబో’ అంటుంది అక్షిత.

మరింతగా...

అంధులకు ఉపకరించే దిశగా ఆసియా, ఆఫ్రికాలలో మా సంస్థను విస్తరించాలనుకుంటున్నాం. ‘కిబో’కు మరిన్ని భాషలను జోడించాలనుకొంటున్నాము. ఏఐ సాంకేతికతతో సెల్ఫ్–లెర్నింగ్, సెల్ఫ్–ట్రైనింగ్ మాడ్యూల్స్‌కు రూపకల్పన చేస్తాం.

– అక్షితా సచ్‌దేవా, కో–ఫౌండర్, ట్రిస్టిల్ ల్యాబ్స్

కిబో ఇలా...

‘కిబో’ వాటర్ బాటిల్ ఆకారంతో ఉంటుంది. దీని ఎడమవైపు ఉన్న బటన్‌ను నొక్కితే టేబుల్ ల్యాంప్ ఆకారంలోకి మారుతుంది. యూఎస్‌బీ కేబుల్ దీన్ని ల్యాప్‌టాప్‌కు కనెక్ట్ చేస్తుంది. పుస్తక పాఠాన్ని ‘కిబో’ సంగ్రహిస్తుంది. అరవై భాషలలో ఏ భాషలలోనైనా అనువాదం అడగవచ్చు. వ్యక్తులు, సంస్థల కోసం విడిగా నాలుగు ‘కిబో’ ప్రొడక్ట్స్‌ను రూపొందించారు. ‘కిబో ఎక్స్‌ఎస్’ను స్కూలు, కాలేజీలలోని లైబ్రరీల కోసం అందుబాటులో ఉంచారు. ‘కిబో 360’ని వ్యాపారసంస్థలు, యూనివర్శిటీలు, ప్రచురణ సంస్థల కోసం రూపొందించారు.



స్పోర్ట్స్



ప్రిక్వార్టర్ ఫైనల్లో కృష్ణప్రసాద్ జోడీ

కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గరగ కృష్ణప్రసాద్-సాయిప్రతీక్ (భారత్) జోడీ శుభారంభం చేసింది. కాల్గరీలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో కృష్ణప్రసాద్-సాయిప్రతీక్ ద్వయం 30 నిమిషాల్లో 21-19, 21-11తో లాప్ కాన్ కెర్న్ పోంగ్ (కెనడా)-ల్యారీ పోంగ్ (ఇంగ్లండ్) జంటపై విజయం సాధించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో లిన్ బింగ్ వె-సు చింగ్ హెంగ్ (చైనీస్ తైపీ)లతో కృష్ణప్రసాద్-సాయిప్రతీక్ తలపడతారు.



పంకజ్ అద్వానీ శుభారంభం

ఆసియా బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో భారత దిగ్గజం పంకజ్ అద్వానీ విజయంతో బోణీ కొట్టాడు. రియాద్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో పంకజ్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గాడు. బెంగళూరుకు చెందిన 38 ఏళ్ల పంకజ్ తొలి మ్యాచ్‌లో 4-2 ఫ్రేమ్‌లతో ఆంగ్ ఫియో (మయన్మార్)పై, రెండో మ్యాచ్‌లో 4-3 ఫ్రేమ్‌లతో యుట్టాపాప్ పక్‌పోజ్ (థాయ్‌లాండ్)పై గెలిచాడు. ఆసియా బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో పంకజ్ ఇప్పటివరకు తొమ్మిదిసార్లు చాంపియన్‌గా నిలిచాడు.

జగజ్జేతల ఆగమనం

నేడు స్వదేశానికి చేరుకోనున్న టి20 వరల్డ్ చాంపియన్ భారత్

- తొలుత ఢిల్లీలో ప్రధానితో రోహిత్ బృందం భేటీ
- సాయంత్రం ముంబైలో బీసీసీఐ ఆధ్వర్యంలో రోడ్ షో, సన్మానం





ఇక్కడేమో అభిమానులు... అక్కడేమో ప్రపంచకప్ గెలిచిన క్రికెటర్లు... ఎన్నాళ్లీ నిరీక్షణ, ఎందుకీ పరీక్ష అని చూసే ఎదురుచూపులకు నేడు తెర పడనుంది. ప్రతికూల వాతావరణంతో బార్బడోస్‌లోనే ఇరుక్కుపోయిన టి20 వరల్డ్ చాంపియన్ భారత జట్టు గురువారం తెల్లవారగానే న్యూఢిల్లీకి చేరుకుంటుంది. వీరికి ఘనస్వాగతం పలికేందుకు బోర్డుతో పాటు వీరాభిమానులు తెగ ఆరాటం కనబరుస్తున్నారు. దీంతో దేశ రాజధాని ఢిల్లీ, వాణిజ్య రాజధాని ముంబై సంబరాల్లో మునిగితేలనున్నాయి.




తల్లిదండ్రులతో అర్ష్‌దీప్ సింగ్

ముంబై: టి20 ప్రపంచకప్‌ను జయించిన భారత క్రికెట్ జట్టు సభ్యులు కాస్త ఆలస్యంగా నేడు స్వదేశానికి చేరుకుంటున్నారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), ఎయిరిండియా సమన్వయంతో చార్టెర్డ్ ఫ్లయిట్‌లో చాంపియన్లు, జట్టు సహాయక సిబ్బంది, బోర్డు అధ్యక్ష కార్యదర్శులు రోజర్ బిన్నీ, జై షాలతో పాటు భారత్‌కు చెందిన మీడియా ప్రతినిధులు బార్బడోస్‌లోని గ్రాంట్లీ ఆడమ్స్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బుధవారం బయలుదేరారు. ఫ్లయిట్ షెడ్యూల్ టైమ్ ప్రకారం గురువారం ఉదయం గం. 6:20 గంటలకు న్యూఢిల్లీ చేరుకుంటుంది. కాసేపు ఆటగాళ్ల ప్రయాణ బడలిక నుంచి సేదతీరాక ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలుసుకుంటారు. 'ఢిల్లీ విమానాశ్రయంలో 6 గంటలకు ఫ్లయిట్ ల్యాండ్ అవుతుంది. కొద్దిసేపు విశ్రాంతి అనంతరం ఆటగాళ్లు ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీ నివాసంలో భేటీ అవుతారు. ఇదివరకే విజేత సభ్యులను సోషల్ మీడియా ద్వారా, ఫోన్‌లో అభినందించిన ప్రధాని కాసేపు క్రికెటర్లతో గడుపుతారు' అని బోర్డు సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపారు. ఈ భేటీ ముగిసిన వెంటనే మరో ప్రత్యేక విమానంలో టీమిండియా ముంబైకి పయనమవుతుంది. ముంబైలోనే బోర్డు అంబరాన్నంటే సంబరాలకు అన్ని ఏర్పాట్లు చేసింది. అక్కడికి చేరుకోగానే ముంబై, మహారాష్ట్ర క్రికెట్ సంఘాలు ఘనస్వాగతం పలుకుతాయి. 'సాయంత్రం 5 గంటలకు నారీమన్ పాయింట్ వద్ద ప్రత్యేకంగా తీర్చిదిద్దిన ఓపెన్ టాప్ బస్‌లో క్రికెటర్ల రోడ్‌షో మొదలవుతుంది. అక్కడి నుంచి విఖ్యాత వాంఖెడే స్టేడియం వరకు సుమారు రెండు గంటలపాటు సాగే ఈ షోలో అభిమానులు అడుగడుగునా నీరాజనాలు పలుకుతారు. రాత్రి 7 గంటల సమయంలో స్టేడియంలో ఆటగాళ్లు, సహాయ సిబ్బందిని ఒక్కొక్కరిగా ఘనంగా సన్మానిస్తారు. బోర్డు ప్రకటించిన రూ. 125 కోట్ల ప్రైజ్‌మనీని కూడా అందజేస్తారు' అని శుక్లా పూర్తి బిజీ షెడ్యూల్ వివరాలను వెల్లడించారు. ఈ విక్టరీ పరేడ్‌లో అభిమానులంతా పాల్గొనాల్సిందిగా బోర్డు కార్యదర్శి జై షా 'ఎక్స్' (ట్విట్టర్)లో విజ్ఞప్తి చేశారు. ఇలాంటి రోడ్‌షో 17 ఏళ్ల క్రితం తొలి టి20 ప్రపంచకప్ గెలిచిన ధోని బృందానికి నిర్వహించారు. కానీ 2011 వన్డే ప్రపంచకప్ గెలిచిన అదే ధోని సేనకు ఐపీఎల్ త్వరలోనే ప్రారంభం కావాల్సి ఉండటంతో రోడ్ షోను నిర్వహించలేదు.

న్యూయార్క్ టు న్యూఢిల్లీ.. వయా బార్బడోస్

గత నెల 29న రోహిత్ శర్మ బృందం టి20 వరల్డ్‌కప్ గెలిచింది. ఆదివారం అర్ధరాత్రి లేదంటే సోమవారం ఉదయానికల్లా జగజ్జేతలు భారత్‌కు రావాలి. కానీ కరీబియన్‌లో భీకరమైన హరికేన్ తుఫాన్ వల్ల బార్బడోస్ ఎయిర్‌పోర్ట్‌ను మూసివేశారు. దీంతో టీమిండియా ఆటగాళ్లంతా అక్కడే ఇరుక్కుపోయారు. ఎట్టకేలకు కరీబియన్‌లో టి20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు సభ్యులు కప్‌తో వచ్చేస్తున్నారు. ఎయిరిండియా చొరవ, న్యూయార్క్‌లోని ప్రయాణీకుల సహకారంతో దారి మళ్లించిన విమానంలో టీమిండియా క్రికెటర్లు, మీడియా సంస్థల ప్రతినిధులు గురువారం ఉదయం న్యూఢిల్లీకి చేరుకుంటారు. అయితే వాతావరణ పరిస్థితిలో మార్పురావడంతో న్యూయార్క్ (అమెరికా) నుంచి న్యూఢిల్లీకి ప్రయాణించాల్సిన ఎయిరిండియా విమానాన్ని వయా బార్బడోస్ మీదుగా దారి మళ్లించారు. ఈ విమానం కోసం టికెట్లు బుక్ చేసుకున్న సాధారణ ప్రయాణికులకు ముందస్తు సమాచారం ఇచ్చి అసౌకర్యం కలుగకుండా చూశారు. ఇంకొందరికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఇక విజేతల కోసం 'ఏఐసీ24డబ్ల్యూసీ' (ఎయిరిండియా చాంపియన్స్ 24 ప్రపంచకప్) పేరిట ఈ విమానాన్ని ముస్తాబుచేసి బార్బడోస్‌లో క్రికెటర్లను ఎక్కించుకొని బుధవారం బయలుదేరింది. అయితే నిర్ణీత రూట్ కాకుండా మరో రూట్ మారడంపై డీజీసీఏ (విమానయాన నియంత్రణ సంస్థ) ఎయిరిండియాను నివేదిక కోరింది.

తొలిసారి శిఖరాన...

వరల్డ్ నంబర్‌వన్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యా

- ఈ ఘనత సాధించిన తొలి భారతీయ క్రికెటర్‌గా గుర్తింపు
- ఐసీసీ టి20 ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: తన అద్భుత ప్రదర్శనతో టి20 ప్రపంచకప్‌లో భారత్‌కు టైటిల్ దక్కడంలో తనవంతు పాత్ర పోషించిన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మరో ఘనత సాధించాడు. బుధవారం విడుదల చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) టి20 ర్యాంకింగ్స్‌లో ఆల్‌రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ క్రికెటర్‌గా పాండ్యా గుర్తింపు పొందాడు. ఓవరాల్‌గా ఐసీసీ టి20 ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా నిలిచిన ఆరో భారతీయ ప్లేయర్‌గా హార్దిక్ నిలిచాడు. గతంలో బ్యాటింగ్ విభాగంలో గౌతమ్ గంభీర్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్... బౌలింగ్ విభాగంలో జస్‌ప్రీత్ బుమ్రా, రవి బిష్ణోయ్ ఈ ఘనత సాధించారు. గత ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో ఉన్న హార్దిక్ రెండు స్థానాలు పురోగతి సాధించి ప్రస్తుతం టాప్ ర్యాంక్‌లో ఉన్న శ్రీలంక కెప్టెన్ హసరంగ సరసన నిలిచాడు. వీరిద్దరి ఖాతాలో 222 రేటింగ్ పాయింట్లున్నాయి. 30 ఏళ్ల హార్దిక్ టి20 ప్రపంచకప్‌లో 144 పరుగులు చేయడంతోపాటు 11 వికెట్లు పడగొట్టాడు. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ' అవార్డు పొందిన బుమ్రా 12 స్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌లో నిలిచాడు. అక్షర్ పటేల్ ఏడో ర్యాంక్‌లో, కుల్దీప్ యాదవ్ తొమ్మిదో ర్యాంక్‌లో ఉన్నారు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో సూర్యకుమార్ తన రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు.

రూడ్... రెండో రౌండ్‌లోనే అవుట్

మూడో రౌండ్‌లోకి అల్‌కరాజ్, మెద్వెదెవ్



లండన్: ఐదో ప్రయత్నంలోనూ నార్వే స్టార్ ప్లేయర్, ఎనిమిదో సీడ్ కాస్పర్ రూడ్ వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో రెండో రౌండ్‌ను దాటలేకపోయాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో రూడ్ 4-6, 5-7, 7-6 (7/1), 3-6తో ఫాబియో ఫాగ్నిని (ఇటలీ) చేతిలో ఓడిపోయాడు. 3 గంటల 18 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రూడ్ 15 ఏస్‌లు సంధించినా, 47 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్), ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో అల్‌కరాజ్ 7-6 (7/5), 6-2, 6-2తో వుకిచ్ (ఆస్ట్రేలియా)పై, మెద్వెదెవ్ 6-7 (3/7), 7-6 (7/4), 6-4, 7-5తో ముల్లర్ (ఫ్రాన్స్)పై గెలుపొందారు. మహిళల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. అంకా టోడోని (రొమేనియా)తో జరిగిన రెండో రౌండ్‌లో కోకో గాఫ్ 6-2, 6-1తో గెలిచింది. ప్రపంచ మాజీ నంబర్‌వన్, నాలుగు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ విజేత నయోమి ఒసాకా (జపాన్) రెండో రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఎమ్మా నవారో (అమెరికా) 6-4, 6-1తో ఒసాకాను ఓడించింది. మరోవైపు భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ డబుల్స్‌లోనూ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగాడు. తొలి రౌండ్‌లో సుమిత్-లాజోవిచ్ (సెర్బియా) ద్వయం 2-6, 2-6తో మార్టినెజ్-మునార్ (స్పెయిన్) జోడీ చేతిలో ఓడిపోయింది.

బ్రెజిల్ ముందుకు...



సాంటాక్లారా (అమెరికా): కోపా అమెరికా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మాజీ విజేత బ్రెజిల్ జట్టు క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. కొలంబియా జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ 'డి' చివరి లీగ్ మ్యాచ్‌ను బ్రెజిల్ 1-1తో 'డ్రా'గా ముగించింది. బ్రెజిల్ తరఫున రాఫినా (12వ ని.లో), కొలంబియా తరఫున డేనియల్ మునోజ్ (45+2వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఏడు పాయింట్లతో కొలంబియా గ్రూప్ 'టాపర్'గా నిలువగా... ఐదు పాయింట్లతో బ్రెజిల్ రెండో స్థానంలో నిలిచి క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో ఈక్వెడార్‌తో అర్జెంటీనా; వెనిజులాతో కెనడా; పనామాతో కొలంబియా; ఉరుగ్వేతో బ్రెజిల్ తలపడతాయి.

16 ఏళ్ల తర్వాత...



లీప్‌జిగ్ (జర్మనీ): యూరో కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో తమ జోరు కొనసాగిస్తూ టర్కీ జట్టు క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఆస్ట్రియా జట్టుతో బుధవారం జరిగిన చివరి ప్రిక్వార్టర్ ఫైనల్లో టర్కీ 2-1 గోల్స్ తేడాతో గెలిచింది. దాంతో 2008 తర్వాత ఈ టోర్నీలో టర్కీ జట్టు మళ్లీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. టర్కీ తరఫున మెరీ డెమిరల్ 1వ నిమిషంలో, 59వ నిమిషంలో రెండు గోల్స్ సాధించి తన జట్టును గెలిపించాడు. ఆస్ట్రియా తరఫున గ్రెగోరిష్ (66వ ని.లో) ఏకైక గోల్ చేశాడు. ఈ మ్యాచ్‌తో ప్రిక్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లు ముగిశాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో స్పెయిన్‌తో జర్మనీ; పోర్చుగల్‌తో ఫ్రాన్స్; ఇంగ్లండ్‌తో స్విట్జర్లాండ్; నెదర్లాండ్స్‌తో టర్కీ తలపడతాయి.

సినిమా

జోడీ రిపీట్?


సమంత


విజయ్

'కత్తి' (2014), 'తేరీ' (2016), 'మెర్సల్' (2017) చిత్రాల తర్వాత హీరో విజయ్-హీరోయిన్ సమంత మళ్లీ జోడీగా కనిపించే అవకాశం ఉందని కోలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. విజయ్ హీరోగా హెచ్. వినోద్ దర్శకత్వంలో ఓ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందని కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న విషయం విదితమే. ఈ సినిమాలో హీరోయిన్‌గా ఇప్పటికే మృణాల్ ఠాకూర్, పూజా హెగ్డే వంటి తారల పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా సమంత పేరు వినిపిస్తోంది. ఇటీవల సమంతకు హెచ్. వినోద్ ఈ సినిమా స్టోరీ లైన్ చెప్పారట. కథ, ఇందులోని పాత్ర నచ్చడంతో సమంత ఈ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. ఇక ఈ సినిమా తర్వాత విజయ్ పూర్తి స్థాయిలో రాజకీయాల్లోకి వెళ్లాలనుకుంటున్నారు. సో.. విజయ్ నటించే చివరి సినిమా ఇదే అవుతుంది. ఆల్రెడీ విజయ్‌తో మూడు సినిమాలు చేసిన సమంత ఆయన చివరి సినిమాలో కూడా హీరోయిన్‌గా నటిస్తారా? విజయ్-సమంతల జోడీ నాలుగోసారి రిపీట్ అవుతుందా అనే ప్రశ్నకు సమాధానం కొన్ని రోజుల్లో తెలిసిపోతుంది.


వెంకటేశ్, మీనాక్షి

భార్య-భర్త-మధ్యలో మాజీ ప్రేయసి

'ఎఫ్ 2, ఎఫ్ 3' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత హీరో వెంకటేశ్-దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్ కాంబినేషన్‌లో కొత్త సినిమా షురూ అయింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై రూపొందుతున్న 58వ చిత్రమిది. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో వెంకటేశ్‌కి జోడీగా మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేష్ నటిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. వెంకటేశ్-మీనాక్షీ చౌదరిలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత సురేష్‌బాబు కెమెరా స్విచ్చాన్ చేయగా, మరో నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ కె. రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకుడు వంశీ పైడిపల్లి స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. ''హీరో, అతని భార్య, మాజీ ప్రేయసి... ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీ రూపొందుతోంది. హీరో- దర్శక-నిర్మాతల కాంబినేషన్‌లో ఇప్పటికే రెండు బ్లాక్‌బస్టర్‌లు రావడంతో మూడో చిత్రం కోసం సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రేక్షకులకు మునుపెన్నడూ కలగని అనుభూతిని అందించడానికి టాప్ టెక్నీషియన్స్ ఈ సినిమా కోసం పని చేస్తున్నారు'' అన్నారు మేకర్స్. ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయి కుమార్, వీకే నరేశ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్, కెమెరా: సమీర్ రెడ్డి.

సెప్టెంబరులో సెట్


మహేశ్ బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను శరవేగంగా చేస్తున్నారు రాజమౌళి. సెప్టెంబరులో ఈ సినిమాని సెట్స్‌కి తీసుకెళ్లాలన్నది రాజమౌళి ముందున్న ప్రస్తుత టార్గెట్ అట. ఇందులో భాగంగానే హైదరాబాద్‌లో కొన్ని రోజుల క్రితమే ఈ చిత్రానికి చెందిన సెట్ వర్క్‌ను ఆరంభించారని తెలిసింది. జస్ట్ ఒక్క సెట్ కాదు... పలు రకాల సెట్స్‌ను డిజైన్ చేయిస్తున్నారట రాజమౌళి. వీటిలో ఆఫీస్ సెట్ కూడా ఉందని, ఎక్కువ శాతం షూటింగ్ ఈ సెట్‌లో జరుగుతుందని భోగట్టా. ప్రస్తుతం తయారు చేయిస్తున్న సెట్స్‌లో ఏదో ఒక సెట్‌లో తొలి షెడ్యూల్‌ని ఆరంభిస్తారట. ప్రస్తుతం ఈ సినిమాకు చెందిన నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారు రాజమౌళి. ఈ క్రమంలోనే ఈ సినిమాలోని విలన్ పాత్రకు మలయాళ నటుడు- దర్శక-నిర్మాత పృథ్వీరాజ్ సుకుమారన్‌ను తీసుకున్నారనే టాక్ ప్రచారంలోకి వచ్చింది.

కథ వినగానే మా అమ్మ గుర్తొచ్చింది - రానా



విశ్వదేవ్, నివేదా థామస్, రానా

''పాఠశాలలో చదువుతున్నప్పుడు 35 నంబర్ నాకు పెద్ద పర్వతంలాంటిది (నవ్వుతూ). నందు '35-చిన్న కథ కాదు' చెప్పినప్పుడు నాకు నేను గుర్తొచ్చాను, మా అమ్మ గుర్తొచ్చింది. ఈ కథని మా అమ్మకు చెప్పాను. ఇది మన అందరి కథ. ఈ కథని అందరూ రిలేట్ చేసుకుంటారు'' అని హీరో రానా దగ్గుబాటి అన్నారు. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం '35-చిన్న కథ కాదు'. నంద కిశోర్ ఈమాని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రానా మాట్లాడుతూ- ''వాణిజ్య సినిమాలు చాలా వస్తుంటాయి. కానీ ఇలాంటి ప్యూర్ హార్ట్ వార్మింగ్ స్టోరీలు రావడం చాలా అరుదు. ఇలాంటి మంచి కథలు సురేష్ ప్రొడక్షన్‌లో చేయాలనేది మా ఉద్దేశం. థియేటర్స్‌లో ఈ సినిమా చూసి ఎంజాయ్ చేయండి'' అన్నారు. ''35-చిన్న కథ కాదు'లో తల్లి పాత్రలో కనిపిస్తాను. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రల్లో చాలా డిఫరెంట్ క్యారెక్టర్‌ని ఈ సినిమాలో చేశాను'' అన్నారు నివేదా థామస్. ''35-చిన్న కథ కాదు' చాలా పెద్ద సినిమా'' అన్నారు నంద కిశోర్. ''ఈ సినిమా గొప్ప అనుభూతినిస్తుంది. మాకు మైలురాయిగా నిలిచిపోతుంది'' అన్నారు సృజన్ యరబోలు. ఈ కార్యక్రమంలో నటుడు విశ్వదేవ్ మాట్లాడారు.


నిత్యా మీనన్

విజయ్ సేతుపతి సరసన...

హీరో, క్యారెక్టర్ ఆర్టిస్టు, విలన్... ఇలా విభిన్న పాత్రలతో విలక్షణ నటుల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు విజయ్ సేతుపతి. ఇటీవల విజయ్ సేతుపతి హీరోగా నటించిన 'మహారాజ' సినిమా విడుదలై, బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన హీరోగా తమిళ దర్శకుడు పాండిరాజ్ ఓ కథను రెడీ చేశారట. గతంలోనే ఈ కథను విజయ్ సేతుపతికి వినిపించారట పాండిరాజ్. ఈ సినిమాలో నిత్యా మీనన్‌ను హీరోయిన్‌గా అనుకుంటున్నారని కోలీవుడ్ సమాచారం. ఇదిలా ఉంటే... రెండేళ్ల క్రితం డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో డైరెక్ట్‌గా విడుదలైన '19 (1)(ఎ)' సినిమాలో విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ స్క్రీన్ షేర్ చేసుకున్న విషయం గుర్తుండే ఉంటుంది. ఈ ఇద్దరూ పాండిరాజ్ సినిమా కోసం మరోసారి స్క్రీన్ షేర్ చేసుకునే చాన్స్ ఉంది.



'లైలా'గా విశ్వక్

లవర్స్ డేకి లైలా

విశ్వక్ సేన్ అమ్మాయి గెటప్‌లో ఎలా ఉంటారు? అంటే ఇదిగో ఇలా ఉంటారు అంటూ కళ్లు మాత్రమే చూపిస్తూ లుక్‌ను రిలీజ్ చేసింది 'లైలా' చిత్రబృందం. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా'లో విశ్వక్ సేన్ కొన్ని సన్నివేశాల్లో లేడీ గెటప్‌లో కనిపించనున్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో ఆకాంక్షా శర్మ హీరోయిన్‌గా పరిచయం కానున్నారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. తొలి సీన్‌కి దర్శకుడు హరీష్ శంకర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు కె. రాఘవేంద్ర రావు క్లాప్ ఇచ్చారు. సినిమా స్క్రిప్ట్‌ను నిర్మాతలు వెంకట సతీష్ కిలారు, పి. కిరణ్ మేకర్స్‌కి అందజేశారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేమికుల దినోత్సవం సందర్భంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''విశ్వక్ సేన్‌కు ఇది బ్యూటిఫుల్ మేకోవర్. 'లైలా'లో విశ్వక్ మ్యాన్ అండ్ ఉమన్‌గా కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: తనిష్క్ బాగ్చి, జిబ్రాన్, కెమెరా: రిచర్డ్ ప్రసాద్.


విశ్వక్ సేన్, ఆకాంక్షా శర్మ

రావణుడు వస్తున్నాడు


రక్షిత్

'పలాస 1978' మూవీ ఫేమ్ రక్షిత్ అట్లూరి హీరోగా రూపొందిన తాజా చిత్రం 'ఆపరేషన్ రావణ్'. సంగీర్తనా విపిన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో రాధికా శరత్ కుమార్ ముఖ్య పాత్ర చేశారు. వెంకట సత్య దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ధ్యాన్ అట్లూరి తెలుగు, తమిళ భాషల్లో నిర్మించారు. ఈ చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. ఇందులో రక్షిత్ అట్లూరి చేసిన యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులను అలరిస్తాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్, కెమెరా: నాని చమిడిశెట్టి.

సరికొత్త రాచరికం


అప్సర

అప్సరా రాణి, వరుణ్ సందేశ్, విజయ్ శంకర్ ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'రాచరికం'. సురేష్ లంకలపల్లి దర్శకత్వంలో ఈశ్వర్ నిర్మించిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''సరికొత్త కథతో 'రాచరికం' చిత్రాన్ని రూపొందించాం, ఇటీవల ఈ సినిమా నుంచి ఉగ్ర రూపం దాల్చిన కాళీ మాతగా అప్సరా రాణి పోస్టర్ రిలీజ్ చేయగా మంచి స్పందన వచ్చింది. థ్రిల్లింగ్ కాన్సెప్ట్, డిఫరెంట్ కంటెంట్‌తో సగటు ప్రేక్షకుడిని కట్టిపడేసే సన్నివేశాలతో ఈ సినిమా ఉంటుంది. అతి త్వరలో సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు.

ఎమోషనల్ చౌకీదార్


పృథ్వీ, ధన్య

పృథ్వీ అంబర్ నటిస్తున్న పాన్ ఇండియన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'చౌకీదార్'. ఈ బహు భాషా చిత్రాన్ని చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వంలో కల్లహళ్లి చంద్రశేఖర్ నిర్మిస్తున్నారు. బెంగళూరులోని బండే మహంకాళి ఆలయంలో ఈ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. తొలి సీన్‌కి సాయికుమార్ కెమెరా స్విచ్చాన్ చేయగా, కల్లహళ్లి చంద్రశేఖర్ క్లాప్ ఇచ్చారు. పృథ్వీ అంబర్ మాట్లాడుతూ- ''ఈ చిత్రంలో పలు జీవితానుభవాలు ఉంటాయి'' అన్నారు. ''ఓ డిఫరెంట్ కథను ప్రేక్షకులకు చెప్పాలని ఈ కథను రెడీ చేశాను'' అన్నారు చంద్రశేఖర్. ''చౌకీదార్' మంచి ఎమోషనల్ డ్రామా. ఇందులో నాది చాలా మంచి పాత్ర'' అన్నారు సాయికుమార్.

సాక్షి
బిజినెస్
గురువారం
4-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	545	79,987
నిఫ్టీ ▲	163	24,287

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	18,188	▲	159
డోజోన్స్	39,308	▼	28
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,171	▲	50
డాక్స్	18,375	▲	210
షాంఘై	2,982	▼	50
నికాయ్	40,581	▲	210

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్
రూ.లలో

ముంబై


బంగారం (99.9 స్వచ్ఛత)	72,226	▲	534
బంగారం (99.5 స్వచ్ఛత)	71,937	▲	532
వెండి (కిలో)	89,698	▲	1,683

ఫారెక్స్ రేట్లు
రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.12	84.14
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.83	107.38
€	యూరో	ఎస్‌బీఐ	88.69	91.04
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.29	52.41
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.88	56.82
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.25	63.94
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.91
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.83	23.61
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.37	12.44

సూచీల సరికొత్త రికార్డులు

- బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లకు డిమాండ్
- అంతర్జాతీయ మార్కెట్ల సానుకూలతలు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలో బుధవారం మరో మరపురాని రోజు. బీఎస్ఈ సెన్సెక్స్ సూచీ తొలిసారి 80,000 శిఖరాన్ని తాకింది. బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, ఫైనాన్స్, పారిశ్రామిక షేర్లు ముందుండి నడిపించాయి. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేరు 2% రాణించి సూచీలకు దన్నుగా నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడే ముగింపులోనూ తాజా రికార్డులు నమోదు చేశాయి. ఉదయం సెన్సెక్స్ 572 పాయింట్ల లాభంతో 80 వేల స్థాయిపైన 80,013 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ఇంట్రాడేలో 633 పాయింట్లు పెరిగి 80,074 వద్ద జీవిత కాల గరిష్టాన్ని నమోదు చేసింది. అయితే చివర్లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో 545 పాయింట్ల లాభంతో 80 వేల స్థాయి దిగువన 79,987 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో నిఫ్టీ 183 పాయింట్లు ఎగసి 24,307 వద్ద ఆల్‌టైం హైని అందుకుంది. చివరికి 163 పాయింట్ల లాభంతో 24,287 వద్ద స్థిరపడింది. లార్జ్‌క్యాప్ షేర్లలో ర్యాలీ క్రమంగా చిన్న, మధ్య తరహా షేర్లకు విస్తరించింది. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.86%, 0.86 శాతం రాణించాయి.

- బ్యాంకుల స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏలు) 12 ఏళ్ల కనిష్టమైన 2.8 శాతానికి పరిమితం కావడంతో బ్యాంకింగ్ షేర్లు మరింత రాణిస్తాయని విశ్లేషకుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఫలితంగా కోటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్ బ్యాంక్, ఎస్‌బీఐలు 2% లాభపడ్డాయి.
- బ్యాంకింగ్ షేర్ల ర్యాలీతో పాటు ఎంఎస్‌సీఐ ఇండెక్సు ఆగస్టు సమీక్షలో వెయిటేజీ పెంచవచ్చనే అంచనాలతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 2% పెరిగి రూ.1,768 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 3.50% ఎగసి రూ.1,792 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది. దీంతో మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.28,758 కోట్లు ఎగసి రూ.13.45 లక్షల కోట్లకు చేరుకుంది.
- ఈ జూన్ 25న 78 వేల స్థాయిని అందుకున్న సెన్సెక్స్... 80,000 స్థాయిని చేరేందుకు కేవలం ఏడు ట్రేడింగ్ సెషన్ల సమయాన్ని మాత్రమే తీసుకుంది.
- ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం(జూన్ 9న) నాటి నుంచి 3,294 పాయింట్లు ర్యాలీ చేసింది.



సెన్సెక్స్ 80 వేల స్థాయిని అందుకోవడం దలాల్ స్ట్రీట్‌కు దక్కిన పెద్ద విజయం. లేమన్ సంక్షోభం (2008)లో 8800 స్థాయికి దిగివచ్చింది. కానీ 16 ఏళ్లలో 9 రెట్ల ఆదాయాలు ఇచ్చింది. నాలుగేళ్ల క్రితం కరోనా భయాలతో 26,000 స్థాయికి చేరుకుంది. అయితే పతనమైన ప్రతిసారీ అంతే వేగంగా పుంజుకుంది. ఈక్విటీ మార్కెట్లు దీర్ఘకాలానికి అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తాయి అనేందుకు ఇది నిదర్శనం.

– శ్రీకాంత్ చౌహాన్
కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ హెడ్

సెన్సెక్స్ రికార్డు ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలోని కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ జీవితకాల గరిష్ట స్థాయి రూ.445.43 లక్షల కోట్లకు చేరింది.

వ్రజ్ ఐరన్ బంపర్ లిస్టింగ్

వ్రజ్ ఐరన్ అండ్ స్టీల్ లిస్టింగ్ రోజే అప్పర్ సర్క్యూట్ తాకింది. బీఎస్ఈలో 16% ప్రీమియంతో రూ.240 వద్ద లిస్టయ్యింది. ఈక్విటీ మార్కెట్ రికార్డు ర్యాలీతో మరింత కొనుగోళ్ల మద్దతు లభించింది. చివరికి 22% లాభపడి రూ.252 అప్పర్ సర్క్యూట్ వద్ద లాకైంది. కంపెనీ మార్కెట్ విలువ రూ.831 కోట్లుగా నమోదైంది.

జూన్ 4: ఎన్డీయేకు బంపర్ మెజారిటీ ఖాయమన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో ముందు రోజు 2,500 పాయింట్ల ర్యాలీ చేసి మార్కెట్ ఫుల్ జోష్ మీదుంది. అయితే, తెల్లారేసరికి అంచనాలు తారుమారయ్యాయి. మార్కెట్‌కు ఎన్నికల ఫలితాల ట్రెండ్ ఊహించన్ని షాకిచ్చింది. బీజేపీకి సొంతంగా మ్యాజిక్ ఫిగర్ కష్టమేనని తెలిపోవడంతో దేశీ స్టాక్ మార్కెట్‌పై అమ్మకాల సునామీ విరుచుకుపడింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ దాదాపు 6,234 పాయింట్లు దిగజారి ఏకంగా 70,234 పాయింట్లకు కుప్పకూలింది. చివరికి 4,390 పాయింట్ల భారీ నష్టంతో 72,079 వద్ద ముగిసింది.

కట్ చేస్తే...

జూలై 3: ఎన్నికల ఫలితాలతో బుర్రతిరిగిన బుల్.. మళ్లీ రంకెలేస్తూ దూసుకుపోయింది. సరిగ్గా నెల రోజుల వ్యవధిలో (ఫలితాల రోజు కనిష్ట స్థాయితో పోలిస్తే) దాదాపు 10,000 పాయింట్ల ర్యాలీతో దుమ్మురేపింది. చరిత్రలో తొలిసారి 80,000 పాయింట్ల మైలురాయిని అధిగమించింది. రోజుకో సరికొత్త రికార్డులతో హోరెత్తిస్తోంది.

సెన్సెక్స్ రోలర్ కోస్టర్

- నెల రోజుల్లో 10,000 పాయింట్లు జంప్
- ఫలితాల రోజున ఏకంగా 6,234 పాయింట్లు క్రాష్
- 70,234 పాయింట్ల కనిష్ట స్థాయికి పతనం



ఎగ్జిట్ పోల్స్ అంచనాలన్నింటినీ తలకిందులు చేస్తూ ఎన్నికల ఫలితాలు బీజేపీ, ఎన్డీయే కూటమిని బిత్తరపోయేలా చేశాయి. అయితే, మిత్రపక్షాల దన్నుతో మళ్లీ సుస్థిర ఎన్డీయే సర్కారు కొలువుదీరడంతో మార్కెట్ వర్గాలు ఊపిరిపీల్చుకున్నాయి. ఫలితాల రోజున నష్టాలన్నింటినీ మూడు రోజుల్లోనే ఎగిరిపోయాయి. వృద్ధికి ఊతమిచ్చేలా 100 రోజుల అజెండాను ప్రకటించిన మోదీ 'హ్యాట్రిక్' ప్రభుత్వ చర్యలు ఇన్వెస్టర్లలో మళ్లీ ఉత్సాహాన్ని నింపాయి. విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాల బాటను వీడి మళ్లీ కొనుగోళ్ల రూట్లోకి రావడం కూడా మార్కెట్‌కు మరింత ఇం'ధనాన్ని' అందించింది. రాబోయే కాలంలో మౌలిక రంగ ప్రాజెక్టులపై మోదీ సర్కారు భారీగా ఖర్చు చేయనుండటం, బడ్జెట్లో వృద్ధికి ఊతమిచ్చేలా పలు చర్యలు ఉంటాయన్న అంచనాలతో మార్కెట్లో ర్యాలీ కొనసాగుతోంది. తాజాగా 80,000 పాయింట్ల శిఖరాన్ని కూడా దాటేయడం దీనికి నిదర్శనం. కాగా, ఈ ఏడాది చివరికల్లా సెన్సెక్స్ 90,000 పాయింట్లను తాకే అవకాశాలు మెండుగా ఉన్నా యని సుందరం మ్యూచువల్ ఫండ్ మాజీ ఎండీ సునీల్ సుబ్రమణ్యం అంచనా వేయడం విశేషం. దీనికి ప్రధానంగా లార్జ్ క్యాప్ షేర్ల ర్యాలీ దన్ను గా నిలుస్తుందని కూడా ఆయన చెబుతున్నారు. కాగా, ఇన్వెస్టర్ల సంపద గత నెల రోజుల్లోనే రూ. 50 లక్షల కోట్లు దూసుకెళ్లింది. జూన్ 4న రూ.395 లక్షల కోట్లుగా ఉన్న బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జూలై 3న రూ.445.5 లక్షల కోట్లకు ఎగబాకడం గమనార్హం!

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఇక 'కూ'త ఉండదు!



- నిధుల కొరత, భాగస్వామ్య యత్నాల వైఫల్యంతో మూసివేత
- వ్యవస్థాపకులు రాధాకృష్ణ, మయాంక్ వెల్లడి

న్యూఢిల్లీ: మైక్రోబ్లాగింగ్ సైట్ ఎక్స్ (గతంలో ట్విటర్)కు ఒక దశలో దేశీ ప్రత్యామ్నాయంగా ఎదిగిన 'కూ' మూతబడుతోంది. నిధుల కొరత, దిగ్గజ కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో సేవలను నిలిపివేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు అప్రమేయ రాధాకృష్ణ, మయాంక్ బిదావత్కా వెల్లడించారు. 'పలు ఇంటర్నెట్ కంపెనీలు, దిగ్గజ సంస్థలు, మీడియా సంస్థలతో భాగస్వామ్యం కోసం ప్రయత్నించాం. అయితే, వాటితో చర్చలు మేము ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. మేము యాప్‌ను కొనసాగించాలనే అనుకున్నా టెక్నాలజీ సేవల వ్యయాలు భారీగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో కఠిన నిర్ణయం తీసుకోక తప్పలేదు' అని లింక్డ్ఇన్‌లో వారు పోస్ట్ చేశారు. 2021లో ట్విటర్, కేంద్ర ప్రభుత్వం మధ్య వివాదం తలెత్తినప్పుడు 'కూ' చాలా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఒక దశలో కోటి పైగా నెలవారీ యాక్టివ్ యూజర్లు, రోజుకు 21 లక్షల మంది యాక్టివ్ యూజర్లు ఉండేవారు.

సేవలకు కొత్త ఆర్డర్ల భరోసా

జూన్‌లో సూచీ 60.5కు అప్

న్యూఢిల్లీ: సేవల రంగం జూన్‌లో మంచి ఫలితాన్ని నమోదుచేసుకుంది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ 60.5కు ఎగసింది. మేలో సూచీ ఐదు నెలల కనిష్ట స్థాయి 60.2కు పడిపోయిన సంగతి తెలిసిందే.



కొత్త ఆర్డర్లు పెరగడం, దేశీయ, అంతర్జాతీయ విక్రయాల్లో పురోగతి వంటి అంశాలు జూన్‌లో పటిష్ట ఫలితాలు రావడానికి కారణం. కాగా, సూచీ 50పైన ఉంటే దానిని వృద్ధి ధోరణిగానే పరిగణించే సంగతి తెలిసిందే. సూచీ 50 దిగువకు పడిపోతేనే దానిని క్షీణతగా పరిగణిస్తారు. ఇదిలావుండగా, సేవలు-తయారీ విభాగాలతో కలగలిపిన హెచ్ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ అవుట్‌పుట్ ఇండెక్స్ కూడా మేలో 60.5 వద్ద ఉంటే, జూన్‌లో 60.9కి ఎగసింది. 400 సంస్థల ప్యానెల్‌కు పంపిన ప్రశ్నపత్రాలకు వచ్చిన ప్రతిస్పందనలతో హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్‌ను ఎస్అండ్‌పీ గ్లోబల్ రూపొందిస్తుంది.

ఏజీఐ గ్రీన్‌ప్యాక్ 230 కోట్ల పెట్టుబడులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్యాకేజింగ్ ఉత్పత్తుల లిస్టెడ్ సంస్థ ఏజీఐ గ్రీన్‌ప్యాక్ ఉత్పత్తి, ఎగుమతి సామర్థ్యాలను మెరుగుపర్చుకునేందుకు రూ. 230 కోట్లు పెట్టుబడులు పెడుతోంది. ఇందులో సింహభాగం నిధులను గ్రూప్ సంస్థ ఏజీఐ గ్లాస్‌ప్యాక్‌లో ప్రస్తుత ఫర్నేస్‌లను ఆధునీకరించేందుకు, అధునాతన టెక్నాలజీలను వినియోగంలోకి తెచ్చుకునేందుకు ఇన్వెస్ట్ చేస్తోంది. ఏజీఐ గ్రీన్‌ప్యాక్ సీఈవో రాజేశ్ ఖోస్లా ఈ విషయాలు తెలిపారు. అంతర్జాతీయంగా గ్లాస్ ప్యాకేజింగ్ మార్కెట్ 2024లో 67.28 బిలియన్ డాలర్లు ఉండగా 2032 నాటికి 93.69 బిలియన్ డాలర్లకు చేరే అంచనాలు ఉన్నాయని ఖోస్లా వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ భువనగిరిలోని తమ స్పెషాలిటీ గ్లాస్ ప్లాంటుతో పాటు ఇతరత్రా ఉత్పత్తి సామర్థ్యాల పెంపుపై దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. గ్లాస్ ప్యాకేజింగ్ ఉత్పత్తులను ఇప్పటికే అమెరికాకు ఎగుమతి చేస్తుండగా కొత్తగా మధ్యప్రాచ్యం, యూరప్ మార్కెట్లలో కూడా అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎన్‌సీఎల్‌టీకి చేరిన హిందుస్తాన్ నేషనల్ గ్లాస్ కొనుగోలు ప్రయత్నాల్లో ఉన్నట్లు వివరించారు. గత ఆర్థిక సంవత్సరం తమ టర్నోవరు రూ. 2,421 కోట్లుగా ఉందని ఖోస్లా చెప్పారు.

పతక విజేతలకు డీజీపీ అభినందనలు



సాక్షి, అమరావతి: అఖిల భారత పోలీస్ జూడో క్లస్టర్-2024 పోటీల్లో పతకాలు సాధించిన రాష్ట్ర పోలీస్ అధికారులను డీజీపీ సీహెచ్. ద్వారకా తిరుమలరావు అభినందించారు. అస్సాంలోని గౌహతిలో జరిగిన ఈ పోటీల్లో 24 రాష్ట్రాలు, ఐదు కేంద్ర పాలిత ప్రాంతాల పోలీస్ శాఖలు, 11 కేంద్ర సాయుధ బలగాల జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించిన రాష్ట్ర పోలీస్ అధికారులను రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం అభినందించారు.

రైలు కింద పడి ఏఎస్ఐ ఆత్మహత్య



మృతుడు నాగార్జునరెడ్డి

కమలాపురం/వల్లూరు: దీర్ఘ కాలిక వ్యాధి... ఎప్పటికీ నయం కాకపోవడం... దీంతో విరక్తి చెందిన ఓ పోలీసు అధికారి అర్ధాంతరంగా తనువు చాలించారు. ఈ ఘటన వైఎస్సార్‌జిల్లా, కమలాపురంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కడప మండలం, మోడమీదపల్లెకు చెందిన బి.నాగార్జునరెడ్డి (58) వైఎస్సార్ జిల్లా కమలాపురం పోలీసుస్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్నారు. మంగళవారం రాత్రి నైట్ డ్యూటీ చేశారు. తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో వల్లూరు మండలంలోని తప్పెట్ల పై ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న రైల్వే ట్రాక్ పై రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే నాగార్జునరెడ్డి పదేళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతున్నారని, వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని కడప రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడికి భార్య లక్ష్మీ కాంతమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ హృషికేశ్వర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది ఆయన మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

'రింగ్'లో మింగారు!

ఐఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చేసి తమ భూములకు రెక్కలు

- ముందే ఖరారు చేసి కన్సల్టెన్సీ ద్వారా రాజముద్ర
- రూ.2 వేల కోట్లకుపైగా టీడీపీ పెద్దల దోపిడీ
- క్విడ్‌ప్రో కో కింద హెరిటేజ్‌కు భూములు
- పూర్తి ఆధారాలతో వెలికి తీసిన సీఐడీ
- ఏ-1 చంద్రబాబు.. ఏ-2 నారాయణ, ఏ-3 లింగమనేని, ఏ-14 లోకేశ్



సాక్షి, అమరావతి: రాజధాని.. ఇన్నర్ రింగ్ రోడ్.. కావేవీ భూ దోపిడీకి అనర్హం అన్నట్టుగా టీడీపీ పెద్దలు చెలరేగిపోయారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేసి తమ భూముల విలువ భారీగా పెంచుకున్నారు. 2014-19 మధ్య టీడీపీ హయాంలో సీఆర్‌డీఏ చైర్మన్ హోదాలో చంద్రబాబు, వైస్ చైర్మన్‌గా ఉన్న పొంగూరు నారాయణ బరితెగించి వ్యవహరించారు. లింగమనేని రమేశ్‌తో క్విడ్ ప్రో కోకు పాల్పడిన ఈ కేసులో నారా లోకేశ్ కూడా ప్రధాన పాత్ర పోషించారు. లింగమనేని భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్ల నుంచి రూ.877.50 కోట్లకు.. రాజధాని నిర్మాణం అనంతరం ఏకంగా రూ.2,130 కోట్లకు చేరేలా ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం భారీ దోపిడీకి నిదర్శనం. సీఐడీ దర్యాప్తులో ఈ కుంభకోణం పూర్తి ఆధారాలతో బట్టబయలైంది.

'హెరిటేజ్ ఫుడ్స్'కు కానుక..

లింగమనేని కుటుంబానికి కల్పించిన ప్రయోజనానికి ప్రతిగా కంతేరులో హెరిటేజ్ ఫుడ్స్‌కు 10.4 ఎకరాలు పొందారు. ఐఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను ఆనుకుని లింగమనేని కుటుంబానికి చెందిన 355 ఎకరాలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్ భూములు ఉండటం గమనార్హం. క్విడ్ ప్రో కోలో భాగంగా లింగమనేని రమేశ్ కృష్ణా కరకట్ట మీద ఉన్న తన అక్రమ బంగ్లాను చంద్రబాబుకు ఇచ్చారు. ఆ ఇంటిని ఉచితంగా ఇచ్చినట్లు ఆయన చెబుతుండగా నాడు చంద్రబాబు ప్రభుత్వం నుంచి హెచ్ఆర్ఏ ఎందుకు పొందారన్న ప్రశ్నకు సమాధానం లేదు.

తమ భూముల విలువ పెరిగేలా..

ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారుకు ముందు లింగమనేని కుటుంబం ఆ ప్రాంతంలో ఎకరా భూమి రూ.8 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించగా మార్కెట్ ధర రూ.50 లక్షలు ఉంది. అంటే ఆ భూముల మార్కెట్ విలువ రూ.177.50 కోట్లు. ఇక ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారు తరువాత ఎకరా రూ.36 లక్షల రిజిస్టర్ విలువ చొప్పున విక్రయించింది. అంటే రిజిస్టర్ విలువే నాలుగున్నర రెట్లు పెరిగింది. మార్కెట్ ధర ఎకరా రూ.2.50 కోట్లు పలికింది. 355 ఎకరాల విలువ మార్కెట్ ధర ప్రకారం అమాంతం రూ.887.50 కోట్లకు పెరిగింది. అమరావతి పూర్తయితే ఎకరా విలువ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో ఎకరా రూ.4 కోట్లకు చేరుతుందని చంద్రబాబు అప్పట్లోనే ప్రకటించారు. ఇక ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూముల విలువ ఎకరా రూ.6 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. అంటే అమరావతి పూర్తయితే ఆ 355 ఎకరాల విలువ ఏకంగా రూ.2,130 కోట్లకు చేరుతుందని అంచనా. తద్వారా హెరిటేజ్ ఫుడ్స్ 9 ఎకరాల విలువ అమరావతి పూర్తయితే రూ.54 కోట్లకు చేరుతుందని లెక్కతేలింది. హెరిటేజ్ ఫుడ్స్ ఒప్పందం చేసుకున్న మరో నాలుగు ఎకరాల విలువ రూ.24 కోట్లకు చేరుతుంది. సీఆర్‌డీఏ తొలి అలైన్‌మెంట్ ప్రకారం ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని చేపడితే నారాయణ విద్యా సంస్థల భవనాలను భూ సేకరణ కింద తొలగించాల్సి వస్తుంది. దీంతో నారాయణ అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. తూర్పు దిశగా మార్పించారు.

పవన్ కళ్యాణ్‌కు 2.40 ఎకరాలు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కూడా ఇన్నర్ రింగ్ రోడ్డు అవినీతిలో వాటా ఇచ్చారు. ఈ రోడ్డు అలైన్‌మెంట్‌కు సమీపంలో ఆయనకు 2.4 ఎకరాల భూమి ఉంది. లింగమనేని కుటుంబం నుంచి ఆ భూములను ప్రభుత్వ ధర ప్రకారం ఎకరా రూ.8 లక్షలు చొప్పున కొనుగోలు చేసినట్టు చూపించారు. ల్యాండ్ పూలింగ్ నుంచి మినహాయింపు కల్పించిన భూమినే పవన్ కళ్యాణ్‌కు ఇవ్వడం గమనార్హం.

ఐఆర్ఆర్ కేసులో నిందితులు

- ఏ-1: చంద్రబాబు
- ఏ-2: నారాయణ
- ఏ-3: లింగమనేని రమేశ్
- ఏ-4: లింగమనేని వెంకట సూర్య రాజశేఖర్
- ఏ-5: కేపీవీ అంజని కుమార్ (రామకృష్ణ హౌసింగ్ కార్పొరేషన్)
- ఏ-6: హెరిటేజ్ ఫుడ్స్
- ఏ-7: ఎల్ఈపీఎల్ ప్రాజెక్ట్స్
- ఏ-14: నారా లోకేశ్

ఏ1 చంద్రబాబు.. ఏ2 నారాయణ.. ఏ14 లోకేశ్

ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్ కుంభకోణం కేసులో సీఐడీ ఇప్పటికే విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ కేసులో ఏ-1గా చంద్రబాబు, ఏ-2గా పొంగూరి నారాయణలను పేర్కొంది. ఐపీసీ 120(బి), 409, 420, 34, 35, 37, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(2), రెడ్‌విత్ 13(1)(సి),(డి)ల ప్రకారం కేసు నమోదు చేసింది.

అలైన్‌మెంట్ బాబుది.. ముద్ర కన్సల్టెన్సీది

ఇన్నర్ రింగ్ రోడ్ కోసం సీఆర్‌డీయే అధికారులు తొలుత 94 కి.మీ. పొడవుతో ఓ అలైన్‌మెంట్‌ను రూపొందించారు. అయితే దానివల్ల తమ భూముల విలువ పెరగదని గుర్తించిన టీడీపీ పెద్దలు అలైన్‌మెంట్‌ను మార్చేశారు. 3 కి.మీ. దక్షిణం వైపు జరిపేసి తాడికొండ, కంతేరు, కాజాలోని చంద్రబాబు, లింగమనేని కుటుంబాలకు చెందిన 355 ఎకరాలు, హెరిటేజ్ ఫుడ్స్‌కు చెందిన 13 ఎకరాలను ఆనుకుని వెళ్లేలా ఖరారు చేశారు. ఆ విషయాన్ని గోప్యంగా ఉంచి ఇన్నర్ రింగ్ రోడ్డుకు అటూ ఇటూ భారీగా భూములు కొన్నారు. అనంతరం ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌ను ఆమోదించుకున్నారు.

సంపద సృష్టి అంటే ఇదే!

'సంఘం సభ్యులకు తెలియజేయడం ఏమనగా.. అమరావతి రాజధాని కోసం ఒక్కో సంఘం నుంచి రూ.వెయ్యి చొప్పున రెండు రోజుల్లో చేర్చండి. ఒక్కో సభ్యురాలు రూ.వంద చొప్పున ఇవ్వాలి. ఆ డబ్బులు రాజధాని అకౌంట్లో కాదు.. సమాఖ్య అకౌంట్‌కు వేయండి. లేదా డబ్బులు కట్టి బిల్లు తెచ్చి ఇచ్చినా పర్వాలేదు'

– తిరుపతి నగరంలోని ఓ రిసోర్స్ పర్సన్ (ఆర్పీ) వాయిస్ మెసేజ్ ఇది

- అమరావతి నిర్మాణం కోసం మహిళల సొమ్ము
- స్వయం సహాయక సభ్యుల నుంచి వసూళ్లు
- ఒక్కో సభ్యురాలు రూ.100
- ఒక్కో సంఘం నుంచి రూ.వెయ్యి
- ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సభ్యులపై ఒత్తిళ్లు

సాక్షి, తిరుపతి టాస్క్‌ఫోర్స్: అమరావతి నిర్మాణం కోసం టీడీపీ కూటమి ప్రభుత్వం మహిళల నుంచి కూడా బలవంతంగా డబ్బు వసూలు చేస్తున్నట్లు ఈ మెసేజ్ స్పష్టం చేస్తోంది. స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి సభ్యురాలు రూ.100 చొప్పున చెల్లించాలని, ప్రతి గ్రూపు నుంచి రూ.వెయ్యి చెల్లించాలని ఆర్పీల ద్వారా ఒత్తిళ్లు తెస్తోంది. కొందరు ఆర్పీలు సంఘాలతో సమావేశాలు పెట్టి మరీ డబ్బు డిమాండ్ చేస్తున్నారు. మరికొందరు ఫోన్లు చేసి చెబుతుండగా, ఇంకొందరి వాయిస్ మెసేజ్‌లు పంపుతున్నారు. వీటిలో ఓ వాయిస్ మెసేజ్ ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ విషయంపై స్వయం సహాయక సంఘాలకు చెందిన కొందరు సభ్యులను సంప్రదించగా అది నిజమేనని చెబుతున్నారు.

ఉమ్మడి చిత్తూరు నుంచి రూ.9.24 కోట్లు

తిరుపతి జిల్లాలో 46 వేల స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 4.70 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ఒక్కొక్కరి నుంచి రూ. వంద చొప్పున రూ.4.70 కోట్లకు పైగా వసూళ్లు చేస్తున్నారు. అదే విధంగా చిత్తూరు జిల్లాలోని 43,400 సంఘాల్లోని 4,53,963 మంది ద్వారా రూ.4.53 కోట్లపైగా వసూలు చేస్తున్నారు. మొత్తంగా ఉమ్మడి చిత్తూరుజిల్లా నుంచి రూ.9.24 కోట్లు సేకరిస్తున్నారు.

అంతా రహస్యం

అమరావతి కోసం చేస్తున్న ఈ వసూళ్ల విషయాన్ని బయటకు చెప్పొద్దంటూ స్వయం సహాయక సంఘాల సభ్యులకు అధికారులు హుకుం జారీ చేశారు. డబ్బులు ఇవ్వకపోయినా, సమాచారం బయటకు వచ్చినా చర్యలు ఉంటాయని హెచ్చరించినట్లు కొందరు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతి కట్టడానికి తాము డబ్బులు ఇవ్వడమేమిటని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు, తమ నుంచి బలవంతగా వసూళ్లు చేయటమే సంపద సృష్టించడమా అని ధ్వజమెత్తుతున్నారు.

మోడల్ నియోజకవర్గంగా పిఠాపురం

- పిఠాపురం ప్రజల వల్లే కూటమి ప్రభుత్వం వచ్చింది
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

పిఠాపురం: పిఠాపురాన్ని దేశంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారు. ఆయన బుధవారం పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించారు. తొలుత పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో పురూహూతికా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉప్పాడ సెంటర్లో నిర్వహించిన వారాహి బహిరంగ సభలో ప్రసంగించారు. పిఠాపురం ప్రజల వల్లే కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జనసేన నేతలు, కార్యకర్తల సహకారంతో ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగామన్నారు. మూడు నెలలు కేవలం అభివృద్ధి పనులపైనే దృష్టి పెడతానని, అప్పటివరకు సినిమాలకు విరామం ప్రకటించానని అన్నారు. పిఠాపురంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్ నిర్మాణం చేపడతామని, ఇందుకోసం ప్రధానమంత్రితో మాట్లాడతానని చెప్పారు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రిని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌గా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. కాకినాడ ఎస్ఈజెడ్‌లో పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. పిఠాపురంను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గొల్లప్రోలులో ఉద్యాన పంటల గోదాముల నిర్మాణం, సెరికల్చర్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులకు పాల్పడటం, హింసకు దిగడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం చేయొద్దని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఉప్పాడ తీర రక్షణకు చర్యలు

సముద్ర కోతకు గురవుతున్న ఉప్పాడ తీర ప్రాంతాన్ని పవన్ పరిశీలించారు. 18 నెలల్లో ఉప్పాడ తీర ప్రాంత రక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. బీచ్ రోడ్డు నిర్మాణంతో పాటు తీరాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. కొత్తపల్లి మండలం వాకతిప్పలో ఉన్న నాగులాపల్లి ఏరియా గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, తాగునీటి శుద్ధి ప్లాంట్ల పని తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, టీడీపీ నేత వర్మ, బీజేపీ నేత కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్

సాక్షి, అమరావతి: వైకల్య ధ్రువీకరణ పత్రాల కోసం సదరం సర్టిఫికెట్లు పొందడానికి గురువారం నుంచి ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మూడు నెలలకు స్లాట్‌లను విడుదల చేశారు. ఈ క్రమంలో వైకల్య ధ్రువీకరణ పొందాల్సిన అభ్యర్థులు గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో స్లాట్‌లను బుక్ చేసుకోవచ్చు. స్లాట్‌లు బుక్ చేసుకున్న వారికి ప్రభుత్వాస్పత్రుల్లోని వైద్యులు స్క్రీనింగ్ నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు.

ట్రిపుల్ ఐటీలో కొనసాగిన సర్టిఫికెట్ల పరిశీలన


సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

నూజివీడు: ఏలూరు జిల్లా, నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన మూడో రోజైన బుధవారం కొనసాగింది. ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ప్రస్తుత విద్యాసంవత్సరానికి నిర్వహిస్తున్న అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా ప్రత్యేక కేటగిరీకి చెందిన సైనిక సంతతి, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్, స్పోర్ట్స్, ఎన్‌సీసీ, పీహెచ్‌సీ కోటాలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. సైనిక సంతతి కోటాకు సంబంధించి 57 మంది, భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ కోటాకు సంబంధించి 49 మంది, ఎన్‌సీసీ కోటాకు సంబంధించి 101 మంది, స్పోర్ట్స్ కోటాకు సంబంధించి 180 మంది, వికలాంగుల కోటాకు సంబంధించి 249 మంది అభ్యర్థులు హాజరైనట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ తెలిపారు. ఈనెల 4న ఎన్‌సీసీ, క్రీడా కోటా అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తామని చెప్పారు.

హెల్త్ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా డీఎంఈ నరసింహం!

సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ నరసింహానికి అదనపు బాధ్యతలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అన్ని విశ్వవిద్యాలయాల వీసీలతో బలవంతపు రాజీనామాలు చేయిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇటీవల వీసీ డాక్టర్ బాబ్జీ రాజీనామా చేశారు. దీంతో కొత్త వీసీని నియమించే వరకూ ఇన్‌చార్జ్ వీసీగా డీఎంఈని ఉంచనున్నట్లు తెలుస్తోంది.

కేర్ టేకర్లకు గ్రాడ్యుయేట్ టీచర్లుగా పదోన్నతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో పని చేస్తున్న కేర్ టేకర్స్/వార్డెన్లకు గ్రాడ్యుయేట్ టీచర్లుగా పదోన్నతి కల్పించారు. ఈ నెల 5వ తేదీలోగా ఆయా గురుకులాల్లో అర్హులైన వారి నుంచి ఆప్షన్లు తీసుకుని జాబితాను పంపించాలని ప్రిన్సిపాళ్లను ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ సెక్రటరీ ఆదేశించారు. సరైన అర్హత ఉండి శిక్షణ పొందిన కేర్ టేకర్స్/వార్డెన్లను తాత్కాలిక ప్రాతిపదికపై గ్రాడ్యుయేట్ టీచర్లుగా పదోన్నతి ఇవ్వనున్నారు.

ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ రాజీనామా



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిష్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) చైర్మన్ గౌతమ్ సవాంగ్ తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. 2025 జూలై 9 వరకు పదవీ కాలం ఉండగా.. కూటమి ప్రభుత్వం నుంచి వచ్చిన ఒత్తిళ్ల మేరకు పదవి నుంచి ఆయన తప్పుకున్నారు. తన రాజీనామా లేఖను గవర్నర్‌కు అందజేశారు.

పూర్తిస్థాయిలో విస్తరించిన రుతుపవనాలు

వారం రోజులు ముందుగానే ఆగమనం



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా.. దేశవ్యాప్తంగానూ నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఈనెల 8వ తేదీ నాటికి దేశమంతటా నైరుతి విస్తరించాల్సి ఉండగా.. వేగంగా కదిలిన నేపథ్యంలో వారం రోజులు ముందుగానే విస్తరించాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ కారణంగా రాష్ట్రంలోనూ, దేశంలోనూ క్రమంగా వర్షాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంపై పశ్చిమ గాలుల ప్రభావంతో రాబోయే మూడు రోజుల పాటు కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

1.81 లక్షల సీట్లు

గతేడాది కంటే భారీగా పెరిగిన ఇంజనీరింగ్ సీట్ల సంఖ్య

- కొత్తగా 28,399 సీట్లు అందుబాటులోకి..
- 16 వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలల్లో 5,500 సీట్లు
- 229 ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో 1,65,579 సీట్లు
- ఆర్జీయూకేటీ నాలుగు క్యాంపస్‌లలో 1,440
- నాలుగు డీమ్డ్ ప్రైవేటు వర్సిటీల్లో 9,180
- అత్యధికంగా కంప్యూటర్ సైన్స్‌లోనే 99,494 సీట్లు
- ఖరారు చేసిన ఏఐసీటీఈ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలు, రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో 1,81,732 ఇంజనీరింగ్ సీట్లకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఆమోదం తెలిపింది. ఏపీలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 16 వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలల్లో 5,500 సీట్లు, 229 ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో 1,65,579 సీట్లు కలిపి మొత్తం 245 కళాశాలల్లో 1,71,079 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు కొత్తగా సెంట్రల్ ట్రైబల్ వర్సిటీలో 33 (ఏఐ కోర్సు), ఆర్జీయూకేటీ నూజివీడు, శ్రీకాకుళం, ఇడుపులపాయ, ఒంగోలు క్యాంపస్‌లలో 1,440, నాలుగు డీమ్డ్ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో 9,180 సీట్లు ఉన్నాయి.



కంప్యూటర్ సైన్స్‌లోనే అధికం

రాష్ట్రంలో మొత్తంగా 1,81,732 ఇంజనీరింగ్ సీట్లు ఉంటే.. అందులో ఒక్క కంప్యూటర్ సైన్స్‌లోనే ఏకంగా 99,494 సీట్లు ఉన్నాయి. గతేడాది 77,730 సీట్లు ఉంటే ఈ సంవత్సరం మరో 21,764 సీట్లు పెరిగాయి. గతేడాది కంటే ప్రభుత్వ కళాశాలల్లో 520 సీట్లు, ప్రైవేటు కళాశాలల్లో 27,879 సీట్లు అధికంగా వచ్చాయి. ఇక ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో 60 సీట్లు, శ్రీకృష్ణదేవరాయ వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలో సీఎస్‌ఈలో ఏఐ, మెషిన్ లెర్నింగ్‌లో 60 సీట్లు, డేటా సైన్స్‌లో 60 సీట్లతో కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. 2024–25 విద్యా సంవత్సరానికి ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో 360 సీట్లు (నగరి), బెహర ఇంజనీరింగ్, టెక్నాలజీ కళాశాలకు 360 సీట్లతో కొత్తగా అనుమతులు లభించాయి.

కోర్సుల వారీగా సీట్లు ఇలా

కోర్సు	ప్రభుత్వ	ప్రైవేటు
కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్	1,340	98,154
ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ	120	6,270
సివిల్ ఇంజనీరింగ్	710	8,220
మెకానికల్ ఇంజనీరింగ్	800	9,615
ఈఈఈ	680	10,740
ఈసీఈ	980	30,330
ఇతర కోర్సులు	870	2,250
మొత్తం	5,500	1,65,579

సీట్ల సంఖ్య ఇలా..

జిల్లా	వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీలు	సీట్లు	ప్రైవేటు కాలేజీలు	సీట్లు
అనంతపురం	2	960	10	5,220
చిత్తూరు	3	1,080	21	18,900
తూర్పు గోదావరి	2	520	24	17,370
గుంటూరు	2	600	35	26,160
కృష్ణా	1	180	30	20,415
కర్నూలు	1	360	11	8,490
నెల్లూరు	0	0	14	11,574
ప్రకాశం	0	0	15	9,330
శ్రీకాకుళం	0	0	4	3,360
విశాఖ	2	900	21	17,190
విజయనగరం	0	0	9	5,430
పశ్చిమ గోదావరి	0	0	16	13,410
వైఎస్సార్	3	900	19	8,730

ఎగ్గొట్టారు!

మధ్యాహ్న భోజన పథకంలో కోడిగుడ్డు నిలిపివేత

- గుంటూరు కార్పొరేషన్ స్కూళ్లలో గుడ్డు లేకుండానే మధ్యాహ్న భోజనం
- ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్న విద్యార్థులు


ఇంటి నుంచి క్యారేజీలు తెచ్చుకుని భోజనం చేస్తున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువులు అర్థాకలితో సాగుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న గోరుముద్ద పేరుతో ఆకర్షణీయమైన మెనూతో రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించగా.. నేడు ఆ పథకం అస్తవ్యస్తంగా మారింది. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు ఇవ్వడం లేదు. గుంటూరులో ఉన్న 14 ఉన్నత పాఠశాలలతో పాటు 80 ప్రాథమిక పాఠశాలల్లో 15 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా రూపకల్పన చేసిన మెనూ యథావిధిగా అమలయ్యేది. అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ పథకం అమలులో నాణ్యతా ప్రమాణాలకు పెద్దపీట వేశారు. దీంతో విద్యార్థులంతా మధ్యాహ్న భోజనం తృప్తిగా ఆరగించేవారు. కానీ ప్రస్తుత విద్యా సంవత్సరంలో స్కూళ్లు తెరిచినప్పటి నుంచి మధ్యాహ్న భోజనం అధ్వానంగా మారింది. విద్యార్థులకు వారంలో ఐదు రోజులు కోడి గుడ్డు ఇవ్వాల్సి ఉండగా.. దీనిని పూర్తిగా విస్మరించారు. ఎక్కడా మెనూ పాటిస్తున్న దాఖలాలు లేవు. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు.. చాలీచాలని, రుచి లేని భోజనం చేయలేక చాలా మంది విద్యార్థులు ఇళ్ల నుంచే క్యారేజీలు తెచ్చుకుంటున్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మాట్లాడుతూ.. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో కోడిగుడ్ల సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళతానని చెప్పారు.

గ్రూప్–2 మెయిన్స్ వాయిదా

సాక్షి, అమరావతి: ఏపీపీఎస్సీ గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలను ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ నెల 28న జరగాల్సిన మెయిన్స్‌ను పరిపాలనాపరమైన కారణాలతో వాయిదా వేస్తున్నట్టు సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచండి

గతంలో జరిగిన ఆలస్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీపీఎస్సీ, ఏపీ డీఎస్సీ ఉద్యోగ వయోపరిమితిని 47 సంవత్సరాలకు పెంచాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతేడాది జనవరిలో జరిగిన పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష అభ్యర్థులకు, తప్పులున్న ప్రశ్నలకు గ్రేస్ మార్కులు వేసి, తదుపరి పరీక్షలకు న్యాయ చిక్కులు లేకుండా అనుమతించాలని కోరారు. గ్రంథాలయ శాఖలో ఉన్న ఖాళీలను త్వరలోనే భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాలకు ఉచితంగా తెలుగు అకాడమీ పుస్తకాలను పంపిణీ చేసి, వార్షిక కేలండర్‌ను విడుదల చేయాలని హేమంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'క్వాలిఫైడ్' అభ్యర్థులకు న్యాయం చేయండి


మంత్రి లోకేశ్‌కు అసిస్టెంట్ ప్రొఫెసర్ టెస్ట్ క్వాలిఫైడ్ అభ్యర్థుల వినతి

ఏఎన్‌యూ: రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను బుధవారం అసిస్టెంట్ ప్రొఫెసర్ 2018 టెస్ట్ క్వాలిఫైడ్ అభ్యర్థులు కలిశారు. లోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో అభ్యర్థులు కలిసి వినతిపత్రమిచ్చారు. 2018లో అప్పటి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వర్సిటీల్లో 1,110 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్ వెలువరించిందని, ఏపీపీఎస్సీ ద్వారా 40,000 మందికి పరీక్ష నిర్వహించగా 3,500 మంది ఉత్తీర్ణత సాధించారని లోకేశ్‌కు తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించకుండా అప్పుడు కొందరు హైకోర్టులో కేసులు వేసి అడ్డుకున్నారని, ప్రస్తుతం ఆ కేసు సుప్రీం కోర్టులో నడుస్తుందని లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తమకు న్యాయం చేయాలని కోరారు. దీనికి మంత్రి లోకేశ్ స్పందిస్తూ న్యాయపరమైన అంశాలు పరిశీలించి తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని అభ్యర్థులు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ టెస్ట్ క్వాలిఫైడ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ బిరుదు రవి బాబు, నాయకులు చిన సత్యనారాయణ, శ్రీనివాస్, గోపి తదితరులున్నారు.


మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రం ఇస్తున్న సంఘం నేతలు

విజయవాడ మీదుగా వెళ్లే

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు



రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న నాన్–ఇంటర్ లాక్ పనుల కారణంగా డివిజన్ మీదుగా నడిచే పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు మరి కొన్నింటిని దారి మళ్లించి నడపనున్నట్లు విజయవాడ రైల్వే పీఆర్వో నుస్రత్ మండ్రూపకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రద్దయిన రైళ్లు: తెనాలి–విజయవాడ (7630), విజయవాడ–గూడూరు (7500), నర్సాపూర్–విజయవాడ (17270), విజయవాడ–బిట్రగుంట (7978) ఆగస్టు 3 నుంచి 10 వరకు, నర్సాపూర్–గుంటూరు (7281), హుబ్లీ–విజయవాడ (17329) ఆగస్టు 4 నుంచి 10 వరకు, గూడూరు–విజయవాడ (7458), విజయవాడ–మాచర్ల (7781), బిట్రగుంట–చెన్నై సెంట్రల్ (17237/17238) ఆగస్టు 4 నుంచి 11 వరకు, విజయవాడ–భద్రచలం రోడ్డు (7979), భద్రచలం రోడ్డు–విజయవాడ (7278), విజయవాడ–తెనాలి (7295), తెనాలి–విజయవాడ (7575), విజయవాడ–గుంటూరు (7464/7465), విజయవాడ–డోర్నకల్ (7756/7755), విజయవాడ–సికింద్రాబాద్ (12713/12714), గుంటూరు–సికింద్రాబాద్ (17201/17202), విశాఖపట్నం–కడప (17488), విజయవాడ–చెన్నై సెంట్రల్ (12711/12712) ఆగస్టు 5 నుంచి 10 వరకు, గుంటూరు–రేపల్లె (7784/7785), గుంటూరు–విజయవాడ (7976), విజయవాడ–నర్సాపూర్ (17269), విజయవాడ–హుబ్లీ (17330) ఆగస్టు 5 నుంచి 11 వరకు, మాచర్ల–విజయవాడ (7782), విజయవాడ–తెనాలి (7629), బిట్రగుంట–విజయవాడ (7977), విజయవాడ–నర్సాపూర్ (7862) ఆగస్టు 8 నుంచి 12 వరకు, కడప–విశాఖపట్నం (17487) ఆగస్టు 6 నుంచి 11 వరకు, చెన్నై సెంట్రల్–విజయవాడ (12077/12078) ఆగస్టు 5, 7, 8, 9, 10 తేదీలలో పూర్తిగా రద్దు చేశారు.

దారి మళ్లింపు: సికింద్రాబాద్–విశాఖపట్నం (12740) ఆగస్టు 2 నుంచి 10 వరకు, గాంధీనగర్–విశాఖపట్నం (20804) ఆగస్టు 4న, నిజాముద్దీన్–విశాఖపట్నం (12804) ఆగస్టు 4, 7వ తేదీలలో, ఛత్రపతి శివాజీ టెర్మినస్–భువనేశ్వర్ (11019) ఆగస్టు 2 నుంచి 10 వరకు, యశ్వంత్‌పూర్–టాటా (18112) ఆగస్టు 4న, హైదరాబాద్–షాలీమార్ (18046) ఆగస్టు 3 నుంచి 11 వరకు, షిర్డీ సాయినగర్–కాకినాడ పోర్టు (17205) ఆగస్టు 4, 6, 8 తేదీలలో, షిర్డీ సాయినగర్–విశాఖపట్నం (18504) ఆగస్టు 2, 9 తేదీలలో, న్యూ ఢిల్లీ–విశాఖపట్నం (20806) ఆగస్టు 2 నుంచి 10 వరకు, హైదరాబాద్–విశాఖపట్నం (12728) ఆగస్టు 3 నుంచి 11 వరకు, విశాఖపట్నం–సికింద్రాబాద్ (12739) ఆగస్టు 2 నుంచి 10 వరకు, విశాఖపట్నం–న్యూఢిల్లీ (20805) ఆగస్టు 2 నుంచి 10 వరకు, భువనేశ్వర్–ఛత్రపతి శివాజీ టెర్మినస్ (11020) ఆగస్టు 2 నుంచి 10 వరకు, కాకినాడ పోర్టు–షిర్డీ సాయినగర్ (17206) ఆగస్టు 3, 5, 7, 10 తేదీలలో, షాలీమార్–హైదరాబాద్ (18045) ఆగస్టు 2 నుంచి 10 వరకు, విశాఖపట్నం–నిజాముద్దీన్ (12803) ఆగస్టు 5, 9 తేదీలలో, విశాఖపట్నం–సాయినగర్ షిర్డీ (18503), టాటా–యశ్వంత్‌పూర్ (18111) ఆగస్టు 8న, విశాఖపట్నం–హైదరాబాద్ (12727) ఆగస్టు 3, 11 తేదీలలో, విశాఖపట్నం–గాంధీనగర్ (20803) ఆగస్టు 8న, మచిలీపట్నం–షిర్డీ సాయినగర్ (17208), నర్సాపూర్–నాగర్‌సోల్ (12787) ఆగస్టు 3, 5, 6, 7, 8, 10 తేదీలలో, మచిలీపట్నం–బీదర్ (12749) ఆగస్టు 3 నుంచి 11 వరకు, లోకమాన్య తిలక్ టెర్మినస్–విశాఖపట్నం (18520) ఆగస్టు 2 నుంచి 10 వరకు, షిర్డీ సాయినగర్–మచిలీపట్నం (17207) ఆగస్టు 7న, నాగర్‌సోల్–నర్సాపూర్ (12788) ఆగస్టు 2, 4, 6, 7, 8, 9 తేదీలలో, బీదర్–మచిలీపట్నం (12750) ఆగస్టు 8 నుంచి 10 వరకు వయా రాయనపాడు, గుణదల, విజయవాడ బైపాస్ మీదుగా దారి మళ్లించి నడపనున్నారు.

'కల్కి' అధిక రేట్లపై వివరణ కోరిన హైకోర్టు

- రాష్ట్ర ప్రభుత్వం, వైజయంతి మూవీస్‌కు నోటీసులు జారీ
- విచారణ వచ్చే వారానికి వాయిదా

సాక్షి, అమరావతి: కల్కి సినిమా టికెట్ ధరలను 14 రోజుల పాటు పెంచుకునేందుకు చిత్ర నిర్మాతలకు వెసులుబాటు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. టికెట్ ధరల పెంపు విషయంలో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, వైజయంతి మూవీస్‌ను ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి తదితరులతో పాటు కల్కి చిత్ర నిర్మాత చలసాని అశ్వనీదత్‌కు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ' సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు చిత్ర నిర్మాతలకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత నెల 26న జారీ చేసిన మెమోను సవాల్ చేస్తూ నెల్లూరుకు చెందిన పి.రాకేశ్‌రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. రూ.100 కోట్ల బడ్జెట్ దాటిన సినిమాలకు మొదటి 10 రోజులపాటు టికెట్ ధరలను భారీగా పెంచుకునేందుకు చిత్ర నిర్మాతలకు అనుమతినిస్తూ గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చిందన్నారు. అయితే.. కల్కి సినిమాకు 10 రోజులు కాకుండా 14 రోజులపాటు అధిక ధరలు వసూలు చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చిందన్నారు. ప్రభుత్వ తీరు వల్ల సినీ వీక్షకులపై అధిక భారం పడుతోందన్నారు. సినిమా టికెట్ ధరలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 2022లో జారీ చేసిన జీవో 13కు సంబంధించిన తదుపరి చర్యలన్నింటినీ హైకోర్టు సింగిల్ జడ్జి నిలిపేస్తూ గతంలోనే ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఆ ఉత్తర్వులు అమల్లోనే ఉన్నాయన్నారు. అందుకు విరుద్ధంగా ఇప్పుడు ప్రభుత్వం కల్కి సినిమాకు టికెట్ రేట్లను పెంచుకునేందుకు అనుమతి ఇచ్చిందన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. సింగిల్ జడ్జి తన ఉత్తర్వుల్లో టికెట్ ధరల్ని పెంచే అధికారం ప్రభుత్వానికి లేదని, దానిని లైసెన్స్ మంజూరు చేసే అధికారి(జిల్లా కలెక్టర్)కి మాత్రమే ఉందని చెప్పారని గుర్తు చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారం కల్కి సినిమాకు టికెట్ ధరలను పెంచుకునే అనుమతి ఇవ్వాల్సింది జిల్లా కలెక్టర్ తప్ప రాష్ట్ర ప్రభుత్వం కాదని శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఈ కేసులో పాయింట్ ఉందని, అన్ని అంశాలను లోతుగా విచారిస్తామని పేర్కొంది. అయితే.. ఇప్పుడు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేసినా అది గందరగోళ పరిస్థితులు సృష్టిస్తుందని, నిర్మాతల వాదన వినకుండా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తెలిపింది.



లా ఆఫీసర్ల నియామకాలకు మార్గదర్శకాలేవి?

- హైకోర్టులో న్యాయవాది పిల్
- కౌంటర్ దాఖలుకు ధర్మాసనం ఆదేశం

సాక్షి, అమరావతి: హైకోర్టుతో పాటు జిల్లా కోర్టులు, ట్రిబ్యునల్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించే లా ఆఫీసర్లను (జీపీలు, ఏజీపీ) నియమించే విషయంలో ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలను రూపొందించలేదని, నియామకాలేవీ పారదర్శకంగా జరగడం లేదంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ శాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

సమర్థత ప్రాతిపదికన నియామకాలు లేవు

పిల్ దాఖలు చేసిన న్యాయవాది వాసిరెడ్డి ప్రభునాథ్ కోర్టు ఎదుట వాదనలు వినిపిస్తూ.. లా ఆఫీసర్లుగా నియమించాలనుకుంటున్న వారి సమర్థత ఏమిటి? వారు ఆ పోస్టులకు సరిపోతారా? వంటి విషయాలను తేల్చేందుకు ఎలాంటి మార్గదర్శకాలు లేవన్నారు. లా ఆఫీసర్ల నియామకం విషయంలో ఎలాంటి విధానాన్ని అనుసరించాలో సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందన్నారు. జిల్లా కోర్టుల్లో లా ఆఫీసర్ల నియామకానికి జిల్లా జడ్జిల నుంచి ప్రతిపాదనలు వస్తాయని, అందుకు అనుగుణంగా నియామకాలు జరుగుతున్నాయన్నారు. హైకోర్టులో కూడా ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. నియామకాల విషయంలో రాజకీయ సిఫారసులను తప్ప, సమర్థతను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. మార్గదర్శకాలను రూపొందించాలంటూ ఈ ఏడాది మార్చిలోనే ప్రభుత్వానికి వినతి పత్రం ఇచ్చానని, ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. లా ఆఫీసర్ల నియామకానికి ఓ నిర్దిష్ట విధానం అంటూ ఉండాలని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన ధర్మాసనం తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

హైకోర్టులో జీపీలు, ఏజీపీల నియామకం

సాక్షి, అమరావతి: హైకోర్టులో ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు ప్రభుత్వ న్యాయవాదులు (జీపీ), సహాయ ప్రభుత్వ న్యాయవాదులు (ఏజీపీ) నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయ శాఖ ఇన్‌చార్జి కార్యదర్శి వి.సునీత బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ న్యాయవాదులుగా నియమితులైన వారిలో గుజ్జర్లపూడి రాజు, జె.దిలీప్‌కుమార్, నాగూరు నాగరాజు, సోమరాజు ఎలిశెట్టి, కె.మురళీకృష్ణారెడ్డి, పొన్నూరు వెంకట సాయి కృష్ణ ఉన్నారు. ఏజీపీలుగా జి.ప్రశాంతి, కె.ప్రియాంక లక్ష్మి, పొట్లూరి సుదీప్తి, వడ్లపట్ల దిపాచౌదరి, దిగుమర్తి ఏడుకొండలు, నేరెళ్ల ఎస్వీ రవితేజ, షేక్ అబ్దుల్ రషీద్‌అహ్మద్, పి.అజయ్‌బాబు, సీపని సతీష్‌కుమార్, చిన్నాల ప్రవీణ్, ఎస్.శరత్‌కుమార్, ఎ.సాయిరోహిత్, గండికోట దివ్యతేజ, కె. అర్జున్ చౌదరి ఉన్నారు. ఇదిలా ఉంటే సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ ఆన్ రికార్డు (ఏఓఆర్)గా గుంటూరు ప్రమోద్ నియమితులయ్యారు.

కోర్టుల్లో ప్రాసిక్యూటర్ల ఖాళీలను భర్తీచేయడం లేదు

- హైకోర్టులో న్యాయవాది తాండవ యోగేష్ పిల్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని న్యాయస్థానాల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (పీపీ), సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు (ఎస్ఏపీపీ), అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (ఏపీపీ) ఖాళీలను ఏళ్ల తరబడి భర్తీచేయడం లేదని, దీనివల్ల పెండింగ్ కేసుల సంఖ్య అమాంతం పెరుగుతోందని హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. అన్ని క్రిమినల్ కోర్టుల్లో ఈ ఖాళీలను ఆరునెలల్లో ఖాళీలను భర్తీచేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం విచారించిన ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇందులో భాగంగా హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్ (డీపీవో) డైరెక్టర్, రాష్ట్రస్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డులకు నోటీసులు జారీచేసింది. విచారణను మూడువారాలకు వాయిదా వేసింది. అంతకుముందు పిటిషనర్ యోగేష్ వాదనలు వినిపిస్తూ.. పీపీల ఖాళీలను భర్తీచేయకపోవడం వల్ల కేసులు సత్వర విచారణకు నోచుకోవడం లేదన్నారు. తద్వారా పెండింగ్ కేసులు లక్షల్లో పెరిగిపోతున్నాయన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఖాళీల వల్ల కోర్టుల పనితీరుపై తీవ్ర ప్రభావం పడుతోందని, కేసుల విచారణ ఎంతకూ ముందుకు సాగడం లేదని పేర్కొంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

యోగాపై శ్రద్ధ అవసరం



మల్లికార్జున స్వామిని అభినందిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: ప్రతిఒక్కరూ ఆరోగ్య రక్షణకు యోగాపై శ్రద్ధ పెట్టాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంచాలకుడు మల్లికార్జున స్వామి పేర్కొన్నారు. ఆయన బుధవారం పాత్రికేయుల భవనంలో విలేకరులకు ఏర్పాటు చేసిన యోగా శిబిరం ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. నిత్యం యోగా సాధన ద్వారా మెరుగైన ఆరోగ్యం పొందవచ్చన్నారు. వారం రోజుల పాటు నిర్వహించిన శిబిరానికి లభించిన అపూర్వ స్పందన అభినందనీయన్నారు. కార్యక్రమంలో బావలత్తి, విజయ్ జాటగల్, జయరాం, శ్రీకాంత్, నీలకంఠ, నాగరాజ్, చందప్పలున్నారు.

రూ.270 కోట్లతో మినీ విధానసౌధల నిర్మాణం

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో 18 కొత్త తాలూకాల్లో మినీ విధానసౌధల నిర్మాణానికి రూ.270 కోట్లు కేటాయించామని కళ్యాణ కర్ణాటక అభివృద్ధి మండలి అధ్యక్షుడు అజయ్ సింగ్ వెల్లడించారు. కలబుర్గిలోని మండలి కార్యాలయంలో బీదర్, కలబుర్గి, యాదగిరి, రాయచూరు, కొప్పళ, బళ్లారి, విజయనగర జిల్లాల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–25వ ఆర్థిక సంవత్సరంలో మినీ విధానసౌధల నిర్మాణాలు, అభివృద్ధి పనులకు త్వరగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి విధానసౌధ నిర్మాణానికి రూ.15 కోట్లు, రహదారులకు రూ.వెయ్యి కోట్లు, ఆరోగ్య రంగానికి రూ.221 కోట్లు, విద్యారంగం అభివృద్ధికి రూ.120 కోట్లు ఖర్చు చేస్తారన్నారు. సమావేశంలో అధికారులు మనోజ్ జైన్, సుందరేష్, ఆకాష్, ప్రమీలలున్నారు.

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

రాయచూరు రూరల్ : బడుగు, బలహీన, దళిత వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మైసూరు ఉరిలింగ పెద్ది మఠాధిపతి జ్ఞానప్రకాష్ స్వామీజీ అభిప్రాయపడ్డారు. మంగళవారం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ జయంతిని ప్రారంభించి ఆయన మాట్లాడారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం జీవితాంతం పోరాటం చేసిన మహాయోధుడు, ప్రపంచ మేధావుల్లో ఒకరైన అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరం కృషి చేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ వర్సిటీ వైస్ చాన్సలర్ హన్మంతప్ప, జాగృతి సభ్యులు మల్లికార్జున, మల్లేష్, మహదేవ్ స్వామి, అజిత్‌లున్నారు.

జిల్లా ఎస్పీ బదిలీ




ఎస్పీ నిఖిల్

రాయచూరు రూరల్: జిల్లా ఎస్పీ నిఖిల్‌ను కోలారుకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. జిల్లా ఎస్పీగా 2022 ఏప్రిల్ 2న అధికార బాధ్యతలు స్వీకరించిన నిఖిల్‌ను కోలారు జిల్లా ఎస్పీగా బదిలీ చేస్తూ ప్రభుత్వ ఉప కార్యదర్శి ఉక్కేష్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు.

ఆన్‌లైన్‌లో రూ.20 లక్షలు మోసం

హుబ్లీ: ధార్వాడ రజతగిరి నివాసి మల్లన్న అనే వ్యక్తికి ఆన్‌లైన్‌లో పరిచయం అయిన వ్యక్తి రూ.20 లక్షలను అతడి బ్యాంక్ ఖాతా నుంచి బదలాయించుకొని వంచించిన ఘటనపై నగర సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మల్లన్న యూట్యూబ్ చూస్తున్న వేళ జఫర్ ఇండియాన్ లిమిటెడ్ కంపెనీ పేరిట నకిలీ వైబ్‌సైట్ ప్రారంభించారు. ఈ క్రమంలో బాధితుడి నెంబర్ వాట్సాప్ గ్రూప్‌లో చేర్పించి డబ్బులు పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయంటూ నమ్మబలికారు. కేటుగాడి మాటలను నమ్మిన మల్లన్న ముందుగా రూ.15 లక్షలు, ఆ తర్వాత మరో రూ.5 లక్షలను వంచకుల ఖాతాలకు బదిలీ చేసి మోసపోయినట్లు తన ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు.

విద్యార్థులకు మొబైల్ వ్యామోహం వద్దు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్

హొసపేటె: విద్యార్థులు నేడు తమకు మొబైల్‌పై ఉన్న వ్యామోహాన్ని వీడి వివిధ క్రీడల్లో పాల్గొని శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రవికుమార్ అన్నారు. ఆయన బుధవారం పట్టణంలోని కోటేశ్వర కళాశాలలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ క్రీడా దినోత్సవానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రతి రోజు వాట్సాప్, పత్రికలు, మీడియా, క్రీడా చానళ్ల ద్వారా సమాచారం ప్రసారం అవుతోందన్నారు. ఆడియో టెస్టులు, కరెంట్ ఈవెంట్లలో క్రీడా విషయాలు ఎక్కువ ప్రాధాన్యత సంతరించుకుంటాయన్నారు. అందులో స్పోర్ట్స్ రిపోర్టర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. మరింత ఎక్కువగా క్రీడలు, విద్యార్థి కేంద్రీకృత కార్యకలాపాలు చేయడం ద్వారా సమాజానికి, కళాశాలకు, దేశానికి కీర్తిప్రతిష్టలు తేవడానికి విద్యార్థులు వార్తాపత్రికలను చదివే అలవాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా చరిత్ర విభాగాధిపతి డాక్టర్ దేవి సిద్దనగౌడ, ఎడ్యుకేషన్ డైరెక్టర్ సేవకుమార్, రాధాస్వామి, ఉమేష్ కందగల్, జలజాక్షి, బసవరాజ్ బణకార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దశాబ్దాలు గడిచినా ఆపన్నహస్తం సున్నా



ఇనుప రేకుల కింద గుడారంలోనే నివాసం



పునాదులకే పరిమితమైన పునరావాస కాలనీ

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నేటికీ అందని పరిహారధనం
- ఇంకా గుడారాల్లోనే నిరుపేదల జీవనం

రాయచూరు రూరల్: కరువు, వరద విలయంతో అతలాకుతలమైన జిల్లా ప్రజలకు దశాబ్దంన్నర గడిచినా ఏమాత్రం సహాయం అందకపోవడంతో నేటికీ తమకు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. 2009లో కురిసిన భారీ కుండపోత వర్షాలతో వరదలు వచ్చి సర్వస్వం కోల్పోయిన ప్రజలు ఇంకా గుడారాల్లోనే బ్రతుకులు వెళ్లదీస్తున్నారు. ఏళ్లు గడిచినా తమకు పూర్తి స్థాయిలో వరద సహాయం అందలేదనే విమర్శలు వెలువడుతున్నాయి. గుడారాల్లోనే కాలం గడుపుతున్న వరద బాధితుల్లో వణికిపోతున్న భయం వెంటాడుతూనే ఉంది. ప్రస్తుతం తమ బ్రతుకులు ఎన్నడు బాగు పడతాయోనని ఎదురు చూస్తున్నారు. ఇళ్లు కోల్పోయిన వారికందరికీ సురక్షిత ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చినా నేటివరకూ వారి ఇళ్ల గురించి ఆలోచన చేసేవారు కరువయ్యారు. జిల్లాలో వేలాది మంది రైతులు పంట బీమా పథకం ప్రీమియం చెల్లించినా నేటికీ రైతాంగానికి ఎలాంటి బీమా డబ్బులు అందక పోవడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకూ అందని సాయం

15 ఏళ్ల క్రితం వరదల కారణంగా దాదాపు లక్ష ఎకరాల్లో వరద ప్రాంతాల్లోనే పంట తీవ్రంగా నష్టపోయింది. ప్రస్తుతం రైతులను ఆదుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో జిల్లా రైతాంగం సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. పంటలపై కట్టిన బీమా సౌకర్యం అందడం లేదని రైతులంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జిల్లా ప్రజలకు ఎలాంటి సహాయం అందిస్తుందనే చర్చ సాగుతోంది. మొదట్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు హడావుడి చేసినా తీరా వారి హంగామా అంతా రాజకీయం కోసమేనంటూ బాధితులు ఆరోపిస్తున్నారు. కరువు, వరద అధ్యయన బృందం జిల్లాలో పర్యటించినా ఫలితం కేవలం పర్యటనలకు మాత్రమే పరిమితమైందనే ఆరోపణలున్నాయి. బృందాలు కూడా జిల్లాలో పర్యటించి, పరిశీలించి ఏళ్లు గడుస్తున్నా నేటి వరకూ జిల్లా రైతాంగానికి, బాధితులకు ఎలాంటి సహాయం అందలేదు. అసలు ప్రభుత్వ సహాయం ఇకనైనా అందుతుందా? లేదా? అనే అనుమానాలు బాధిత కుటుంబాల్లో వ్యక్తం అవుతున్నాయి.

జిల్లా ఎస్పీగా శోభారాణి

- ప్రస్తుత ఎస్పీ రంజిత్ కుమార్ బదిలీ
- తొలి మహిళా ఎస్పీగా నియామకం



జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శోభారాణి

సాక్షి,బళ్లారి: గత మూడేళ్ల నుంచి జిల్లా ఎస్పీగా పని చేస్తున్న రంజిత్ కుమార్ బండారి బదిలీ అయ్యారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో బెంగళూరు పోలీసు విభాగంలో ఉన్నతాధికారిణిగా పని చేస్తున్న శోభారాణిని బళ్లారి ఎస్పీగా బదిలీ చేశారు. ఈమె గతంలో మండ్య, హాసన్ ఏఎస్పీగా, తుమకూరు ఎస్పీగా విధులు నిర్వహించారు. అంతేకాకుండా ఏసీబీ, సీఐడీ విభాగంలో కూడా పోలీసు ఉన్నతాధికారిణిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం బెంగళూరు బృహత్ మహానగర పాలికె పరిధిలో జీఎంటీఎఫ్ ఎస్పీగా ఉన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలువురు జిల్లాధికారులతో పాటు ఎస్పీలను కూడా బదిలీ చేసినా రంజిత్ కుమార్ బండారిని బళ్లారిలోనే కొనసాగించారు. అయితే ఉన్నఫళంగా ప్రస్తుత ఎస్పీ రంజిత్ కుమార్‌ను బదిలీ చేశారు. దీంతో ఆమె బుధవారం ఎస్పీ కార్యాలయంలో అధికార బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇంతవరకు జిల్లాకు మహిళా ఎస్పీగా గతంలో ఎవరూ పని చేయనందున తాజాగా నియమితురాలైన శోభారాణి తొలి మహిళా ఎస్పీగా రికార్డుల్లోకి ఎక్కనున్నారు.

వైభవంగా మహిమోత్సవాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న సుబుదేంద్ర తీర్థులు



క్షీరాభిషేకం చేస్తున్న సుబుదేంద్ర తీర్థులు

రాయచూరు రూరల్: మంత్రాలయంలో బుధవారం విజయేంద్ర మహిమోత్సవాలు వైభవంగా ముగిశాయి. మంత్రాలయంలో వెలిసిన రాఘవేంద్ర స్వాముల మఠంలో మూల విరాట్‌కు పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ శ్రీపాదంగల్ గంధం పూసి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ వేడుకల్లో వందలాది భక్తుల సమక్షంలో రథోత్సవం నిర్వహించారు.

హాళకట్టి సాధన ఆదర్శప్రాయం



ప్రొఫెసర్ హాళకట్టి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రముఖులు

గంగావతి రూరల్: వచన సాహిత్య పరిరక్షణలో ప్రొఫెసర్ హాళకట్టి సాధన ప్రపంచానికే ఆదర్శమని కొప్పళ ఎమ్మెల్సీ హేమలతా నాయక్ అన్నారు. ఆమె మంగళవారం కొప్పళలోని సాహిత్య భవన్‌లో హాళకట్టి జయంతిలో భాగంగా ఏర్పాటు చేసిన వచన సాహిత్య సంరక్షణ దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. 12వ శతాబ్దంలో శరణులు రచించిన వచనాలను సేకరించి వాటిని భావి తరాలకు చాటిచెప్పే పనిని హాళకట్టి నెరవేర్చారన్నారు. విజయపురలోని బీఎల్‌ఈ విశ్వవిద్యాలయాన్ని స్థాపించి అత్యున్నత విద్యా సంస్థకు పునాది వేశారన్నారు. ఎన్నో బ్యాంకులను ఏర్పాటు చేశారన్నారు. హాళకట్టి చిరస్మరణీయ విజయానికి గుర్తుగా విజయపురలో ఆయన స్మారక చిహ్నం నిర్మించారన్నారు. ఆయన విజయాలను చిరస్థాయిగా నిలిపేందుకు ప్రభుత్వం ఆయన జయంతిని వచన సాహిత్య సంరక్షణ దినోత్సవంగా నిర్వహిస్తోందన్నారు. మనందరం వచన సాహిత్యాన్ని అధ్యయనం చేసి అందులోని సారాన్ని మన జీవితంలో అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వచన పారాయణంతో మానసిక ప్రశాంతత



హాళకట్టి జయంతిని ఆచరించిన దృశ్యం

హొసపేటె: శరణుల వచనాలు మనల్ని అంతర్గతంగా, బాహ్యంగా శుద్ధి చేసే దివ్య ఔషధాలు అని తహసీల్దార్ రేణుక తెలిపారు. పట్టణంలోని తాలూకా కార్యాలయంలో డాక్టర్ హాళకట్టి జయంతి, వచన సంరక్షణ దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వచనాలను రోజు పఠించడం వల్ల మనస్సుకు ప్రశాంతత లభిస్తుందన్నారు. శరణుల గతి సూత్రాలను అధ్యయనం చేస్తే మన జీవితం పావనం అవుతుందన్నారు. మానవీయ విలువల్లాంటి ఈ పద్యాలను మనకు అందేలా చేసింది హాళకట్టి అని తెలిపారు. వద పరిరక్షణ రంగంలో ఏ విశ్వవిద్యాలయం చేయలేని ఘనత సాధించి విశేష కృషి చేశారన్నారు. ఉపశమనాన్ని అందించే శక్తి గ్రంథాలకు ఉందన్నారు. బసవణ్ణ 12వ శతాబ్దంలో కాయక శరణులందరినీ ఏకం చేయగా, డాక్టర్ హాళకట్టిని ఆధునిక బసవణ్ణ అని పిలిచినా తప్పు లేదన్నారు. మహనీయుడైన కాయక జీవి హాళకట్టి శరణులు అని, ఆయనను ఎప్పటికీ స్మరించుకోవాలని ఆమె అన్నారు. కసాప తాలూకా అధ్యక్షుడు వీరేష్ అంగడి, కరవే తాలూకా అధ్యక్షుడు కాటేర్ హాలేష్, కజాప తాలూకా అధ్యక్షుడు కేఎం.వీరేష్, డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్‌కుమార్, పీఏపీఎం సభ్యుడు కేఏఎం జానా చీఫ్, ఫిరోజ్‌ఖాన్‌తో పాటు తాలూకా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: సీఎం

శివాజీనగర: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని ప్రేమించి కాపాడాలి. ఇదేమి కష్టంతో కూడిన పనేమి కాదు. అయితే అందరూ మనసు పెట్టి చేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. బుధవారం నగరంలో కంఠీరవ క్రీడామైదానంలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినాచరణలో ఆయన పాల్గొన్నారు. వన మహోత్సవం, పర్యావరణ పురస్కారాలను ప్రదానం చేశారు. పరిశుభ్రత, వర్షం నీరు నిల్వ తదితర పద్ధతులను అలవరచుకోవాలి. దీనిద్వారా పర్యావరణాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి అనుకూలం అవుతుందని అన్నారు. విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణ వల్ల కలిగే లాభాలేమిటి? పరిసరాలు, అడవులు, ప్రజా జీవితం, ప్రాణుల గురించి తెలుసుకోవాలి. మనుషులు బతికినట్లే వివిధ ప్రాణులకు కూడా బతికే హక్కు ఉంది. దానిని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. శుద్ధమైన తాగునీరు సరఫరా ప్రభుత్వం బాధ్యత. ఇటీవల కలుషితమైన నీటి సేవనంతో అయ్యే ప్రమాదాలను మనం చూశాం. అనేక మంది మృతిచెందగా, కొందరు రోగాల బారిన పడ్డారని సీఎం తెలిపారు. ఇటీవల డెంగీ కేసులు అధికమవుతున్నాయి. దీని నియంత్రణకు నగర పాలికె, ఆరోగ్య, పురపాలక శాఖలు కలసికట్టుగా పని చేస్తున్నాయి. ప్రజలు కూడా చేతులు జోడిస్తే డెంగీ వంటి జబ్బుల నివారణ సాధ్యమవుతుందని ఆయన తెలిపారు.

పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార్ బదిలీ

హుబ్లీ: రాష్ట్రంలోని పోలీస్ శాఖకు మేజర్ సర్జరీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం హుబ్లీ ధార్వాడ పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార్‌తో పాటు సుమారు 25 మంది అధికారుల బదిలీలకు శ్రీకారం చుట్టింది. ఆ మేరకు జంట నగరాల నూతన పోలీస్ కమిషనర్‌గా ఎస్.శశికుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలను వెల్లడించింది. 2007వ బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన శశికుమార్ బెంగళూరులో యువజన సేవ క్రీడా శాఖ ఐజీపీగా విధులు నిర్వహించేవారు. జంట నగరాల నేర నివారణ చట్ట భద్రత విభాగం డీసీపీ అయిన ఐపీఎస్ అధికారి కుశాల్ చౌక్సి కూడా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంటెలిజెన్స్ అధికారి అయిన ఐపీఎస్ అధికారి మహాలింగ నందగామిని నియమించారు. హుబ్లీ ధార్వాడ నూతన కమిషనర్, డీసీపీలను బుధవారమే అధికార బాధ్యతలను స్వీకరించాలని ఆదేశించినట్లుగా ఆ వర్గాలు తెలిపాయి. కాగా పోలీస్ కమిషనర్‌గా ఉన్న రేణుకా సుకుమార్‌ను బెంగళూరు క్రైం విభాగానికి ఏడీజీపీగా, అదేవిధంగా డీసీపీగా ఉన్న కుశాల్ చౌక్సిని చిక్కబళ్లాపుర జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు.

పరిహారం ఇవ్వనందుకు బస్సు సీజ్



అధికారులు సీజ్ చేసిన ఆర్టీసీ బస్సు ఇదే

హొసపేటె: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మరణించిన కేసులో మృతుని కుటుంబానికి పరిహారం ఇవ్వనందుకు ఆర్టీసీ బస్సును సీజ్ చేసిన ఘటన విజయనగర జిల్లా కూడ్లిగిలో జరిగింది. వివరాలు..2019లో దావణగెరె డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పట్టణ శివార్లలోని గోవిందగిరి వద్ద వెళుతున్న మారెప్ప అనే పాదచారిని ఢీకొనడంతో చనిపోయాడు. ఈ ఘటనపై బంధువు వి.చెన్నప్ప అనే వ్యక్తి కోర్టులో కేసు వేశారు. న్యాయవాది జీ.సీతారామ ఈ కేసులో ఉపశమనం కోసం పిటిషన్ వేశారు. దీంతో కోర్టు మారెప్పకు రూ.15 లక్షల పరిహారం చెల్లించాలని ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు ఆర్టీసీ సంస్థ పరిహారం అందించక పోవడంతో సీనియర్ న్యాయమూర్తి జే.యోగేష్ ఇటీవల ఆర్టీసీ బస్సును సీజ్ చేయాలని తీర్పు ఇవ్వడంతో ఆమేరకు అధికారులు బస్సును సీజ్ చేశారు.

గ్రామీణాభివృద్ధికి కృషి



అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హొసపేటె: తాలూకాలోని ధర్మసాగర గ్రామాన్ని బుధవారం సందర్శించిన ఎమ్మెల్యే హెచ్ఆర్ గవియప్ప అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రభుత్వ సీనియర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం ఎమ్మెల్యే జనస్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలను ఆలకించి గ్రామీణాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా బైలు వద్దిగేరి జీపీ అధ్యక్షురాలు శాంతమ్మ, ఉపాధ్యక్షురాలు హులిగమ్మ, టీపీ ఈఓ హరీష్, తహసీల్దార్ విశ్వజిత్ మెహత, అన్ని శాఖల తాలూకా స్థాయి అధికారులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

సమస్యలపై సత్వరం స్పందించండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపా

కేజీఎఫ్: రైతులు, పేదలు, అమాయకులను కార్యాలయాల చుట్టూ అనవసరంగా తిప్పుకోవడం మాని వారి పనులను వెంటనే చేసివ్వాలని ఎమ్మెల్యే రూపా శశిధర్ అధికారులకు సూచించారు. బుధవారం నగరంలోని తాలూకా కార్యాలయ భవనం ముందు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన తాలూకా స్థాయి జనస్పందన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అధికారుల కార్యవైఖరి వేగవంతమైనప్పుడే ప్రజల పనులు చక్కబడతాయన్నారు. కొంతమంది చేసే చిన్న చిన్న తప్పుల వల్ల శాఖ మొత్తం తలదించుకునే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అందువల్ల అధికారులు ప్రజా సమస్యల పరిష్కార విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. రాబోయే రోజుల్లో ఫిర్కా స్థాయిలో, క్యాసంబళ్లి, బేతమంగలలో కూడా జనస్పందన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ సౌకర్యాలను ప్రజల ముంగిటకు చేర్చడంలో అధికారులు, సిబ్బంది ప్రముఖ పాత్ర వహించాలన్నారు. ఉప విభాగాధికారి డాక్టర్ మైత్రి, ఎస్పీ శాంతరాజు, తహసీల్దార్ నాగవేణి, ఈఓ మంజునాథ్ హర్తి, డీఎస్పీ పాండురంగ, నగరాభివృద్ధి ప్రాధికార కమిషనర్ ధర్మేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాల్ట్ పాలు తాగి విద్యార్థులకు అస్వస్థత

- పాఠశాలలో అధికారుల తనిఖీ



విద్యార్థులకు అందించిన మాల్ట్ ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు

కోలారు: మాల్ట్ కలిపిన పాలను తాగి విద్యార్థులు అస్వస్థులై ఆస్పత్రిలో చికిత్స పొందిన ఘటన ముళబాగిలు తాలూకా అంగొండహళ్లి ప్రభుత్వ హైస్కూల్‌లో చోటు చేసుకుంది. ఉదయం మాల్ట్ మిశ్రిత పాలు తాగిన విద్యార్థుల్లో 19 మంది విద్యార్థులకు అలర్జీ, దురద, ఒంటిపై చిన్న చిన్న దద్దుర్లు లేవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన చెందారు. వెంటనే విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో హుటాహుటిన పాఠశాల వద్ద వైద్య బృందంతో చేరుకున్న అధికారులు విద్యార్థులకు చికిత్స అందించారు. ఓ విద్యార్థిని ముళబాగిలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. విద్యార్థులు అందరూ ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు, అధికారులు తెలిపారు. పాఠశాల వద్దకు బీఈఓ గంగరామయ్య, టీహెచ్ఓ డాక్టర్ సుగుణ వెళ్లి పరిశీలించారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటశివారెడ్డి

శ్రీనివాసపురం: తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తామని ఎమ్మెల్యే జీకే వెంకట శివారెడ్డి తెలిపారు. బుధవారం తాలూకాలోని లక్ష్మీసాగర జీపీలోని బీరగానహళ్లిలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.63 లక్షల వ్యయంతో నిర్మించే ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణ పనులను ప్రారంభించి ఆయన మాట్లాడారు. తాగునీటి సమస్య నుంచి ప్రజలను దూరం చేయడానికి ప్రభుత్వం తెచ్చిన పథకం జల జీవన్ మిషన్ అన్నారు. కాంట్రాక్టర్లు పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా కొనసాగించాలన్నారు. నిర్ణీత సమయంలోగా పనులు పూర్తి చేయాలన్నారు. నియోజవర్గంలో ఎక్కడ తాగునీటి సమస్య ఉన్నా వెంటనే తమ దృష్టికి తేవాలన్నారు. కాంట్రాక్టర్ నంజుండేగౌడ, పీడీఓ మంజునాథ్, బీకే సురేష్, అంజప్ప, రామప్ప, వెంకటేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ గోడౌన్లపై ఉక్కుపాదం

- రూ.50 లక్షల విలువ చేసే సరుకు స్వాధీనం

హుబ్లీ: గోకుల్ రోడ్డు పారిశ్రామిక వాడలోని గోడౌన్లపై దాడి చేసిన పాలికె కమిషనర్ డాక్టర్ ఈశ్వర్ ఉల్లాగడ్డి నేతృత్వంలోని అధికారుల బృందం రూ.50 లక్షలకు పైగా విలువ చేసే 35 టన్నుల నిషేధిత ప్లాస్టిక్‌ను జప్తు చేశారు. అక్కడి పాలీప్యాక్ గోడౌన్, ప్లాస్టిక్ తయారీ యూనిట్లపై కమిషనర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం దాడి చేసి అక్కడ నిల్వ చేసిన ప్లాస్టిక్‌తో పాటు గోడౌన్‌ను సీజ్ చేశారు. అంతేగాక బాధ్యులకు నోటీసులు జారీ చేసి చట్టరీత్యా చర్యలు చేపట్టారు. ఈ దాడిలో ఎస్‌డబ్ల్యూఎం అధికారి డీఎం మల్లికార్జున, డివిజన్ అధికారి గిరి తళ్వార, కాలుష్య నియంత్రణ మండలి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని పాదచారి మృతి

హుబ్లీ: రోడ్డు దాటుతుండగా బీఆర్‌టీఎస్ నగర బస్సు సర్వీసు పాదచారిని ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన విద్యానగర్ వద్ద బుధవారం జరిగింది. మృతుడిని నగర నివాసి గంగాధర బసవంతప్ప ముమ్మిగట్టి(84)గా గుర్తించారు. ఈ ఘటనపై హుబ్లీ ఉత్తర ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మిషన్ కొనుగోలు పేరుతో వంచన

హుబ్లీ: యూట్యూబ్‌లో సోప్ తయారు చేసే వీడియో చూసిన క్రమంలో ఆన్‌లైన్‌లో ఆ యంత్రాన్ని కొనుగోలు చేయడానికి ప్రయత్నించిన అక్షయ కాలనీ నివాసి ప్రసాద్ అనే వ్యక్తి నుంచి రూ.16.80 లక్షలను ఆన్‌లైన్ కేటుగాళ్లు బదలాయించుకొని వంచించిన ఘటన జరిగింది. ఓ కంపెనీ వీడియో చూసిన ప్రసాద్ అక్కడ ఉన్న నెంబర్‌కు ఫోన్ చేశారు. ఆ ఫోన్‌లో మాట్లాడిన అవతలి వ్యక్తి మాటల్లో మభ్య పెట్టి మిషన్ కొనుగోలుకు అడ్వాన్స్ చెల్లించాలంటూ ఆ మొత్తాన్ని తన ఖాతాలోకి బదలాయించుకొని తనను మోసగించినట్లు బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇద్దరిపై ఇటుకలతో దాడి

హుబ్లీ: చిన్నపాటి వివాదానికి ముగ్గురు కలిసి ఇద్దరిపై ఇటుకలతో దాడి చేసి ప్రాణాలు తీస్తామని బెదిరించిన ఘటన ఇక్కడి మంటూరు రోడ్డులోని బీసీఎం హాస్టల్ వద్ద జరిగింది. ప్రజ్వల్ జాధవ్, శ్యాం జాధవ్, శ్రీ అనే ముగ్గురు వ్యక్తులు ప్రజ్వల్ బెళహట్టి, వికాస్ అనే ఇద్దరిని మాట్లాడదాం రమ్మని బీసీఎం హాస్టల్ వద్దకు పిలిచి వారిపై దాడి చేసి గొడవ పడ్డారు. అంతేగాక ఇటుకలతో తలపై కొట్టి బెదిరించినట్లు బాధితులు బెండిగేరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

10న రెడ్డి విద్యార్థులకు పురస్కారాలు

బళ్లారి రూరల్: బళ్లారి, విజయనగర జిల్లాల్లో రెడ్డి వర్గానికి చెందిన ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలో 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ఈనెల 10న పురస్కారాలు అందజేయనున్నట్లు కర్ణాటక రెడ్డి జన సంఘం సంచాలకుడు గణపాల ఐనాథరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన రెడ్డి విద్యార్థులు తమ మార్కుల జాబితా, కులధృవీకరణ పత్రాలను ఈ నెల 7వ తేదీలోపు వాట్సాప్ నంబర్–9448147616కు పంపాలని తెలిపారు. బళ్లారి బలిజ కళ్యాణ మండపంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు, రెడ్డి వర్గ విశ్రాంత ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విశ్రాంత ఉద్యోగులు తమ వివరాలను వాట్సాప్ నంబర్–9448080399కు పంపాలని తెలిపారు. సన్మాన కార్యక్రమంలో బళ్లారి రెడ్డి జన సంఘం అధ్యక్షుడు నాగరాజరెడ్డి, కార్యదర్శి శివలింగారెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

ఆక్రమణలు తొలగించరూ..



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం పదాధికారులు బుధవారం ఆక్రమిత స్థలం వద్ద ధర్నా చేసి తాలూకా యంత్రాగానికి వినతిపత్రం సమర్పించారు. ఆందోళనకారులు మాట్లాడుతూ ఈనెల 15 లోగా కాలు దారి సమస్యను పరిష్కరించకుంటే వందలాది ట్రాక్టర్లతో బేతమంగల బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ముందు బృహత్ ధర్నా చేపడతామని హెచ్చరించారు. కాలు దారిని పలువురు ఆక్రమించుకోవడం వల్ల రైతులు తమ పంట పొలాల వద్దకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పొలాల్లో పనులు చేసుకోలేక పంటలు నష్టపోతున్నారన్నారు. స్థలాన్ని సర్వే చేసి వెంటనే ఆక్రమణలను తొలగించాలని, లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.నారాయణగౌడ, మరగల్ శ్రీనివాస్, రామసాగర వేణు, సురేష్‌బాబు, ఈకంబళ్లి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా శనేశ్వరస్వామి కుంభాభిషేకం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కోలారు: తాలూకాలోని అరాభికొత్తనూరు గ్రామంలోని గేట్ వద్ద ఉన్న శ్రీశనేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధార మహోత్సవంలో భాగంగా బుధవారం స్వామివారికి కుంభాభిషేకాన్ని అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో ఈ సందర్భంగా గణపతి హోమం, నవగ్రహ హోమం, ప్రధాన హోమం, కళా హోమం తదితరాలను నెరవేర్చారు. మహోత్సవంలో భాగంగా అన్నదాసోహం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.